Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి: 56 • సంచిక: 122 • శనివారం 12 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ పంచమి రా. 9.32 వరకు; అనంతరం షష్ఠి; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 6.11 వరకు; అనంతరం రేవతి; అమృతకాలం: తె. 3.10 నుండి 4.40 వరకు; వర్జ్యం: సా. 5.49 నుండి 7.22 వరకు; దుర్ముహూర్తం: ఉ. 5.44 నుండి 7.26 వరకు; రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు

పంద్రాగస్టు నాడు 5 పథకాలు!



జెండా వేదికగా అభివృద్ధి అజెండా

పేదల సంక్షేమానికి పథక రచన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రతిష్టకు, ఇక్కడి చరిత్రకు ప్రతిబింబంగా నిలిచిన గోల్కొండ కోటపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నాలుగోసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మూడుసార్లు ఈ ప్రతిష్టాత్మక కోట వేదికగా జెండా పండగను జరుపుకున్న ఆయన ఈ ఏడాది రాష్ట్ర ప్రజలకు మరెన్నో శుభవార్తలను అందించబోతున్నారు. అత్యంత విశ్వసనీయంగా అందిన సమాచారాన్ని బట్టి ముఖ్యమంత్రి మదిలో ఐదు సరికొత్త పథకాలకు రూపకల్పన జరిగినట్లు తెలుస్తోంది. ఆయితే ఆ పథకాలను పంద్రాగస్టు వేడుకల సందర్భంగా ప్రకటించాలని అనుకుంటున్నట్లు సమాచారం. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, యువజనోపాధి రంగాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ ఈ రంగాల్లోనే కొత్త పథకాలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. ప్రత్యేకంగా పేద వర్గాల కోసం ఓ ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టాలన్నది ఆయన ఆలోచన. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లోని పేద కుటుంబాల విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక స్కాలర్‌షిప్ పథకం, చిన్న, సన్నకారు రైతు కుటుంబాల కోసం మరో రెండు సంక్షేమ పథకాలు, మహిళా సాధికారత కోసం డ్వాక్రా తరహాలో ఎక్కువ లబ్ధిని చేకూర్చే వడ్డీలేని రుణ పథకం, వైఎస్ హయాంలో ఉన్న విధంగా కొత్త పేరుతో ముఖ్యమంత్రి యువజన యోజన పథకం అమలు

➪ 3వ పేజీలో...

ఎదిగి.. ఒదిగి... ఒద్దికగా...!



అందరి వాడిని

రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు

రైతుబిడ్డ రాజసమిది

రాజ్యసభలో వెంకయ్యపై ప్రధాని మోడీ ప్రశంసలు

ఉపరాష్ట్రపతిగా వెంకయ్య ప్రమాణం

ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి కోవింద్

రాజ్యసభలో వెంకయ్య కన్నీళ్లు

4 రాజ్యాంగబద్ధ పదవుల్లో బీజేపీ నాయకులే

"స్వాతంత్ర్యం తర్వాత జన్మించిన వాళ్లలో ఉపరాష్ట్రపతి పదవి చేపట్టిన మొట్టమొదటి వ్యక్తి వెంకయ్య నాయుడు. ఇదొక అరుదైన సందర్భం. ఇదే సభలో వెంకయ్య సుదీర్ఘకాలం సభ్యుడిగా ఉన్నారు. ఇప్పుడు అదే సభకు చైర్మన్ అయ్యారు. ఆయన ఏ మాధ్యమంలోనైనా అనర్గళంగా మాట్లాడగలరు. అదే ఒరవడితో సభను హుందాగా నడుపుతారని ఆశిస్తున్నా."

"ఓ రైతుబిడ్డ ఉపరాష్ట్రపతి కావడం దేశానికి గర్వకారణం. దేశంలో తొలిసారిగా గ్రామాల్లో జన్మించిన వ్యక్తులు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిగా ఒకేసారి ఎన్నికయ్యారు. న్యాయవాది న్యాయమూర్తి అవుతారు. అలాగే రాజ్యసభ సభ్యుడు..రాజ్యసభ చైర్మన్ అయ్యారు."

- రాజ్యసభలో ప్రధాని మోడీ

11



ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడిచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

"నేను ఏ పార్టీవైపు పక్షపాతం వహించబోను. చైర్మన్‌గా నేనిప్పుడు అన్ని పార్టీలకు చెందిన వాడిని. సభలో ఉన్న వారంతా రాజకీయ ప్రత్యర్థులే కానీ శత్రువులు కాదు. చట్ట సభలను నంబర్ గేమ్‌గా మార్చకుండా ప్రజలకు ఉపయోగపడే అంశాలపై అర్థవంతమైన చర్చలు జరిగేలా కృషి చేస్తా. ఉత్తమ భారత్ అన్ని పార్టీల లక్ష్యం కావాలి. సభ్యులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని అర్థవంతమైన చర్చలు జరపాలని ఆకాంక్ష."

- రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు



ఆర్టీసీ వజ్ర బస్సులకు ఎక్సలెన్స్ అవార్డు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రయాణికుల ముంగిట్లోకి సర్వీస్ పేరుతో దేశంలోనే తొలిసారిగా ఆర్టీసీ ప్రవేశపెట్టిన వజ్రబస్సులకు నేషనల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఎక్సలెన్స్ అవార్డు లభించింది. టీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణారావు ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రోఫీ, ప్రశంసా పత్రం, రూ. 5 లక్షల నగదు రివార్డును అందుకున్నారు. రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి లీనా నందన్, రవాణా శాఖ సంయుక్త కార్యదర్శి అభయ్ డాంలే చేతుల మీదుగా పబ్లిక్ ట్రాన్స్ పోర్టు ఎక్సలెన్స్ అవార్డు -2017ను రమణారావు అందుకున్నారు. వజ్ర మినీబస్సుల ప్రయోగం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. కాలనీల నుండి కాలనీలకు నడపడం ఈ బస్సు

➪ 2వ పేజీలో...

హైదరాబాద్ అభివృద్ధికి పదేళ్ల ప్రణాళిక

గ్రీన్ సిటీ భాగ్యనగరం

నగరం చుట్టూ హరిత వనాలు

మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన రెండు రిజర్వాయర్లు

చెరువుల్లోకి పారిశ్రామిక వ్యర్థాలు చేరకుండా నిరోధక చర్యలు చేపట్టండి

భవన నిర్మాణాలకు తప్పుడు అనుమతులు ఇస్తే కఠిన దండన: సీఎం కేసీఆర్



హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధిపై ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌కు ప్రత్యేక ప్రణాళిక రచించాలని, అందుకు అనుగుణంగానే ఇప్పటి నుంచి ప్రతీ పని చేసుకుపోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే 30 ఏళ్ళకు ఏర్పడే అవసరాలకు తగినట్లు ప్రణాళికా సిద్ధం చేయాలని, పదేళ్ళ కోసం కార్యాచరణ తయారు చేయాలని సూచించారు. నగరం కోసం రెండు మంచినీటి రిజర్వాయర్లు నిర్మించడంతో పాటు రహదారులు, మురికి కాలువలు, వరద కాలువలు, విద్యుత్ సరఫరా,

➪ 3వ పేజీలో...



23న డీఎస్సీ నోటిఫికేషన్!

17న పాఠశాల విద్యాశాఖ అధికారులతో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి సమీక్ష

విధి విధానాల రూపకల్పన.. కార్యాచరణ

18న టీఎస్‌పీఎస్సీకి వివరాలు అందజేత

పాత జిల్లాల ప్రకారమే డీఎస్సీ నిర్వహణ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకానికి 23న డీఎస్సీ నోటిఫికేషన్ జారీ కానుంది. ఉపాధ్యాయ నియామకానికి సంబంధించిన విధి విధానాలను పాఠశాల విద్యా శాఖ 17న రూపొందించనుంది. ఆ వివరాలను 18న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పంపించనుంది. శుక్రవారం పాఠశాల విద్యా శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఎలా భర్తీ చేయాలనే దానిపై చర్చించారు. రిజర్వేషన్ల ప్రక్రియ, రోస్టర్ విధానం, నియామకాలు

➪ 2వ పేజీలో...



ఒకేసారి వినాయక చవితి, బక్రీద్ పండుగలు

సెప్టెంబర్ 5న గణేశ్ నిమజ్జనం

3లో

35వేల మందితో భారీ భద్రత


ఊరేగింపు మార్గాల్లో సీసీ టీవీలు

71 స్టాటిక్, 70 మొబైల్ క్రేన్లు

అన్ని శాఖలతో సమన్వయం

హోంమంత్రి నాయిని వెల్లడి

ఔరా..!



సీతారామ ఫేజ్-1కు గ్రీన్‌సిగ్నల్

కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భద్రాద్రి, ఖమ్మం జిల్లాలను సస్యశ్యామలం చేసే సీతారామా ఎత్తిపోతల పథకానికి కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ ఫేజ్-1కు టిఓఆర్ జారీచేసింది. రూ.11,931కోట్ల వ్యయంతో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు ఈ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా, 2,72,921హెక్టార్లకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరందనుంది. ఇందులో 1,33,085హెక్టార్లు కొత్త ఆయకట్టు కాగా, 1,39,896హెక్టార్ల ఆయకట్టును స్థిరీకరించడం పథకం ఉద్దేశ్యం. ఈ ప్రాజెక్టుకు

➪ 2వ పేజీలో...



ఛ్చే... వృద్ధిరేటు కష్టమే..!

• తేల్చిన ఆర్థిక సర్వే • మొట్టమొదటిసారిగా ఏడాది మధ్యలో విడుదల • రుణమాఫీ వల్ల వెంటనే కష్టాలే
• జీఎస్టీ మంచిదే • ఆర్థిక లావాదేవీల్లో పెరిగిన పారదర్శకత • నోట్ల రద్దుతో తగ్గిన వినిమయం
• పుంజుకుంటే దీర్ఘకాలంలో మంచి ఫలితాలు • బంగారు నగలపై తక్కువ పన్ను ఉందని అభిప్రాయం

6లో

గోరఖ్‌పూర్‌లో విషాదం

ఆక్సిజన్ అందక 30 మంది శిశువులు కన్నుమూత

గోరఖ్‌పూర్: భారతీయ జనతా పార్టీ పాలిత రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం విషాదం చోటు చేసుకుంది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజక వర్గంలోని బీడీఆర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక

➪ 2వ పేజీలో...

ఇక దూకుడే..

•పోచంపాడ్ సభ సక్సెస్‌తో టీఆర్ఎస్‌లో ఉత్సాహం •జనంలోకి వెళ్ళేందుకు పక్కా ప్రణాళిక



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దూకుడికి టైమింగ్ ముఖ్యం. ఏ సమయంలో రాజకీయంగా ఏం చేయాలో పక్కాగా తెలిసిన వ్యూహ చతురుడు కెసిఆర్. పోచంపాడు సభ సక్సెస్‌తో ఉత్సాహంగా ఉన్న టిఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్ళేందుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. రానున్న రోజుల్లో జనంలోనే ఉండేందుకు.. మరింత ఉత్సాహంగా పనిచేసి కార్యక్రమాలను పరుగెత్తించేందుకు పక్కా స్కెచ్ సిద్ధం చేస్తోంది. అనూహ్యంగా.. హాజరైన జనం, సభా వేదిక వద్దకు రాకుండానే కిలోమీటర్ల మేర రోడ్లపై ఇరుక్కుపోయిన వాహనాలతో పోచంపాడు సభ విజయం సాధించగా, జనహోరు నేతలను ఉత్సాహపరిచింది. వరంగల్ లాంటి మహాసభలు నిర్వహించినపుడే.. ట్రాఫిక్ గంట, రెండు గంటల్లో క్లియర్ కాగా, పోచంపాడు సభా వేదిక చుట్టూ 20కిమీ ట్రాఫిక్ క్లియర్ కావడానికి దాదాపు ఆరేడు గంటలు పట్టిందని నేతలు చెబుతున్నారు. సభకు హాజరైన వారు కూడా ఎక్కువగా రైతుకుటుంబాలేనని, తలపాగాలు ధరించిన రైతులేనని.. రైతాంగంలో ముఖ్యమంత్రి కెసిఆర్ పట్ల ఉన్న భరోసాకు ఇది నిదర్శనమని పార్టీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల టిఆర్ఎస్‌వి కమిటీల నియామకం పూర్తిచేసి, సభ్యత్వ నమోదుకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా ఇప్పటికే పది లక్షలకు పైగా సభ్యత్వనమోదు జరిగింది. త్వరలో హైదరాబాద్ కేంద్రంగా విద్యార్థి మహాసబ నిర్వహించేందుకు కూడా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ టిఆర్ఎస్‌వి కార్యక్రమాలను ప్రతిరోజూ ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఇక పార్టీకి సంబంధించి రాష్ట్ర కమిటీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, పొలిట్‌బ్యూరో ప్రకటనలన్నీ ఆగస్టులోనే పూర్తిచేసి.. బాధ్యతలు అప్పగించి దూకుడు పెంచాలని నిర్ణయించారు. మరోవైపు అనుబంధసంఘాలను కూడా క్రియాశీలం చేయనున్నారు. గత మూడేళ్ళుగా.. పార్టీ కమిటీలను వ్యూహాత్మకంగా జాప్యం చేసిన సిఎం.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇకపై వీటిని పకడ్బందీగా వేయడంతో పాటు వాటికి సంబంధించిన కార్యాచరణను కూడా నిర్దేశిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పక్షం రోజుల్లోనే సిఎం కెసిఆర్ మరోసారి ప్రెస్‌మీట్ నిర్వహించి స్వయంగా పార్టీ కమిటీలను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

నియోజకవర్గాల వారీగా..

ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న సిఎం.. పనిచేయని ఎమ్మెల్యేలను, ప్రజల్లో పరపతి తక్కువ ఉన్న ఎమ్మెల్యేలను పలుమార్లు హెచ్చరించారు. పార్టీ బలంగా ఉన్నా.. అభ్యర్థులు బలహీనంగా ఉన్నచోట కూడా తగిన వ్యూహాన్ని రూపొందించారు. వచ్చే ఎన్నికల్లో 111సీట్లు వస్తాయని తమ సర్వేల్లో తేలినట్లు సీఎం ఎమ్మెల్యేల పనితీరుపై చేయించిన సర్వే నివేదికల్లో వెల్లడించగా, విపక్షాలపై కూడా దూకుడు వ్యూహంతో ముందుకు వెళ్ళాలని నిర్ణయించారు. సభల్లో.. సమావేశాల్లో కాంగ్రెస్‌ను ఎక్కడికక్కడ నిలదీయండి అని పిలుపునిస్తున్న సిఎం కెసిఆర్ ఆ పార్టీ బలపడకుండా చేసేందుకు, టిఆర్ఎస్ కార్యకర్తలు గ్రామస్థాయి నుండి మరింత క్రియాశీలంగా పని చేసేందుకు వ్యూహం రూపొందించారు. ఇటీవల సిఎం గ్రామసభల్లో పాల్గొని వరాల జల్లు కురిపించగా, ప్రజల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. తాను ఇక ప్రజల మధ్యే ఉంటానని ఈ కార్యక్రమాల ద్వారా సంకేతాలిచ్చారు. పోచంపాడు సభ అనూహ్యంగా విజయవంతం కాగా.. ఈ సభ స్ఫూర్తితో మరిన్ని సభలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. కెసిఆర్ ప్రజల్లోకి వచ్చి.. చేసింది.. చేసేది చెప్పాక ఇక ప్రతిపక్షాలకు అస్త్రాలేవీ ఉండవని, వారి మాటలు.. ప్రచారం అంతా తేలిపోతుందని నేతలు చెబుతున్నారు. తాజాగా అధినేత ప్రణాళిక, అడుగులు చేసి గులాబీనేతలు సంతోషంలో మునిగితేలుతున్నారు.

మాట నిలుపుకున్న మంత్రి హరీష్

మంత్రి హరీష్ మరోసారి మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచారు. మాటమీద నిలబడ్డారు. రోడ్డుప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని న్యూలైఫ్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న క్రికెటర్ కమురుద్దీన్ అలియాస్ సాదామ్‌ను మంత్రి హరీష్ శుక్రవారం పరామర్శించారు. మంత్రి ఇటీవల జహీరాబాద్ పర్యటనలో బాధితుని కుటుంబానికి రూ.లక్ష సహాయం అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం యువ క్రీడాకారుడి చికిత్స కోసం రూ.2.50లక్షలు ఎల్ఓసిని హైదరాబాద్ న్యూలైఫ్ ఆస్పత్రిలో కుటుంబసభ్యులకు అందజేశారు. మంత్రి వెంట మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్ కూడా ఉన్నారు. మంత్రి సాయం పట్ల కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హరీష్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.



రాష్ట్ర శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి కుమారుడు ప్రశాంత్ వివాహానికి ముఖ్యమంత్రి కెసిఆర్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ రంగాల ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు, ఈటల రాజేందర్, నాయిని నర్సింహారెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపిలు కవిత, బాల్క సుమన్, ప్రతిపక్ష నేత జానారెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, సినీనటులు చిరంజీవి, బ్రహ్మానందం, సుమన్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గోల్కొండ కోట ముస్తాబు

•పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లపై సీఎస్ ఎస్పీసింగ్ సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఆదేశించారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ వేడుకల్లో ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్వాతంత్ర్య సమర యోధులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేయాలన్నారు. ముఖ్యంగా అవార్డు గ్రహీతలు, మీడియా, వీఐపీలు ఎక్కడ కూర్చోవాలో స్పష్టంగా నిర్దేశించాలన్నారు. అవార్డు గ్రహీతలతో పాటు కేవలం ఇద్దరిని మాత్రమే అనుమతించాలని సూచించారు. ఈ సందర్భంగా రాణిమహల్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసే స్టేజీని, కోట ప్రధాన గేటు వద్ద పోలీసులు నిర్వహించే పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పతాకావిష్కరణ గావించి, గీతాన్ని ఆలపించేసమయంలో కోటలోని ప్రతి ఒక్కరూ లేచి నిలబడి సెల్యూట్ చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఇంటలిజెన్స్ ఐజీ ఎంకే సింగ్, సిఐడీ ఐజీ శిఖాగోయెల్, ప్రోటోకాల్ డీఐజీ అంజనీ కుమార్, నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి, అదనపు కమిషనర్ బీవీ శ్రీనివాసరావు, డీసీపీలు రంగనాథ్, వెంకటేశ్వరరావు, అభిలాష్ బిస్తా, అపూర్వ రావు, జీఏడీ ముఖ్య కార్యదర్శి అదర్ సిన్హా, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, సమాచార శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఇన్ఫర్మేషన్ ఇంజనీరు చీఫ్ కిషోర్ బాబు, ఆర్ఐఈ దామోదర్, పాఠశాల విద్యా కమిషనర్ కిషన్, హైదరాబాద్ ఇంచార్జి కలెక్టర్ ఎం.ప్రశాంతి, ప్రోటోకాల్ డిప్యూటి సెక్రటరీ అరవింద్ సింగ్, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, జోనల్ కమిషనర్లు రవికిరణ్, రఘుబాబు, ఆర్డీవో చంద్రకళ, ఆర్అండ్‌బి ఎస్ఈ శారద, ఓఎస్డీ నరసింహారావు, స్కూల్ ఎడ్యుకేషన్ లైజన్ ఆఫీసర్ డాక్టర్ బాలరాజు, గోల్కొండ తహసిల్దార్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంసాగర్...ఓ సెంటిమెంట్

•నమ్మకాలు తుడిచిపెట్టుకుపోతాయంటున్న ప్రజలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శ్రీరాంసాగర్.. పునరుజ్జీవన పథకం ఒక బృహత్తర ప్రయత్నం. ఈ పథకం చేపట్టిన ముఖ్యమంత్రి కెసిఆర్‌కు రాజకీయాలకు అతీతంగా అంతా జేజేలు పలుకుతున్నారు. ఏడాదిలోపే.. శ్రీరాంసాగర్‌కు రివర్స్‌పంపింగ్ ద్వారా నీరు తీసుకొచ్చి 90టిఎంసిలు నింపుతానని, ఏడాది పొడవునా వరదకాలువ నిండువరదతో కళకళలాడేలా చేస్తానని సిఎం కెసిఆర్ పెద్ద ఎత్తున హాజరైన ప్రజల సమక్షంలో హామీనిచ్చారు. అంచనాలకు అనుగుణంగా బహిరంగసభ సక్సెస్ కాగా.. కెసిఆర్ సంకల్పాన్ని ఆయకట్టు రైతాంగం అభినందిస్తోంది. అయితే ఇంతటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాన్ని సిఎం చేపట్టగా, రాజకీయవర్గాల్లో ఓ సెంటిమెంట్ చర్చ వినిపిస్తోంది. సెంటిమెంట్లకు, వాస్తు సిద్ధాంతాలకు ప్రాముఖ్యమిచ్చే కెసిఆర్.. శ్రీరాంసాగర్ సెంటిమెంట్‌ను మాత్రం పట్టించుకోక పోవడం విశేషం. గతంలో వేములవాడ ఆలయ సందర్శన సమయాల్లోనూ ఇలాంటి సెంటిమెంట్లు ప్రచారం జరిగినా, కెసిఆర్ ఆలయాన్ని సందర్శించి.. పెద్ద ఎత్తున వరాలు కూడా ప్రకటించారు. ఆ తర్వాత రాష్ట్రం మరింత ప్రగతిపథంలో ముందుకు పోయిందే తప్ప ఇలాంటి సెంటిమెంట్లు ప్రభావం చూపలేదని, ఈ శ్రీరాంసాగర్ విషయంలోనూ అదే రిపీట్ అవుతుందని టిఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి.

రాజకీయ జీవితాలు మార్చిన శ్రీరాంసాగర్..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించాక అనేక మంది రాజకీయ నాయకుల జీవితాల్లో మార్పులు వచ్చాయని, వారి పొలిటికల్ కెరీర్ డైలమాలో పడిందన్న చర్చను కొందరు నేతలు ప్రచారంలోకి తెచ్చారు. ఈ ప్రాజెక్టుకు 1963లో పండింట్ జవహర్‌లాల్ నెహ్రూ శంఖుస్థాపన చేశారు. ఆ తర్వాత సంవత్సరంలో ఆయన స్వర్గస్థుల య్యారు. తర్వాత పివి నరసింహా రావు ప్రధానిగా ఉన్న సమయంలో ఆయన చేతులమీదుగానే.. శ్రీరాంసాగర్ వరదకాల్వ పనులకు శంఖుస్థాపన చేశారు. విచిత్రంగా ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో పివికి టిక్కెట్టే దక్కలేదు. ఓ సారి కాసు బ్రహ్మానందరెడ్డి కూడా ఈ ప్రాజెక్టును సందర్శించారు. తర్వాత మళ్ళీ ఆయన సిఎం కాలేకపోయారు. సీనియర్ నేత సోమనాథ్ చటర్జీ కూడా శ్రీరాంసాగర్‌కు వచ్చారు. ఆ తర్వాత పార్టీ బహిష్కరణకు గురై రాజకీయ ఇబ్బందులకు గురయ్యారు. ఇలా రాజకీయ జీవితాలు మార్చిన.. సెంటిమెంట్‌ను కొందరు నేతలు ప్రచారం చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అభివృద్ధి, సందర్శన ఈ సెంటిమెంట్లకు కామన్‌పాయింట్‌గా ఉండగా, సెంటిమెంట్లకు ప్రాధాన్యమిచ్చే కెసిఆర్ అన్ని రకాలుగా ఆలోచించే శ్రీరాంసాగర్‌ను సందర్శించి ఉంటారని కొందరు నేతలు చెబుతున్నారు. సచివాలయానికి భయంకరమైన వాస్తుదోషం ఉందని, అటువైపు చూడడానికే.. పెద్దగా ఇష్టపడని సిఎం.. శ్రీరాంసాగర్ పునర్జీవన పథకానికి అంకురార్పణ చేశారంటే ఈ ప్రాజెక్టుపై జరిగే సెంటిమెంట్ల ప్రచారమంతా కాకతాళీయమేనని కొందరు నేతలు ఉదహరిస్తున్నారు. సిఎం కెసిఆర్ చెప్పినట్లు ఏడాదిలో పునర్జీవన పథకం పనులు పూర్తయి.. నీరొస్తే నమ్మకాలు, సెంటిమెంట్లన్నీ దూదిపింజల్లా కొట్టుకుపోతాయని స్థానిక ప్రజలు అంటున్నారు. సంకల్పబలం గొప్పదైతే.. అన్నీ అనుకూలిస్తాయని, ఈ పథకం విషయంలో.. అన్నీ శుభాలే జరుగుతాయని ప్రజలు చెబుతున్నారు.



1250 కాలేజీలకు అనుబంధ గుర్తింపు



•21వరకు గుర్తింపునకు అవకాశం •కార్పొరేట్ కాలేజీల నుంచి జరిమానా చెల్లింప చేశాం •గతంకంటే ఇంటర్ అడ్మిషన్లు పెరుగుతున్నాయ్ •ఏప్రిల్ 12 విద్యాసంవత్సరం చివరిరోజు •జూన్ 1నుంచి పాఠశాలల పున:ప్రారంభం: డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని 1250 ప్రైవేటు జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇచ్చామని ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. మరో 350 కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వాల్సి ఉందన్నారు. గుర్తింపు ఇవ్వడానికి 21 వరకు సమయం ఇచ్చామని వాటిలో ఉన్న లోపాలను సవరించుకుంటే వారికి కూడా అనుబంధ గుర్తింపును మంజూరు చేస్తామని కడియం స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ బోర్డులో అనుబంధ గుర్తింపు ప్రక్రియలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా జరిగేలాగా ఆన్‌లైన్ వ్యవస్థను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఉపముఖ్యమంత్రి శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ, ఇంటర్‌బోర్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్, పాఠశాల విద్యా శాఖ సంచాలకులు జి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వాసవి కాలేజీ ఘటనలు జరగకుండా ఉండటం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం అనుబంధ గుర్తింపు ఇచ్చిన కాలేజీలు కాకుండా గుర్తింపు రాని కాలేజీలకు 21 వరకు సమయం కేటాయించినట్టు తెలిపారు. అప్పటి లోగా ఆయా కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం అన్ని సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు. 21న ఇంటర్ బోర్డు మీటింగ్ ఉంటుందని ఆ సమావేశంలో అనుబంధ గుర్తింపుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. విజిలెన్స్ బకాయిలు చెల్లించని కార్పొరేట్ కాలేజీలకు అనుబంధ గుర్తింపుకు అవకాశం కల్పించలేదని, వారు శుక్రవారం నాటికి జరిమానాలను చెల్లించారని తెలిపారు. బోర్డు చరిత్రలో కార్పొరేట్ కాలేజీల నుంచి జరిమానా చెల్లింపులు ఈ ఏడాదే జరిగాయని అన్నారు. 29 కార్పొరేట్ కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవడానికి 21 వరకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. అవే కాకుండా గుర్తింపులేని ఇతర కాలేజీలు కూడా దరఖాస్తు చేసుకోవడానికి సమయం ఇచ్చామన్నారు. పరీక్షఫీజు చెల్లింపు కంటే ముందే రాష్ట్రంలో అనుబంధ గుర్తింపు ఉన్న కాలేజీల వివరాలను బహిరంగ పరుస్తామని, అనుబంధ గుర్తింపు లేని కాలేజీల్లో చేరిన విద్యార్థులకు ఇతర కాలేజీల్లో చేరాలని అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఆ తరువాతనే పరీక్షఫీజును వసూలు చేస్తామన్నారు. ఈ ఏడాది వాసవి కాలేజీ ఘటనలు పునరావృతం కాకూడదనే ఇటువంటి చర్యలు తీసుకుంటున్నట్టు స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీల్లో మధ్యాహ్నం భోజనం అమలు చేయడంపై కసరత్తు జరుగుతోందని తెలిపారు. త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి జూన్ 1 నుంచే పాఠశాలలను ప్రారంభిస్తామని తెలిపారు. 2017-18 విద్యా సంవత్సరం ఏప్రిల్ 12, 2017తో ముగించేలా విద్యా క్యాలెండర్‌ను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ రూపకల్పన కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు వారి సూచనలు, సలహాలు తీసుకోనున్నట్టు తెలిపారు. త్వరలోనే వీరితో పాఠశాల విద్యా శాఖ సంచాలకులు సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రతిపాదనలను సిద్ధం చేయనున్నట్టు చెప్పారు. అయితే సర్వీస్ రూల్స్ రూపొందించడానికి కొంత సమయం పడుతుందని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు.

చిలుకూరు బాలాజీ ఆలయంలో.. వర్షాలకోసం వీణా కచేరి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వరుణుడి కరుణ కోసం మరోసారి వరుణ యాగాలు, జపాల బాట పట్టారు తెలుగు ప్రజలు. వర్షాల రాక కోసం రకరకాల పూజలు, మొక్కులతో వరుణుడిని పూజిస్తున్నారు. పురాణాలు, ఇతిహాసాల్లో పేర్కొన్నట్లుగా సంగీతంతో మేఘాలు కరుగుతాయని, రోగాలు నయమవుతాయని మళ్లీ ఆచరించి చూపుతున్నారు. ఇదే ఒరవడిని చిలుకూరి బాలజీ ఆలయంలో శుక్రవారం ఆచరించి చూపారు. అట్టహాసంగా సంగీత కచేరీ చేసి వరుణ దేవుడి కటాక్షం కోసం ప్రార్థించారు. వర్షాల కోసం నక్షత్ర వాణ కచేరీ నిర్వహించారు. విజయలక్ష్మి సారథ్యంలో 24 మంది వీణా విద్వాంసులతో పాటలు ఆలపించారు. ఈ కచేరీలో వేణువుపై వెంకటాలచపతి, మురళీధర్‌రెడ్డి సహకారం అందించారు. వర్షాన్ని ఆకర్శించే రాగాలైన మేఘరంజని కీర్తనలుఆలపించారు. పురాణాల్లో వీణ, వేణువుపై ఉన్నట్లుగా ఈ కచేరీలో గానాలాపన చేశారు.

23న డీఎస్సీ నోటిఫికేషన్!

(మొదటిపేజీ తరువాయి)

కొత్త జిల్లాల వారీగానా, పాత జిల్లాల ప్రకారం చేపట్టాలా? అనే అంశాలపై చర్చించినట్టు సమాచారం. వీటితోపాటుగా జిల్లాల వారీగా ఖాళీల వివరాలను సేకరించి తద్వారా నియామకాలను చేపట్టనున్నారు. ఉపాధ్యాయ నియామకానికి సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలను ప్రభుత్వం తీసుకోవాలని భావిస్తోంది. గతంలో గురుకుల టీచర్ పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌ను మార్చాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో ఈ సారి అలా కాకుండా జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మండలి నిబంధనల మేరకు టీచర్ పోస్టులను భర్తీ చేయాలని భావిస్తోంది. ఉపాధ్యాయ టీచర్ పోస్టుల భర్తీ కోసం పాఠశాల విద్యా శాఖ రూపొందించిన విధి విధానాల జాబితా(ఇండెంట్)ను 18న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పంపించనున్నారు.

ఉపాధ్యాయ నియామక ప్రక్రియను గతంలో మాదిరిగా డీఎస్సీ పేరుతో నిర్వహిస్తారా? టీచర్ రిక్రూట్‌మెంట్ పేరుతో నిర్వహిస్తారా? అనేది కూడా నిర్ణయించనున్నారు. టిఎస్‌పిఎస్సీకి పాఠశాల విద్యా శాఖ వివరాలను పంపించిన అనంతరం వాటిని పరిశీలించి 23న నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. నోటిఫికేషన్‌తోపాటే సిలబస్‌ను కూడా పబ్లిక్ సర్వీస్ కమిషనే నిర్ణయించనుంది. నోటిఫికేషన్ జారీ అయిన తరువాత ఎవరూ కూడా కోర్టులకు వెళ్లకుండా ఉండేలాగా అన్ని రకాల జాగ్రత్తలను సర్కార్ తీసుకుంటోంది. ఇందుకోసం సాధారణ పరిపాలన శాఖ అనుమతి కూడా తీసుకోనుంది. 8972 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేయనుంది.

ఆక్సిజన్ అందక 30 మంది శిశువులు కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

48 గంటల్లో 30 మంది చిన్నారులు మృత్యువాత పడ్డారు. వీరంతా మెదడువాపు వ్యాధి కారణంగా చికిత్స పొందుతున్నవారని అధికారులు వెల్లడించారు. సీఎం సొంత నియోజకవర్గంలో ఈ సంఘటన చోటు చేసుకోవడం ఈ విషయం మరింత చర్చనీయాంశమవుతుంది. రెండు రోజుల కిందటే సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ ఆస్పత్రికి తనిఖీ కోసం వచ్చి వెళ్ళారని గోరఖ్‌పూర్ కలెక్టర్ రాజీవ్ రౌటెలా తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు అక్కడి వారంతా సమస్యల ఏకరువు పెట్టగా తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చి వెళ్ళారు. స్థానిక సమాచారం ప్రకారం... ఆక్సిజన్ సరఫరా చేస్తున్న కంపెనీకి సదరు ఆస్పత్రి రూ. 66 లక్షల బాకీ ఉంది. పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఆ కంపెనీ ఆక్సిజన్ పంపిణీని ఆపేసింది. ఫలితంగా ఇంతమంది చిన్నారుల ప్రాణాలు గాల్లో కలసిపోయాయి. ఇందులో ఆస్పత్రివర్గాలు, ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఇదిలా ఉండగా, మరో 45 మంది చిన్నారుల పరిస్థితి కూడా విషమంగా ఉందని సంబంధితవర్గాలు వెల్లడించాయి. వారిని వెంటిలేషన్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. అయితే, బీజేపీ పాలిత రాష్ట్రంలో ఈ దుర్ఘటన జరగటం ఆ పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడనుంది.

ఆర్టీసీ వజ్ర బస్సులకు ఎక్సలెన్స్ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశం. దేశంలోని ప్రభుత్వ రంగ రవాణా సంస్థలు ఇప్పటి వరకు ఇలాంటి ప్రయత్నం చేయలేదు. తొలిసారిగా టీఎస్ ఆర్టీసీ ప్రవేశపెట్టిన ఈ బస్సులకు ప్రయాణికుల నుండి ఆదరణ పెరుగుతోంది. అందరిని ఆకట్టుకుంటోంది. ఇతర రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని ప్రవేశపెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సు రవాణా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ప్రయాణికుల ముంగిల్లో సర్వీస్ విధానం భారత ప్రభుత్వాన్ని కూడా ఎంతగానో ఆకట్టుకుంది. ప్రస్తుతం వజ్రబస్సులను హైదరాబాద్ నుండి వరంగల్, నిజామాబాద్‌కు నడిపిస్తున్నారు. డిమాండ్ మేరకు ఇతర దూర ప్రాంతాలకు నడిపించే అలోచనలో ఆర్టీసీ అధికారులు ఉన్నారు. పరిమితమైన సీట్లు, వేగవంతమైన ప్రయాణం వజ్రబస్సుల ప్రత్యేకత. ఆన్‌లైన్‌లో సీట్లు బుక్ చేసుకోవడం, సీట్లను రిజర్వు చేసుకొనేందుకు ఆర్టీసీ ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇంటిదగ్గర ఉన్న బోర్డింగ్ పాయింట్ వద్ద ఎక్కడం, దిగడం లాంటి సౌకర్యం కల్పించారు.

ప్రతిభగల ఉద్యోగులకు అవార్డులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకు ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. ప్రథమ బహుమతికి రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతికి రూ.3 లక్షలు, తృతీయ బహుమతికి రూ.2 లక్షల పారితోషికాన్ని చెల్లించాలని నిర్ణయించింది. గోల్కొండలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈ అవార్డులను ప్రధానం చేయనున్నారు.

ర్యాంక్	పేరు	హోదా
1	డాక్టర్ సీహెచ్ మధుసూదన్	అసిసోయేట్ ప్రొఫెసర్
2	సురేష్‌బాబు	డీపీవో
3	పీడబ్ల్యు జాన్‌సన్	డీఆర్‌డీవో
1	కె.చంద్రకళ	ఆర్డీవో
2	జి.విశ్వనాథన్ గుప్తా	ప్రధానోపాధ్యాయుడు
3	రమీజుద్దీన్ అహ్మద్	మండల్ ప్లానింగ్ ఆఫీసర్
1	ఎం.జయమ్మ	స్టాఫ్ నర్సు
2	డి.శంకర్ కుమార్	పంచాయితీ సెక్రటరీ
1	బి.దశరత్	సర్కిల్ ఆర్డర్లీ
2	గంగయ్య	ఆఫీస్ సబ్‌ఆర్డినేట్
3	కె.కిష్టయ్య	ఆఫీస్ సబ్‌ఆర్డినేట్

ఫ్రిజ్‌లో చిన్నారిని పెట్టి...వీడియో తీశారు

బోస్టన్: వనం నిత్యావసరాలు పాడైపోకుండా ఉండేదుకు ఫ్రిజ్‌లను వాడతాం. ఫ్రిజ్ లోకూరగాయలను నిల్వ చేసుకొనేందుకు ప్రత్యేకంగా బాక్స్ ఉంటుంది. ఇక్కడ కట్ చేస్తే ఎనిమిది నెలల శిశువును ఫ్రిజ్‌లోనికూరగాయల బాక్స్‌లో పెట్టిన ఘటన అమెరికాలోని బోస్టన్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే శిశువు తల్లి పనిపై బయటకు వెళుతూ తన కుమార్తెను మేనకోడలికి అప్పగించి వెళ్లింది. ఆ యువతి పసిగుడ్డుతో దారుణమైన ప్రయోగానికి వడి కట్టింది. చిన్నారిని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచితే ఏమవుతుం దోచూద్దామనే ఆలోచన రాగానే ఫ్రిజ్‌లో ఉంచింది. ఆమె స్నేహితురాలు ఈ ఘటనను స్నాప్ చాట్ ద్వారా వీడియోకూడా తీసింది. కొంత సేపయిన తరువాత ఏమయినదో చూద్దామని ఫ్రిజ్‌ను ఓపెన్ చేశారు. అయితే అదృష్టవశాత్తు చిన్నారికి ఏ విధమైన అపా యంసంభవించలేదు. అంతటితో ఆగకుండా ఈ వీడియో షేర్ చేశారు. విషయం పోలీసుల వరకు వెళ్లడంతో కేసు నమోదు చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితులు మైనర్లు కావడంతో వారి వివరాలు వెల్లడిం చలేదు. తన మేనకోడలు తెలియక చేసిందని, కావాలని చేయలేదని శిశువు తల్లి వారిని సమర్థించింది. వారు మూర్ఖ త్వంతో తన కుమార్తెను ఫ్రిజ్ ఉంచారని మరోసారి తన పిల్లలను ఎవరి వద్ద వదలి వెళ్లనని తల్లి కన్నీటి పర్యంతమైంది.

సీతారామ ఫేజ్-1కు గ్రీన్‌సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

గత ఏడాది సిఎం కెసిఆర్ శంఖుస్థాపన చేయగా, భూసేకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

కన్నెపల్లి ఎత్తిపోతలకు టీఓఆర్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి అనుబంధ పథకమైన కన్నెపల్లి పథకానికి కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ టీఓఆర్ జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి గ్రామం వద్ద గోదావరి నుండి 4.5 టీఎంసీల నీటిని తోడి 14 చిన్నతరహా నీటిపథకాలను నింపే ఈ పథకానికి కేంద్ర మంత్రిత్వశాఖ పచ్చజెండా ఊపింది. పరిసర గ్రామాల తాగునీటికి 0.3 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం 1457 హెక్టార్ల భూమి అవసరం కాగా, రూ.499.23 కోట్లతో నిర్మించనున్నారు.

విత్తన భాండాగారంగా

తెలంగాణ

దిగుబడి పెంచడానికి వెయ్యి మంది రీసోర్స్ పర్సన్స్: మంత్రి పోచారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయమే ప్రధానమైన తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భాండాగారంగా మార్చాలన్న సీఎం కేసీఆర్ సంకల్పం మేరకు అధికారులు నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో చర్యలు మొదలుపెట్టాలని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఇందుకు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. అవసరం మేరకు వ్యవసాయ విస్తరణాధి కారులు వస్తున్నందున శాస్త్రవేత్తల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. రానున్న రబీ నాటికి రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో సీడ్ ఫామ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగుకు యోగ్యమైన భూమి అంతా సస్యశ్యామలం కావాలని, అప్పుడే మన విత్తనాలను మనం సాగు చేసుకోగలమని అభిప్రాయపడ్డారు. గ్రామ రైతు సంఘాలను త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. గ్రామంలోని మంచి ఆలోచనాపరులైన వ్యక్తులను సమన్వయ కమిటీ సభ్యులుగా నియమించాలన్నారు. యూనిట్ ప్రామాణికంగా ఏఈవోలు పనిచేయాలన్నారు. విత్తన దిగుబడిని పెంచడానికి 1000 మంది రిసోర్స్ పర్సన్స్‌ను తయారు చేస్తున్నామన్నారు. ఎకరాకు రూ.4వేల పెట్టుబడి ఇవ్వడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.


పంద్రాగస్టు నాడు 5 పథకాలు!

- 2019 లక్ష్యాలను వెల్లడించేందుకు సిద్ధమవుతున్న సీఎం కేసీఆర్
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గోల్కొండ కోటపై నాలుగో పంద్రాగస్టు వేడుకలు
- విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, యుజనోపాధి రంగాలకు మరింత ప్రాధాన్యత

(మొదటిపేజీ తరువాయి)

చేయాలన్నది కేసీఆర్ మదిలో ఉన్న సరికొత్త ఆలోచన. అయితే ఈ పథకాలను ఈ ఏడాది ప్రకటించి, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకురావాలన్నది ఆయన సంకల్పం. అప్పటిలోగా ఈ కొత్త పథకాల విధివిధానాలను రూపొందించనున్నారు. అణగారిన వర్గాల సంక్షేమం, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందడుగు వేస్తున్న ప్రభుత్వం లో రానున్న రెండేళ్ళ లక్ష్యాలను వెల్లడించేందుకు సంసిద్ధమై నట్లు విశ్వసనీయ సమాచారం. తెలంగాణ పునర్‌నిర్మా ణానికి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్న సీఎం భవిష్యత్ లక్ష్యాలను కూడా నిర్దేశించుకున్నారు. ఒకప్పటి తెలంగాణ చారిత్రక వైభవాన్ని చాటిచెప్పే విధంగా ప్రతియేటా గోల్కొండ కోటపై జాతీయ జెండాను ఆవిష్కరి స్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంతానికి జరిగిన అన్యా యాన్ని, తెరాస అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల అభివృద్ధికి చేపట్టిన చర్యలను, సమీప భవిష్యత్తులో సాధించనున్న ప్రగతి ఫలాలను గత మూడేళ్లుగా ప్రజలకు వివరిస్తూ వచ్చిన కేసీఆర్, ఈ ఏడాది పంద్రాగస్టు వేడుకల సందర్భంగా మరిన్ని నజరానాలను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే 2019 నాటికి ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యాలను కూడా వెల్లడించనున్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన కార్యక్రమాలు, దీర్ఘకాలిక అభివృద్ధి పథకాల ఫలాలను వచ్చే రెండేళ్ళలో పూర్తిస్థాయిలో అందించాలన్న ధృడ సంకల్పంతో ఉన్నారు.

తెలంగాణాలో ఉన్న ప్రతి పౌరుడూ ఆత్మగౌరవంతో బతకాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ కార్యక్రమాలను దశలవారీగా విస్తరింపజేస్తున్నారు. పరిపాలన వికేంద్రీకరణకు కొత్త జిల్లాల ఏర్పాటు అవసరమని గుర్తించి ఇప్పుడున్న పది జిల్లాలకు అదనంగా ఏర్పాటు చేసిన 21 జిల్లాల్లోనూ అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా నిర్దిష్టమైన కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. త్వరలో రానున్న



విజయదశమి పర్వదినం నాటికి కొత్త జిల్లాల ప్రగతి ప్రణాళికను ప్రకటించనున్నారు. ఉద్యమ నేత నుంచి ప్రభుత్వాధినేత వరకు సామాజిక స్థితిగతులు, జన జీవనంపై విశేష అనుభవమున్న కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయే విధంగా శాశ్వత పథకాలకు పునాదులు వేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు ఇప్పుడిప్పుడే ప్రజలకు ఫలాలను అందిస్తున్నాయని, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల సాధించనున్న మరిన్ని ఫలితాల గురించి పంద్రాగస్టు నాడు ప్రజలకు సందేశమివ్వనున్నారు.

ప్రాజెక్టులతో ప్రజలకు మరింత చేరువ

ఎంతటి అవాంతరాలనైనా ఎదిరించి కోటి ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కేసీఆర్ పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. పేద, మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ పథకం స్థానంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ళ పథకాన్ని ప్రారంభించి ఇప్పటికే కొంత పురోగతి సాధించారు. వచ్చే ఏడాదికి 2.60 లక్షల ఇళ్ళను నిర్మించి పేదలకు మరింత దగ్గరవుతున్నారు.

దళిత, గిరిజన వర్గాలు, పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్‌ల్యాండ్ విధానంలో సమూల మార్పులు చేసి ఆ భూములను నిజమైన లబ్ధిదారులే అనుభవించే విధంగా తీసుకున్న చర్యల వల్ల కొంత మేరకు నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. దశాబ్దాల తరబడి వివాదాల్లో ఉన్నభూ తగాదాలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు సాదాబైనామాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఉచితంగా పూర్తిచేసి మన్ననలు పొందారు. ఈ విషయంలో చిన్న, సన్నకారు, దళిత, గిరిజన రైతుల ఆదరాభిమానాలు చూరగొన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ, ప్రభుత్వం ఎంచుకున్న అన్ని కార్యక్రమాలను, ప్రతిష్టాత్మకమైన పథకాలను వచ్చే రెండేళ్ళలో పూర్తిచేసి ఆ ఫలాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

హక్కుల పరిరక్షణలో రాజీలేని పోరాటం

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం అస్తవ్యస్తంగా, గందర గోళంగా ఉన్న పరిస్థితుల్లో రాష్ట్ర హక్కులను పరిరక్షించుకునేందుకు, బంగారు తెలంగాణ నిర్మాణం లక్ష్యాలను చేరుకునేందుకు కేసీఆర్ అహర్నిషలూ కృషి చేస్తున్నారు. గోదావరి జలాల్లోని తెలంగాణా వాటాలో చుక్క నీరు కూడా వదిలిపెట్టేది లేదన్న పట్టుదలతో ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేస్తున్నారు. నీళ్ళు, నిధులు, ఉద్యోగాల్లో ఇన్నాళ్ళూ జరిగిన అన్యాయాన్ని భర్తీ చేసేందుకు పరిపాలన విధానాల్లో కీలక మార్పులు తీసుకువస్తూ నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అన్నింటినీ దశల వారీగా అమలు చేయడంతో పాటు ప్రకటించని అనేక కార్యక్రమాలను కార్యరూపంలోకి తీసుకువచ్చారు.

ప్రతి గ్రామానికి రహదారి

జిల్లా కేంద్రాల నుంచి రాజధానికి నాలుగు లైన్ల రహదారులు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు లైన్ల రహదారులను నిర్మించేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశారు.

రోడ్లు భవనాల శాఖ పరిధిలో గత ఏడాది 7500 కిలోమీటర్ల రహదారులను నిర్మించగా, ఈ ఏడాది 9వేల కిలోమీటర్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో గత ఏడాది 4,500 కిలోమీటర్ల రహదారులను పూర్తిచేశారు. ఈ ఏడాది మరో 6వేల కిలోమీటర్ల రోడ్లను నిర్మించేందుకు చర్యలు ప్రారంభించారు. గడిచిన మూడేళ్ళలో రాష్ట్రానికి దాదాపు 16వందల పరిశ్రమలు సాధించారు. దీంతో రూ.30వేల కోట్ల పెట్టుబడులు రాగా లక్షా 11వేల మందికి ఉపాధి లభించినట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. కేవలం ఒక్క ఐటీ రంగంలోనే 1300 కంపెనీలను స్థాపించి సాంకేతిక రంగం అభివృద్ధికి బాటలు వేశారు.

వారసత్వ సంపదను

కాపాడండి

కేంద్ర అటవీశాఖ మంత్రికి జోగు రామన్న వినతి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే చెందిన కొన్ని ప్రత్యేక జాతుల పశువుల సంరక్షణ కోసం లైవ్‌స్టాక్ హెరిటేజ్ ఫాం మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి జోగు రామన్న కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ఢిల్లీలో కేంద్ర అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌తో శుక్రవారం రాత్రి భేటీ అయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న లైవ్‌స్టాక్ ఫాంలలో ఒక్కటి కూడా తెలంగాణకు చెందలేదని వివరించారు. పైపెచ్చు ఆదిలాబాద్ జిల్లాలో జరి, తూర్పు అనే స్థానిక జాతుల పశు సంపదను గుర్తించామని, వాటిని సంరక్షించుకోడానికి హెరిటేజ్ ఫాం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర మంత్రికి తెలిపారు. కాగ్ 13 సదస్సులో భారత దేశం తరపున హాజరైన తెలంగాణ రాష్ట్రం వారసత్వ పశుసంపదను సంరక్షించుకోవాలని తీర్మానం చేసినట్టు ఆయన వెల్లడించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన జోగు రామన్న, హెరిటేజ్ ఫాం నెలకొల్పడానికి ఆదిలాబాద్ జిల్లా అత్యంత అనువైనదని పేర్కొన్నారు. అడవులు, గిరిజనులు ఎక్కువగా ఉన్న ఈ జిల్లాలో హెరిటేజ్ ఫాం ఏర్పాటు చేయాలంటే రూ. 190 కోట్లు ఖర్చవుతుందని, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 125 కోట్లు ఇస్తే, మిగతా మొత్తాన్ని స్థానిక స్వచ్ఛంద సంస్థలు లేదా రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి వెచ్చించి పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. హెరిటేజ్ ఫాంతో పాటు పెండింగ్ సమస్యలపైనా జోగు రామన్న మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేయాల్సిన కాంపా నిధుల గురించి మరోసారి గుర్తుచేశారు. అలాగే టీఎస్ కాస్ట్ కోసం కేటాయించిన రూ. 3 కోట్లలో ఇప్పటి వరకు కేవలం రూ. 75 లక్షలు మాత్రమే విడుదల చేశారని, మిగతా మొత్తాన్ని కూడా త్వరలో విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్టు వివరించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని జోగు రామన్న వెల్లడించారు.

గ్రీన్ సిటీగా భాగ్యనగరం

(మొదటిపేజీ తరువాయి)

పారిశుధ్యం, రవాణా సదుపాయాలు, మార్కెట్లు, టాయిలెట్లు, పచ్చదనం తదితర అంశాల్లో నగరం ఎలా ఉండాలో ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. హైదరాబాద్ నగరాభివృద్ధిపై ప్రగతి భవన్‌లో శుక్రవారం సీఎం కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మం0త్రులు కేటీ రామారావు, టి.హరీష్‌రావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటి మేయర్ ఫజీయుద్దీన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, రామకృష్ణ, నవీన్ మిట్టల్, జిహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, హెచ్‌ఎండిఏ కమిషనర్ చిరంజీవులు, వాటర్ వర్క్స్ కమిషనర్ దానకిషోర్, పిసిసిఎఫ్ ప్రశాంత్ కిషోర్ ఝా, సీఎంవో ప్రత్యేక కార్య దర్శి భూపాల్‌రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శరవేగంగా పెరుగుతున్న హైదరాబాద్‌లో జనాభా అవసరాలు దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని, రానున్న 30 ఏళ్ళకు అంచనాలు వేసి ఆ రీతిలో మౌలిక సదుపాయాలు ఉండేలా డిజైన్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రానున్న రోజుల కోసం ఇప్పటినుంచే ఆలోచన చేస్తూ అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కనీసం పదేళ్ళ కార్యాచరణ ప్రణాళిక వేయాలని, ఇప్పటినుంచి చేసే ప్రతిపని ఆ ప్రణాళికలో భాగమై ఉండాలని సీఎం నిర్దేశించారు. ప్రజలకు నిరంతర విద్యుత్ ఇచ్చేందుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి అందులో విజయం సాధించామని కేసీఆర్ సంతృప్తి వ్యక్తంచేశారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, రైతులకు సాగునీరు కోసం ప్రాజెక్టులు కడుతున్నామని గుర్తుచేశారు. ఈ రెండు రంగాలలో పనులు బాగా సాగుతున్నయనీ, ఇక ప్రజలకు మౌలికసదుపాయాలు అందించే విషయంలో ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని చెప్పారు. నగరాలు, పట్టణాలలో నివసించే జనాభా పెరుగుతోందని, దీనికి అనుగుణంగా వసతులు కల్పించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలోనే దాదాపు కోటి జనాభా ఉందని, ఈ నగరంపై ఎక్కువ దృష్టి పెట్టాలని, ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలని ఆయన సూచించారు.

హైదరాబాద్ మంచినీటి సరఫరాకు శాశ్వత ప్రాతిపదికన రెండు రిజర్వాయర్లు చూడాలని ఆయన చెప్పారు. గోదావరి నదిపై కడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక రిజర్వాయర్‌ను, కృష్ణానదిపై పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా మరో రిజర్వాయర్‌ను నింపాలని ముఖ్యమంత్రి చెప్పారు. గ్రావిటి ద్వారా నీటిని సరఫరా చేసి 10 నుంచి 15 టిఎంసీలు నిల్వ ఉండేవిధంగా రిజర్వాయర్లు నిర్మించాలని, దీనికోసం సాంకేతిక అంశాలను పరిశీలించి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న వేలాది ఎకరాల అటవీ భూముల పచ్చదనం పెంచాలన్నారు. నాగోల్, నారపల్లి ప్రాంతాల్లో దాదాపు 8వేల ఎకరాలు, శంషాబాద్ ప్రాంతంలో దాదాపు 16వేల ఎకరాలు, నర్సాపూర్, శివంపేట ప్రాంతాల్లో దాదాపు 40వేల ఎకరాల భూమి ఉందని ముఖ్యమంత్రి వివరించారు. ఓఆర్‌ఆర్ పొడవునా వేప, రావి, గుల్మోర్ చెట్లు నాటాలని, ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్‌లో పచ్చదనం ఉండాలని ఆయన అన్నారు. నగరంలో పచ్చదనం పెంచే కార్యక్రమం పర్యవేక్షించేందుకు మునిసిపల్ శాఖ మంత్రి పేషీలో ఓ ఐఎఫ్‌ఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలని కేసీఆర్ సూచించారు.

నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెంచాలనీ, అందుకోసం బస్తీ కమిటీలు వేయాలని చెప్పారు. ప్రతి డివిజన్‌కు 10 కమిటీలు ఉండాలని, 15 రోజుల్లోగా కమిటీల నియామకం పూర్తి కావాలని కేసీఆర్ ఆదేశించారు. ప్రజలందరినీ కలుపుకుని బస్తీలో పచ్చదనం పెంచడం, పరిశుభ్రత కాపాడడం తదితర విషయాల్లో ఈ కమిటీలు కీలకంగా పనిచేస్తాయని ఆయన అన్నారు. గండిపేట, హిమాయత్‌సాగర్, శామీర్‌పేటతో పాటు నగరంలో, నగరం చుట్టూ ఉన్న చెరువుల్లో పారిశ్రామిక వ్యర్థాలు, ఇతర కాలుష్యం చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, మురికినీరు చెరువుల్లోకి చేరకుండా ప్రత్యేక కాలువలు నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలో కొత్తగా కట్టే నిర్మాణాలు ఇచ్చే సందర్భంలో అధికారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని, అనుమతులు ఇచ్చే సందర్భంలో తప్పులుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబర్మతి రివర్ ఫ్రంట్ తరహాలో మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయాలని, మూసీనదిలో మురికినీరు చేరకుండా చూడాలని సూచించారు.

మురికినీరు పోవడానికి ప్రత్యేక ఏర్పాట్లుచేసి నదికి రెండువైపులా ఉద్యానవనాలు అభివృద్ధి చేయాలని చెప్పారు. మూసీ మీదుగా ఓఆర్‌ఆర్ నుంచి ఓఆర్‌ఆర్ వరకు రహదారి నిర్మించి మూసీనది దాటడానికి పలుచోట్ల వంతెనలు నిర్మించాలని అధికారులకు సూచించారు. నగరంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరచి ఇండ్లపై తీగలను తొలగించాలని ఆదేశించారు.

నగరంలో పెరిగే డిమాండ్‌ను కూడా దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. ఎస్‌ఆర్‌డిపిలో భాగంగా నిర్మించే రహదారుల విషయంలో క ూడా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఉప్పల్ లాంటి ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అండర్ పాస్‌లు నిర్మించే సందర్భంలో వర్షం, వరదనీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు అవసరమైన సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఒకేసారి వినాయకచవితి, బక్రీద్ పండుగలు

సెప్టెంబర్ 5న గణేష్ నిమజ్జనం

- 35 వేల మందితో భారీ భద్రత
- ప్రతి గణేష్ మండపానికి జియోట్యాగింగ్‌తో పర్యవేక్షణ
- గణనాథుని ఊరేగింపు మార్గాల్లో సీసీటీవీల ఏర్పాటు
- అన్ని శాఖలతో సమన్వయం: హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : జీహెచ్ఎంసీ పరిధిలో గణేష్ చవితి పండుగ, గణేష్ నిమజ్జ నంలను శాంతి యుతంగా, ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి తెలిపారు. శుక్ర వారం సచివాలయంలో గణేష్ చవితి పండుగ, గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ, గత సంవత్సరం మాదిరే ఈ సంవత్సరం గణేష్ చవితి నిమజ్జనాన్ని శాంతి యుతంగా జరుపుకోవడానికి అన్ని శాఖలు ఏర్పాట్లు చేస్తున్నాయని, భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు తగు సహకారం అందించాలని కోరారు. గణేష్ పండుగను ప్రశాంతంగా నిర్వహించడానికి దాదాపు 35 వేల మంది పోలీసు సిబ్బందిని నియ మించి ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గాలలో సీసీటీవీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారన్నారు. గణేష్ నిమజ్జనం కోసం వివిధ లోకేషన్లలో 71 స్టాటిక్, 70 మొబైల్ క్రైన్లు అవసరమైన పక్షంలో అదనపు మొబైల్ క్రైన్లను ఇరిగేషన్ శాఖ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రహదారులు, భవనాల శాఖ ద్వారా నిమజ్జనం జరిగే చెర్వుల వద్ద పోలీసుల సహ కారంతో బ్యారికేడింగ్ చేపడుతున్నామన్నారు. జీహెచ్‌యంసీ ద్వారా గణేష్ విగ్రహాల ఊరేగింపు మార్గాలకు మరమ్మతులు, అప్రోచ్ రోడ్డుల నిర్మాణం, పారిశుద్ధ్యం, రహదారుల విద్యు దీకరణ, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పట్లు చేపడుతున్నామన్నారు. వినాయక నిమజ్జనాన్ని సెప్టెంబర్ 5వ తేదీ ఉదయం నుండే ప్రారంభించేలా చూడాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు.

ఖైరతాబాద్ గణేష్ విగ్రహ నిమజ్జనాన్ని కూడా నిమజ్జనం రోజే నిర్వహించాలని కోరారు. నిమజ్జనానికి అవసరమైన వాహనాలను సేకరించాలని రవాణా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను, టీములు, స్టాండ్ బై ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచుతున్నామని అధికారులు వివరించారు. నిమజ్జనం జరిగే రోజు 10 లక్షల మంచినీటి పాకెట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తుల కోసం వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా మందులు, అంబులెన్సులు అందుబాటులో ఉంచుతామన్నారు. గణేష్ పండుగ సందర్భంగా ఆర్టీసీ ద్వారా అదనంగా 500 బస్సులు రాత్రి సమయాలలోనూ నడుపుతామని తెలిపారు. నగర పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిటీలో నిమజ్జన కార్యక్రమం ప్రతిసారి మాదిరే ఈ సారి కూడా ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గణేష్ పండుగ మొదలు కొని నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జంట నగరాలలో 25 వేల మంది సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో 10 వేల మంది పోలీసు సిబ్బందిని పర్యవేక్షణకై నియమించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. గణేష్ పండుగ, బక్రీద్ ఒకే సమయంలో వస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకొనుటకు చర్యలు తీసుకుంటామన్నారు.

భాగ్యగనర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గణేష్ మండపాల సభ్యులతో మాట్లాడి నిమజ్జనాన్ని ఉదయం నుండే జరిగే విధంగా చూడాలని అన్నారు. ప్రతి గణేష్ మండపాన్ని జియో ట్యాగింగ్ చేసి పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. అంతకు ముందు గణేష్ పండుగ, నిమజ్జనంపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యలు రాజాసింగ్, స్టీఫెన్‌సన్, జి.ఎ.డి.ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్‌త్రివేది, దేవాదాయ శాఖ కార్యదర్శి శివశంకర్, ఫైర్ సర్వీసెస్ డి.జి. రాజీవ్ రతన్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు మహేందర్‌రెడ్డి, సందీప్‌శాండిల్య, మహేష్ భగవత్, అడిషినల్ డీజీ అంజనీకుమార్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు ప్రత్యేక విద్యుత్ టారిఫ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక విద్యుత్ టారీఫ్‌ను ప్రకటించింది. గణేశ్ విగ్రహాలను ప్రతిష్టించేమండపాలలో ఈ విద్యుత్ టారీఫ్‌ను అమలు చేయనున్నారు. ఈ నెల 25నుంచి సెప్టెంబర్ 4 వరకూ మొత్తం 11రోజులపాటు ఈ ప్రత్యేక విద్యుత్ చార్జీల టారీఫ్ అమల్లో ఉంటుంది. ఎల్‌టీ తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను పొందగోరే గణేశ్ ఉత్సవ నిర్వాహకులకోసం ఈ టారీఫ్‌ను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా 250 వాట్ల విద్యుత్ వినియోగానికి రూ.500, 250నుంచి 500వాట్ల విద్యుత్ వినియోగానికి వెయ్యి రూపాయాలు, 500వాట్లు ఆ పైన విద్యుత్ వినియోగానికి రూ.1500 గా నిర్ణయించారు. 500పైన వినిగించే ప్రతి 500వాట్లకు రూ.750 రూపాయాలు చెల్లించాల్సి ఉంటుంది. ఒక వేళ దరఖాస్తు దారులు మీటర్డ్ విద్యుత్ సరఫరాను కోరితే అములో ఉన్న నిబంధనల ప్రకారం ఎల్‌టీ తాత్కాలిక సరఫరాను అందిస్తారు. విద్యుత్ తీగలకు కొక్కేలను తగిలించి విద్యుత్ సరఫరాను పొందటం నేరమే కాకుండా అపాయం కూడా అని అధికారులు హెచ్చరించారు. గణేశ్ మండపాల నిర్వాహకులతో స్థానిక విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మాట్లాడి విద్యుత్ కనెక్షన్ పొందేంవిధంగా ప్రొత్సహించాలని సీఎండీ రఘుమారెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎలక్ట్రిసిటీ యాక్టు 2003 ప్రకారం విద్యుత్ చౌర్యం నేరమే కాకుండా హానికరం అని, విద్యుత్ వినియోగం కోసం విధిగా కనెక్షన్ తీసుకోవాలని సీఎండి రఘుమారెడ్డి పేర్కొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 12 ఆగస్టు 2017

మంచిమాట నిపుణులతో వచ్చిన చిక్కేమిటంటే వాళ్లు సంకుచితంగా ఆలోచిస్తారు. ● ఎలైన్ మోర్గన్


అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్(యు)లతో జనతాదళ్(యు) మహాఘట్‌బంధన్ (మహాకూటమి)ని ఏర్పాటు చేసింది. బీజేపీకి వ్యతిరేకంగా సెక్యులర్ పార్టీలన్నీ కలిసి ఏర్పాటు చేసిన ఈ కూటమికి నితీశ్ తూట్లు పొడిచారని శరద్ యాదవ్ ఆరోపిస్తే, సెక్యులర్ ముద్ర కోసం అవినీతి ముద్ర వేయించుకోవాలా అని నితీశ్ ప్రశ్నిస్తున్నారు. ఇద్దరివాదనల్లో లాజిక్ ఉంది. ఆర్‌జెడిఅధ్యక్షుడు లాలూ ప్రసాద్, ఆయన తనయుని అవినీతి బురద తనకు అంటకుండా ఉండటం కోసమే మహాకూటమి నుంచి బయటకు వచ్చి తిరిగి బీజేపీతో చేతులు కలిపినట్టు నితీశ్ వివరణ ఇస్తున్నారు.

జేడీయూలో చీలిక... దూరమైన చిరకాల మిత్రులు !

బీహార్‌లో అధికారంలో ఉన్న జనతాదళ్(యు) చీలిక దిశగా సాగుతోంది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు శరద్ యాదవ్, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ల మధ్య కొద్ది రోజులుగా సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం ఇప్పుడు ప్రత్యక్షయుద్ధంగా రూపు తీసుకుంది. నితీశ్ అధికారంలో ఉన్న కారణంగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లో అత్యధికులు ఆయననే సమర్థిస్తున్నారు. శరద్ యాదవ్ రాజ్యసభలో పార్టీ నాయకునిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఆయనకు ఇద్దరు ఎంపీల మద్దతు మాత్రమే ఉంది. అందుకే, శరద్ యాదవ్ తన దారి తాను చూసుకుంటే అభ్యంతరం లేదని నితీశ్ కుమార్ నిర్మొహమాటంగా స్పష్టం చేశారు. బీజేపీ ఆడిస్తున్న ఈ ఆటలో చిరకాల మిత్రులు దూరమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్(యు)లతో జనతాదళ్(యు) మహాఘట్‌బంధన్ (మహాకూటమి)ని ఏర్పాటు చేసింది. బీజేపీకి వ్యతిరేకంగా సెక్యులర్ పార్టీలన్నీ కలిసి ఏర్పాటు చేసిన ఈ కూటమికి నితీశ్ తూట్లు పొడిచారని శరద్ యాదవ్ ఆరోపిస్తే, సెక్యులర్ ముద్ర కోసం అవినీతి ముద్ర వేయించుకోవాలా అని నితీశ్ ప్రశ్నిస్తున్నారు. ఇద్దరివాదనల్లో లాజిక్ ఉంది. ఆర్‌జెడిఅధ్యక్షుడు లాలూ ప్రసాద్, ఆయన తనయుని అవినీతి బురద తనకు అంటకుండా ఉండటం కోసమే మహాకూటమి నుంచి బయటకు వచ్చి తిరిగి బీజేపీతో చేతులు కలిపినట్టు నితీశ్ వివరణ ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తమ పార్టీతో చేతులు కలిపిన నితీశ్‌కి తమ అవినీతి గురించి ఇప్పుడు గుర్తొచ్చిందా అని లాలూ కుటుంబసభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌జెడితో జనతాదళ్(యు) మహా కూటమిని ఏర్పాటు చేయడానికి ముందే లాలూ జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటికి వచ్చారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చోటు చేసుకున్న దాణా కుంభకోణంలో కోట్లాది రూపాయిల అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు రుజువు కావడంతో కోర్టు ఆయనకు జైలు శిక్ష విధించింది. శిక్ష పడటానికి ముందు ఆయన బెయిల్‌పై ఉంటూనే, యూపీఏ-1 ప్రభుత్వంలో ఐదేళ్ళ పాటు రైల్వే మంత్రిగా వ్యవహరించారు. ఆ సమయంలో కాంట్రాక్టుల కేటాయింపులో చోటు చేసుకున్న అవినీతిపై సీబీఐ ఇప్పుడు విచారణ జరుపుతోంది. ఈ విచారణ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, లాలూ కుమారుడు అయిన తేజస్విపై ఎఫ్‌ఐఆర్‌ని నమోదు చేసింది. అయితే, తన తండ్రి రైల్వే మంత్రిగా కొనసాగిన కేసులో తన వయస్సు 14 సంవత్సరాలేననీ, తనను ఎలా బాధ్యుణ్ణి చేస్తారంటూ తేజస్వి ఎదురు ప్రశ్నించినా అతడి వాదం నిలబడలేదు. అతడి రాజీనామా కోసం బీజేపీ పట్టుపట్టడం, అవినీతిని సహించబోనంటూ నితీశ్ రాజీనామా చేయడం వంటి పరిణామాల తదనంతరం నితీశ్ బీజేపీతో చేతులు కలిపారు. తనపై ఎఫ్‌ఐఆర్ నమోదు అయిన వెంటనే రాజీనామా చేసి తమ పార్టీలోనే మరొకరికి ఆ పదవిని అప్పగించి ఉంటే నితీశ్‌కుమార్ తప్పుకుని ఉండేవారు కారు. లాలూ తన కుమారుణ్ణి వెనకేసుకుని రావడం వల్లనే మహాకూటమికి తూట్లు పడ్డాయి. వాస్తవం ఇది కాగా, నితీశ్ పదవీ కాంక్షతో బీజేపీతో చేతులు కలపడం వల్లనే మహాకూటమి చీలిపోయిందని ఇంతకాలం లాలూ చేస్తూ వచ్చిన ఆరోపణనే ఇప్పుడు శరద్ యాదవ్ అందుకున్నారు.నితీశ్ బీజేపీతో కలిసి సంకీర్ణ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసిన వెంటనే శరద్ యాదవ్ నితీశ్ చర్యను ఎండగట్టి ఉంటే ఆయన ఉద్దేశ్యాన్ని శంకించేందుకు వీలుండేది కాదు. నితీశ్‌ని సమర్థిస్తున్న ఎంపీలల్లో ఇద్దరికి కేంద్రంలో మంత్రి పదవులు ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఆ ఇద్దరిలో తనపేరు లేకపోవడం వల్లనే శరద్ యాదవ్ ఇప్పుడు నితీశ్‌పై ధ్వజమెత్తుతున్నారని ఆయనవర్గీయులు ఆరోపిస్తున్నారు. ఇది కూడా నమ్మదగిందే. పదవి కోసం ఆశించడం, భంగపడిన వెంటనే ఎదురు తిరగడం ఆధునిక రాజకీయాల్లో సర్వసాధారణమే. అధికార పార్టీల్లో చీలిక వచ్చినప్పుడు అధికారంలో ఎవరుంటే వారి వర్గమే చివరికి అసలైన పార్టీ అవుతుంది. 1969లో కాంగ్రెస్‌లో తొలిసారి చీలిక వచ్చినప్పుడు ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధీ నేతృత్వంలోని ఇందిరాకాంగ్రెస్సే అసలైన కాంగ్రెస్ అయింది. ఇప్పుడూ నితీశ్ నేతృత్వంలోని జనతాదళ్ వర్గమే అసలైన జేడీయూ అవుతుంది. అందుకే, శరద్ యాదవ్ తన దారి చూసుకోవచ్చని నితీశ్ ఖరాకండీగా స్పష్టం చేశారు. తాను బీహార్ బీహార్ ప్రజల మేలు కోసమే బీజేపీతో చేతులు కలిపానని నితీశ్ స్పష్టం చేస్తున్నారు. ఇదంతా ఆయన పదవీ కాంక్ష వల్ల జరిగిందని అనడం కన్నా, దేశంలోని అన్ని రాష్ట్రా లనూ తన ఏలుబడిలోకి తెచ్చుకోవాలన్న యావతో కమలనాథులు చకచకా పావులు కదపడం, ఈ క్రమంలో సీబీఐ, ఆర్థిక శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) వంటి ప్రభుత్వ విభాగాలను ఇష్టమొచ్చినట్టు వినియోగించుకోవడం వల్లనే జరుగుతోంది. అంతమాత్రాన లాలూ అవినీతిని ఎవరూ సమర్థించరు. బీహార్‌లో సొంతంగా అధికారంలోకి రావడానికి బీజేపీ చాలా కష్టపడింది. నితీశ్ కుమార్‌తో పొత్తు లేకపోయినా, ప్రధానమంత్రి నరేంద్రమోడీ పట్ల జనానికి ఉన్న ఆకర్షణశక్తితో అధికారంలోకి రావచ్చని ఆశించి భంగపడింది. బీహార్‌ని ఎన్‌డిఏ ఖాతాలో వేసుకునేందుకు కమలనాథులు నడిపించిన ప్రహసనం పర్యవసానమే రాష్ట్రంలో తాజా పరిణామాలు. ఇందులో ఎవరూ తక్కువ కాదు. అటు లాలూ తన కుటుంబం పట్టును కాపాడుకోవడానికి ప్రయత్నిస్తే, ఇటు బీజేపీ తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించింది. ఒక కుటుంబం కోసం రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టడం కన్నా, మతతత్వశక్తులతో చేతులు కలపడం తప్పులేదన్న నితీశ్ వాదనకు ప్రజలు మద్దతు ఉందో లేదో ఏదైనా అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరిగితే తెలుస్తుంది.

నెహ్రూ ముద్రను చెరిపేయగలరా?

తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ లౌకిక రాజ్యాంగ వ్యవస్థ ప్రాణాధారంగా నవభారత నిర్మాణానికి మార్గదర్శకుడయ్యారు. ఆయన హయాంలో జాతీయ,అంతర్జాతీయ రంగాల్లో దేశం తనదైన ముద్రవేసుకున్నది. శాంతియుత సామ్యవాదం లక్ష్యంతో ఆయన పదిహేడేళ్ళ పాటు ప్రధానమంత్రి పదవిని నిర్వహించి పంచవర్ష ప్రణాళికలను అమలు జేశారు. దేశంలో నవరత్నాలుగా పేరొందిన భారీ పరిశ్రమలన్నీ ఆయన హయాంలో వెలిసినవే. అలాగే, ప్రాజెక్టులే దేవాలయాలుగా భావించి ఆయన భాక్రానంగల్,నాగార్జున సాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారు. మహోన్నతమైన సేవలందించిన తొలి ప్రధాని పేరును దేశాధ్యక్షపదవికి ఎన్నికైన సంఘ్ పరివార్ తొలి ప్రతినిధి రామనాథ్ కోవింద్ తన తొలిప్రసంగంలో ప్రస్తావించకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న లోపం.ఇది సమంజసమా అన్న చర్చ జరుగుతోంది. బీజేపీకి మాతృక అయిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయను గుర్తు చేసుకుంటూ, జాతిపిత మహాత్మాగాంధీ, తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్,రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌లను ప్రత్యేకంగా ప్రసావించిన కోవింద్ నెహ్రూజీ పేరును విస్మరించడం ప్రస్తుత ప్రభుత్వ విధానానికి అనుకూలంగానే ఉంది.నెహ్రూ నెలకొల్పిన వ్యవస్థలన్నింటినీ సమూలంగా మార్చడం ద్వారా నెహ్రూ ముద్రను పూర్తిగా చెరిపివేయడమే లక్ష్యంగా ప్రస్తుత ప్రభుత్వం పని చేస్తోంది.అయితే,అది సాధ్యమా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రధానమంత్రి పదవిని చేపట్టక ముందు ఎన్నికల ప్రచారం సందర్భంగా తన వైఖరి ఏమిటో నరేంద్రమోడీ వెల్లడించారు.ఇప్పుడు చోటు చేసుకుంటున్నవన్నీ అందుకు అనుగుణంగానే ఉన్నాయి.



దేశాధ్యక్ష పదవిలో ఉన్న రామనాథ్ కోవింద్, రాజకీయ పార్టీలకు అతీతంగా వ్యవహరించవలసిన ఉన్నత వ్యక్తిగా, దేశ గౌరవ ప్రతిష్ఠలను అత్యున్నత విలువలతో సంరక్షించగలరని యావత్ దేశం ఆశిస్తోంది. 21వ శతాబ్దపు రెండో దశాబ్దంలో, 70 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో, సుదీర్ఘ దశాబ్దాలు దేశాన్ని పాలించిన భారత జాతీయ కాంగ్రెస్‌కు పటిష్ఠమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా భారతీయ

జనతాపార్టీ ఎదగటం భారత ప్రజాస్వామ్య మహోన్నత విలువలకు తార్కాణం. 130 ఏళ్ళ కాంగ్రెస్‌ను, కేవలం 37 సంవత్సరాల ఆవిర్భావ చరిత్ర కలిగిన బిజెపి, ప్రతిపక్షంలో కూర్చోపెట్టగలగటం గొప్పవిషయమే. 1952లో తొలి లోక్‌సభలో నాటి భారతీయ జనసంఘ్ మేధావులు ముగ్గురే ఉన్నారు. 2014 నాటి 16వ లోక్‌సభలో 282 సీట్లు గెలిచిన భారతీయ జనతాపార్టీ అత్యధిక మెజారిటీ సాధించడం సామాన్యవిషయం కాదు.

జాతీయవాదంలో హిందుత్వం

తొలితరం జాతీయ నేతలు లోకమాన్య తిలక్, మదనమోహన మాలవ్యా, గాంధీజీ వంటివారు జాతీయవాదంలో హిందుత్వాన్ని సమర్థించారు. భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు, స్వాతంత్ర్య సాధన, భారతజాతి ఒకేశక్తిగా చైతన్యవంతం కావటానికి ఆయుధంగా హిందూత్వాన్ని సమర్థించారు.1915 నుంచి 1937 వరకు కాంగ్రెస్ పార్టీలో అంతర్భాగంగా హిందుత్వ చైతన్యంతో హిందూ మహాసభ, ఆర్యసమాజ్, సనాతన ధర్మసభ వంటి సంస్థలతో కాంగ్రెస్ నాయకులకు అనుబంధం కొనసాగేది. 1937 - 1947 దశాబ్దంలో అఖండ భారత్ విభజనకు దారితీసిన చారిత్రక పరిస్థితులు బ్రిటిష్ దుర్నీతి, ముస్లిం లీగ్ వితండవాదాలు హిందుత్వవాదాన్ని సంఘటితం చేశాయి. దురదృష్టవశాత్తు దేశ విభజన అనివార్య అశనిపాతంగా పరిణమించింది. హిందూ జాతీయవాదిగా భారత జాతీయ కాంగ్రెస్‌కు నాలుగుసార్లు అధ్యక్షుడైన మాలవ్యాను మరణించిన 69 సంవత్సరాల తరువాత ప్రస్తుత మోడీ ప్రభుత్వం భారతరత్నతో గౌరవించటం అపురూపం.

జనసంఘ్ నుంచి బిజెపి ప్రస్థానం

తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కేబినెట్‌లో మంత్రిగా నాడు శ్యామప్రసాద్ ముఖర్జీ బాధ్యత స్వీకరించారు. అప్పటికీ హిందుత్వవాదం, అఖండ భారత్ నినాదం ఇంకా వదులుకోలేదు. పైగా నెహ్రూ ప్రభుత్వం ముస్లింల పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ,శ్యామప్రసాద్ ముఖర్జీ మంత్రి పదవికి రాజీనామా చేశారు.

1950 ఏప్రిల్‌లో రాజీనామా అనంతరం ఆయన సన్నిహితమిత్రులైన మేధావులతో కలిసి భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులయ్యారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అద్వానీ వంటి మేధావివర్గం అండదండలున్నాయి. జనసంఘ్, కాంగ్రెస్‌కు బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగలేదు. వాజ్‌పేయి వంటి మేధావులు, సునిశితమైన ప్రతిపక్ష నేతలుగా పార్లమెంటులో నెహ్రూ ప్రభుత్వాన్ని నిలదీసేవారు.

నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ వారసత్వ ఆధిపత్యం

1947 నుంచి 1977 వరకు నెహ్రూ అనంతరం ఇందిర తిరుగులేని ఆధిపత్యంతో దేశాన్ని నడిపించింది. ప్రతిపక్ష పార్టీలే కాదు. కాంగ్రెస్ పార్టీ లోనే మొరార్జీ దేశాయ్, సంజీవరెడ్డి వంటి నాయకులకు పొగపెట్టి పొమ్మనే నిరంకుశ పోకడలు కాంగ్రెస్‌ను ఇందిర హయాంలో చీల్చి వేశాయి. అప్పటికే దేశాన్ని తండ్రి, కుమార్తె కలిసి 33 సంవత్సరాలు పాలించారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ విప్లవ సారథిగా ప్రతిపక్ష పార్టీలను ఐక్యంచేసి జనతాపార్టీని ఆవిర్భవింపజేశారు. ప్రస్తుతం భారతీయ జనతాపార్టీ దేశాధికారం చేపట్టడానికి నాడు జెపి స్థాపించిన జనతాపార్టీ, ఊపిరందించింది. అయినా ప్రతిపక్షాల అనైక్యత కారణంగా ఇందిర, రాజీవ్ మళ్ళీ ప్రధానులు కాగలిగారు. సోనియా సారథ్యంలో మన్మోహన్‌సింగ్ మళ్ళీ ప్రధానిగా, పరోక్షంగా నెహ్రూ వారసత్వం కొనసాగింది.

అత్యవసర పరిస్థితి సృష్టించిన రాజకీయ దుష్పరిణామాల చారిత్రక స్థితిగతులలో చంద్రశేఖర్ ప్రధానిగా ఉండగా జనతా పార్టీ నేతలుగా ఉన్న వాజ్‌పేయి, అద్వానీ వంటి నేతలు జనసంఘ్‌లో కూడా సభ్యత్వం కలిగివుంటే ద్వంద్వ సభ్యత్వ వైఖరిపై విమర్శలు తలెత్తాయి. అప్పటికే జనతాపార్టీ ముక్కలు చెక్కలై అధికార వ్యామోహంలో జయప్రకాశ్ కన్నకలలు భగ్నమయ్యాయి. అదే అదునులో 1980 ఏప్రిల్ నాటికి వాజ్‌పేయి, అద్వానీ, జోషి, మల్హోత్రా, సికందర్ భక్త్, రామ్‌జెఠ్మలానీ వంటి జనతా నేతలు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ ప్రతిపక్ష రాజకీయశక్తిగా భారతీయ జనతాపార్టీగా, బిజెపికి ప్రాణం పోశారు. వాజ్‌పేయి బిజెపి తొలి అధ్యక్షుడై అనంతరం దేశానికి తొలి బీజేపీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టగలగటం భారత ప్రజాస్వామ్య ఘనవిజయం. పార్టీ చీఫ్‌గా లాల్‌కృష్ణఅద్వానీ 1990 రామ్ జన్మభూమి, రథయాత్ర హిందుత్వం బిజెపిని జాతీయస్థాయిలో సుప్రతిష్ఠం చేసింది.

జనతాపార్టీ ఆఖరి అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యస్వామి 2014 ఎన్నికలముందు ఆ పార్టీని భూస్థాపితం చేసాడు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బిజెపి, బిఎస్‌పి, ఎన్‌సిపి, సిపిఐ, సిపిఎమ్, తృణమూల్ కాంగ్రెస్ ఏడు రాజకీయ పార్టీలు ఉన్నా యుపిఎ, ఎన్‌డిఎ సంకీర్ణ కూటములుగా కేంద్రాధికార ఆధిపత్యం కాంగ్రెస్, బిజెపిలకే సంక్రమిస్తోంది. ఉత్తర భారతావని రాజకీయ పార్టీగా రాష్ట్రా లలో సుప్రతిష్ఠమవుతున్న బిజెపిని, దక్షిణ భారతంలో బలపడి జాతీయస్థాయి రాజ్యాధికారాన్ని స్థిరంగా మరింత విస్తరింపచేసుకొనే ప్రయత్నంలో బిజెపి తలమునకలవుతోంది. ప్రధాని నరేంద్రమోడీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా రాజకీయ చాణక్యులని, దేశాధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు రామ్‌నాథ్ కోవింద్, వెంకయ్యల నిర్ణయం స్పష్టం చేస్తోంది. రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలు కేంద్ర పాలనకు అనుకూలమైనా,అవి ఏమాత్రం బలహీన పడినా, వాటిని లొంగదీసుకునేందుకు మోడీ,అమిత్ షా ద్వయం ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. వాటి ప్రభావం తెలుగు రాష్ట్రా లపై కూడా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఐదేళ్ళ (2022) లో జరుపుకునే స్వాతంత్ర్య సంరంభం ప్లాటినం వేడుకల నాటికి నవభారత్ నిర్మాణానికి సంసిద్ధం కావాలన్న పిలుపు అంతరార్థం అదే.

- జయసూర్య , 9440664610

డ్రగ్స్ వెనుక లక్ష్యం
హైదరాబాద్

హైదరాబాద్ లక్ష్యంగా డ్రగ్స్ సరఫరా వెనుక పెద్ద కుట్ర దాగుం ది. భారతదేశంలో యువత 60 శాతం పైన ఉంది. విదేశాల నుండి కొకైన్, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలను దొంగచాటుగా సరఫ రా చేస్తున్నారు. తీగ లాగితే డొంక కదిలినట్టు ఒకకార్పొరేట్‌స్కూలు అమ్మాయి వల్ల ఈ వ్యవహారం బయటకొచ్చింది. ఆ విద్యార్థిని మత్తుకు బానిసై నగ్నంగా ఫొటోలు పంపిన సంఘటన హైదరాబాద్‌లో స్కూళ్ళ పరిస్థితిని కళ్ళకు కడుతుంది. హెదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని చేస్తున్న కుట్రలను తెలంగాణ ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాంఘికంగా, ఆర్థికంగా ప్రపంచ వేదికల నుండి ఆ దేశాల కుట్రలను తిప్పికొట్టాలి. డ్రగ్స్ మాఫియా పైన యుద్ధాన్ని ప్రకటించి అసలు తెలంగాణలో హైదరాబాద్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నాయో తెలంగాణ ప్రభుత్వం తేల్చాల్సిందే. భవిష్య తరాలకు ఇది క్యాన్సర్‌లా తయారవుతుంది. తెలంగాణ ప్రభుత్వం ఇంతవరకు ఏ పబ్బు లేదా ఏ ఇంజనీరింగ్ కాలేజీ యాజ మాన్యాలపైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా ఆ కాలేజీలకు ఫీజు రీయిం బర్స్‌మెంట్ ఎక్కువగా అందుతున్న కళాశాలలోనే డ్రగ్స్ వాడుతున్న విద్యార్థులు ఎక్కువ. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మత్తు మాఫియాను అరెస్టుచేసి యువతకు ఉజ్వల, నూతన భవిష్యత్ కల్పించాలి కాని సిట్ అధికారులు తూతూ మంత్రంగా విచారించి, సినిమా పోలీసింగ్ చేస్తున్నారు. తరువాత రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి, అధికారులు మారు చేస్తారు తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం కనుక్కోరు. కెల్విన్ పాత్రపై పలు అనుమానాలు



న్నాయి మొదట వాటిని బయ టపెట్టాలి ఇంకా ఎంతమంది కెల్విన్ లాంటి నేరస్థులున్నారు. వారిలో ఎంతమంది పాస్‌పోర్ట్ గడువు ముగిసిన తరువాత కూడా హైదరాబాద్‌లో ఉంటున్నారు తేల్చాలి. మన పోలీస్ నిబంధనలు, అధికారుల నిర్లక్ష్యం వల్ల కూడా కొంత జాప్యం జరుగుతుంది. కెల్విన్‌తో పరిచయమున్నందునే సినీ పరిశ్రమలోని ప్రముఖులను విచారించి కొంతమంది రక్తనమూనాలను సేకరించి విచారిస్తున్నారు.

డ్రగ్స్‌కు అలవాటు పడుతున్న వారు హైదరాబాద్ నగర శివార్లలోని ఇంజనీరింగ్ విద్యార్థులు. ఒక్కో కళాశాలలో సుమారు 100 మంది విద్యార్థులు డ్రగ్స్‌ను వాడుతున్నారంటే ఆయా కళాశాలల పర్యవేక్షణ ఎలా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. విద్యార్థులు ముఖ్యంగా ఇంజనీరింగ్ చదివే వారిని మత్తుకు బానిసలుచెయ్యడం ద్వారా వారి భవితను ముతాలు ఫణంగా పెడుతుండడం దిగ్భ్రాంతి గొలుపుతోంది. ఎన్ని ఇంజనీరింగ్ కళాశాలలో సోషల్ రెస్పాన్సిబిలిటీ తరగతులు తీసుకుంటున్నారు. అవగాహన ఎంతమందికి కల్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ డ్రగ్స్ ఎడిక్షన్ సెంటర్స్ ఏమయ్యాయి తేలాలి. పేర్లు బయటకొచ్చిన 13 పాఠశాలలకూ నోటీసులిచ్చి ఎందుకు విచారించడం లేదు?. మన రాష్ట్రంలో సైన్స్ ల్యాబరేటరీలకు డ్రగ్స్ తీసుకున్నారా లేదా అని కనుక్కొనే పరిజ్ఞానం లేదు. మొత్తం దేశంలో చత్తీస్‌ఘడ్‌లో ఈ సౌకర్యముంది. డ్రగ్స్ కు బానిసలైన వారికి కౌన్సెలింగ్ సెంటర్స్ కు తరలించి అవగాహన కల్పించాలి. అంతే తప్ప వారిని విచారించాల్సిన అవసరం లేదు. డ్రగ్స్ తీసుకున్న ఎంతమందిపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు ప్రభుత్వం చెప్పాల్సిన అవసరముంది. మూడేళ్ళ నుండి లేనిది అకస్మాత్తుగా డ్రగ్స్ మాఫియాను తెరపైకి తీసుకొచ్చి విచారణ పేరుతో ఎందుకు విసిగిస్తున్నారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే డ్రగ్స్ సరఫరాను నియంత్రించాలి. ఆయా దేశాల నుండి వస్తున్న వారి వీసాల గడువు ముగియగానే వెనక్కి పంపాలి. ఉద్యోగాల పేర్లతో, చదువుల పేర్లతో వచ్చి మన దేశ చట్టాలకు సంబంధించిన లొసుగులను ఆసరా చేసుకొని భారతదేశంలో మత్తు, డ్రగ్స్ మాఫియా, వ్యాపార సామ్రాజ్యంగా విస్తరించి భారతదేశంలోని యువతను డ్రగ్స్‌కు బానిసలు చేసి భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసే పనిలో విదేశీ శక్తులు ఉన్నాయి. కఠినతరమైన చట్టాలు తీసుకొచ్చి డ్రగ్స్‌కు బానిసలవుతున్న వారిని ముఖ్యంగా ఇంజనీరింగ్ మరియు సాఫ్ట్‌వేర్, సినీ పరిశ్రమలను డ్రగ్స్ కు దూరం చెయ్యాలి.

-ఎన్.రాజేంద్రప్రసాద్
పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, 9704846563

ఆర్యవైశ్యులకు 6 శాతం రిజర్వేషన్లివ్వాలి

ఆర్యవైశ్యులు విద్యా, ఉద్యోగ, రాజకీయ (ప్రజాప్రతినిధులు) రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఆర్యవైశ్యులు 7 నుంచి 8 శాతం వరకు ఉన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ప్రత్యేక వెనుకబాటుతనం ఉంటే ఆర్టికల్ 15 (4) కింద రిజర్వేషన్లు కల్పించవచ్చును. ఇదే విధానంలో ముస్లిం మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఆర్యవైశ్యులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 6 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరుతున్నాను.

- బేజుగం నాగరాజ్
యాదగిరిగుట్ట

గురుకులాల్లో పార్ట్ టైం టీచర్ల వెట్టిచాకిరి

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో దారుణంగా శ్రమ దోపిడీ జరుగుతోంది. లక్షల రూపాయలు వేతనాలు తీసుకునే రెగ్యులర్ టీచర్లు నామమాత్రంగా విధులు నిర్వహిస్తూ పార్ట్ టైం టీచర్లతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు. తెలంగాణలో ఉన్న 268 పాఠశాలల్లో ఇటీవల రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ఖాళీగా ఉన్న స్థానాల్లో పార్ట్ టైం టీచర్లను నియమించారు. పోస్టుగ్రాడ్యుయేషన్, ఉపాధ్యాయ శిక్షణ పొందినవారికి రూ.14వేల వేతనం, లెక్చరర్లకు 18వేలు చెల్లిస్తున్నారు. నిబంధనల ప్రకారం నెలలో వంద తరగతులు తీసుకోవాల్సి ఉంది. కొన్ని సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని ప్రిన్సిపాల్స్ తమ సొంత నిర్ణయంతో 120 తరగతులు తీసుకోవాలని ఆదేశిస్తూ రెగ్యులర్ ఉపాధ్యాయులను గాలికి వదిలేస్తున్నారు. పేరుకు పార్ట్ టైం అయినా, వీరి చేత వారంలో రెండు, మూడు రోజులు రాత్రి విధులు నిర్వహించాలని ప్రిన్సిపాళ్లు ఆదేశాలు జారీ చేస్తున్నారు. పండుగలు, పబ్బాలు, దసరా సెలవులు, సంక్రాంతి సెలవులు, ఆదివారాలు వీరికి వేతనం ఇవ్వరు. లక్షల రూపాయలు వేతనాలు తీసుకునే రెగ్యులర్ ఉపాధ్యాయులు ఈ ప్రత్యేక విధుల నుంచి తప్పించుకుని పార్ట్ టైం టీచర్లపై రుద్దుతున్నారు. నిబంధనలకు మించిన పని వేళలు, భద్రత లేని ఉద్యోగం, ప్రిన్సిపాళ్ల వేధింపుల వల్ల చాలా మంది పార్ట్ టైం టీచర్లు తమ ఉద్యోగాలను మధ్యలోనే వదిలేస్తున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల పనిని కూడా అప్పగించి నిబంధనలను కాలయరాయడం సరికాదన్నది పార్ట్ టైం ఉపాధ్యాయుల ఆవేదన. తెలంగాణ రాష్ట్రంలోని పార్ట్ టైం ఉపాధ్యాయులంతా ఒక్కతాటిపైకి వచ్చి సమస్యలను పరిష్కరించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

- శ్రీవాణి, నిజామాబాద్.

సమాజాన్ని మార్చే శక్తి యువత సొంతం!


నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

యునెస్కో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ప్రతీ సంవత్సరం ఆగస్టు 12వ తేదీన నిర్వహించాలని ప్రకటించింది. 1999 నుండి ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయంగా అన్ని దేశాలలో నిర్వహిస్తున్నారు. 18 సంవత్సరాల నుండి 26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకుల అవసరాలపై, ప్రాధాన్యతలపై దృష్టిసారించడం ఈ దినోత్సవ లక్ష్యం. ప్రపంచ జనాభాలో ఐదో వంతు యువజనులే ఉన్నారు. నిరుద్యోగం కారణంగా చెడు వ్యసనాలకు అలవాటు పడడం, జులాయిగా తిరగడం, ప్రేమమోజులో ఉండడం, సమయాన్ని దుర్వినియోగం చేస్తూ వాట్సాప్, ఫేస్‌బుక్‌లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఆయా దేశాల సంస్కృతీ, సాంప్రదాయాలు, నాగరికతలు, యువజనుల ద్వారానే కొనసాగుతాయి. వరల్డ్ కాన్ఫరెన్స్ ఆఫ్ మినిస్టర్స్ రెస్పాన్సిబుల్ ఫర్ యూత్ సంస్థ సూచనను అనుసరించి ఆగస్టు 12న ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 17.12.1999న తీర్మానించింది. యువత తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. యువతకు మార్గదర్శి, స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద. ఆయన బోధనలు యువతను సన్మార్గం వైపు నడిపిస్తాయి. యువత అన్ని రంగాలలో రాణించాలి. యువతే దేశానికి వెన్నెముక. నేటి యువత జల్సాలు చేస్తూ, చదువుకు దూరమవుతున్నారు. అత్తెసరు చదువులే చదువుతున్నారు. యువత మేలుకోవాలి.. సమాజాన్ని జాగృతం చేయాలి. యువత రాజకీయాలలోకి రావాలి. యువతరం ద్వారానే అవినీతిని రూపుమాపవచ్చు. యువత నిరాశ, నిస్పృహలను దూరం చేసి, సకారాత్మకంగా ఆలోచించి భవితను నిర్మించుకోవాలి.

- కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, జయశంకర్ భూపాలపల్లి

ఆవంత్స ఆధునిక 'కళాకేళి'

కవిగా, విమర్శకునిగా, బహుముఖ ప్రజ్ఞానిధిగా పేరు గాంచారు ఆవంత్స సోమసుందర్. శతగ్రంథ కర్తగానూ, తెలంగాణాలో నిజాంని ఎదిరించి కవిత్వం రాసిన వజ్రాయుధ కవిగానూ ఆవంత్స సుప్రసిద్ధులు. ఆయనలోని మరో కోణం పత్రికా సంపాదకత్వం. తూ. గో. జిల్లా పిఠాపురం నుండి 1968 - 1971 సంవత్సరాల మధ్య కళాకేళి అనే ఆధునిక సాహిత్య పత్రికని ఆధునిక ప్రమాణాలతో నడిపారు. సాంప్రదా యిక సాహిత్యం మొగ్గుతోనే తెలుగులో సాహిత్య పత్రి కలు వచ్చిన నేపథ్యంలో - సోషలిజపు భావజాలంతో సాహిత్య పత్రికను నడిపిన ఘనత సోమ సుందర్‌ది. ఇది కాలాన్ని బట్టి కాక ఆధునిక భావజాలాన్ని బట్టే ఆధునిక పత్రిక కయింది. శ్రీశ్రీ, దాశరథి, ఇస్మాయిల్, వరవరరావు, తిలక్, వేగుంట, పేర్వారం జగన్నాథం, సి.నా.రె, శివారెడ్డి, ఆరుద్ర, పురిపండా, కుందుర్తి, శీలా వీర్రాజు, మానేపల్లి, కేతవరపు, అద్దేపల్లి, టంకశాల, చాగంటి సోమయాజులు, నాగభైరవ, రోణంకి, శంకర శ్రీరామారావు, శశికాంత శాతకర్ణి, మల్లిక్ వంటి వారి రచనలు కళాకేళి సంచికల్లో మనం చూస్తాం. విశ్వసాహిత్య దృష్టిని తెలుగు వారికి కలిగించాలనే తపనతో రాబర్ట్ ఫ్రాస్ట్,ఇజ్రాపౌండ్ వంటి వారి గురించి కూడా రచనలు అందులో ప్రచురించారు. 1970 జూన్ సంచిక కథానికల ప్రత్యేక సంచికగా వేస్తూ ఎక్కువ భాగం కవితలకు ప్రాధాన్యతనిచ్చారు. 1971 మార్చి సంచికలో విరసం ఆలోచనా



(తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో రేపు ఆవంత్స సోమసుందర్ విగ్రహావిష్కరణ)

విధానాలపై విమర్శలు సంధించారు. దాని సంపాదకీయంలో సాహితీపరులు సక్రమ పథావలంబులు కావాలి.. పాత వ్యవస్థను అట్టేపెట్టుకోజూచే దుమ్ముల గొండెలు, సవాలక్ష ఉన్నాయి. కుల, మత వ్యవస్థలను తిరిగి నెలకొల్పజూచే తారుపీపాలెన్నో ఉన్నాయి. కూలంకషంగా వాటిని నిర్మూలించ వలసిన బాధ్యత దేశభక్తి కల రచయితలపై ఉంది అన్నారు. 1970 ఫిబ్రవరి శ్రీశ్రీ అభినందనసంచిక పునర్ముద్రించుకోవలసిన గొప్ప సంచిక. సోవియట్ రచయిత, పరిశోధకుడు నినానికిల్‌యేవా శ్రీశ్రీపై రాసిన ఓ అరుదైన వ్యాసం గొప్ప వ్యాసం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శి, దేవులపల్లి రామానుజారావు తమ అకాడమీ సభ్యుల వినియోగానికి కళాకేళికి 65 సాలు చందాలు పంపారంటే దీని ప్రాధాన్యం తెలుస్తోంది. 1968 ఏప్రిల్ కళాకేళిలో కుందుర్తి ఆధునిక కవిత్వంలో ఆంగ్ల భాషాపదాడంబరం.రచన ప్రబోధాత్మకమైనది అందులో .. మరి ఆధునిక కవులంతా మన భాషలో అంత పండితులా అంటే కాదు, ఆంగ్ల భాషా పదాలను తెలుగు కవిత్వం నిండా గుప్పించడంలో మాత్రమే పండితులు .. అంటూ ఆంగ్ల పదాలు గుప్పించి రాయడాన్ని కొంటె కోణాల రచనలుగా అభివర్ణిస్తూ ప్రయోగాలు చేయడానికి ఆంగ్ల పదాలు వాడచ్చుగానీ అది అంటు వ్యాధిలా దాపురించకూడదు అన్నారు.

1970 జూన్ సంచిక కథానికల ప్రత్యేక సంచిక. కానీ అందులో కవితలు ఎక్కువ వేయడం ఆశ్చర్యకరం.

1969 సెప్టెంబర్, అక్టోబర్‌ల సంచిక గాంధీ శతాబ్ది సంచిక. బాలగంగాధర తిలక్ కవి గాంధీ జీవితం ఒక మహాకావ్యం వ్యాసం గాంధీతత్వాన్ని జీర్ణించుకునే మరీ రాశారు. అందులో ఆధునికమైన కొన్ని సిద్ధాంతాల్ని, నినాదాల్నీ అపక్వంగా జీర్ణించుకుని గాంధీని వేళాకోళం చేయడం సాంస్కృతికంగా, చారిత్రకంగా వారి దృక్పథ లోపాన్ని తెలుపుతుంది. ఈ పరిణామం చాలా ఆందోళనకరమైనది అన్నారు. అద్దేపల్లి రామమోహన రావు ఇంకెక్కడి గాంధీ కవితలో అహింస. ఆయన హత్యతోనే హింసించబడింది. మన గుండెల్లోని చీకటి ముద్దలకు ఆయన హృదయంలోని కాంతిరేఖల నక్షత్ర మందలి లాం టిది అంటూ భావుకత కల కవిత అందించారు. కళాకేళిలో సోమసుందర్ సంపాదకీయాలు ఇప్పటికీ ఆలోచనా దీపాలు, ఆలోచనా ప్రేరకాలు, అభ్యుదయ భావ విలపితాలు. ఆధునిక భావజాల ఆత్మకోణాలు వివిధ సంచికల్లో ప్రయోజనాత్మకంగా దర్శనమిస్తాయి. ఉత్తమ ఆధునిక కవిత్వం, ఉదాత్త వ్యాసం, ప్రాపంచిక పరిజ్ఞాన ప్రదానం, మూఢాచారాలపై నిరసనాస్త్రాలూ ఇన్ని వున్న కళాకేళి పత్రికా సంపాదకునిగా సోమసుందర్ కీర్తిని విస్తృత పరచింది. తెలుగు పత్రికా సంపాదకుల చరిత్రలో - ముఖ్యంగా ఆధునిక సాహిత్య పత్రికల్లో వీరిస్థానం ఎప్పటికీ పదిలమే.

-సన్నిధానం నరసింహ శర్మ
9292055531

ఇంటింటికీ మొక్కల పంపిణీ



కలెక్టర్లకు సీఎస్ ఎస్పీ సింగ్ ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హరితహారంలో భాగంగా ఇకపై పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటింకీ మొక్కలు ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుంది. పట్టణ ప్రాంతాల్లో కూడా ఇంటింటికి వెళ్లి మొక్కలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేయాలని సూచించారు. పూలు, పండ్ల మొక్కలు మాత్రమే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడానికి అటవీ శాఖతో పాటు గ్రామీణాభివృద్ధి శాఖల వద్ద 2,925 నర్సరీలలో 42 కోట్ల మొక్కల పెంపకం మూడో విడత హరితహారం కోసం జరిగిందన్నారు. స్థానిక సంస్థల చొరవ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని బాధ్యతతో కూడిన సమన్వయంతో విజయవంతం చేయవలసి ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు హరితహారంలో ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాలతో పాటుగా పట్టణాల్లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి వాటిని పెంచేందుకు ప్రోత్సాహించవలసి ఉందన్నారు. హరితహారంలో ప్రతి ఇంటిని, ఇంట్లోని వారందరిని భాగస్వామ్యం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలోని నర్సరీల నుండి పట్టణాలకు, కాలనీలకు వాహనాలను ఏర్పాటు చేసి మొక్కలను తరలించడం, అదే వాహనంలో ఒక మైకును ఏర్పాటు చేసి పూలు, పండ్ల మొక్కల పంపిణీ గురించి ప్రచారం చేస్తూ ఇంటింటికి అందచేయాలన్నారు. ప్రజలు కోరుకున్న పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా ఇదే పద్ధతితో మొక్కలను పంపిణీ చేసి వాటిని పెంచేందుకు ప్రోత్సహించవలసి ఉందన్నారు. నర్సరీల నుండి మొక్కల తరలింపు, స్థానిక సంస్థలతో అటవీ శాఖ సమన్వయం విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ప్రధాన అటవీ సంరక్షణ అధికారి పి.కె. ఝూను ఆదేశించారు. హరితహారం కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాదిరిగా కాకుండా సామాజిక ఉద్యమంగా ముందుకు సాగవలసి ఉందన్నారు. స్థానిక సంస్థల నిధులతో పాటు, ఆయా ప్రాంతాల్లోని పారిశ్రామిక, స్వచ్ఛంద, ఇతర పౌరసంస్థల సహకారం ఇందు కోసం తీసుకోవాలని ఎస్.పి.సింగ్ జిల్లా అధికారులను కోరారు. ఆయా సంస్థల సామాజిక బాధ్యత నిధులను ఇందుకోసం వాడేలా ప్రోత్సహించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో ఉండే స్థానిక నిధులతో పాటు, స్వచ్ఛందంగా ఎవరైనా ఖర్చు భరించేందుకు ముందుకు వస్తే వారి సహకారం కూడా ఇందుకోసం తీసుకోవాలన్నారు. సింగరేణి సంస్థ స్వయంగా భారీ సంఖ్యలో మొక్కలు నాటడంతో పాటు కొన్ని లక్షల మొక్కలను తమ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పట్టణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తుందని గుర్తు చేశారు. ఇదే విధానాన్ని మిగతా సంస్థలు అనుసరించవచ్చని పేర్కొన్నారు.

నేరెళ్ల ఎస్ఐని సస్పెండ్ చేస్తే చాలా?



● హనుమంతరావు ప్రశ్న

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సీఎం కేసీఆర్ నోరు తెరిస్తే పాత మనిషిగా మారుతానని అంటున్నారు.. దయచేసి మారవద్దని కోరుకుంటున్నానని ఏఐసీసీ కార్యదర్శి వి హనుమంతరావు సూచించారు. ఎందుకంటే కేసీఆర్ గత చరిత్ర బాగా లేదన్నారు. నేరెళ్ల బాధితులకు మద్దతుగా ఈ నెల 30 న ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. నేరెళ్ల ఘటనకు సంబంధించి ఎస్ఐని సస్పెండ్ చేయడంతో సరిపోదని, ఎస్పీ విశ్వజిత్‌ను సస్పెండ్ చేయాలని, కేసీఆర్, కేటీఆర్‌లపై కూడా కేసులు నమోదు చేయాలని వీహెచ్ డిమాండ్ చేశారు. న్యాయం జరగకపోతే నేరెళ్లలోనే ఆమరణ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. నేరెళ్లలో దళిత,బహుజనులపై పోలీసుల చిత్రహింసలపై ఎందుకు మాట్లాడడం లేదు? వారు మనుష్యులు కాదా? తాను స్వయంగా బాధితులను కలిసి మాట్లాడానని, ఒక్కొక్కరిని నాలుగు రోజుల పాటు పశువుల కంటే హీనంగా హింసించారని, ప్రైవేట్ భాగాలకు సైతం కరెంట్ షాక్ ఇచ్చారని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన సోనియా, రాహుల్, మీరాకుమార్‌ను తిడతావు. వారి వల్లే సీఎం పీఠంపై కూర్చున్నావు. ఇంకెవరిని గౌర విస్తావని వీహెచ్ ప్రశ్నించారు.

సెప్టెంబర్‌లో డ్రగ్స్ సెకండ్ లిస్ట్

● అందులోనూ అగ్రస్థానం సినీ ప్రముఖులే! ● వణుకుతున్న టాలీవుడ్ ● డ్రగ్స్ వాడకందారులను గుర్తిస్తాం ● అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొంటామన్న పెద్దలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రగ్స్ కేసులో విచారణ కొనసాగుతోంది. సెప్టెంబర్‌లో రెండో లిస్టు విడుదలయ్యే అవకాశం ఉంది. డ్రగ్స్ కేసులో పట్టుబడిన కాల్విన్, మైక్ కమింగా, లేడీ డాన్ సంగీత, గాబ్రియేల్ నుంచి ఇందుకు సంబంధించి పోలీసులు విలువైన సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తోంది. అందరి విచారణలో అన్ని రంగాలతో పాటు సినిమా రంగ ప్రముఖులు ఉన్నారన్న విషయం సుస్పష్టమైంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎక్సైజ్ సిట్ వద్ద సిద్ధంగా ఉన్న జాబితాలో 15మంది సినీ ప్రముఖుల పేర్లు ఉన్నట్లు సమాచారం. తాజాగా పట్టుబడిన వారి విచారణలో వెల్లడవుతున్న సినీ ప్రముఖుల పేర్లను కూడా జతచేర్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, సెకండ్ లిస్టు ఇప్పట్లో లేదని తొలిసారి 12 మంది సినీ స్టార్స్ విచారణ అనంతరం ఎక్సైజ్ సిట్ వెల్లడి చేసింది. దీంతో, ఇక డ్రగ్స్ కేసులో పురోగతి ఉండదని అంతా భావించారు. అయితే, ఎక్సైజ్ సిట్ దూకుడు పెంచి వరుస వెంబడి డ్రగ్స్ మూలాల అన్వేషణలో పడి డ్రగ్స్‌దందాను కొనసాగిస్తున్న డ్రగ్స్ మాఫియాల భరతం పడుతోంది.

నైజీరియన్లతో పట్టుబడ్డ లేడీ డాన్ సంగీత ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు గాబ్రియేల్‌ని అతడి ప్రియురాలిని అరెస్టు చేశారు. గాబ్రియేల్‌కు సైతం టాలీవుడ్ ప్రముఖులతో సంబంధాలున్నట్లు పోలీసులు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. పట్టుబడిన డ్రగ్‌డాన్ మైక్ కమింగా ఏకంగా సినీ ప్రముఖులు ఉన్న చోటనే నివాసం ఉండి డ్రగ్స్ దందాను కొనసాగించాడని తెలిసింది. డార్క్‌నెట్ ద్వారా డ్రగ్స్‌ను తెప్పించేవాడని విచారణలో వెల్లడైనట్లు సమాచారం. తాను స్వయంగా నెదర్లాండ్స్‌కు వెళ్లి ఖరీదైన డ్రగ్స్‌ను తీసుకొచ్చి ఇక్కడ విక్రయించేవాడని, కమింగా ఖాతాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, రాజకీయ నేతలతో పాటు పలువురు సినీ ప్రముఖులు ఉన్నట్లు తెలుస్తోంది. డ్రగ్స్ మాఫియాలు విడివిడిగా తమ దందా నడుపుకున్నప్పటికీ వ్యాపార పరంగా ఒకరితో ఒకరికి సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్నారని కూడా తెలుస్తోంది. అన్ని వర్గాలకంటే మిన్నగా సినీ ప్రముఖులే వారి జాబితాలో ఉన్న సమాచారం మరోవైపు టాలీవుడ్‌ను కలవరపాటుకు గురి చేస్తోంది. ఓ వైపు తొలి జాబితాలో విచారణను ఎదుర్కొన్న సినీస్టార్స్‌లో కొందరు ఇప్పటికీ తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. చర్యలుండే అవకాశం ఉందన్న జాబితాను సైతం ఎక్సైజ్ సిట్ సిద్ధం చేసినట్లుగా సమాచారం. ఒకరి వెంబడి ఒకరుగా డ్రగ్స్‌మాఫియాలో కీలక వ్యక్తులు పట్టుబడుతుండటం.. ప్రతి ఒక్కరి ఫోన్, ల్యాప్‌టాప్ లిస్టులలో సినీ ప్రముఖుల పేర్లే ప్రధానంగా ప్రస్తావనకు వస్తున్నాయన్న సమాచారం టాలీవుడ్ పెద్దలను ఆలోచింపజేసింది.

ఇటీవల కేబీఆర్ పార్కులో ఏర్పాటైన సే నో డ్రగ్స్ కార్యక్రమంలో టాలీవుడ్ ప్రముఖులు ఎవరూ హాజరు కాలేదు. దీనిపై విమర్శలు చెలరేగాయి. సినీ ప్రముఖులు అవగాహన కార్యక్రమంలో పాల్గొంటే దాని ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నది అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో నిర్వహించిన ఆ కార్యక్రమానికి వారే డుమ్మా కొట్టడం గమనార్హం. మరోవైపు పట్టుబడ్డ వారిలో కీలక నిందితులంతా సినీ పరిశ్రమతో సంబంధాలున్నాయన్న కఠోరవాస్తవం వెలుగుచూసింది. అయితే వీరంతా డ్రగ్స్‌ను కళాశాల, పాఠశాల విద్యార్థులకు సైతం చేరవేసి భావి భారత పౌరుల జీవితాలను అంధకారంలో నెట్టివేశారు. పట్టుబడ్డ గాబ్రియేల్ ఇచ్చిన సమాచారంతో నగరంలో వీసా గడువు ముగిసినా తిష్టవేసిన సోమాలియా, నైజీరియన్లలో డ్రగ్స్ దందాను కొనసాగిస్తున్నదెవరు? అన్నదానిపై కార్డాన్‌సెర్చ్‌ని చేపట్టారు. కార్యక్రమంలో పోలీసులు, ఇమ్మిగ్రేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ విధంగా ఓ వైపు డ్రగ్స్ మూలాలపై సమరం కొనసాగిస్తూనే మరోవైపు అవగాహన కార్యక్రమం ద్వారా డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించాలని పోలీసులు యత్నిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా కాలేజీలు, పాఠశాలలు, యూని వర్సిటీలలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు చేపడుతున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ కమిషనర్ చంద్రవదన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ డైరెక్టర్ అకున్ సబర్వాల్‌లు విధిగా పాల్గొని సే నో డ్రగ్స్ అని చెప్పడంతో పాటు హాజరైన వారితో సే నో డ్రగ్స్ అని నినాదాలిప్పిస్తున్నారు. తాజాగా టాలీవుడ్ పెద్దలు సైతం తాము సైతం అంటూ అవగాహన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటామని చెబుతుండటం శుభపరిణామం. ఓ వైపు అవగాహన కార్యక్రమాలు ప్రాధాన్యతనిస్తూనే మరోవైపు డ్రగ్స్ మూలాల అన్వేషణ దిశగా పోలీసులు దృష్టిసారించారు.



ఒత్తిళ్లు లేవు..అంతా పారదర్శకమే

● ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్

తాము విచారించిన డ్రగ్స్ దందాలో భాగంగా 11 కేసుల్లో చార్జిషీట్‌లను సిద్ధం చేశామని, ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదిక రాగానే వీటిని కోర్టులో దాఖలు చేస్తామని సబర్వాల్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఇఫ్లూ యూనివర్సిటీలో డ్రగ్స్ ఫ్రీ నేషన్ పేరిట ఓ కార్యక్రమం జరుగగా, అకున్ సబర్వాల్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. డ్రగ్స్ కేసులో విచారణ ఆగిపోలేదని, పారదర్శకంగా ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. తమపై ఎటువంటి ఒత్తిళ్లు లేవన్నారు. రక్తనమూనాలు తీసుకున్న సినీ ప్రముఖుల రిపోర్టులను పరిశీలించిన తరువాత వారిపై చర్యలుంటాయని తెలిపారు. డ్రగ్స్ గురించి సమాచారం ఎవరికైనా తెలిస్తే నిర్భయంగా తమకు అందించాలని సూచించారు. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా నిలిపేందుకు యువతలో మరింత చైతన్యం కలిగేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వ హించనున్నామని అకున్ సబర్వాల్ వెల్లడించారు. ప్రముఖ విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

త్వరలో తెలంగాణ ఆత్మగౌరవ యాత్ర



● ప్రాజెక్టులు ఆపుతున్నది కేసీఆరే: భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రజల ఆత్మగౌరవం, అభిమానం దెబ్బతినేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నందుకు నిరసనగా తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ యాత్రను త్వరలో చేపట్టనున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర నాయకత్వం, నాయకులు అందరితో మాట్లాడి పాదయాత్రను చేపడతానని చెప్పారు. పాద యాత్ర అవసరం ఉందని తెలిపారు. శుక్రవారం శాసనసభ మీడియా హాలులో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను అడ్డుకుంటోందని సీఎం కేసీఆర్ పదేపదే చెప్పడాన్ని ఆయన ఖండించారు. వాస్తవంగా కేసీఆరే ప్రాజెక్టులను అడ్డుకుంటోందని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే లక్షలాది ఎకరాలకు ఇప్పటికే సాగునీరు అందేదని, అవి పూర్తయితే, పొలాలకు నీళ్లు పారితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందనే కుట్రతోనే వాటిని పూర్తి చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అసలు నువ్వు...చేపట్టిన ప్రాజెక్టులేవి ? ప్రాణహిత -చేవెళ్లను కాదని కాళేశ్వరం అంటున్నావు...ఈ ప్రాజెక్టు వ్యయం 30 వేల కోట్లయితే, లక్ష కోట్లకు పెంచావని, అన్ని వేల కోట్ల అంచనాలు పెంచడం ఎవరి కోసం ? కమీషన్ల కోసం కాదా ? ప్రాణహిత -చేవెళ్లకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉందని, దాన్ని ఎందుకు మార్చి వేశారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టు కాంగ్రెస్ కట్టింది కాదా ? సాంకేతిక పరిజ్ఞానం లేకుండా ప్రాజెక్టులను ఎలా క్లియర్ చేస్తారు ? నువ్వేమైనా టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌వా? ఇంజినీరింగ్ అధికారులను పిలిచి గీతలు గీసి ఇలా ప్రాజెక్టులు కట్టండని అనడం సమంజసమా ? చిన్న ఇంటి నిర్మాణానికే ఇంజినీర్ అవసరం ఉంటుందని.అలాంటిది పెద్ద ప్రాజెక్టులకు అవసరం లేదా ? ఇంజినీర్ల సలహా ఎందుకు తీసుకోవడం లేదని భట్టి ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ చర్యల మూలంగా రాష్ట్రంలో అరిష్టాలు..,అనర్థాలు జరుగుతున్నాయని చెప్పారు. తెలంగాణ వస్తే ఆత్మగౌరవంతో బతకవచ్చని, సామాజిక తెలంగాణ వస్తుందని, ప్రగతిశీల పాలన జరుగుతోందని ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీలు అనుకుని పోరాటాలు,త్యాగాలు చేశారని, తీరా...వారి ఆత్మగౌరవం దెబ్బతినేవిధంగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అందుకే రాష్ట్రంలో ప్రజలకు కేసీఆర్ పాలనను గూర్చి తెలియజేయాల్సిన అవసరాన్ని దృష్టిలోఉంచుకుని పాదయాత్ర చేపట్టనున్నట్లు భట్టి విక్రమార్క తెలియజేశారు.

ఇంటికి సున్నం వేసి నాదే అంటున్న కేసీఆర్: మధుయాష్కీ

ఎవరో కట్టిన ఇళ్లకు సున్నం వేసి ఆ ఇల్లు నాదే అని సీఎం కేసీఆర్ అంటున్నారని ఏఐసీసీ కార్యదర్శి మధు యాష్కీ గౌడ్ విమర్శించారు. ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టు కాంగ్రెస్ హయాంలో నిర్మాణం జరిగిందని, ఆ ప్రాజెక్టు పేరు తుడిచేందుకే పునరుజ్జీవం పేర కేసీఆర్ నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. మహారాష్ట్రతో కేసీఆర్ చీకటిఒప్పందం కుదుర్చుకున్నందుకే శ్రీరాంసాగర్‌కు నీళ్లు రావడం లేదని విమర్శించారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. అన్నీ చేసి కొత్తగా పునరుజ్జీవం నాటకం చేస్తున్నారని, ఎన్టీఆర్ కంటే మించిన నటుడు కేసీఆర్ అని మధుయాష్కీ నిప్పులు చెరిగారు. మాజీ ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ, పునరుజ్జీవం పేర కోట్లు దండుకునేందుకు ప్రభుత్వం నాటకం ఆడుతోందని ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాకు నీళ్లు రాకుండా కేసీఆర్ అడ్డుకుంటున్నారని విమర్శించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇసుక లారీల కింద పడి ఎంతమంది చనిపోయారు.. ఎంత మందికి గాయాలయ్యాయో వివరాలు ఇవ్వాలని రాష్ట్ర సమాచార కమిషనర్‌ను పీసీసీ మాజీ అధ్యక్షుడు వీహెచ్ కోరారు.ఈ మేరకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు వివరాలు సమర్పించాలని దరఖాస్తు చేశారు.

టీఆర్ఎస్‌ను వీడను: డీఎస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తాను కాంగ్రెస్‌లోకి వెళ్తానంటూ జరుగుతున్న ప్రచారం సత్యదూరమని, తాను టిఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక తెలంగాణ భవన్‌లో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడానికి కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పదిరోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగితే తాను ఢిల్లీలోనే ప్రెస్ మీట్ పెట్టి ఖండించానని, దానితో ఆ ప్రచారం సమసిపోవాలన్నారు. కానీ శుక్రవారం మళ్ళీ దీనిపై వార్తలు రావడం బాధించిందన్నారు. తనను ఎవరూ కనీసం సంప్రదించడం కూడా జరగలేదని, ఎందుకిలా ప్రచారం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. నాయకులు ఎంతో కష్టపడి సాధించుకున్న క్రెడిబులిటీని దెబ్బతీసే విధంగా కథనాలు ప్రచురించవద్దన్నారు. కాంగ్రెస్‌తో తనకు నలభై ఏళ్ళ అనుబంధం ఉందని.. కొన్నిసంఘటనలకు కలత చెంది ఆ పార్టీ నుండి తాను బయటకు వచ్చానన్నారు. తనకు టిఆర్ఎస్‌లో సముచిత స్థానం ఉందని, సిఎం కెసిఆర్ తనను ఎంతో అభిమానంగా చూసుకుంటారన్నారు. కాంగ్రెస్ నేతలు తనను ఎవరు అప్రోచ్ అయ్యారో ప్రెస్ మీట్ పెట్టి చెప్పాలన్నారు. తాను టిఆర్ఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వీడబోనని, ఈ అంశంపై పూర్తి స్పష్టతతో ఉన్నానన్నారు. ఊహాగానాలు, తప్పుడు సమాచారాలు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

ఎస్పీని సస్పెండ్ చేయాలి

● నేరెళ్ల ఘటనపై డీజీపీని కలిసిన అఖిలపక్షం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నేరెళ్ల ఘటనకు బాధ్యుడైన జిల్లా ఎస్పీ విశ్వజిత్‌తో పాటు ఇతర అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డీజీపీ అనురాగ్ శర్మకు అఖిలపక్ష నాయకులు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు శుక్రవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, టీటీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ రేవంత్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, టీపీసీసీ ఎస్సీసెల్ చైర్మన్ ఆరేపల్లి మోహన్, న్యూడెమోక్రసీ నాయకులు డీజీపీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. 8 మందిని చిత్రహింసలు పెట్టిన ఘటనపై ఎస్ఐని బాధ్యుడిని చేస్తే సరిపోదని, ఎస్పీతో సహా ఇతర అధికారులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ప్రజల కోసం పనిచేయాలని కోరారు. మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో దళితులు భయాందోళనలతో ఉన్నారని, వారికి రక్షణ కల్పించాలని వినతిపత్రం సమర్పించారు. డీజీపీని కలిసిన అనంతరం వారు విలేఖరులతో మాట్లాడారు.

అట్రాసిటీ కేసు ఎందుకు పెట్టలేదు: భట్టి

దళితులను హింసించినందుకు పోలీసులపై చట్ట ప్రకారం ఎందుకు కేసులు నమోదు చేయలేదని డీజీపీని ప్రశ్నించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పోలీసులే కొట్టారని ప్రభుత్వం ఒప్పుకుని ఎస్ఐని బాధ్యుడిని చేసిందని, అలాంటప్పుడు ఎస్పీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని అడిగినట్లు చెప్పారు. కేసీఆర్ కుటుంబం చేతిలో ఇసుక మాఫియా ఉన్నందున ఆగడాలను పోలీసులు అరికట్టలేకపోతున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజకీయ వత్తిళ్లకు తలొగ్గవద్దు: రేవంత్ రెడ్డి

రాజకీయ వత్తిళ్లకు తలొగ్గి కేసును నీరుకార్చవద్దని డీజీపీకి విజ్ఞప్తిచేసినట్లు రేవంత్ రెడ్డి చెప్పారు. పోలీసులతో సంబంధం లేకుండా ఎస్ఐని సస్పెండ్ చేసినట్లు కేటీఆర్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. కేటీఆర్‌ను సంతృప్తి పర్చేందుకు పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలీసులు ప్రజల కోసం పని చేయాలని కోరారు.

విశ్వజిత్‌ను సస్పెండ్ చేస్తేనే న్యాయం : చాడ

ఎస్పీ విశ్వజిత్‌ను సస్పెండ్ చేస్తేనే బాధితులకు న్యాయం జరుగుతుందని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్‌కు తన నియోజకవర్గం ప్రజలను చూసే తీరికలేదని, హైదరాబాద్‌కే ఆయన పరిమితమయ్యారని విమర్శించారు.

దళితులపై దాడులు దారుణం: మోత్కుపల్లి

తెలంగాణ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు చూస్తుంటే దళిత బిడ్డగా 30 ఏళ్ళ ప్రజా జీవితంలో ఉన్న రాజకీయ నాయకుడిగా తనకే ఏడుపు వస్తోందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు ఆవేదన వ్యక్తంచేశారు. నేరెళ్ళ ఘటన జరిగి ఇన్ని రోజులు గడిచినా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు బాధితులను పరామర్శించేందుకు ఎందుకు వెళ్ళడం లేదని ఆయన ప్రశ్నించారు. సినీ తారలతో గంటలకొద్ది సమావేశమయ్యే ముఖ్యమంత్రికి మా దళిత బిడ్డలను పరామర్శించే సమయం కూడా లేదా అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధితులకు రూ.10 లక్షల నష్టపరిహారం, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ఎంత మొర పెట్టుకున్నా కనికరించకుండా మొండిగా వ్యవహరిస్తున్నారని శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన దుయ్యబట్టారు.

డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

● నేరెళ్ల ఘటనపై నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నేరెళ్ల ఘటనపై తెలంగాణ రాష్ట్ర డీజీపీకి జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. దళితులను అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టినట్టు తమకందిన ఫిర్యాదులు, మీడియా కథనాల ఆధారంగా ఈ నోటీసులు జారీ చేసినట్టు కమిషన్ పేర్కొంది. ఈ ఆరోపణల ప్రకారం నేరెళ్లలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్టుగా కనిపిస్తోందని కమిషన్ ఈ మేరకు విడుదల చేసిన ఓ ప్రకటలో వెల్లడించింది. అందుకే దీనిపై పూర్తి పారదర్శక విచారణ జరిపి 4 వారాల్లోకి తమకు నివేదికను సమర్పించాల్సిందిగా తెలంగాణ డీజీపీని ఆదేశించినట్టు జాతీయ మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. నేరెళ్ల ఘటనపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు జాతీయ మానవ హక్కుల కమిషన్లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తమ ఫిర్యాదుకు మరింత బలం చేకూర్చేలా వివిధ పత్రికల్లో వచ్చిన కథనాల ప్రతులు, టీవీ ఛానెళ్ల రికార్డింగులను కూడా అందజేసినట్టు తెలుస్తోంది. వాటన్నింటినీ పరిశీలించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆ మేరకు డీజీపీకి నోటీసులు జారీ చేసినట్టు అర్థమవుతోంది.

నేడు హైదరాబాద్‌కు కుంతియా

● రేపు పీసీసీ విస్తృత స్థాయి సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ డాక్టర్ రామచంద్ర కుంతియా, ఏఐసిసి కార్యదర్శి జె సతీష్ శనివారం హైదరాబాద్ రానున్నారు. భువనేశ్వర్ నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు నగరం చేరుకుంటారు. అదే విధంగా కార్యదర్శి సతీష్ రాయచూర్ నగరం నుంచి సాయంత్రం 5 గంటలకు వస్తారు. రాష్ట్ర ఇంచార్జీగా నియమితులైన తర్వాత హైదరాబాద్‌కు కుంతియా మొదటిసారి వస్తున్నారు. అందువల్ల ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమాయత్తమవుతున్నారు. మరుసటి రోజు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు గాంధీభవన్‌లో జరిగే టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొంటారు. పీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కుంతియా, సతీష్ నాయకులకు దిశానిర్దేశం చేస్తారు.సోమవారం ఉదయం 10 గంటలకు గాంధీభవన్‌లో టీపీసీసీ అనుబంధ సంఘాలు, విభాగాలతో సమావేశమవుతారు.

ఫారం-సి
తెలంగాణ ప్రభుత్వము
నోటిఫికేషన్
రెవిన్యూ (భూ.సే) శాఖ

భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం. 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) మరియు 10ఎ మినహాయింపు అనుసరించి (రూల్ 6/12 చూడుము)

ఫైల్ నెం. జి/1022/2017 **తేది: 11-08-2017**

ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం క్రింద ఏదుల బ్యాలన్సింగ్ రిజర్వాయర్ రూపొందించుట కొరకు వనపర్తి జిల్లా రేవల్లి మండలం యొక్క కొంకలపల్లి గ్రామం యొక్క మొత్తం 56.19 ఎకరాల భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ వనపర్తి వారు భావించుచున్నారు.

అందువలన పై తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు వనపర్తి జిల్లా రేవల్లి మండలం యొక్క కొంకలపల్లి గ్రామంలో 56.19 ఎకరాలు విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెల్పిన విధంగా వివరణాత్మక వివరం ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

గ్రామము : కొంకలపల్లి — మండలం : రేవల్లి

క్ర సం.	సర్వే నెం	పట్టా వర్గీ కరణం	భూ వర్గీ కరణ	భూ సేకరణ క్రింద తీసుకో బడిన విస్తీర్ణము	పట్టాదారు పేరు	అనుభవదారు పేరు	సరిహద్దులు ఉ	ద	తూ	ప
1	2	3	4	5	6	7	8	9	10	11
1	2	పట్టా	మెట్ట	0.020	టి.బాలకిష్టయ్య తండ్రి బాలయ్య	టి.బాలకిష్టయ్య తండ్రి బాలయ్య	4	1	3	99
2	3	పట్టా	మెట్ట	0.015	టి.దేవేందర్ తండ్రి నాగయ్య	టి.దేవేందర్ తండ్రి నాగయ్య	4	2	రాజ పాకుల భూమి	4
3	6	పట్టా	మెట్ట	0.030	టి.దేవేందర్ తండ్రి నాగయ్య	టి.దేవేందర్ తండ్రి నాగయ్య	గ్రామ సరి హద్దు	99	4	రాజ పాకుల భూమి
4	9	పట్టా	మెట్ట	0.010	టి.లక్ష్మయ్య తండ్రి రాంచంద్రయ్య	టి.లక్ష్మయ్య తండ్రి రాంచంద్రయ్య	గ్రామ సరి హద్దు	రాజ పాకుల భూమి	10	8
5	11	ఖిద్మతి ఇనాం	మెట్ట	2.270	బాలపీరు తండ్రి గులాం హుసేన్ ఖాసిం సాయిలు తండ్రి గులాం హుసేన్	బాలపీరు తండ్రి గులాం హుసేన్ ఖాసిం సాయిలు తండ్రి గులాం హుసేన్	10	12	గ్రామ సరి హద్దు	రాజ పాకుల భూమి
6	11	ఖిద్మతి ఇనాం	మెట్ట	1.170	సలాం తండ్రి సుల్తాన్	సలాం తండ్రి సుల్తాన్	10	12	గ్రామ సరి హద్దు	రాజ పాకుల భూమి
7	11	ఖిద్మతి ఇనాం	మెట్ట	4.040	మొల్ల ముసాబాయి తండ్రి ఖాసిం సాయిబు	మొల్ల ముసాబాయి తండ్రి ఖాసిం సాయిబు	10	12	గ్రామ సరి హద్దు	రాజ పాకుల భూమి
8	12	పట్టా	మెట్ట	0.270	తులిసే నాగస్వామి తండ్రి శేషన్న	తులిసే నాగస్వామి తండ్రి శేషన్న	11	13	గ్రామ సరి హద్దు	రాజ పాకుల భూమి
9	33	పట్టా	మెట్ట	0.010	దాడిమల కుర్మయ్య తండ్రి లక్ష్మయ్య	దాడిమల కుర్మయ్య తండ్రి లక్ష్మయ్య	31	34	32	59
10	33	పట్టా	మెట్ట	0.120	దాడిమల కుర్మయ్య తండ్రి లక్ష్మయ్య	దాడిమల కుర్మయ్య తండ్రి లక్ష్మయ్య	31	34	32	59
11	33	పట్టా	మెట్ట	0.120	పి. లక్ష్మి తండ్రి నాగరాజు	పి. లక్ష్మి తండ్రి నాగరాజు	31	34	32	59
12	33	పట్టా	మెట్ట	0.020	మల్లయ్య తండ్రి చిన్నయ్య	మల్లయ్య తండ్రి చిన్నయ్య	31	34	32	59
13	51	పట్టా	మెట్ట	0.380	ఎల్లమ్మ భర్త నర్సయ్య	ఎల్లమ్మ భర్త నర్సయ్య	49	38	55	61
14	51	పట్టా	మెట్ట	2.120	కుర్మయ్య తండ్రి నర్సయ్య	కుర్మయ్య తండ్రి నర్సయ్య	49	38	55	61
15	51	పట్టా	మెట్ట	3.140	కొంకలి జగదీశ్వర్ తండ్రి బిచ్చన్న	కొంకలి జగదీశ్వర్ తండ్రి బిచ్చన్న	49	38	55	61
16	66	పట్టా	మెట్ట	0.240	మల గంగమ్మ భర్త పెద్ద చెన్నయ్య	మల గంగమ్మ భర్త పెద్ద చెన్నయ్య	63/2	67	65	86
17	66	పట్టా	మెట్ట	0.080	మిద్దెల కుర్మయ్య తండ్రి పెంటయ్య	మిద్దెల కుర్మయ్య తండ్రి పెంటయ్య	63/2	67	65	86
18	66	పట్టా	మెట్ట	0.065	మిద్దెల కుర్మయ్య తండ్రి పెంటయ్య	మిద్దెల కుర్మయ్య తండ్రి పెంటయ్య	63/2	67	65	86
19	66	పట్టా	మెట్ట	2.010	మినిగే లక్ష్మి భర్త లాలయ్య	మినిగే లక్ష్మి భర్త లాలయ్య	63/2	67	65	86
20	66	పట్టా	మెట్ట	0.310	మినిగే శేషయ్య తండ్రి నర్సింహ్మా	మినిగే శేషయ్య తండ్రి నర్సింహ్మా	63/2	67	65	86
21	66	పట్టా	మెట్ట	0.310	మినిగే తిరుపతయ్య తండ్రి నర్సింహ్మా	మినిగే తిరుపతయ్య తండ్రి నర్సింహ్మా	63/2	67	65	86
22	66	పట్టా	మెట్ట	0.045	మినిగే వెంకటేశ్వర్లు తండ్రి చిన్న చెన్నయ్య	మినిగే వెంకటేశ్వర్లు తండ్రి చిన్న చెన్నయ్య	63/2	67	65	86
23	88	పట్టా	మెట్ట	0.260	మిద్దెల లక్ష్మి తండ్రి వెంకటస్వామి	మిద్దెల లక్ష్మి తండ్రి వెంకటస్వామి	90	87	89	80
24	88	పట్టా	మెట్ట	0.180	జగదీష్ తండ్రి చిన్నయ్య	జగదీష్ తండ్రి చిన్నయ్య	90	87	89	80
25	88	పట్టా	మెట్ట	0.015	కుమారు వెంకటయ్య తండ్రి బాలయ్య	కుమారు వెంకటయ్య తండ్రి బాలయ్య	90	87	89	80
26	88	పట్టా	మెట్ట	0.120	కుమారు బాలయ్య తండ్రి లక్ష్మయ్య	కుమారు బాలయ్య తండ్రి లక్ష్మయ్య	90	87	89	80
27	88	పట్టా	మెట్ట	0.040	మల్లమ్మ భర్త నర్సయ్య	మల్లమ్మ భర్త నర్సయ్య	90	87	89	80
28	88	పట్టా	మెట్ట	0.180	కొంకలి జగదీశ్వర్ తండ్రి బిచ్చన్న	కొంకలి జగదీశ్వర్ తండ్రి బిచ్చన్న	90	87	89	80
29	88	పట్టా	మెట్ట	0.180	కుర్మయ్య తండ్రి నర్సయ్య	కుర్మయ్య తండ్రి నర్సయ్య	90	87	89	80
30	88	పట్టా	మెట్ట	0.040	టి.కురుమయ్య తండ్రి రాములు	టి.కురుమయ్య తండ్రి రాములు	90	87	89	80
31	88	పట్టా	మెట్ట	0.040	టి.ఆంజనేయులు తండ్రి రాములు	టి.ఆంజనేయులు తండ్రి రాములు	90	87	89	80
32	88	పట్టా	మెట్ట	0.080	బాలపీరమ్మ	బాలపీరమ్మ	90	87	89	80
33	88	పట్టా	మెట్ట	0.090	బాలపీరమ్మ	బాలపీరమ్మ	90	87	89	80
34	88	పట్టా	మెట్ట	0.150	టి.కురుమయ్య తండ్రి రాములు	టి.కురుమయ్య తండ్రి రాములు	90	87	89	80
35	88	పట్టా	మెట్ట	0.150	టి.ఆంజనేయులు తండ్రి రాములు	టి.ఆంజనేయులు తండ్రి రాములు	90	87	89	80
36	88	పట్టా	మెట్ట	0.050	మిద్దెల బాలపీరమ్మ	మిద్దెల బాలపీరమ్మ	90	87	89	80
37	88	పట్టా	మెట్ట	1.220	కమరు బాలయ్య తండ్రి లక్ష్మయ్య	కమరు బాలయ్య తండ్రి లక్ష్మయ్య	90	88	89	80
38	88	పట్టా	మెట్ట	0.160	మిరిగిల్ల రాములు తండ్రి ఆంజనేయులు	మిరిగిల్ల రాములు తండ్రి ఆంజనేయులు	90	87	89	80
39	90	పట్టా	మెట్ట	0.090	కొంకలి జగదీశ్వర్ తండ్రి బిచ్చన్న	కొకలి జగదీశ్వర్ తండ్రి బిచ్చన్న	97	89	98	91
40	98	పట్టా	మెట్ట	0.010	కొంకలి నిరంజన్ తండ్రి నాగన్న	కొంకలి నిరంజన్ తండ్రి నాగన్న	రాజ పాకుల భూమి	62	99	97
41	88	పట్టా	మెట్ట	0.200	గజ్జి దుడుమయ్య తండ్రి బొక్కలయ్య	గజ్జి దుడుమయ్య తండ్రి బొక్కలయ్య	90	87	89	80
42	37	పట్టా	మెట్ట	0.100	ఎ.రేణుక భర్త వెంకట్రామి రెడ్డి	ఎ.రేణుక భర్త వెంకట్రామి రెడ్డి	35	గ్రామ సరి హద్దు	38	54
43	59	పట్టా	మెట్ట	0.150	దాడిమల బొందమ్మ భర్త కుర్మయ్య	దాడిమల బొందమ్మ భర్త కుర్మయ్య	60	57	33	66
44	37	పట్టా	మెట్ట	0.010	షేక్ బాబు తండ్రి చాంద్‌మియా	షేక్ బాబు తండ్రి చాంద్‌మియా	35	గ్రామ సరి హద్దు	38	54
45	50	పట్టా	మెట్ట	0.300	సదకోడు లింగమ్మ భర్త మల్లయ్య	సదకోడు లింగమ్మ భర్త మల్లయ్య	49	38	55	61
46	17	లావుని పట్టా	మెట్ట	0.300	పి.నాగరాజు తండ్రి బుచ్చన్న	పి.నాగరాజు తండ్రి బుచ్చన్న	15	గ్రామ సరి హద్దు	గ్రామ సరి హద్దు	22
47	17	లావుని పట్టా	మెట్ట	0.300	పి.శేషయ్య తండ్రి బుచ్చన్న	పి.శేషయ్య తండ్రి బుచ్చన్న	15	గ్రామ సరి హద్దు	గ్రామ సరి హద్దు	22
48	24	లావుని పట్టా	మెట్ట	0.300	కల్మురి గలయ్య తండ్రి పెద్దకిష్టయ్య	కల్మురి గలయ్య తండ్రి పెద కిష్టయ్య	24/2	21	23	29
49	24	లావుని పట్టా	మెట్ట	0.300	కల్మురి వెంకట స్వామి తండ్రి పెద్ద కిష్టయ్య	కల్మురి వెంకట స్వామి తండ్రి పెద్ద కిష్టయ్య	24/2	21	23	29
50	42	లావుని పట్టా	మెట్ట	0.300	గజ్జి ఎల్లయ్య తండ్రి పుల్లయ్య	గజ్జి ఎల్లయ్య తండ్రి పుల్లయ్య	54	42/2	42/1	42/3
51	35	పట్టా	మెట్ట	2.000	జైనబీ భర్త సయీద్	జైనబీ భర్త సయీద్	58	36	34	55
52	88	పట్టా	మెట్ట	0.200	పుల్లను శివయ్య తండ్రి చిన్న బాలయ్య	పుల్లను శివయ్య తండ్రి చిన్న బాలయ్య	90	87	89	80
53	52	పట్టా	మెట్ట	0.370	జి.రాజు తండ్రి లింగయ్య	జి.రాజు తండ్రి లింగయ్య	49	38	55	61
54	52	పట్టా	మెట్ట	1.000	నారాయణమ్మ	నారాయణమ్మ	49	38	55	61
55	55	పట్టా	మెట్ట	2.090	జమ్ముల రమేష్ తండ్రి బాలస్వామి	జమ్ముల రమేష్ తండ్రి బాలస్వామి	35	54	37	53
56	55	పట్టా	మెట్ట	2.080	జమ్ముల రామ చంద్రయ్య తండ్రి బాలస్వామి	జమ్ముల రామ చంద్రయ్య తండ్రి బాలస్వామి	35	54	37	53
57	2	పట్టా	మెట్ట	0.010	తులిసే నాగేంద్రం తండ్రి బాలయ్య	తులిసే నాగేంద్రం తండ్రి బాలయ్య	4	1	3	99
	6	పట్టా	మెట్ట	0.020			గ్రామ సరిహద్దు	99	4	రాజపాకుల భూమి
	7	పట్టా	మెట్ట	0.001/2			8	3	కుంట 9	6
	22	పట్టా	మెట్ట	0.130			17/1	21	19	23
	1	పట్టా	మెట్ట	2.030			2	25	24/6	99
	58	పట్టా	మెట్ట	0.170			33	35	34	57
58	43	పట్టా	మెట్ట	2.000	కోతకోట సుందరమ్మ భర్త బాల్ రెడ్డి	కోతకోట సుందరమ్మ భర్త బాల్ రెడ్డి	49	38	55	61
59	43	పట్టా	మెట్ట	1.200	నల్లవెల్లి తిరుపతమ్మ భర్త ధర్మారెడ్డి	నల్లవెల్లి తిరుపతమ్మ భర్త ధర్మారెడ్డి	49	38	55	61
60	90	పట్టా	మెట్ట	1.010	జి. చందన్ రెడ్డి తండ్రి ఈశ్వర్ రెడ్డి	జి. చందన్ రెడ్డి తండ్రి ఈశ్వర్ రెడ్డి	97	89	98	91
61	89	పట్టా	మెట్ట	0.200	జి. ఈశ్వర్ రెడ్డి తండ్రి రామచంద్రా రెడ్డి	జి. ఈశ్వర్ రెడ్డి తండ్రి రామచంద్రా రెడ్డి	90	88	63/2	88
	90	పట్టా	మెట్ట	3.08 1/2			97	89	98	91
62	4	పట్టా	మెట్ట	0.020	తులిసే నాగేంద్రం తండ్రి బాలయ్య	తులిసే నాగేంద్రం తండ్రి బాలయ్య	6	2	3	5
	31	పట్టా	మెట్ట	0.100			గ్రామ స్థలం	33	30	61
63	60	పట్టా	మెట్ట	0.001/2	బొగ్గు బుచ్చన్న	బొగ్గు బుచ్చన్న	61	59	32	66
64	33	పట్టా	మెట్ట	0.040	బుగ్గ వెంకటమ్మ భర్త నర్సింహ్మా	దాదిమల వెంకట్రాములు తండ్రి కురుమయ్య	31	34	32	59
65	16	పట్టా	మెట్ట	0.150	తులిసే నర్సింహ్మా తండ్రి లక్ష్మయ్య	వనపర్తి నిరంజన్ తండ్రి నర్సింహ్మా	13	17/1	17/6	24/5
66	16	పట్టా	మెట్ట	0.150	తులిసే నర్సింహ్మా తండ్రి లక్ష్మయ్య	వనపర్తి నాగేంద్రం తండ్రి బాలయ్య	13	17/1	17/6	24/5
67	68	పట్టా	మెట్ట	0.12 1/2	కల్మురి రాములు తండ్రి వెంకటయ్య	మిరిగిల్ల శాంతమ్మ భర్త నర్సింహ్మా	67	69	57	70/1
68	68	పట్టా	మెట్ట	0.12 1/2	కల్మురి రాములు తండ్రి వెంకటయ్య	మిరిగిల్ల బుచ్చన్న తండ్రి చిన్న నాగయ్య	67	69	57	70/1
69	33	పట్టా	మెట్ట	0.050	మిద్దెల చిన్న బాలయ్య తండ్రి చెన్నయ్య	దాదిమల వెంకట్రాములు తండ్రి కురుమయ్య	31	34	32	59
70	33	పట్టా	మెట్ట	0.010	బుచ్చన్న తండ్రి చెన్నయ్య	దాదిమల వెంకట్రాములు తండ్రి కురుమయ్య	31	34	32	59
71	33	పట్టా	మెట్ట	0.060	చిన్న నర్సింహ్మా తండ్రి చెన్నయ్య	దాదిమల వెంకట్రాములు తండ్రి కురుమయ్య	31	34	32	59
72	41	పట్టా	మెట్ట	0.110	వడ్ల గాలయ్య తండ్రి బాలయ్య	వడ్ల లక్ష్మీదేవమ్మ భర్త బ్రహ్మయ్య	49	38	55	61
73	2	పట్టా	మెట్ట	0.060	తులిసే దేవేందర్ తండ్రి నాగయ్య	బాలకిష్టయ్య తండ్రి రామచంద్రయ్య సాయి బాబు తండ్రి రామచంద్రయ్య	4	1	3	99
	3	పట్టా	మెట్ట	0.070			4	2	రాజ పాకుల భూమి	4
	4	పట్టా	మెట్ట	0.050			6	2	3	5
	6	పట్టా	మెట్ట	0.030			గ్రామ సరిహద్దు	99	4	రాజ పాకుల భూమి
	9	పట్టా	మెట్ట	0.060			గ్రామ సరిహద్దు	రాజ పాకుల భూమి	10	8
74	2	పట్టా	మెట్ట	0.020	పెనుముకుల రాజు తండ్రి బాలయ్య	పెనుముకుల రాజు తండ్రి బాలయ్య	4	1	3	99
75	65	పట్టా	మెట్ట	0.030	మద్దెల చిన్న నర్సయ్య	మద్దెల చిన్న నర్సయ్య	62	60	61	64
76	65	పట్టా	మెట్ట	0.030	మద్దెల పెద్ద నర్సయ్య	మద్దెల పెద్ద నర్సయ్య	62	60	61	64
77	2	పట్టా	మెట్ట	0.020	చిన్న నర్సయ్య తండ్రి బాలయ్య	చిన్న నర్సయ్య తండ్రి బాలయ్య	4	1	3	99
78	9	పట్టా	మెట్ట	0.020	బాలయ్య తండి ఆయన్న	బాలయ్య తండ్రి ఆయన్న	గ్రామ సరి హద్దు	రాజ పాకుల భూమి	10	8
79	65	పట్టా	మెట్ట	0.030	మద్దెల పెద్ద బాలయ్య	మద్దెల పెద్ద బాలయ్య	62	60	61	64
80	8	పట్టా	మెట్ట	0.00 1/2	బాలకిష్టయ్య	బాలకిష్టయ్య	కుంట 9	7	కుంట9	6
81	33	పట్టా	మెట్ట	0.060	పెద్ద నర్సింహ్మా తండ్రి చెన్నయ్య	పెద్ద నర్సింహ్మా తండ్రి చెన్నయ్య	31	34	32	59
82	8	పట్టా	మెట్ట	0.010	నాగేంద్రం తండ్రి బాలకిష్టయ్య	నాగేంద్రం తండ్రి బాలకిష్టయ్య	కుంట9	7	కుంట9	6
83	35	పట్టా	మెట్ట	0.010	పెద్ద నాగిరెడ్డి తండ్రి పాపయ్య	పెద్ద నాగిరెడ్డి తండ్రి పాపయ్య	58	36	34	55
84	9	పట్టా	మెట్ట	0.030	బాలకిష్టయ్య తండ్రి బాలయ్య	బాలకిష్టయ్య తండ్రి బాలయ్య	గ్రామ సరి హద్దు	రాజ పాకల భూమి	10	8
		మొత్తం		56.19						

భూసేకరణ, పునరావాస మరియు రీసెటిల్‌మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం. 21 ఆఫ్ 2017)లో పారదర్శకత మరియు పరిహారాన్ని కొరకు హక్కు చట్టం ద్వారా సవరించబడిన విధంగా భూసేకరణ, పునరావాస మరియు రీసెటిల్‌మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013)లో సక్రమ పరిహారం మరియు పారదర్శక హక్కు యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనల క్రింద ఇందుకు సంబంధించిన వారందరికీ ఈ ప్రకటన చేయబడినది.


భూమి యొక్క ప్లాన్ జిల్లా కలెక్టర్, వనపర్తి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, వనపర్తి భూసేకరణ వారి కార్యాలయములో ఏదైనా పని దినములలో పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వము / కలెక్టర్ - కం - సరియైన ప్రభుత్వము సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు నిర్దేశిత విధంగా వారి పనిని సరిగా చేపట్టుట కొరకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు & భూమిలోనికి ప్రవేశించుటకు మరియు సరిగా చేయుటకు ఏదేని భూమి యొక్క ఎత్తుపల్లాలు తీసుకొనుటకు సబ్‌సాయిల్ త్రవ్వుటకు లేదా బోరు వేయుటకు రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు అతని సిబ్బందికి అధికారిగా అధికారమిచ్చుటకు సంతసించుచున్నారు.

చట్టం యొక్క సెక్షన్ 11 (4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు ఆమోదాలు లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి భూమి యొక్క ఏదేని లావాదేవీ అనగా అమ్మకాలు / కొనుగోలు మొదలైనవి లేదా అటువంటి భూములపై ఏవేని రుణభారములు సృష్టించుటకు కారణమగుట లేదా ఏదేని లావాదేవీ ఏ వ్యక్తి చేయరాదు. పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తి / ప్రభావితమయ్యే వ్యక్తులందరి నుండి క్లెయింలు మరియు సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటే భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60 (అరువది) రోజుల లోపల భూమిలో ఆసక్తి గల వ్యక్తులచే జిల్లా కలెక్టర్ / అధీకృత సమక్షంలో సమర్పించవచ్చును.

సం/- భూసేకరణ అధికారి రాజస్వ మండలాధికారి, వనపర్తి — **సం/- సంయుక్త కలెక్టర్, వనపర్తి** — **సం/- జిల్లా కలెక్టరు, వనపర్తి**

7.5% వృద్ధిరేటు కష్టమే..

- తేల్చిన ఆర్థిక సర్వే
- మొట్టమొదటి సారిగా ఏడాది మధ్యలో విడుదల
- రుణమాఫీ వల్ల వెంటనే కష్టాలే
- తరువాత మంచి కూడా జరగొచ్చు
- జీఎస్టీ మంచిదే
- నోట్ల రద్దుతో వినిమయం తగ్గింది
- అది ఇంకా పుంజుకుంటే దీర్ఘకాలంలో మంచి ఫలితాలు
- బంగారు నగలపై తక్కువ పన్ను ఉందని అభిప్రాయం



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆర్థిక సర్వే 2016-17 రెండవ సంపుటిని పార్లమెంటులో శుక్రవారం ప్రవేశపెట్టారు. భారత ఆర్థికవ్యవస్థలోని వివిధ అంశాలపై దృష్టి పెట్టిన సర్వే దేశ ఆర్థిక పరిస్థితుల నిర్వహణ తదితర అంశాలపై నివేదించింది. 2017-18 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం మొదటిసారిగా, రెండవ లేదా మిడ్ టెర్మ్ ఆర్థిక సర్వేను సమర్పించింది. పుంజుకుంటున్న రూపాయి విలువ, వ్యవసాయ రుణాల రద్దు, పరివర్తన సవాళ్లు, జీఎస్టీ అమలు తదితర సవాళ్ల కారణంగా గతంలో (ఫిబ్రవరిలో విడుదల చేసిన మొదటి సంపుటి) అంచనా వేసిన 6.75-7.5 శాతం వృద్ధిని సాధించడం చాలా కష్టమవుతుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ముఖ్యంగా జీఎస్టీలో నిర్మాణాత్మకసంస్కరణలు, పెద్దనోట్లరద్దు తదనంతర పరిణామాలను చర్చించింది. అలాగే ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ సహా, పలురంగాల్లో సంస్కరణలు చేపట్టాలని ఆ సర్వే నివేదిక ప్రతిపాదించింది. భారతీయ ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక సంస్కరణలపై ఆశావాదం తిరిగి పుంజుకున్నదన్న విషయాన్ని సర్వే గుర్తుచేసింది. దీంతోపాటు భారతదేశ ఆర్థికవ్యవస్థ ప్రస్తుతస్థితి, మొత్తం వాణిజ్యం, బయటిరుణాలు, విదేశీప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ద్వారా విదేశీనిధుల ప్రవాహం తదితర అంశాలను ఆర్థిక సర్వే తాజా నివేదికలో వివరించింది. జీఎస్టీ వల్ల మేలు జరుగుతోందని చెపినా సదరు పరిణామాలను వృద్ధి రేటు అంచనాల్లో పరిగణనలోకి తీసుకోలేదు. అయితే.. జీఎస్టీ అమలు చేయడం గొప్ప రాజకీయ, ఆర్థిక విజయంగా నివేదిక పేర్కొంది. ఫిబ్రవరిలో ఒక సర్వే విడుదల అయిన తరువాత అప్పటి నుంచి దేశంలో చోటు చేసుకున్న కొత్త పరిణామాలను పరిగణిస్తూ మరో అధ్యయన నివేదికను విడుదల చేసింది. నగదు లభ్యత, కంపెనీలకు రుణ లభ్యత వల్ల పరిస్థితిని మెరుగుపర్చవచ్చని అయితే.. ద్రవ్యోల్బణం పెరగకుండా ఉండగా జీడీపీ వృద్ధి రేటు కంటే ఆర్బీఐ ప్రకటించే వడ్డీ రేట్లు తక్కువగా ఉండాలని సూచించింది. 2016-17 మొదటి ప్రథమ క్వార్టర్‌లోనే జీడీపీ వృద్ధి రేటుతో పాటు పెట్టుబడులు మందగించాయని, ఆ ఏడాది మూడో క్వార్టర్‌లో పరిస్థితి మరింత దిగజారిందని తేల్చి చెప్పింది. ఎగుమతులను దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరిలో అంచనా వేసిన 7.5 శాతం వృద్ధి రేటు రూపాయి విలువ పెరగడం వల్ల, ఇంకా ఇతర కారణాల వల్ల జరగకపోవచ్చని తెలిపింది. రుణమాఫీ కూడా సదరు కారణాల్లో ఒకటని, ఇది ప్రభుత్వం వద్దనున్న ధనం ఉత్పాదక పనుల మీద పెట్టుబడి పెట్టడానికి అవకాశం లేకుండా చేస్తుందని తేల్చింది. నోట్ల రద్దు తరువాత తగ్గిన వస్తు వినిమయం ఇంకా పెరగాలని, అప్పుడే కోరుకున్న వృద్ధి రేటు సాధ్యమవుతుందని నివేదికలో వివరించారు. అలాగే కార్పోరేట్ కంపెనీల లాభాలు తగ్గిపోవడం, దీంతో వారు బ్యాంకులకు రుణాలు చెల్లించడంలో ఎక్కువ సమయం తీసుకోవడం లేదా చెల్లించలేకపోడం లేదా తక్కువ వడ్డీకి రుణాలు దొరక్క పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం వంటి కారణాలు కూడా వృద్ధి రేటు ఉసురు తీస్తాయని తెలిపింది. 2017-18 బడ్జెట్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల రుణ వితరణ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం రూ. 25,000 కోట్లు కేటాయించినా, వడ్డీ రేట్లు ఇంకా తగ్గకపోవడం వృద్ధి రేటుకు అడ్డంకేనని తేల్చింది. జీఎస్టీ అమలు వల్ల పన్ను పరిధిలోకి వచ్చే వస్తువులు లేదా లావాదేవీలు పెరిగితే సదరు లాభాలను ఈ అధ్యయనంలో లెక్క వేయలేదని వివరించింది. ఆ మేరకు పన్ను పరిధి పెరిగి ఆదాయం పెరిగితే వృద్ధి రేటు కూడా పెరిగే అవకాశం లేకపోలేదు. అయితే.. ఆ అంచనాలను ఎకనమిక్ సర్వేలో పరిగణనలోకి తీసుకోలేదు. జీఎస్టీవల్ల పన్ను పరిధి పెరుగుతుందని, విద్య, ఆరోగ్యం, విద్యుత్, రియల్ ఎస్టేట్, మద్యం రంగాల్లో కొత్త పన్ను వ్యవస్థ ఆదాయం పెంచుతుందని చెప్పింది.

బంగారం, నగలపై మూడు శాతం మాత్రమే పన్ను విధించడాన్ని అరవింద్ సుబ్రమణ్యన్ తప్పుబట్టారు. ఈయన నేతృత్వంలోని కమిటీ వీటిపై కనీసం నాలుగు శాతం పన్ను గరిష్టంగా ఆరు శాతం పన్నును సిఫార్సు చేసింది. మొత్తానికి జీఎస్టీ వల్ల ప్రత్యక్షపన్నుల వసూళ్లు మెరుగవుతాయని చెప్పింది. ఈ వ్యవస్థలో వ్యాట్ నుంచి జీఎస్టీకి మళ్లిన వారిలో కొత్తగా 15 లక్షల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని వీరందరి వ్యాపార లావాదేవీలు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడానికి తోడ్పడతాయని సుబ్రమణ్యన్ అంచనా వేసారు. విద్యుత్‌ను కూడా జీఎస్టీ పరిధిలోకి తేవడం వల్ల ఇన్‌పుట్ క్రెడిట్‌లను సదరు పరిశ్రమలు క్లెయిమ్ చేసే అవకాశం ఉందని, ఇది మంచికేనని సూచన చేసారు.

♦ కీలక రంగాల్లో సంస్కరణలు అవశ్యం

వ్యవసాయం, పరిశ్రమలు, మౌలికసదుపాయాలు, విద్య, ఆరోగ్యంలాంటిరంగాల్లో సంస్కరణలు అత్యవసర మని ఆర్థికసర్వే సూచించింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ధరల నియంత్రణ కోసం మార్కెటింగ్ లాంటి మౌలికసదుపాయాలను స్థిరీకరించాలని నివేదిక తెలిపింది. పంటల దిగుబడి, రైల్వే ఆదాయాన్ని పెంచాలని అభిప్రాయప డింది. మధ్యతరహా పోర్టుల అభివృద్ధి, ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ ప్రాధాన్యతను ప్రస్తావించింది. భారత్‌ను అంతర్జా తీయ ఏవియేషన్ హబ్‌గా మార్చాలంటే నిబంధనలను సరళీకరించాలని పేర్కొంది. సంస్కరణల విషయాన్ని ప్రస్తావించిన సర్వే జీఎస్టీ అమలు, ఎయిరిండి యా ప్రైవేటీకరణ లను ప్రస్తావించింది. విద్యుత్, ఇంధన సబ్సిడీలను తగ్గించాలని చెప్పింది. వంటగ్యాస్‌పై సబ్సిడీని తగ్గించాలని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిగా ఎత్తేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం ఈ విషయాన్ని అనుసరించే ఉండొచ్చు. కార్పోరేట్ కంపెనీలకు లాభాలు తగ్గడం లేదా నష్టాలు రావడం వల్ల బ్యాంకులు ఎదుర్కొం టున్న ట్విన్ బ్యాలెన్స్‌షీట్ సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికింది.

♦ లక్షితదిశలోనేద్రవ్యోల్బణం..

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో 7.5 శాతం జీడీపీ వృద్ధి రేటును సాధించడం అసాధ్యమని సర్వే స్పష్టం చేసింది. రైతు రుణాల మాఫీతో వృద్ధి రేటను సాధించడం కుదరదని తేల్చిచెప్పింది. ద్రవ్యోల్బణం 2018 మార్చినాటికి రిజర్వ్‌బ్యాంక్ నిర్దేశించిన టార్గెట్ 4శాతం కంటే కూడా కిందకు దిగొస్తుందని పేర్కొంది. మరోవైపు 2017-18 సంవత్సరానికి పెట్టుకున్న జీడీపీ లక్ష్యాన్ని అందుకోవడం ఒకింత పెద్దసవాల్ అని ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యన్ మీడియా సమావేశంలో వెల్లడించారు. నెమ్మదిగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితిని ప్రతిబింబిస్తూ, భారత ఎగుమతులు 2016-17 నాటికి 12.3 శాతం వద్ద సానుకూలం గా మారాయి. దిగుమతులు 1.0 శాతం పెరగడంతో 2016-17 నాటికి వాణిజ్యలోటు 112.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2015-16 నాటికి ఇది 130.1 బిలియన్ డాలర్లు. ప్రస్తుత ఆర్థికలోటు 2016-17 నాటికి జీడీపీ 0.7 శాతం వరకు పెరిగింది, 2015-16లో 1.1 శాతం నుండి వాణిజ్యలో టులో స్పష్టమైన కుదింపు ఏర్పడింది. 2013-14 నుంచి 2015-16 మధ్యకాలంలో చెల్లింపుల పరిస్థితిని నిరుపయోగంచేయాల్సినపరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఆర్థిక లోటు తగ్గడంతో 2016-17లో మరింత మెరుగుపడింది. విదేశీ మారకద్రవ్యం మరింత పెరిగిందని ఆర్థిక సర్వే పేర్కొంది.

♦ విదేశీమారకద్రవ్యంలోరెండవస్థానం

2015-16 నాటికి 55.6 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా, 2016-17 లో స్థూల ఎఫ్‌డీఐ 60.2 బిలియన్ డాలర్లకు పెరిగింది. అయితే నికర పెట్టుబడులు 35.6 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2015-16 నాటికి ఇది 36.0 బిలియన్ డాలర్ల నుంచి 1.1 శాతానికి పరిమితమైంది.

కరెంట్ అకౌంట్ లోటు ను నడుపుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో, బ్రెజిల్ తర్వాత 2017 జులై 7వ తేదీ నాటికి 386.4 బిలియన్ డాలర్ల నిల్వలతో భారత్ రెండవ అతిపెద్ద విదేశీ మారకద్రవ్యాన్ని కలిగి ఉందని సర్వే తేల్చింది. 2017 మార్చి చివరినాటికి భారత్ మొత్తం విదే శీ రుణాల నిల్వ 471.9 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

3.1 బిలియన్ డాలర్లు (2.7శాతం) విదేశీ మారకద్రవ్యం గత ఏడా ది 74.3 శాతంతో పోలిస్తే విదేశీ మారకద్రవ్యం 78.4 శాతం విదేశీ రుణాన్ని అందించింది. అయితే, విదేశీ మారకద్రవ్యం జీడీపీకి 20.2 శాతానికి పడిపోయింది.

ఔషధ ధరలకు రెక్కలు

ఐపిఏ అధ్యక్షుడు రావు వడ్లమూడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత ఔషధ ఉత్పత్తులకు పేటెంట్ హక్కుల కాలం ముగిస్తే వాటి ధరలు గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ) అధ్యక్షుడు డాక్టర్ రావు వడ్లమూడి చెప్పారు. దీనిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని, ఈ పరిస్థితుల్లో దిగుమతి ప్రత్యామ్నాయం చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అంతర్జాతీయ ఫార్మా ట్రేడ్ షో అండ్ కాన్ఫరెన్స్, యూబీఎం ఇండియా నిర్వహిస్తున్న రెండు రోజుల ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ శుక్రవారం ప్రారంభించారు. హైటెక్స్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన ఈ ట్రేడ్ షోలో ఇండియన్ ఫార్మాసూటికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రావు వడ్లమూడి, యూబీఎం ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేశ్ ముద్రాస్‌లు కూడా పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి వచ్చిన అనలికల్, బయోటెక్, ల్యాబ్ ఎక్విప్‌మెంట్, కెమికల్స్, ఫార్మా మిషినరీ, ప్యాకేజింగ్ రంగాకు చెందిన 150 సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ వడ్లమూడి మీడియాతో మాట్లాడుతూ, దేశ ఫార్మా ఎగుమతులు గత ఏడాది 8శాతం నమోదయ్యాయని, ఫార్మా రంగం ఏటా 15 నుంచి 20శాతం పెరుగుతోందని చెప్పారు. దేశీయ సంస్థలు అనేక పరిశోధనలు చేస్తున్నాయని, అయితే పేటెంట్ అంశం ధరలపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రతి మెడికల్ షాపులో ఫార్మాసిస్టులే మందులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని వడ్లమూడి అభిప్రాయపడ్డారు. మందులపై పరిజ్ఞానం ఉన్న వారితోనే వినియోగదారులకు న్యాయం జరుగుతుంద న్నారు. ఔషధాల ధరలు తగ్గించాలని ప్రభుత్వం ప్రతిపాది స్తోందని, అయితే పెరుగుతున్న ఉత్పత్తి వ్యయానికి తగ్గట్టుగా నే ధరలు ఉన్నాయని ఆయన అన్నారు. తక్కువ ధరలకు మందులు కావాలంటే తక్కువ ప్రమాణాలతో వాటిని ఉత్పత్తిచేసే ప్రమాదం ఉందని రావు అన్నారు. మార్కెట్‌లో మూడువేల రకాల డ్రగ్స్ ధరలు నియంత్రణలోనే ఉన్నాయని చెప్పారు. యోగేశ్ ముద్రాస్ మాట్లాడుతూ, అనటికల్, బయోటెక్నాలజీ, ల్యాబ్ ఏక్విప్‌మెంట్స్, ఫార్మా మెషినరీ, ఫార్మాప్యాకేజింగ్ రంగాలు నాణ్యం, పరిశోధన, నియంత్రణ, పర్యావరణ పాటింపుపరంగా బలోపేతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకే భారతీయ పరిశ్రమ మెరుగైన ఉత్పాదనలు, సేవలు అందించడం ద్వారా నేటి స్థితిగతుల శక్తి నుంచి గరిష్ట సామర్థ్యాన్ని సాధించడం, ఈ వస్తుసేవలను మరింతగా మార్కెట్ చేసేందుకు విస్తృత ప్రజానీకానికి అందించాల్సి ఉందన్నారు.

ఐదో రోజూ నష్టాలే

బ్యాంకింగ్ రంగం కుదేలు

ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు వరుసగా ఐదో రోజు కూడా భారీ నష్టాలతోనే ముగిశాయి. మరోవైపు యూరప్‌సహా ఆసియా మార్కెట్లన్నీ నెగిటివ్‌గా ఉండటంతో దేశీయంగానూ దాని ప్రభావం కనిపించింది. ఆరంభంనుంచీ భారీ అమ్మకాల ఒత్తిడితో భారీ పతనాన్ని నమోదు చేసిన మార్కెట్లు చివరలో స్వల్పంగా కోలుకుని, చివరికి సెన్సెక్స్ 318పాయింట్లు పతనమై 31,213వద్ద ముగిసింది. అదేవిధంగా నిఫ్టీ 109 పాయింట్లు నష్టపోయి 9,710 వద్ద ముగిసింది. ఒక దశలో సెన్సెక్స్ 400 పాయిం ట్లకు పైగా కోల్పోగా, నిఫ్టీ సాంకేతికంగా కీలకమైన 9,700 మద్దతుస్థాయి కిందికి దిగజారినా ఆఖరి అర్ధగంటలో షార్ట్‌కవరింగ్ వచ్చింది. అయితే ఎనలిస్టులు మాత్రం అప్రమ త్తతను వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ పరిణామాలు ముఖ్యంగా అమెరికా, ఉత్తరకొరియా ఉద్రిక్తతలు సద్దుమణిగే వరకూ ఒకింత ఒడిదొడుగులు తప్ప వని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

దాదాపు అన్ని రంగాల్లోనూ అమ్మకాల ఒత్తిడి కొనసాగగా ప్రభుత్వ బ్యాంకులు మరింతగా కుదేలయ్యాయి. దీంతో పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 5 శాతం నష్టపోగా.. మెటల్, ఆటో, రియల్టీ రంగాలు పతనమయ్యాయి. క్యూ-1 ఫలితాల దెబ్బతో బాష్, ఎస్‌బీఐ, టీవీఎస్ మోటార్ నష్టపోగా, హిందాల్కో, వేదాంతా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎంఅండ్ఎం, ఎల్ అండ్ టీ, ఓఎన్‌జీసీ, ఆర్ఐఎల్, హెచ్‌యూఎల్, ఐషర్, టీసీఎస్ షేర్లలో అమ్మకాల తీవ్రత కొనసాగింది. డాక్టర్ రెడ్డీస్, బీపీసీఎల్, అరబిందో, ఇన్ఫోసిస్, గెయిల్, విప్రో, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ లాభపడిన వాటిల్లోఉన్నాయి. అటు డాలర్ మారకంలో రుపీ మరింత పతనమైంది. 0.13 పైసల నష్టపోయి రూ. 64.21 వద్ద ఉండగా, ఎంసీఎక్స్ మార్కెట్‌లో పసిడి పది గ్రా. రూ.87 ఎగిసి రూ. 29, 263 వద్ద ఉంది.

సన్‌ఫార్మాకు
రూ.425 కోట్లు నష్టం

ముంబయి: దేశీయ ఔషధ దిగ్గజ సంస్థల్లో ఒకటైన సన్‌ఫార్మా భారీ నష్టాలను మూటగట్టుకున్నది. శుక్రవారం ప్రకటించిన క్యూ-1 ఫలితాల్లో ఏకంగా రూ. 425 కోట్ల రూపాయల నష్ట భారాన్ని వెల్లడించింది. గత పన్నెండేళ్ల కాలంలో ఇంతభారీ నష్టాలు రావడం సన్‌ఫార్మాకు ఇదే తొలిసారి. అమెరికా ఔషధ తనిఖీలకు తోడు జెనరిక్ ఔషధ వ్యాపారానికి అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడం ఈ నష్టాలకు కారణమని ఆ సంస్థ ప్రకటించింది. ముంబయి ఆధారిత ఈ సంస్థకు బిలియనీర్ దిలీప్ సంఘ్వి సన్‌ఫార్మా వ్యవస్థాపకుడు. మొదటి త్రైమాసికం ఆశాజనకంగా లేదన్నారు. భారత్‌లో పన్నుల సంస్కరణలు, అమెరికా జనరిక్ మార్కెట్లో ధరల సవాళ్లు లాభాలపై ప్రభావం చూపాయన్నారు.

ఇన్ఫీ ఛైర్మన్‌గా మూర్తికి గౌరవ హోదా ఇవ్వాలి

మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్

హైదరాబాద్: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తిని తిరిగి గౌరవ చైర్మన్‌గా నియమించాలని ఇన్ఫీ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్‌పాయ్ కొత్తవాదనను తెరపైకి తెచ్చారు. ఈ చర్య సంస్థ ఇమేజీని ఇనుమడింప జేస్తుంది. ఉన్నత కార్పొరేట్ పాలనా విలువలు కలిగిన వ్యక్తి మూలంగా పెట్టుబడిదారుల్లో భరోసా పెంపొందుతుంది. అదేవిధంగా వ్యవస్థాపకుల తరపున ఇద్దరు బోర్డు సభ్యులను నామినేట్ చేయాలని, ముఖ్యంగా 13 శాతం వాటా కలిగిన వారిని ఇందుకు అర్హులుగా గుర్తించాలన్నారు. ఈ ముగ్గురు భారత పారిశ్రామిక దిగ్గజ త్రిమూలుగా అభివర్ణించారు. చట్ట బద్ధమైన, వ్యూహాత్మక నిర్ణయాల్లో ఆయన పాత్రలేకున్నా గౌరవప్రద చైర్మన్‌గా కొనసాగాలన్నదే తన వ్యక్తిగత అభిప్రాయమని పాయ్ చెప్పారు.

యాద్గార్‌లో రైల్ బోగీ కర్మాగారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఫియట్ రైల్లో బోగీ కర్మాగారం సిద్ధమైంది. ఈ నెల 18న రైల్వే మంత్రి సురేష్ ప్రభు ఈ కర్మాగారాన్ని ప్రారంభించబోతున్నారు. సుమారు రూ. 80. 92 కోట్లతో కర్ణాటకలోని యాద్గార్ జిల్లాలో కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇలాంటి రైల్ బోగీ కర్మాగారం నిర్మించడం ఇదే ప్రథమం. రైల్ బోగీ కర్మాగారానికి 2014లో శంకుస్థాపన చేశారు. నిర్మాణ బాధ్యతలను టాటా ప్రాజెక్టు సంస్థకు అప్పగించారు. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ పర్యవేక్షణలో కర్మాగారం రూపుదిద్దుకుంది. రైల్ బోగీ కర్మాగారం నిర్మాణానికి అవసరమైన 150 ఎకరాల స్థలాన్ని కర్ణాటక ప్రభుత్వం భారత రైల్వేకు ఉచితంగా అందచేసింది. రాయచూర్ రైల్వే స్టేషన్‌కు 40 కిలో మీటర్ల దూరంలో కర్మాగారం నిర్మించడం జరిగింది. సైదాపూర్ రైల్వే స్టేషన్‌కు కేవలం 10 కిలో మీటర్ల దూరంలోనే ఉంది. సంప్రదాయ రైల్ బోగీల స్థానంలో ఆధునిక రైల్ బోగీలను ప్రవేశపెట్టాలని ఇండియన్ రైల్వే నిర్ణయించింది. ఎల్‌హెచ్‌బి కోచ్‌లను దశల వారిగా ప్రవేశపెట్టడానికి చర్యలు తీసుకుంటుంది. సురక్షిత ప్రయాణం, అధిక ప్రయాణికుల సామర్థ్యం, గంటకు 160 కిలో మీటర్ల వేగంతో ప్రయాణం ఎల్ హెచ్‌బి కోచ్‌ల ప్రత్యేకత. ఇండియన్ రైల్వే ప్రస్తుతం ఈ తరహా కోచ్‌లను ఏటా 2800ల వరకు తయారు చేసే సామర్థ్యం కలిగి ఉంది. ఒక ఎల్‌హెచ్‌బి కోచ్‌కు రెండు ఫియట్ బోగీలు అవసరం. డిమాండ్ మేరకు బోగీలను తయారు చేయడానికి యాద్గర్‌లో యూనిట్ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. యాద్గర్‌లో ఏర్పాటు చేసిన కర్మాగారంలో 470 మంది ఉద్యోగులు పని చేయనున్నారు. ఈ కర్మాగారం అనేక ప్రత్యేకతలను కలిగి ఉంది. ప్రీ ఇంజనీరింగ్ బిల్డింగ్ సాంకేతిక పరిజ్ఞానం సంతరించుకుంది. అత్యంత ఆధునికతతో కర్మాగారం ఏర్పాటు చేశారు.

బీసీ విద్యార్థులకు మరో అవకాశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ : విదేశాల్లో ఉన్నత చదువులు చదివే బీసీ విద్యార్థులు' మహాత్మ జ్యోతిబా పూలే విద్యా నిధి' పథకానికి దర ఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు 30 ఏళ్ల లోపుగల విద్యార్థులు 60 శాతం మార్కులు వచ్చిన వారు ఆన్‌లైన్ (www.telanganaepass.cgg.gov.in) ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వార్షికాదాయం గ్రామీణ అభ్యర్థులకు రూ. 1,50,000, అర్బన్ అభ్యర్థులకు రూ. 2లక్షల లోపు ఉండాలన్నారు. విదేశాల్లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ సైన్స్, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్స్ విద్యకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పీసీబీ ఉద్యోగాల ధ్రువపత్రాలు పరిశీలన

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కాలుష్య నియంత్రణ మండలిలో ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన రాత పరీక్షలో మెరిట్ లిస్టును ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారికి ధ్రువపత్రాల పరిశీలను చేపట్టనుంది. 23 నుంచి సర్వీస్ కమిషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుందని కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉన్నాయని అన్నారు.

దసరా, దీపావళికి 78 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దసరా, దీపావళి పండుగల సందర్భంగా సికింద్రాబాద్ - దర్భాంగా, హైదరాబాద్ - రెక్సాల్ మధ్యన 78 ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్ - దర్భాంగా మధ్యన 52, హైదరాబాద్ - రెక్సాల్ మధ్యన 26 ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఈ రైళ్లు నడిపించడం జరుగుతుంది. సికింద్రాబాద్ - దర్భాంగా ప్రత్యేక రైళ్లు మార్గమధ్యలోని కాజీపేట, రామగుండం, మంచిర్యాల, సిర్‌పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, గోండియా, దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, ఝూర్సుగూడ, రూర్‌కెలా, రాంచి, బొకారో స్టీల్ సిటీ, గోమోహ్, పర్శనాథ్, కోడెర్మా, గయా, జమల్‌పూర్ తదితర స్టేషన్‌లో నిలుపుదల చేయడం జరుగుతుంది. అదే విధంగా హైదరాబాద్ - రెక్సాల్ మధ్య ఏర్పాటు చేసిన 26 ప్రత్యేక రైళ్లు కూడా మార్గమధ్యలోని అన్ని ప్రధాన స్టేషన్‌లలో రెండు నిమిషాలు పాటు నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రత్యేక రైళ్లలో ముందుస్తు రిజర్వేషన్ ప్రారంభించబడిందని పేర్కొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం కృషి

సాంఘిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ రాగం సుజాత



హైదరాబాద్,ఆంధ్రప్రభ : మహిళాభివృద్ధికి సీఎం చంద్రశేఖర్‌రావు ఎంతో కృషి చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ రాగం సుజాతయాదవ్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన సాంఘిక సంక్షేమ మండలి, కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ నిర్వహించి ఎగ్జిక్యూటీవ్ సమావేశంలో సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా మహిళాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయిస్తోందన్నారు. ఒంటరి మహిళలకు పెన్షన్లు, మహిళల అక్షరాస్యత కోసం నిధులు, ఉద్యోగ ఉపాధి అకాశాలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వండి

•రీడిజైనింగ్ పేరుతో అంచనాల పెంపు ఆపండి •భూసేకరణ చట్టం మేరకు నష్టపరిహారం చెల్లించండి •సీఎం కేసీఆర్‌కు రేవంత్ బహిరంగ లేఖ




హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన విధంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో అంచనాలు పెంపును నిలిపివేయాలని తెలుగుదేశం పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆ పార్టీ శాసనసభాపక్ష నాయకుడు ఎ.రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రతిపక్షాలు ఎలాంటి సూచనలు పాటించకుండా కేవలం కాంట్రాక్టర్లకు మేలుచేసే నిర్ణయాలు తీసుకుంటే తెలంగాణ సమాజం నష్టపోతుందని ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుకు రాసిన బహిరంగ లేఖలో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఆర్థికంగా నష్టం కలిగించే చర్యలు ఉపసంహరించుకోకుంటే తెలంగాణ ప్రజలు, రైతులతో కలిసి ఉద్యమం చేపట్టేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని రేవంత్ హెచ్చరించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎలాంటి పక్షాపతం లేకుండా ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాల సాగునీటి పారుదలకు ప్రణాళికలు రూపొందించాలి.రూ.18వేల కోట్లతో పూర్తయి 28 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో తొలి ప్రాధాన్యత ఇచ్చి వాటిని పూర్తిచేయాలని ఆ బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయడానికి కావలసిన రూ.1000 కోట్ల నిధులను తక్షణం కేటాయించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మహారాష్ట్రతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసి మహారాష్ట్రకు చెందిన 1800 ఎకరాల భూ కేటాయింపు సాధనకోసం ప్రధానమంత్రి వద్దకు అఖిలపక్షాన్ని తీసుకువెళ్ళాలని రేవంత్‌రెడ్డి ఆ లేఖలో డిమాండ్ చేశారు.ప్రాజెక్టు నిర్మాణాలకు తమ పార్టీ మద్దతు ఇస్తోందని, వాస్తవాలను మరుగునపెట్టి కాంట్రాక్టర్లకు కోట్లు దెచిపె డుతుంటే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో దేవాదుల, ప్రాణహిత, రాజీవ్ దుమ్ముగూడెం, కల్వకుర్తి, భీమా, ఆర్డీఎస్, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, సంగంబండ, ఎస్ఎల్‌బీసీ, నిజాంసాగర్, అలీసాగర్, ఎల్లంపల్లి, కాళేశ్వరం, పెద్దవాగు, కొమరంభీమ్, సింగూరు కాలువ, సుద్దవాగు, చౌటుపల్లి తదితర అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. గతంలో వేసిన అంచనాల ప్రకారం కేవలం రూ.17,500 కోట్లు ఖర్చుపెడితే 25 అసంపూర్తి ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తవుతుందని, దీనివల్ల 28 లక్షల ఎకరాలకు నీరందించే అవకాశం ఉందని నివేదికలు సమర్పించారు. అలాగే వెయ్యికోట్లు ఖర్చుపెడితే 8 లక్షల ఎకరాలకు నీరందించవచ్చునని నివేదికలు చెబుతున్నాయని ఆ లేఖలో గుర్తుచేశారు. కానీ కొత్త ప్రాజెక్టులు, ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు ముఖ్యమంత్రి సిద్ధపడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. నిర్ణీత ఎత్తులో కాళేశ్వరం కడితే ఆదిలాబాద్ జిల్లాలో 10 లక్షల ఎకరాలకు గ్రావిటి ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. మహారాష్ట్ర పరిధిలోని 1800 ఎకరాల భూమి కోసం మీరు చేసుకున్న ఒప్పందం మేరకు రాష్ట్రంపై రూ.80వేల కోట్ల ఆర్థిక భారం పడే పరిస్థితి ఉందని రేవంత్ ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్ళి ప్రధానిని కలుస్తుంటారనీ, మహారాష్ట్రకు చెందిన 1800 ఎకరాల భూమిని తెలంగాణకు కేటాయించాల్సిందిగా ఒప్పించడంలో విఫలమయ్యారా అని కేసీఆర్‌ను ప్రశ్నించారు.భూసేకరణ 2013 చట్టం ప్రకారం భూములు సేకరించి వారికి నష్టప రిహారం చెల్లించకుండా దౌర్జన్యంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. చట్ట ప్రకారం భూసేకరణ చేయాలని ఒత్తిడితెస్తే దానికి రాజకీయ రంగు పులిమి ప్రతిపక్షాలు ప్రాజెక్టులను అడ్డుకుంటున్నాయని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. మీ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల దుస్థితి వెలు గులోకి వచ్చినపుడు తెలంగాణ సమాజం మిమ్మల్ని, మీ కుటుంబాన్ని క్షమించే ప్రసక్తే ఉండదని రేవంత్ ఆ బహిరంగ లేఖలో హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో లైసెన్సు రద్దు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆగస్టు 7 నుంచి 11 వరకు నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఆ డ్రైవ్ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మంది పట్టుబడ్డారు. వారి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేసింది ఎర్రమంజిల్ కోర్టు. మరో 71 మంది జైలు శిక్షతోపాటు రూ.1.22 లక్షల జరిమానా విధించింది. 569 మందిపై చార్జిషీట్ దాఖలు చేశారు ట్రాఫిక్ పోలీసులు.

విక్రమ్‌గౌడ్ బెయిల్ పిటిషన్ కొట్టివేత


ఫైల్ ఫోటో

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కథ, స్క్రీన్‌ప్లే దర్శకత్వం వహించి తనపై కాల్పులు జరిపించుకుని కాల్పుల డ్రామాను రక్తికట్టించి.. చివరికి తాను తీసిన గోతిలో తానేపడ్డ విక్రమ్‌గౌడ్ పడినట్లయింది. ఈ కేసులో విక్రమ్‌గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి విదితమే. కాగా, నాంపల్లి కోర్టులో గురువారం విక్రమ్‌గౌడ్ బెయిల్ పిటిషన్ అయింది. బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ నిర్వహించిన కోర్టు విక్రమ్‌గౌడ్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

ఏపీలో రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

అమరావతి, ఆంధ్రప్రభ : ఒకవైపు కరవు, మరోవైపు వర్షాభావంతో పంటల సాగు కష్టతరంగా మారి దుర్భర జీవితాలను అనుభవిస్తున్న రాష్ట్ర రైతాంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీతో అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం దానిని అమలు చేయడంలో తీవ్రంగా విఫలమైందని, మూడవ విడతకు రూ.3,600 కోట్లు కేటాయించి, ఇంత వరకు నిధులను విడుదల చేయలేదన్నారు. గత ఏడాది 82 శాతంగా ఉన్న పంటలు ఈ ఏడాది 43 శాతానికి పడిపోయాయని, కనీసం రైతుల ఇళ్లలో తిండి గింజలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు, వర్షాభావంతో పంటలను నష్టపోయిన రైతులకు ఉచితంగా సన్‌ఫ్లవర్, జొన్న విత్తనాలను ఇవ్వడంతోపాటు ఎకరానికి రూ.20 వేలను పంట నష్టం క్రింద ఇవ్వలన్నారు. కరవు నివారణ చర్యలు చేపట్టక ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రులు, రాష్ట్ర యంత్రాంగమంతా నంద్యాలలోనే మకాం వేశారని, ఉప ఎన్నికల గెలుపుకోసం వ్యవసాయాన్ని, రైతాంగాన్ని, రాష్ట్రాన్ని పాలకులు వదిలేశారని విమర్శించారు. పశువులకు గ్రాసంలేక కబేళాలకు తరలుతున్నాయన్నాయని తెలిపారు..

తెలుగు రాష్ట్రాల వారికే

సూపర్ స్పెషాలిటీ సీట్లు

● హైకోర్టులో పిటిషన్ దాఖలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎన్టీఆర్, కాళోజీ నారాయణరావు ఆరోగ్య వర్సిటీల్లో సూపర్ స్పెషా లిటీ కోర్సుల్లోని మొత్తం సీట్లను జాతీయ స్థాయి కౌన్సెలింగ్ నిర్వ హించడం ద్వారా భర్తీ చేయా లంటూ ఢిల్లీలోని హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ..శుక్రవారం హైకో ర్టులో అత్యవసరంగా వ్యాజ్యం దాఖలైంది. పీజీ వైద్య విద్యార్థి డాక్టర్ బి.సతీష్ క ుమార్‌తో పాటు పలువురు వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనిలతో కూడిన డివి జన్ బెంచ్ ఈ వ్యాజ్యాలపై విచారణ చేపట్టి, ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమ ర్పించాలని ప్రతివాదులను ఆదేశించింది. ఎన్టీఆర్, కాళోజీ నారాయణరావు ఆరో గ్య విశ్వవిద్యాలయాల్లోని సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో కల్పించిన ప్రవేశాలు తాము ఇవ్వబోయే తదుపరి ఉత్తర్వులకు లోబడి ఉంటాయని తేల్చి చెప్పింది. తదుపరి విచారణ ఈ నెల 16కు వాయిదా వేసింది.

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది సరసాని సత్యం రెడ్డి వాదనలు వినిపిస్తూ ..రాష్ట్రపతి ఉత్తర్వులు 371(డి) ప్రకారం తెలంగాణాలో ఉన్న కాళోజీ నారాయణరావు విశ్వవిద్యాలయంలో 85 శాతం సీట్లను తెలంగాణ, మిగిలిన 15 శాతం సీట్లు ఏపీ అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. అలాగే ఏపీలోని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలోని 85 శాతం సీట్లను ఏపీ అభ్యర్థులతో, మిగిలిన 15 శాతం సీట్లను తెలంగాణ అభ్యర్థులకు కేటాయించాలని అభ్యర్థిం చారు. ఆ సీట్ల భర్తీకి జాతీయ స్థాయి కౌన్సిలింగులో నిర్వహించాలి. ఇతర రాష్ట్ర అభ్యర్థులకు స్థానం కల్పించడానికి వీల్లేదన్నారు. ఆ వాదనలపై ధర్మాసనం స్పం దిస్తూ ..ఈ వ్యవహారంపై ప్రతివాదుల స్పందన తెలుసుకోవాలని అభిప్రాయ పడింది. ఈ దశలో ఆ న్యాయవాది స్పందిస్తూ ప్రవేశాలు కల్పిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆ ప్రవేశాలు తాము వెలువరించబోయే తదుపరి ఉత్తర్వులకు లోబడి ఉంటాయని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఈ నెల 16 కు వాయిదా వేసింది.

ఏపీ సీఎంను కలసిని ఫాతిమా బాధితులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఢిల్లీ వచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫాతిమా మెడికల్ కళాశాల విద్యార్థుల సెగ తగిలింది. ఉదయం విమానాశ్రయం నుంచి ఏపీ భవన్లోని సీఎం కాటేజికి చేరుకున్న ముఖ్యమంత్రిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వచ్చి కలిశారు. రెండు వారాలుగా తమకు న్యాయం చేయాలంటూ ఢిల్లీలోనే మకాం వేసిన వీరు ముఖ్యమంత్రికి కూడా వినతి పత్రాన్ని అందజేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని వేడుకున్నారు. ఫాతిమా ఉదంతం గురించి ముఖ్యమంత్రికి ముందే తెలుసు కాబట్టి, వారి సమస్యను కేంద్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వెంటనే అక్కడే ఉన్న ఎంపీలు, అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. ముఖ్యమంత్రి స్పందన చూసిన విద్యార్థులు ఆయనక ు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు వారాలుగా ఢిల్లీలోనే ఉంటున్న బాధితులు కనిపించిన ప్రతి నేతనూ కలిసి న్యాయం చేయాలని వేడుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఒక రోజు ముందు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. శుక్రవారం సీఎం కాటేజికి చేరుకున్న ముఖ్యమంత్రి, ఉప రాష్ట్రపతి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లే ముందు అక్కడే ఆయన కోసం ఎదురుచూస్తూ నిల్చున్నారు. గుంపుగా కనిపించిన బాధితులను చూసిన సీఎం వాహనాలను ఆపాల్సిందిగా అధికారులను ఆదేశించి వారి గోడు విన్నారు. అనంతరం ఉప రాష్ట్రపతి కార్యక్రమానికి హాజరయ్యారు.

ఏపీలో విస్తారంగా వర్షాలు

•పలుజిల్లాల్లో కుండపోత వాన •గంటలోపే జలమయం అయిన రోడ్లు •భారీ వర్షాలతో రైతుల కళ్లల్లో ఆనందం





అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. శుక్రవారం పలు జిల్లాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతాంగానికి భారీ వర్షాలతో ఊరట లభించింది. వారి కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల పంటలకు సరిగా నీరులేక ఎండిపోయే పరిస్థితులున్నాయి. ముఖ్యంగా ఈ సీజన్లో వరినాట్లు విరివిగా పడ్డాయి. అయితే దానికి తగిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో రైతాంగం దిగాలు చెందింది. ఈ మధ్యకాలంలో కొన్నిజిల్లాల్లో స్వల్పంగా వర్షాలు కురిసినా అవి ఏ మాత్రం పంటలకు సరిపోలేదు. దీంతో శుక్రవారం కురిసిన కుంభవృష్టి వర్షాలతో రైతులు ఆనందంలో ఉన్నారు. మరో రెండు రోజుల్లో భారీ వర్ష సూచన ఉండటంతో ఈ సీజన్‌కు పంటలకు నీరు సరిపోతుందనే అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా రాయలసీమలో చుక్కనీరులేక, రెయిన్ గన్స్ కూడా పనిచేయని పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో రాయలసీమ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో రైతాంగంతోపాటు ప్రజలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బోర్లు మూగబోయి పంటలు నోర్లు విచ్చుకున్నాయి. దీంతో వేసిన పంట మొక్కగానే ఎండిపోతుందన్న ఆందోళనలో రైతుల్లో కనిపించింది. ఈ క్రమంలో గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో వారు ఊరటచెందారు. ప్రభుత్వం కూడా వర్షం వివరాలను ఎప్పటికప్పుడు ఆరా తీస్తోంది. ఈ నెల 14వ తేదీ వరకూ ఇదే పరిస్థితులు ఉంటాయని వాతావరణశాఖ చెబుతోంది. తాజాగా రాయలసీమలోని కడప, చిత్తూరు, అనంతపురంలలో వర్షాలు కురియగా, కోస్తా పరిధిలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, నెల్లూరు, కృష్ణా, గుంటూరు, ప్రకాశంలో కొన్నిచోట్ల కుండ పోత వర్షాలు పడగా మరి కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి. తిరుమల తిరుపతి దేవస్థానంపై గంటన్నరపాటు వర్షం పడగా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజమహేంద్రవరంలో భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఏలూరులోనూ కుండపోత వర్షంతో రోడ్డు జలమయం కాగా , డ్రైయిన్లు పొంగిపొర్లాయి. కొన్నిచోట్ల చెట్లు కూలి రోడ్లపై పడ్డాయి. కృష్ణాజిల్లాలో నూజివీడులో భారీ వర్షం పడింది. అనంతపురంలో అన్నీ జిల్లాల్లో సాధారణం నుంచి భారీ వర్షాలు కురిశాయి. కళ్యాణదుర్గంలో అత్యధికంగా 59.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. లేపాక్షిలో 53.2, హిందూపూర్‌లో 52.4, రోళ్లలో 40.2, పెనుగొండలో 39.2, మడకశిరలో 35.2 తాడిపత్రిలో 25, అనంతపురంలో 24.8, ఉరవకొండలో 22 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రాష్ట్రవ్యాప్తంగా బాపట్ల 48 మిల్లీమీటర్లు, కాకినాడ 23, మచిలీపట్నం 23, నెల్లూరు 7, ఒంగోలు 23, తునిలో 19 మిల్లీమీటర్ల వర్షం నమోదు అయ్యింది. ఏలూరులో 46.2, కుక్కునూరులో 8 మీల్లీమీటర్ల వర్షం కురిసింది. కృష్ణాజిల్లాలోని నూజివీడులో 38.2, తిరువూరులో 28, గుడివాడలో 17.2, విజయవాడలతో 15.2, కైకలూరులో 11.2, ప్రకాశం బ్యారేజీ వద్ద 10, నందిగామలో చిరుజల్లులు పడ్డాయి. గుంటూరు జిల్లాలో సత్తెనపల్లిలో 19.8, మాచర్లలో 6.2, గుంటూరులో 7.2, అచ్చెంపేటలో 5.6, పిడుగురాళ్లలో 4.2, మంగళగిరి 3 మిల్లీమీటర్ల వర్షం పడింది. కడప జిల్లాలో ముద్దునూరులో 23.4, సింహాద్రిపురం 15.2, పులివెందుల 9.8, కమలాపురం 6, పొద్దుటూరులో 8.2, వెంపల్లిలో 5.2 మిల్లీమీటర్ల వర్షం నమోదు అయ్యింది. మరికొన్ని జిల్లాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. రాగల 24 గంటల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు, మరికొన్నిచోట్ల కుంభవృష్టి కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఈ నెల 13, 14వ తేదీల్లో కోస్తాంధ్ర పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. రాయలసీమ జిల్లాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ క్రమంలో కోస్తాంధ్ర జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సముద్రంలోకి వేటకు వెళ్లే మత్స్యకారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

వర్షాలతో చల్లబడిన వాతావరణం

కొద్ది రోజులుగా 39 నుంచి కొన్నిచోట్ల 39.9 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వేసవివాతావరణం కనిపించింది. అయితే శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా మేఘాలు కమ్మి తేలికపాటి నుంచి కుంభవృష్టి వర్షాలు కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కొద్ది రోజులుగా పగలు ఉక్కపోత, భిన్నమైన ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతోపాటు రైతులకు ఈ వర్షాలు మేలు చేయనున్నాయని అంటున్నారు. ఈ నెల 14వ తేదీ వరకూ ఇదే రకమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయంటున్నారు. చాలా జిల్లాల్లో ఇప్పటికీ ఈ సీజన్లో నమోదు కావాల్సిన వర్షాలు కురవలేదు. తాజాగా కురుస్తున్న వర్షాలతో ఈ లోటు భర్తీ అవుతుందని వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఐటీ సహకారంతో ప్రజలకు పౌరసేవలు


ఈ-లెర్నింగ్ శిక్షణ ప్రారంభంలో వక్తలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పౌర సేవలను మరింత సమర్థవంతంగా సమాజానికి అందించేందుకు ప్రభుత్వోద్యోగులు ఐటీని విస్తృతంగా వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఎస్ నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ ఈ లెర్నింగ్ విధానం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో ఉద్యోగులు ప్రభుత్వ సేవలను సమాజానికి మెరుగైన రీతిలో అందించేందుకు ఐటీని వినియోగించుకుంటున్న తీరును ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజా సేవల అందజేతలో భాగంగా ఈ-శిక్షణ అనేది ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత ఆవశ్యకమని చెప్పారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి ఉద్యోగులకు స్నేహితుడగి ఆయన అభివర్ణించారు. ఉద్యోగులంటే తమకు కేటాయించిన విధులనే నిర్వర్తించడం కాకుండా రాష్ట్రవృద్ధిలో కీలక భూమికి ఉందని పేర్కొన్నారు. ప్రజావసరాలను అర్థం చేసుకొని వాటికి పరిష్కారమార్గాలను కనుగొని మెరుగైన సేవలను అందించాలన్న భావనతో ఉద్యోగులు ముందుకు సాగాలని ఆయన కోరారు. అందుకు ఈ-లెర్నింగ్ విధానం ఉపకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో తాము గ్రూప్-ఎ, గ్రూప్-బి అధికారుల శిక్షణపై మాత్రమే దృష్టిసారించేవారమని భారత ప్రభుత్వ వ్యక్తిగత శిక్షణ విభాగం జాయింట్ సెక్రటరీ డాక్టర్ దేవేశ్ చతుర్వేది అన్నారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ సేవలను అందించేకింది స్థాయి ఉద్యోగులకు సరైన శిక్షణనివ్వకుండా ప్రజలకు సుపరిపాలన అందించడం సాధ్యపడదన్న భావనతోనే ఇప్పుడు ఇతర కిందిశ్రేణి ఉద్యోగులపై కూడా దృష్టిసారించామన్నారు. ఇందులో భాగంగానే దేశ వ్యాప్తంగా తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో 82వేల మంది ఉద్యోగులకు ఈ-లెర్నింగ్ ప్రక్రియ ద్వారా శిక్షణనిచ్చేందుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రవర్తన నైపుణ్యాలు, ఉద్యోగుల వైఖరిలో మార్పు తీసుకొచ్చే విధంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రా భివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, బహుళ ప్రయోజక అభివృద్ధి కార్య క్రమాలను తీసుకొస్తున్నప్పటికీ వాటిని విజయవంతం చేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమైందని ఎంసీహెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ బిపి ఆచార్య అన్నారు. ఈ శిక్షణతో రాష్ట్రపాలనకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్-2017ను బంగారు తెలంగాణ దిశగా నిన్నటి నేపథ్యం-రేపటి సంకల్పం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బూసాని వెంకటేశ్వర్‌రావు. ఎంపి సేథీ, అయలూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వ్యవసాయ కళాశాలల విద్యార్థుల భిక్షాటన

అమరావతి, ఆంధ్రప్రభ: వ్యవసాయశాఖలో వివాదాస్పదంగా మారిన జీవో 64ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆచా ర్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాలల విద్యార్థులు ఆందోళనను మరింత ఉధృతం చేశారు. ఇప్పటి వరకు విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలకే పరిమితమైన ఉద్యమం శుక్రవారం నుంచి విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. గత 10 రోజుజులుగా జరుగుతోన్న ఆందోళనలో భాగంగా శుక్రవారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు భిక్షాటన రూపంలో తన నిరసన వ్యక్తం చేశారు. వర్షం పడుతున్న లెక్కచేయకుండా ఆందోళనలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు.



ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును అభినందిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



వేడెక్కుతున్న నంద్యాల





హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉప ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ నంద్యాల రాజకీయం వేడెక్కుతోంది. తెలుగుదేశం , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీల నేతలు వీధివీధి సందు సందూ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి నంద్యాలలోనే మకాం వేసి గత మూడు రోజులుగా రోడ్‌షోల ద్వారా సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. రోజుకు 15 నుంచి 20గ్రామాల్లో జగన్ అలుపు సొలుపు లేకుండా రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలు మొదలుకుని శివారుపల్లె, శ్రీనివాసపురం వంటి చిన్న చిన్న పల్లెలను సైతం వదలకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాడు చాపిరేవుల నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించి అటు గుంతనాల దాక , ఇటు పులిమద్దిదాక రోడ్‌షోలతో ఏకంగా 22గ్రామాలను చుట్టివచ్చారు. వెళ్లిన ప్రతిచోట ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో జగన్ తన ప్రసంగాల్లో పదును పెంచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు , కర్నూలులో 2014 ఆగస్ట్ 15న చేసిన ప్రకటనలు జిల్లా అభివృద్ధి ,ప్రత్యేకించి నంద్యాల ప్రాంతానికి ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. అయితే జగన్ ఎన్నికల ప్రచారంలో భూమా కుటుంబంపై పెద్దగా విమర్శల జోలికి పోకుండా తెలుగుదేశం పార్టీని , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టార్గెట్‌గా చేసుకుని విమర్శల బాణాలు ఎక్కు పెడుతున్నారు.

రంగంలోకి బాలకృష్ణ!

జగన్ ఎన్నికల ప్రచారానికి ధీటుగా ఎదుర్కొనేందుకు తెలుగుదేశం పార్టీ సినీహీరో బాలకృష్ణను రంగంలోకి దించుతోంది. మాస్ హీరోగా పేరున్న బాలయ్యతో నంద్యాలలో రోడ్‌షోలు చేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నెల 16నుంచి వరుసగా మూడు రోజుల పాటు బాలయ్య నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొనేలా కార్యక్రమాలను రూపొందించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలుగుదేశంపార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి మద్దతుగా బాలకృష్ణ నంద్యాల ఎన్నికల ప్రచారానికి రావాలని బాలయ్య ఫాన్స్‌తోపాటు స్థానిక నేతలు ఎప్పటి నుంచో కోరుతూ ఉన్నారు. బాలయ్య వస్తే యువతలో ఉత్సాహం ఉరకలేస్తుందని, ఎన్నికల ప్రచారానికి కూడా ఊపు వస్తుందని ఆశిస్తున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా నంద్యాలకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు పార్టీ ముఖ్యనేత మార్కెట్ కమిటీ ఛైర్మన్ వి.వి. రామిరెడ్డి తెలిపారు. మంత్రులు , పార్టీ సీనియర్లు ఇప్పటికే తమ తమ స్థాయిల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. పార్టీ యువనేత ఏపీఐడీసీ మాజీ ఛైర్మన్ ఏ.వి.సుబ్బారెడ్డి ఉప ఎన్నికల్లో నంద్యాలపై మరింత దృష్టి పెడుతున్నారు. 2009లో నంద్యాల నియోజక వర్గం నుంచి పోటీచేసిన ఏవీకి అన్ని గ్రామాలతో పరిచయాలు ఉండటం ,అప్పటి తన ఎన్నికల అనుభవం ఇప్పుడు బాగా ఉపకరిస్తోంది.

పట్టు దొరకని కాంగ్రెస్

నంద్యాల ఉప ఎన్నికల్లో పార్టీఅభ్యర్థిని రంగంలోకి దించినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి ఇంకా పట్టు దొరకటంలేదు. పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి, కేంద్ర మాజీ మంత్రికోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి నంద్యాల ఉప ఎన్నికల్లో గట్టిపోటీ ఇస్తున్నామన్న అభిప్రాయం కలిగించేందుకు శ్రమిస్తున్నారు. కాంగ్రెస్ కంటే రాయలసీమ పరిరక్షణ సమితి అభ్యర్థి బి.పుల్లయ్య ప్రచారంలో ఎంతో ముందంజలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నంద్యాల్లోనే మకాం వేసి రాయలసీమ సమస్యలను ప్రజల్లోకి తీసుకుపోతూ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

పేదల ఆశలతో చెలగాటమా?



నంద్యాల/ నంద్యాల రూరల్, కెఎన్ఎన్ : సార్వత్రిక ఎన్నికల్లో అధికారం కోసం హామీ లను గుప్పించి ఓట్ల కోసం రైతు లను మొదలుకొని నిరుద్యోగులను మోసం చేసిన ముఖ్యమంత్రిని శిక్షించడం తప్పా అని వైసీపీ అధి నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నిం చారు. ఇప్పటి వరకు 600 హామీ లకు పైగా ఇచ్చి అమలు చేయ కుండా రాష్ట్ర ప్రజలను ముఖ్య మంత్రి వెన్నుపోటు పొడిచారని, ఇలాంటి చంద్రబాబుకు ఉరిశిక్ష వేసినా తప్పు లేదంటామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నంద్యాల రూరల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో 3వ రోజు ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా సభల్లో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అల వి కానీ హామీలతో రాష్ట్ర ప్రజలను మోసగించడం అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇలాంటి వ్యక్తిని ఉరి తీయాలని పదే పదే చెబుతుంటానని ప్రస్తావించారు. చివరకు పేదల ఆశలతో చెలగాట మాడుతున్నారన్నారు. రాజకీయ వ్యవస్థలో మార్పు కోసం ప్రయత్ని స్తున్నామని, ఆ మార్పు నంద్యాలలో నాంది పలకాలని పిలుపునిచ్చారు. నంద్యా ల ఉప ఎన్నికల్లో వైసీపీ పోటీ పెట్టకపోతే అభివృద్ధి పనులకు ఒక్క రూపాయి ఇచ్చేవారా అని ప్రశ్నించారు . ఎన్నికలు మొదలుకొని కర్నూలు హామీలతో మొదల యితే నంద్యాల ఉప ఎన్నికల్లో గెలుపు కోసం అవే హామీలను గుప్పిస్తున్నారన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో గెలవడం కోసం ముఖ్యమంత్రి ఇంత చేయడం ఎందుకని, ఒక్కసారి వెనక్కి వెళి తే విషయాలు తెలుస్తాయన్నారు. గెలవ డం కష్టమని తెలిపోవడంతోపాటు జగన్ సర్వేలలో ముందున్నారని చెబుతుం డటంతో అవే హామీలను మరోసారి వినిపిస్తున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో రైతుల రుణాలు రూ. 87,612 కోట్లు ఉన్నాయన్నారు. అప్పట్లో రైతుల రుణ మాఫీ భేషరతుగా చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అక్కా, చెల్లెళ్ళ ఓట్ల కోసం అప్పటికే పావలా వడ్డీ రుణాలు తీసుకున్న డ్వాక్రా, పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేస్తానని ఇచ్చిన హామీ అమలు అయిందా అని ప్రజలను అడిగారు. మరో అడుగు ముందుకు వేసిన చంద్రబాబు నిరుద్యోగులను వదలేదన్నారు. జాబ్ రావాలంటే బాబు రావాలని పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెట్టి ప్రచారం చేశారన్నారు. నిరుద్యోగుల కోసం నిరుద్యోగ భృతిని రూ. 2 వేలు అందిస్తారన్నారు. ఇప్పటికి 36 నెలల చంద్రబాబు పాలనలో ఒక్కొక్క నిరుద్యోగికి రూ. 76 వేలు ఇచ్చారా అని ప్రజలను ప్రశ్నించారు. చివరకు పేదల సొంతింటి కల ఆశలతో చెలగాటం ఆడారన్నారు. మూడు సెంట్ల స్థలంతోపాటు ఇళ్ళు కూడా కట్టిస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క ఇళ్ళు కూడా కట్టించారా అని ప్రజల నుంచి స్పందనను కోరారు. ముఖ్యమంత్రి పదవి కోసం చెప్పని అబద్దాలు కానీ, చేయని మోసాలు కానీ లేవన్నారు. నోరు తెరిస్తే అబద్దాలనే వల్లించారన్నారు. ప్రజలను మోసం చేసిన ఆయనను ఏమి అనకూడదంటా అని అన్నారు. రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి మరచిపోయారని, మరోసారి మోసం చేయబోతున్నారన్నారు

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి నిధులు

వందశాతం ఖర్చుచేయాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను సకాలంలో ఖర్చు చేసేందుకు గాను ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చిందని ప్రభుత్వ సలహాదారు రామలక్ష్మణ్ అన్నారు. జనాభా దామాషా ప్రకారం అన్ని శాఖలకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, ఆ నిధులను సకాలంలో ఖర్చు చేయాలని ఆయన సూచించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధిపై రామలక్ష్మణ్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎస్సీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ పి. కరుణాకర్, ఎస్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్. లక్ష్మణ్, గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం భుక్యాతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్సీల అభివృద్ధికి రూ. 14,375.12 కోట్లు, ఎస్టీల అభివృద్ధికి రూ. 8,165.87 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని రామలక్ష్మణ్ తెలిపారు. వివిధ శాఖల ద్వారా ఈ నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయలన్నారు. వ్యవసాయం, అనుబంధ శాఖలకు కేటాయించిన నిధులను సంబంధింత యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు , కావాల్సిన నైపుణ్యతపై శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలన్నారు.

జీఎస్టీపై యాగిలో అర్థంలేదు

- బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వ ప్రాజెక్టుల విషయంలో చేస్తున్న రాద్ధాంతంలో అర్థం లేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు డా. లక్ష్మణ్ అన్నారు. పన్ను రేటు నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వం కాదని, ఆ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలుసని అన్నారు. అయినా సరే బీజేపీని నిందించే విధంగా ఆయన వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. పన్ను రేట్లను జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయిస్తుందని, కౌన్సిల్‌లో అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు భాగస్వాములేనని లక్ష్మణ్ తెలిపారు. అయితే కౌన్సిల్ సమావేశాలకు తెలంగాణ నుంచి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ హాజరవకుండా కేటీఆర్ ఎందుకు హాజరవుతున్నారని ఆయన ప్రశ్నించారు. జీఎస్టీ కారణంగా రూ. 19,200 కోట్లు అదనపు భారం పడుతోందని తెలంగాణా ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల వెనుక రాజకీయ దురుద్దేశాలున్నాయని లక్ష్మణ్ అన్నారు. కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీ చేరుకున్న తెలంగాణ నేతల బృందం శుక్రవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి భవన్లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో ప్రభుత్వ పథకాలపై వ్యాట్ రూపంలో 5 శాతం పన్ను ఉండేదని, అది ఇప్పుడు జీఎస్టీ రూపంలో 18 శాతానికి పెరగడం వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడుతోందని చెప్పడం అర్థరహితం అన్నారు. జీఎస్టీలో వసూలైన పన్నులో సగ భాగం రాష్ట్రానికి కూడా వస్తుందన్న విషయం మర్చిపోవద్దని అన్నారు. అలాగే పెరిగిన పన్ను భారం కాంట్రాక్టర్లపై ఉంటుంది తప్ప రాష్ట్ర ఖజానాపై కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఏదేమైనా పన్ను రేటు తగ్గించమని అడగడంలో తప్పులేకపోయినా, నిందించడం ఏమాత్రం తగదని లక్ష్మణ్ అన్నారు. పేదలకు ఇళ్లు, బీడీ కార్మికులపై ప్రభావం చూపే బీడీలపై పన్ను రేటు తగ్గించేవిషయంలో తాము కూడా ఒత్తిడి తెస్తున్నామని అన్నారు. మరోవైపు రైల్వే ప్రాజెక్టులు నత్తనడకన సాగడంపై తెలంగాణ ప్రభుత్వానిదే తప్పని డా. లక్ష్మణ్ అన్నారు. కాజీపేట రైల్వే వర్క్‌షాప్ కోసం ఎండోమెంట్ భూమిని కేటాయించడం వల్ల న్యాయపరమైన సమస్యలు తలెత్తిందని, నిజానికి దీనికోసం రైల్వే శాఖ నిధులు కూడా కేటాయించిందని వెల్లడించారు. అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వాన్ని సైతం భాగస్వాములను చేస్తూ చేపట్టిన ప్రాజెక్టుల్లో కేంద్రం వైపు నుంచి అంతా సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వమే స్థలాలు కేటాయించడం, ఇతరత్రా విషయాల్లో జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఈ విష యంపై రైల్వే శాఖ తెలంగాణ ప్రభుత్వానికి లేఖలు కూడా రాసిందని వివరించారు. రైతులు పంట నష్టపోయినప్పుడు ఆదుకునే ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం నీరుగార్చిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద చెల్లించాల్సిన ప్రీమియం చెల్లించకపోవడం వల్ల రైతులకు నష్టపరిహారం అందడం లేదని అన్నారు.

స.హ.చట్టం కమిషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సమాచార హక్కు (స.హ) చట్ట కమిషన్ లో ఒప్పంద పొరుగు సేవల ఉద్యోగుల సర్వీసును ఈ నెల 16 నుంచి కొనసాగించాలని హైకోర్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలను ఆదేశించింది. అలాగే వారికి 58:,42 నిష్పత్తిలో వేతనాలు చెల్లించాలని హైకోర్టు రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. సమాచార హక్కు చట్ట కమిషన్లను ఏర్పాటు చేయలేదన్న సాకుతో ఉద్యోగుల్ని రోడ్డుపాలు చేయడం సరికాదని ఏపీ ప్రభుత్వ న్యాయవాదికి సూచించింది. తెలంగాణ లోకల్ స్టేటస్ ఉన్న ఉద్యోగులను ఎలాగైతే స.హ కమిషన్లో కొనసాగిస్తున్నారో ,తమనూ అలాగే కొనసాగించాలని అభ్యర్థిస్తూ ..స.హ కమిషన్లో గతంలో పనిచేసిన పలువురు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపిస్తూ ..ప్రధాన సమాచార కమిషనర్, ఇతర కమిషనర్ల నియామకాన్ని ఆరు వారాల్లో భర్తీ చేయాలని, ఇటీవల ధర్మాసనం ఉత్తర్వులు వెలువరించిందని గుర్తు చేశారు. స.హ కమిషన్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటున్నామని, ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్నట్లు జనాభా నిష్పత్తిలో వారికి జీతాలను 58:,42 నిష్పత్తిలో రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సి ఉందని విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ ..ఏపీ లో కమిషన్ లేదన్నారు. అలాగే పిటిషనర్లను విధుల్లోకి తీసుకోవడానికి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వ న్యాయవాది వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. ఆరు వారాల్లో ప్రధాన సమాచార కమిషనర్, ఇతర కమిషనర్లను నియమించాలని ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసింది. స.హ కమిషన్ ఏర్పాటు చేయలేదన్న కారణంతో వారి సేవల్ని నిరాకరించడం తగదని స్పష్టం చేసింది. స.హ కమిషన్లో గతంలో సేవలు అందించిన పొరుగు సేవల ఒప్పంద ఉద్యోగులందరినీ ఈ నెల 16 నుంచి విధుల్లోకి తీసుకోవాలని రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

ఫ్యాక్షన్ వారసత్వంతోనే ప్రసంగాలు


- జగన్‌కు రాజకీయాల్లో కొనసాగే నైతికహక్కులేదు
- ఎన్నికల హామీలు అమలు చేయాని సీఎం కేసీఆర్ : ఎల్.రమణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నడ్డిరోడ్డుపై కాల్చాలని, ఉరి తీయాలంటూ వ్యాఖ్యానించిన వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి రాజకీయాల్లో కొనసాగే నైతిక హక్కు లేదని తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగపరమైన చట్టాలకు, ప్రజలు ఇచ్చిన తీర్పునకు విలువ లేకుండా ఆయన మాట్లాడుతున్నారని శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో దుయ్యబట్టారు. ఈ సమావేశంలో తెదేపా మహిళా అధ్యక్షురాలు బంద్రు శోభారాణి, లంకల దీపక్ రెడ్డి కూడా పాల్గొన్నారు. నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో జగన్ ప్రసంగాలు చేయడం లేదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవిధంగా మాట్లాడుతున్నారని రమణ ఆరోపించారు. ప్రచారంలో ప్రజల విశ్వాసం పొందేవిధంగా ప్రసంగాలు ఉండాలేగానీ, తాత, తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఫ్యాక్షన్ మనస్తత్వంతో అటవికంగా కాల్చిచంపాలని, ఉరితీయాలని మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం కోసం తన కుటుంబం నుంచి వారసత్వంగా వచ్చిన ఫ్యాక్షన్ రాజకీయాలను పెంచిపోషిం చేందుకు నంద్యాల ఉపఎన్నికను వేదికగా చేసుకున్నారని రమణ ఆరోపించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా, గోదావరిపై కంతనాపల్లి, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేస్తామంటూ ఉద్యమ సమయంలో కేటీఆర్ ప్రకటించారని రమణ గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి పెట్టకుండా పునర్జీవం పేరిట ఎస్ఆర్ఎస్పి ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు ఖర్చు పెట్టడం పాత గోడలకు కొత్తరంగు వేసినట్లుగా కేసీఆర్ వ్యవహారశైలి ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

సామాజిక సమీక'రణం'

- కులాల ఓట్లపై పార్టీల కన్ను
- వ్యూహాత్మకంగా నేతల గాలం
- ప్రభావం చూపనున్న ముస్లిం, బలిజ, వైశ్యులు, మాలల ఓట్లు



కర్నూలు, కెఎన్ఎస్ బ్యూరో : నంద్యాల ఉప ఎన్నికల్లో సామాజిక కులాల ఓటు బ్యాంక్ కీలకంగా మారనున్నాయి. వీరి ఓట్లలో ఏ పార్టీ అయితే వీరి ఓటు బ్యాంకును కొల్లగొడుతుందో ఆ పార్టీదే విజయం ఖాయంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కులాలు, మతాల వారీగా ఓట్లను అంచనాలు వేసుకుం టున్నారు. ఎవరి ఓట్లు ఎవరికి పడతాయో ముందస్తుగా ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారు. 2014 పోలింగ్ అయిన ఓట్లను దృష్టిలో ఉంచుకొని అంచనాలు రూపొందిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా గత ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు నమోద య్యాయన్న వివరాలతో ముందస్తు ప్రణాళికల రూపొందిస్తున్నారు. తమకు నమోదైన ఓటింగ్ శాతాన్ని కాపాడుకుంటూనే, ప్రత్యర్థి పార్టీకి నమోదైన ఓటింగ్‌ను దెబ్బకొటేందుకు అనుసరించాల్సిన వ్యూహన్ని అమలు చేసేందుకు సిద్ధం చేసుకుంటు న్నారు. నంద్యాల బరిలో 15 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధాన పోటీ టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిల మధ్యే ఉంది. ఇద్దరు కూడా సమజ్జీవులు కావడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో వీరి విజయానికి సామాజిక కులాల ఓట్లు కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. నంద్యాల నియోజకవర్గంలో 2,18,858 ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 1,07,778 మంది ఉండగా, మహిళలు 1,10,18 మహిళలు ఉన్నారు. నియోజక వర్గంలో 238 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అదనంగా మరో 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టణ కేంద్రాల్లో 1400 మంది జనాభా ఉన్న ప్రాంతంలో ఒక పోలింగ్ కేంద్రం, గ్రామీణ ప్రాంతంలో 1200 మంది జనాభా ఉన్న ప్రాంతంలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. నంద్యాల నియోజకవర్గంలో కులాల వారిగా పరిశీలిస్తే బ్రాహ్మణులు 1800, బలిజలు 41000, ముస్లిం మైనార్టీలు 52000, బోయవాల్మికులు 10500, రజకు లు 4500, ఈడిగలు 3100, వైశ్యులు 25000, యాద వులు 7000, ఎస్‌సి మాలలు 21000, ఎస్‌సి మాదిగలు 7500, ఎస్‌టిలు 2700, కమ్మలు 4300, కుమ్మ రులు2300, ఇతరులు 15000 వేల మంది ఉండ వచ్చనని అంచన. ఈ కులాలల్లో ముస్లింలు, బలిజలు, వైశ్యులు, మాలలు కలిపి సుమారు 140000 మంది ఓటర్లు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ ఓటర్లే ఈ ఎన్నికలలో కీలకంగా మారన్నా యి. ఈ ఓట్లలో ఎవరు ఎక్కువ శాతం ఎవరికి నమోదైతే వారిదే విజయం తధ్యంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో వీరి ఓట్లను సాధించేందుకు అనేక రకరకాల హమీలను ఇస్తున్నాయి. ముస్లింలను దృష్టిలో ఉంచుకొని టీడీపీ ముందస్తుగానే ముస్లింలోని ప్రధాన నాయకులకు పదవు లును కేటాయించింది. మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు ఎన్ఎండి ఫరూక్‌కు ఎమ్మెల్సీ పదవిని, మరో ముస్లిం నేత నౌమాన్‌కు ఉర్దూ ఆకాడమి చైర్మన్ పదవిని కేటాయించింది. ఇక వైసీపీ నేత జగన్ ముస్లింలకు అనేక హమీలను ఇచ్చారు. 4 శాతం ఇచ్చిన ఘనత తమ తండ్రికే దక్కుతుందని, ఈ సారి నంద్యాల్లో అవకాశం కల్పిస్తే ముస్లింలకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హమీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ముస్లిం మైనార్టీ ఓటు బ్యాంకు రెండు పార్టీలకు కీలకంగా మారింది.ఇదిలా ఉండగా ముస్లింలలో కొందరు కాంగ్రెస్ వైపు ఉండే అవకాశాలు ఉన్నాయి. అనాదిగా కాంగ్రెస్‌కు ముస్లింఓటు బ్యాంక్ ఉండడంతో ఈ సారి కొంత వరకైనా తమకు అనుకూలిస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకే రాజకీయ వ్యూహంలో భాగంగా కాంగ్రెస్ ముస్లిం అభ్యర్థి అబ్దుల్ ఖాదర్‌కు కేటాయించింది. ఈ నేపథ్యంలో ముస్లిం సామాజిక ఓటు ఎవరి వైపు మద్దతు ఉంటుందో చూడాల్సి ఉంది. బలిజ కులస్థుల ఓటింగ్ కూడా ప్రబావం చూపే అవకాశాలు ఉన్నాయి.

మోసాలకు కేరాఫ్ చంద్రబాబు

- వైసీపీ ఎమ్మెల్యే రోజా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుట్రలు కుతంత్రాలు మోసాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని వైకాపా ఎమ్మెల్యే రోజా అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రోజా మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ల పాలనలో రాయలసీమను చంద్రబాబు ఏవిధంగా మోసం చేశారో ఇపుడు మళ్లీ ఏవిధంగా మోసం చేస్తున్నారో నంద్యాల ప్రజలు గమినిస్తున్నారన్నారు. రాయలసీమకు అంతో ఇంతో నీరొస్తుందంటే అది వైఎస్ కృషి వల్లనే అన్నారు. రాష్ట్రంలో 1240 మంది రైతుల ఆత్మహత్యలకు కారకుడు చంద్రబాబే అన్నారు. రోజా చనిపోయిందంటు కొందరు వేస్ట్ వెధవలు శ్రద్ధాంజలి పెడుతున్నారని , ఇలాంటి వారు అసలు మనుషులేనా అని రోజా ఆగ్రహం వెలిబుచ్చారు.

కుందూ-పెన్నా లింక్ కెనాల్ పనులపై యథాతథస్థితి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కడప జిల్లాలోని కుందూ - పెన్నా లింక్ కెనాల్ (కేపీఎల్ సీ) పనులపై యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసా గించాలని ఏపీ రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యా జ్యంలో ప్రతివాదులందరికీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రమా ణ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ,రామలింగేశ్వరరావు ఈ మేరకు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కేపీఎల్‌సీ పనులను సవాలు చేస్తూ ..కడప జిల్లా, రాజు పాలెం మండలం పార్లపాడు గ్రామానికి చెందిన పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రొద్దుటూరు పట్టణానికి నీరందించే నిమిత్తం 2007లో ఈ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. అప్పటి నుంచి కాంట్రాక్టరు మూడు సార్లు ఈ కాలువ అసైన్ మెంట్ ను మార్చారన్నారు. సాంకేతిక నిపుణుల బృందం ఆ పనులపై అభ్యంతరం చెప్పిందన్నారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సైతం ఇది నిరుపయోగమైన ప్రాజెక్టు గా తేల్చారు. భూసేకరణ అధికారులు అన్ని ప్రతిపాదనలు ఉపయోగించుకున్నామని చెప్పారన్నారు. తాజాగా ఈ ప్రాజెక్టు వ్యవహారాలు తెరపైకి వచ్చిందన్నారు. గుత్తేదారు ప్రయోజనం కోసం వందల మంది రైతులు భూములను కోల్పోవల్సి వస్తుందన్నారు. ఆ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కేపీఎల్ సీ పనులపై యథాతథ స్థితి కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.,

గోబ్యాక్ కోదండరాం..

- బస్వాపూర్ వద్ద అడ్డుకున్న రైతులు, తెరాస శ్రేణులు
- ప్రజాస్వామ్యం ఖూనీ అయిందన్న కోదండరాం
- భారీగా పోలీసుల మోహరింపు





భిక్కనూరు, కెఎన్ఎన్ : అమరవీరుల స్ఫూర్తి యాత్రను చేపట్టిన జేఏసీ ఛైర్మన్ కోదండరాం గో బ్యాక్ అంటూ రైతులు, తెరాస శ్రేణులు నినాదాలు చేయడంతో బస్వాపూర్‌వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకుంది. పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి కోదండరాం బస్సు యాత్రను అక్కడి నుండి ముందుకు పంపించారు. శుక్రవారం రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ కోదండరాం అమరవీరుల స్ఫూర్తి యాత్రను చేపట్టారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లా సరిహద్దు అయిన బస్వాపూర్ గ్రామం వద్దకు జేఏసీ ఛైర్మన్‌తో పాటు విద్యార్థి నాయకులు పలు వాహనాల్లో చేరుకున్నారు. అప్పటికే రోడ్డుపైకి మండలంలో ఉన్న రైతులు, తెరాస శ్రేణులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. జిల్లాలోకి జేఏసీ ఛైర్మన్ కోదండరాంను రానివ్వకుండా అడ్డుకుంటామంటూ వారు రోడ్డుపై బైఠాయించారు. అక్కడికి చేరుకున్న కోదండరాంకు కొందరు కాంగ్రెస్ నాయకులు, విద్యార్థి నాయకులు పూలమాలలు వేశారు. అప్పటికే రోడ్డుపై ఉన్న తెరాస నాయకులు, రైతులు కోదండరాంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గో బ్యాక్, గో బ్యాక్ కోదండరాం అంటూ నినాదాలు చేస్తూ వారి వాహనాలకు అడ్డువచ్చారు. భిక్కనూరు, కామారెడ్డి సిఐలు కోటేశ్వర్‌రావు, శ్రీధర్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. యాత్రను అడ్డుకోవద్దని వారికి సూచించినప్పటికి వినకుండా కోదండరాంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆగ్రహించిన కొందరు విద్యార్థి జేఏసీ నాయకులు, రైతులు, తెరాస శ్రేణులపై దాడికి దిగడంతో వారు ఎదురుదాడికి దిగారు. ఇరువురు మధ్య కొద్దిసేపు తోపులాట జరుగడంతో ఇరువురిని పోలీసులు చెదరగొట్టారు. అనంతరం రోప్ సహయంతో కోదండరాంను పోలీసులు బస్వాపూర్ నుండి పంపించగా భిక్కనూరు చౌరస్తా వద్దకు అమరవీరుల స్ఫూర్తి యాత్ర చేరుకుంది. అనంతరం బస్వాపూర్ వద్ద ఉన్న జేఏసీ కటౌట్‌లను రైతులు తొలగించారు. భిక్కనూరు వద్ద ప్రజలనుద్దేశించి కోదండరాం మాట్లాడగా పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కోదండరాంను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ కోదండరామ్

తెలంగాణ అమరవీరుల సాక్షిగా సీఎం కేసీఆర్ పతనం కావడం ఖాయమని రాష్ట్రరాజకీయ జేఏసీ ఛైర్మన్ కోదండరాం చెప్పారు. శుక్రవారం ఆయన కామారెడ్డి జిల్లాలో తలపెట్టిన అమరవీరుల స్ఫూర్తి యాత్రను తెరాస నాయకులు, పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం దారుణమని ధ్వజమెత్తారు. భిక్కనూరు పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని వారి కుటుం బాలకు తగిన న్యాయం జరుగలేదని చెప్పారు. వాటిని ప్రజలకు వివరించేందుకు స్ఫూర్తి యాత్రను చేపడితే ప్రభుత్వం అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇసుక మాఫియాగా మారి అక్రమార్జనకు పాల్పడుతున్నారని, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే రవిందర్‌రెడ్డి భూ కబ్జాలకు, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారి కోట్లాది రుపాయలు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో తెరాసకు ప్రజలే తగిన బుద్ది చెబుతారని అన్నారు. తాము శాంతియుతంగా స్ఫూర్తి యాత్రను కొనసా గిస్తున్నామని ఎక్కడ కూడా గొడవలు సృష్టించడం లేదని చెప్పారు. స్వరాష్ట్రంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ యాత్ర ద్వారా వివరించేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.తమ రాజకీయ జేఏసీ ఏ పార్టీకి తొత్తుగా పని చేయడం లేదని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు పోతున్నామని చెప్పారు.తెలంగాణ ఉద్యమంలో కామారెడ్డి జిల్లా అప్పట్లో ప్రథమ స్థానంలో ఉందన్నారు. తాను అప్పుడు వచ్చినప్పుడు బ్రహ్మరథం పట్టారని, ఇప్పుడు కూడా అదే స్థాయిలో బ్రహ్మరథం పడుతుంటే దానిని అధికార పార్టీ జీర్ణించుకోలేక తమ యాత్రను అడ్డుకున్నారని ఆరోపించారు. అడ్డంకులు ఎన్ని అయిన తెలంగాణ రాష్ట్రంలో అమరవీరుల కుటుంబాలకు, విద్యార్థులకు, రైతులకు అన్యాయాలను వివరి స్తామని చెప్పారు. పోలీసులు సైతం ప్రభుత్వానికి తొత్తుగా వారి నిర్బంధించడం సమం జసం కాదన్నారు. సమా వేశంలో జిల్లా జేఏసీ ఛైర్మన్ గోపాల్‌శర్మ, కామారెడ్డి జేఏసీ కన్వీనరు జగన్నాథం, తెదేపా జిల్లా అధ్యక్షులు సుభాష్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నల్లవెల్లి అశోక్, సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఎడ్లరాజిరెడ్డి, జేఏసీ నాయకులు ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి విఘాతం : తమ్మినేని

టీజేఏసీ ఛైర్మన్ కోదండరామ్ నిర్వహిస్తున్న తెలంగాణ అమరుల స్ఫూర్తియాత్రను ప్రభుత్వం అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విఘాతమని ఆయన హెచ్చరించారు.

పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్

• అపోహలు సృష్టించినవారే భంగపడ్డారు • అభివృద్ధిలో దూసుకుపోతున్నాం

• పారిశ్రామిక ప్రగతి మా ధ్యేయం • అంతర్జాతీయ ఖ్యాతి గడించేలా

హైదరాబాద్‌లో గ్లోబల్ సమావేశాలు: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రానున్న ఎనిమిదేళ్లలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడంతో సఫలీకృతులమవుతాం, ఇందుకనువైన అనేక ప్రణాళికలు, లక్ష్యాలతో ముందుకు వెళుతున్నామని ఐటీ, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వచ్చే ఎనిమిదేళ్లు తమకు కీలకమని చెప్పారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ పతంలో నిలిపేలా ప్రణాళికాబద్ధమైన కృషిని ఆరంభించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో నాలుగు ప్రధానమైన ఎక్స్‌ప్రెస్ ఫ్లై ఓవర్లు నిర్మాణం చేపట్టనున్నామని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో నిర్మాణ రంగానికి అద్భుతమైన అవకాశాలు, ప్రకాశవంతమైన పరిస్థితులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్ మాసంనుంచి 2018 మార్చి వరకు మూడు ప్రధానమైన గ్లోబల్ ఈవెంట్లకు హైదరాబాద్ వేదికకానుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ సమ్మిట్, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్, వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌లను నిర్వహించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. తెలంగాణ వస్తే ఐటీకి గడ్డుకా లమని, హైదరాబాద్‌లో ఐటీ మూతపడుతుందని భయాందోళనలకు గురిచేశారని...కానీ నేడు దేశంలోనే ఐటీలో హైదరాబాద్ పేరు మార్మోగుతోందన్నారు. ఐటీ అంటేనే హైదరాబాద్ అనే పేరు సంపాదించుకుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంపై విస్తృతంగా చర్చ జరిగిందని, తెలంగాణ వస్తే అభివృద్ధి కుంటుపడుతుందని అపోహలు సృష్టించారని, వారంతా భంగపడేలా అభివృద్ధిలో అగ్రస్థానంలో దూసుకుపోతున్నామని గుర్తు చేశారు. తెలంగాణ వస్తే కరెంటు ఉండదని, చీకటి వస్తుందని చెప్పిన కిరణ్‌కుమార్‌రెడ్డి నిరంతర కోతలు లేని కరెంటును చూస్తున్నారని చెప్పారు. మరోవైప్ రియల్ ఎస్టేట్ పడిపోతుందని, హైదరా బాద్‌కు పెట్టుబడులు ఆగిపోతాయని అప్పటి నేతలు అపోహలు సృష్టించారని, వీట న్నిం టినీ పటాపంచలు చేస్తూ కేసీఆర్ సారధ్యంలో మూడేళ్ల లోనే గణనీ యమైన పురోగతి సాధించా మని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు పెట్టుబడుల వరద పారుతోందని, పారిశ్రామికంగా అనేక దిగ్గజాలు హైదరాబాద్‌వైపు చూస్తున్నాయని ఆయన వెల్లడిం చారు.



రాష్ట్ర విభజనకు ముందున్న అపోహలన్నీ తొలగి తెలంగాణకు వాస్తవాలు కళ్లముందు సాక్షాత్కరిస్తున్నాయన్నారు. మనకంటే ముందు ఏర్పడిన రాష్ట్రాలు ఇప్పటికీ కుదురుకోలేదని, కానీ దేశమంతా అబ్బురపడేలా సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. ఆదాయం వృద్ధిరేటు సహా 12 రంగాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉంది...హైదరాబాద్‌లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి నివారించామని, హైదరాబాద్‌లో అన్ని ఇబ్బందులూ తొలగిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. క్రైం రేటును గణనీయంగా తగ్గించామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే వేలాది కోట్ల పెట్టుబడితో మౌలిక వసతుల కల్పన, సుందరీకరణ పనులు జోరుగా సాగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. 'మేం అధికారంలోకి రాగానే రాష్ట్రానికి సరిపడా విద్యుత్, తాగునీటి సమస్య పరిష్కరించాం. కీలకమైన విషయాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించి పౌరులకు మేలు చేయడంపై దృష్టి సారించాం. నగరంలోని ముఖ్యమైన రహదారుల్లో 290 కిలోమీటర్ల పొడవైన నాలుగు ఫ్లైఓవర్లు నిర్మించేందుకు కసరత్తు చేశాం. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ నగరంగా అభివృద్ధి చేయడానికి రెండేళ్ల గడువును లక్ష్యంగా పెట్టుకున్నాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. నిర్మాణరంగానికి అనువుగానే ఇప్పటివరకు వ్యవహరించామని తెలిపారు. పట్టణాల్లో కఠిన నిబంధనలు అమలు చేయలేదని, అడ్డంకులను తొలగిస్తూ ఉదారంగా ఉన్నామని చెప్పారు. బిల్డర్ల స్వీయ నియంత్రణతో అభివృద్ధి నిర్ధారించేలా ఉండాలన్నారు. హైదరాబాద్‌కు సమీపంలోని పంచాయతీలను త్వరలోనే జీహెచ్ఎంసీలో విలీనం చేస్తాం... నిర్మాణరంగంలోని అవకతవకలు, నిబంధనలకు విరుద్ధంగా సాగిన కట్టడాలపై జరిమానాలు, కఠిన చర్యలు ఉంటాయని గుర్తుంచుకోవాలని బిల్డర్స్ అసోసియేషన్ నేతలకు సూచించారు. ఇటువంటి రుసుములను నివారించేలా, ప్రభుత్వానికి సహాయకారిగా నిబంధనలకు కట్టుబడి తమ ప్రాజెక్టులను కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్టాంపు డ్యూటీని 2 శాతానికి పరిమితం చేయాలని, 10శాతం తనఖా నిబంధననుండి మినహాయింపు నివ్వాలని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది.

ఫెడరేషన్ మూడవ వార్షిక సమావేశంలో భాగంగా టీబీఎఫ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. లే అవుట్‌ల జారీకి 10శాతం తనఖా నిబంధన ఎత్తివేయాలని, రేరా బలోపేతం అయిన నేపథ్యంలో బిల్డర్లకు బరిన్ని అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ నోట్ల రద్దు, జీఎస్టీ రియల్ ఎస్టేట్ చట్టం వంటివి రియల్ రంగంతోపాటు నిర్మాణరంగంపై పెను ప్రభావం చూపుతోందన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, వాణిజ్య పన్నుల ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్, మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ సభ్యుల వేతనాలు భారీగా పెరిగాయ్!

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుల వేతనాలు భారీగా పెరిగాయి. ఏకంగా 300 శాతం పెరిగాయి. చైర్మన్ వేతనం రూ. 80,000 ఉండగా ఇప్పుడు రూ. 2.25 లక్షలకు పెరిగింది. సభ్యుల వేతనాలను రూ. 79,000 నుంచి రూ. 2.24 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన వేతనాలను 2016 జనవరి నుంచి వర్తింప చేశారు. 2016 జనవరి నుంచి బకాయిలు ఒక్కో సభ్యునికి రూ. 27,55,000 చెల్లించనున్నారు.

ఎంబీఏలో 99 శాతం సీట్ల భర్తీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎంబిఏలో 99 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 116 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. 295 కాలేజీల్లో 22,499 సీట్లు ఉండగా వాటిలో 22,383 సీట్లు భర్తీ అయ్యాయి. సీటు పొందిన వారు 19లోపు ఫీజు చెల్లించి 21 వరకు ఆయా కాలేజీల్లో చేరాలని అడ్మిషన్ల కన్వీనర్ వాణి ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ కాగా ప్రైవేటు కాలేజీల్లో 99.45 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఎంసీఏ కాలేజీల్లో 2077 సీట్లు ఉండగా వాటిలో 2020 సీట్లు భర్తీ అయ్యాయి.

12 నుంచి రెండో విడత మెడికల్ కౌన్సెలింగ్


హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో చేరడం కోసం కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించిన మెరిట్ లిస్టు విద్యార్థులు రెండో విడత కౌన్సిలింగ్‌లో 12 నుంచి వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించినట్టు యూనివర్సిటీ రిజిస్ట్రార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఇచ్చారు.

హజ్‌యాత్రకు ఏర్పాట్లు పూర్తి: ఏకే ఖాన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ : హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఏకే ఖాన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 3,700 మంది వెళ్లుతున్నారని శనివారం హజ్‌యాత్ర కు వెళ్లుతున్నారని చెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 22 వరకు విడతల వారిగా హజ్‌యాత్రకు వెళ్లుతారని వివరించారు. హజ్‌యాత్రికుల కోసం హజ్ కమిటి మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ సూచించినట్లు చెప్పారు. హజ్‌యాత్రకు ప్రభుత్వం మూడు కోట్ల రూపాయలు ముందుగానే ప్రకటించామన్నారు. యాత్రికులు కూడా హజ్‌కమిటి సూచనలను పాటించాలన్నారు.

మెగా టెక్స్‌టైల్ పార్కుకు 16న సీఎం శంకుస్థాపన

డిప్యూటీ సీఎం కడియం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్కును ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి కే చంద్రశేఖ రరావు శంకుస్థాపన చేయనున్నట్లు డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం తనను కలిసిన విలేకరులతో కడియం శ్రీహరి మాట్లాడుతూ వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ, సంగెం మండలాల మధ్యలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. దాదాపు రూ.1150కోట్ల నిధులతో నిర్మాణం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పార్కులో రూ.11,500కోట్ల పెట్టుబడులు వస్తాయని ఇప్పటికే అంచనా వేశారని తెలిపారు. ఈ పార్కు ద్వారా 1.13లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనున్నదని తెలిపారు. వలస వెళ్లిన చేనేత కార్మికులు తిరిగి స్వరాష్ట్రానికి వచ్చేందుకు ఈ మెగాపార్కు దోహదపడుతుందని తెలిపారు. 2014 ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఈ హామీని నేరవేరుస్తున్నారని గుర్తు చేశారు. సీఎం శంకుస్థాపన చేసిన వెంటనే నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. పార్క్‌లో పెట్టుబడులు పెట్టే ఔత్సాహికులకు అత్యంత వేగంగా కల్పించి, వారి పనులు ప్రారంభించేందుకు వెసులుబాటు కల్పించేందుకు క ూడా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ పార్కుకు ఇప్పటికే 1190 ఎకరాల భూమి సేకరించడం జరిగిందన్నారు. దీని కోసం ముందుకు వచ్చిన రైతులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

హైదరాబాద్‌లో మరో దందా?

• హవాలాతో వైట్ మనీగా వేల కోట్లు


• ఈడీ విచారణలో నివ్వెరపోయే వాస్తవాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియా సృష్టించిన కలకలం మరవకముందే మరో దందా బయటపడింది. ఏటా వేల కోట్ల రూపాయలను హవాలా మార్గంలో తరలిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. నకిలీ పత్రాలు సృష్టించి విదేశాలకు తరలిస్తున్న డబ్బును తిరిగి పెట్టుబడుల రూపంలో ఇండియాకు మళ్లిస్తున్నారు. చందానగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ ప్రారంభించిన ఈడీ అధికారులకు నివ్వెరపోయే విషయాలు తెలియవచ్చాయి. ఏటా 1000 కోట్ల రూపాయలు విదేశాలకు హవాలా రూపంలో తరలిపోతు న్నాయని పోలీసులు గుర్తించారు. తాజా విచారణలో మహేష్ ఖత్రీ అనే వ్యాపారి రూ.31 కోట్లు విదేశాలకు తరలించినట్లు గుర్తించారు. స్నేహితులు, ఇతరుల పేర్ల మీద నకిలీ పత్రాలు తయారు చేసి ఆ డబ్బును విదేశాలకు తరలిస్తున్నట్లు తేల్చారు. ఇలా ఇప్పటివరకు సుమారు రూ.150 కోట్లు విదేశాలకు హవాలా రూపంలో తరలించినట్లు సమాచారం. ఈ డబ్బుతో విదేశాల్లో



పరిశ్రమలు స్థాపిస్తున్నట్లు బోగస్ పత్రాలు సృష్టించినట్లు గుర్తించారు. తిరిగి ఆ ఖాతాల్లోని డబ్బును పెట్టుబడుల రూపంలో ఇండియాకు మళ్లించి వైట్‌మనీగా మారుస్తున్నట్లు నిర్ధారించారు. బ్లాక్ మనీనీ వైట్ మనీగా మారుస్తున్న ఈ దందా వెనుక ఇంకా ఎవరి హస్తముందనేది తెలియరావాలిస ఉంది. ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న మహేష్ ఖత్రీకి స్టీల్‌వ్యాపారి వినోద్ ఓయూ సహకరించినట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి చెక్కులు తీసుకుని నగదును ఆనంద్‌కుమార్ అనే హవాలా వ్యాపారి సమకూర్చేవాడని ఈడీ అధికారులు చెబుతున్నారు.

ముత్తూట్ దోపిడీ కేసు.. ప్రధాన నిందితుడి అరెస్ట్



హైదరాబాద్, కెఎన్ఎన్ : మైలార్‌దేవ్‌పల్లి ముత్తూట్ ఫైనాన్స్ దోపిడీ యత్నం కేసులో ప్రధాన నిందితుడి మహ్మద్ షరీఫ్‌ను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సైబరాబాద్ కమిషనర్ సందీప్ శాండిల్యా వివరాలు వెల్లడించారు. గత నెల 4వ తేదీన ముత్తూట్‌ఫైనాన్స్ కార్యాలయంలో దోపిడీకి యత్నించిన 8 మంది నిందితుల్లో ఐదుగురిని పట్టుకోగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. దీంట్లో ప్రధాన నిందితుడి షరీఫ్‌ను మహరాష్ట్రలోని ఔరంగబాద్‌లో అదుపులోకి తీసుకోగా ఉత్తర్‌ప్రదేశ్ చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. గతంలో షరీఫ్‌పై పలు దోపిడీ కేసులు ఉన్నాయని, మైలార్‌దేవ్ ముత్తూట్ దోపిడీ యత్నంలో ప్రధాన పాత్ర పోషించాడని పోలీసులు తెలిపారు. అలాగే ముత్తూట్‌ఫైనాన్స్ చోరీ కోసం మూడు లక్షల రూపాయలు షరీఫ్ ఖర్చు పెట్టాడు. అతని వద్ద నుంచి 2 అత్యాధునిక 7ఎంఎం పిస్టల్స్, 4 సెల్ ఫోన్లు,15 రౌండ్ల బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు.

'నవంబర్‌లో బాలల చలన చిత్రోత్సవాలు'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ ఏడాది నవంబర్‌లో హైదరాబాద్‌లో బాలల చలన చిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు సమాచార, ప్రజా సంబంధాల కమిషనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. నవంబర్ 8వ తేదీ నుంచి 14 వరకూ బాలల చలన చిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని కోసం 12 సినిమా థియేటర్లను సిద్ధం చేశామని పేర్కొన్నారు. దీని కోసం బాలభవన్‌లో సినిమా చిత్రీకరణపై వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు వచ్చే దేశ, విదేశీ ప్రతినిధుల వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

ఢిల్లీలో పళని, పన్నీర్

ప్రధాని మోడీతో సీఎం పళనిస్వామి భేటీ



న్యూఢిల్లీ: తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో శుక్రవారంనాడు సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య దాదాప ు అర్ధగంటపాటు చర్చలు కొనసాగాయి. ఏఐఏడీఎంకే పార్టీలోని ప్రత్యర్థి వర్గాలన్నీ ఈ వారాంతానికల్లా ఏకమవుతున్నట్లు సీఎం పళని ప్రధానికి వివరించినట్లు చెబుతున్నారు. అయితే, మాజీ సీఎం, జయలలిత విధేయుడు పన్నీరు సెల్వం కూడా ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి వచ్చినట్లు చెబుతున్నప్పటికీ, ఈ ఇద్దరు నేతలూ పార్టీ సమన్వయం కోసం చర్యలు చేపట్టనున్నట్లు కనిపిస్తోంది.తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం వర్గం, ప్రస్తుత సీఎం పళనిస్వామి వర్గాలు త్వరలోనే విలీనానికి సిద్ధమైనట్లు తాజా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై చర్చించేందుకే పళనిస్వామి, పన్నీర్ సెల్వం ఢిల్లీకి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో విలీనానికి మార్గం సుగమం చేసేలా ఇప్పటికే ఏఐఏడీఎంకే నేతలు ఆ పార్టీ డిప్యూటీ చీఫ్, శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్‌ను పదవి నుంచి గెంటేసిన సంగతి విదితమే. దినకరన్ నియామకం అక్రమంగా జరిగిందనీ, ఆయనకు కట్టబెట్టిన పదవి చెల్లదనీ, ఆమోదయోగ్యం కాదని ఏఐఏడీఎంకే ఓ తీర్మానం కూడా ఆమోదించింది. ఆఫీస్ బేరర్ల నియామకం సహా పార్టీ విషయంలో దినకరన్ తీసుకున్న నిర్ణయాలన్నీ రద్దు చేసింది. ఇదిలాఉండగా, ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రధాని మోడీతో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ టీటీవీ దినకరన్ అన్నాడీఎంకే విచ్చిన్నానికి కారణమయ్యారంటూ పరోక్షంగా దుయ్యబట్టారు. 420 పదం ఆయనకు సరిగ్గా సరిపోతుందని ఎద్దేవా చేశారు. అయితే, తమిళనాడు అసెంబ్లీలో మరోసారి అవిశ్వాస తీర్మానం పెడతామని డీఎంకే నేత స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై కూడా సీఎం పళని స్పందిస్తూ, అదే కనుక జరిగితే అసెంబ్లీలో మళ్లీ తామే నెగ్గుతామని ధీమా వ్యక్తం చేశారు. నీట్ పరీక్షపై కూడా తాను ప్రధాని మోడీతో చర్చించినట్లు పేర్కొన్నారు. నీట్ నుంచి తమిళనాడు రాష్ట్రానికి మినహాయింపు కల్పించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు.

సంక్షేమ భవనాల నిర్మాణాలు పూర్తిచేయాలి

ఇంజినీర్లకు ప్రభుత్వ కార్యదర్శి మహేశ్‌దత్ ఆదేశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గిరిజన సంక్షేమ శాఖలోని ఇంజినీరింగ్ శాఖపై ప్రభుత్వ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా సమీక్ష నిర్వహించారు. గిరిజన శాఖలోని అభివృద్ధి పనులు, భవన నిర్మాలకు సంబంధించిన వివిధ పనుల పురోగతిలపై ఎస్.ఈ, ఈ.ఈలను అడిగి తెలుసుకున్నారు. గురుకులాల భవనాలను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 51 గురుకులాల భవనాలు, 52 పోస్టు మెట్రిక్ హాస్టల్స్, 26 గిరిజన భవనాలు, 4 యూత్ ట్రైనింగ్ సెంటర్స్, 10 మహిళా హాస్టల్స్‌తో పాటు గిరిజన ప్రాంతాల్లోని రోడ్ల నిర్మాణాలపై తెలుసుకున్నారు. ఈ పనులన్ని వచ్చే మార్చి వరకు పూర్తి చేయాలని సూచించారు. రోడ్ల పనులను డిసెంబర్ వరకు పూర్తి కావాలని ఆదేశించారు.

స్విడ్జర్లాండ్ బృందంతో సీఆర్డీఏ అధికారుల సమావేశం




అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌తో ఆర్థిక సంబంధాలు మెరగు పర్చుకునేందుకు అక్కడి పరిస్థితులను అధ్యయనానికి స్విడ్జర్లాండ్ ఆర్థిక మంత్రి శాఖ డిప్యూటీ మినిస్టర్లు మార్కన్ ట్రేలర్, బ్రూనో సాటోలతో కూడిన ప్రతినిధి బృందం శుక్రవారం అమరావతి రాజధాని నగరంతోపాటు ఏపీసీఆర్‌డీఏ కార్యాలయాన్ని సందర్శించింది. అమరావతి అభివృద్ధి ప్రణాళికను, ల్యాండ్ పూలింగ్ విధానాన్ని, డిసెంబర్2018 నాటికి పూర్తిచేయనున్న తొలిదశ అభివృద్ధి వివరాలను ఏపీసీఆర్‌డీఏ స్పెషల్ కమిషనర్ వి. రామమనోహర రావు వారికి వివరించారు. ల్యాండ్ పూలింగ్ విధానాన్ని ఆసక్తిగా అడిగి తెలుసుకున్న స్విడ్జర్లాండ్ బృదం పూలింగ్‌లో భాగస్వామ్య అభివృద్ధి విధానాన్ని, భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న యూన్యిటీ, పెన్షన్లు, నైపుణ్య అభివృద్ధి, రైతులే ముందు వంటి పథకాలను బృందం సభ్యుల ప్రశంసించారు. అనేక దేశాల్లో భూసేకరణ విధానాల్లో రైతుల సంక్షేమానికి ఇంతగా ప్రాధాన్యత ఇచ్చిన మరే పథకం తమ దృష్టికి రాలేదని బృంద సభ్యులు అభిప్రాయపడ్డారు. అమరావతి అభివృద్ధి విస్తృత ప్రణాళిక పట్ల ప్రతినిధి బృదం హర్షం వ్యక్తంచేస్తూ, సిడ్జర్లాండ్‌లోని జ్యూరిక్ ప్రాంతంతో పోలిస్తే అమరావతి అభివృద్ధి ప్రణాళిక ఎన్నో రెట్లు పెద్దదని గ్రహించారు. సిడ్జర్లాండ్ దేశ జీవన ప్రమాణాలు వివరిస్తూ బహిరంగ ప్రదేశాల్లో కళాయిలలో లభించే నీరు సైతం తాగేందుకు సురక్షితమైన స్థాయిలో నీరు శుద్ధి చేసే ప్రక్రియలను వారు వివరించారు. అదేవిధంగా వ్యర్ధ పదార్థాల నుంచి విద్యుత్ తయారీ, వ్యర్ధ జలాల శుద్ధి, స్వచ్ఛ నగరాల నిర్వహన, స్మార్ట్ టెక్నాలజీలతో మౌలిక సదుపాయాల నిర్వహణ వంటి రంగాల్లో తమ దేశానికున్న అవసరమైన అనుభవాన్ని సాంకేతికతను, అందజేస్తామని తెలిపారు. అదే విధంగా రవాణా వ్యవస్థకు సంబంధించి సహాయ సహకారాలందిస్తామని చెప్పి, అమరావతి మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నైబర్ హుడ్ విధానంలో అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఈసమావేశంలో స్విడ్జర్లాండ్ దేశ సహకారం, రాష్ట్ర అభివృద్ధి, అమరావతి అభివృద్ధిపై మరింత అధ్యయనానికి ఉన్న అవసరాన్ని గుర్తించారు. ఈసమావేశంలో సీఆర్‌డీఏ ఎకనామిక్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ వై.నాగిరెడ్డి, స్ట్రాటజీ డైరెక్టర్ జేఎస్ఆర్‌కె శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కైజాల యాప్‌లో 'ముఖ్యమంత్రి' ముఖాముఖి

• కనెక్ట్ ఏపీ సీఎం క్విజ్ పోటీ • విజేతలకు ఆగస్టు 15న బహుమతుల ప్రదానం




అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ముఖ్యమంత్రితో ప్రజలు నేరుగా సంభాషించేందుకు వీలుగా కైజాలయాప్ సరికొత్త విధానాన్ని అమలు చేయనుంది. రాష్ట్రంలోని ప్రజల సమస్యలు నేరుగా ముఖ్యమంత్రి కి చెప్పడానికి ఒక పోటీ నిర్వహించనుంది. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ క్విజ్ పోటీ నిర్వహించి, అదేరోజు రాత్రి 8 గంటలకు విజేతల వివరాలను ప్రకటించనున్నారు. ఈమేరకు రియల్ టైమ్ గవర్నెన్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి అహ్మ ద్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రజా సమస్యల పరిష్కారానికి 'కైజాలయాప్' ద్వారా కృషి చేస్తున్నామని ఆర్టీజీ సీఈవో వెల్లడించారు. ముఖ్యమంత్రితో నేరుగా మాట్లాడేందుకు వీలుగా స్మార్ట్‌ఫోన్, అండ్రాయిడ్ ఫోన్ల ద్వారా కైలాజ్ యాప్‌ను ముందుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. డౌన్ చేసుకున్న ఈ యాప్ ద్వారా ఆదివారం ఉదయం 10 గంటలకు ఎపిసిఎం కనెక్ట్ అయ్యి ఈ పోటీలో పాల్గొ నవచ్చునని అహ్మద్ బాబు వెల్లడించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తా రు. ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తిరుపతిలోజరిగే కార్యక్రమంలో విజేత లకు బహుమతులు అందజేస్తారు. 13వ తేదీ ఉద యం 10 గంటలకు ఆన్‌లైన్ ద్వారా క్విజ్‌లో



పాల్గొని యాప్‌లో అడిగే ప్రశ్నలకు జవాబులు ఇచ్చే వారి నుండి ముగ్గురు లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు. విజేతల వివరాలను అదేరోజు రాత్రి 8 గంటల కు తెలియజేస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 'ప్రజలే ముందు 1100' టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున చర్యలు చేపడుతు న్నామని అహ్మద్‌బాబు వెల్లడించారు. అలాగే ప్రజా సమస్య లు, అధికారుల పనితీరుపైనా నేరుగా 'ఎపి సిఎం కనెక్ట్' ద్వారా ముఖ్యమంత్రికి వెల్లడించే అవకాశం ఉం దన్నారు. ఈ కైజాలయాప్ ద్వారా రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరూ ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తేవడానికి వీలుంటుంది.

ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రశాంత్ కిషోర్ ప్రయత్నం

• అతని కదలికలపై నిఘా పెట్టాలి: వర్ల రామయ్య



అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీ ప్రభుత్వాన్ని కూల్చాలని ప్రశాంత్‌కిషోర్ ప్రయత్నం చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల రామయ్య విమర్శించారు. శనివారం టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన ప్రశాంత్ కిషోర్ తుపాకీలో కాల్చి పారేసిన తూటా లాంటివాడని, ఆవిషయం ఉత్తరప్రదేశ్ (యూపీ) ఎన్నికలతో అర్థమైందన్నారు. యూపీ ఎన్నికల్లో అఖిలేష్‌యాదవ్, రాహుల్ గాంధీల కూటమిని గెలిపిస్తానని చెప్పి కోట్ల రూపాయలు దండుకున్నారని, ఇప్పుడు అదేవిధంగా జగన్‌ని మోసం చేస్తున్నారన్నారు. ప్రశాంత్ కిషోర్ మీద అఖిలేష్ యాదవ్‌కు పీకల్లోతు కోపంతో రగిలిపోతున్నారని, ఉత్తర ప్రదేశ్‌లో అడుగు పెడితే అంతుచూస్తానని చెప్పి ప్రశాంత్ కిషోర్‌కు వార్నింగ్ ఇచ్చిన మాట నిజం కాదా అంటూ ప్రశ్నించారు. యూపీ ఎన్నికల సమయంలో ఆయన మీద 7 క్రిమినల్ కేసులు, సైబర్ కేసులు నమోదయ్యాయన్నారు. అత్యంత అవినీతుపరుడు, 11 చార్జిషీట్లు, 5ఈడీ చార్జిషీట్లతో ఏకేసులోనైనా జైలుకు వెళ్లక తప్పదని భావించిన జగన్ నిన్ను ఆశ్రయించి నీ రాజకీయ సలహాలతో అధికారంలోకి రావాలనుకుంటున్నారని విమర్శించారు.

సీఆర్‌డీఏ ఓపెన్ ఫోరంలో 24 దరఖాస్తులకు అనుమతి

అమరావతి, ఆంధ్రపభ: ఏపీసీఆర్‌డీఏ కార్యాల యంలో శుక్రవారం జరిగిన ఓపెన్ ఫోరంలో 24 దరఖాస్తులకు అనుమతి లభించిందని ఏపీసీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. భవనాలు, లేఅవుట్ల కు సంబంధించి మొత్తం 28 దరఖాస్తులు రాగా అందులో నాలిగిటికి అదనపు సమాచారం కోరటం జరిగిం దన్నారు. గతంలో అనుమతి కోసం దరఖాస్తు చేసిన 99 లేఅవుట్లలోని 500 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న 9 లేఅవుట్ల అనుమతికి తగిన వివరాలతో దరఖాస్తు చేసుకోగా ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన జీవో నిబంధనల మేరకు వాటిని ఆమోదించేందుకు పరిగణలోకి తీసుకోవటం జరిగిందన్నారు. ఈఓపెన్ కార్యక్రమంలో సీఆర్‌డీఏ డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ వి.రాముడు, సీనియర్ ప్లానింగ్ అధికారి జి. నాగేశ్వరావు, జాయింట్ డైరెక్టర్లు కె. నాగసుందరి, కె.ధనుంజయరెడ్డి, బాలాజీతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

2016 అత్యుష్ణ ఏడాది: ఎన్ఓఏఏ



వాషింగ్టన్: ఉష్ణోగ్రతలు లెక్కించడం ప్రారంభించిన తరువాత 2016 వ సంవత్సరంలో అధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఈ విషయాన్ని అమెరికా జాతీయ వాతావరణ యంత్రాంగం (ఎన్ఓఏఏ) గురువారం నిర్ధారించింది. ఆగస్టు 11, 2016న అధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు అమెరికా శాస్త్రవేత్తలు ధృవీకరించారు. గత 137 సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా వరుసగా మూడో సంవత్సరం అధిక ఉష్ణోగ్రత నమోదైందని యూఎస్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో 2016లో అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు యూఎస్ నేషనల్ అండ్ అట్మాస్ఫరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఏఏ) నివేదించింది. ఎల్‌నినో వలన పసిఫిక్ మహా సముద్రంలో నీరు వేడెక్కుతుంది. దీంతో పాటు చమురు, గ్యాస్, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలను దహనం చేయడం ద్వారా గ్రీన్ హౌస్ వాయువులు వాతావరణంలోకి విడుదలవుతాయి. దీని ప్రభావంగా వాతావరణంలో మార్పులు సంభవిస్తాయని యూఎస్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. గ్రీన్ హౌస్‌వాయువులలో కార్బన్‌డైఆక్సైడ్ పరిమాణం అత్యధిక స్థాయికి చేరుకుంది. 2016 లో సముద్రమట్టం రికార్డు స్థాయికి చేరింది. రెండు దశాబ్దాలుగా సముద్ర మట్టం సంవత్సరానికి సగటున 0.13 అంగుళాలు పెరిగింది. పశ్చిమ పసిఫిక్ ,హిందూ మహా సముద్రంలలో అత్యధికంగా సముద్ర మట్టం పెరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఆగస్టు , నవంబరులలో తక్కువ రోజువారి మరియు నెలవారి అంటార్కిటిక్ సముద్రపు మంచు విస్తీర్ణం 1981 నుంచి 2010 వరకు సగటున తగ్గుతూ వచ్చినట్లు ఎన్ఓఏఏ తెలిపింది.

రహదారుల పనుల్లో జాప్యం వద్దు

- భూసేకరణ వేగవంతం చేయండి
- ప్రజలఅభీష్టం మేరకే కూల్చివేతలు
- ఆర్ అండ్ బీ సమీక్షలో మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో నూతనంగా సాధించుకున్న జాతీయ రహదారుల పనుల్లో జాప్యంపై ఆర్ అండ్ బి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీలో అల సత్వంపై ఆయన అసహనం వ్యక్తం చేస్తూ అధికారులను మందలించారు. గతేడాది కేంద్రం అనుమతించి జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థకు బదలీ చేసిన ఐదు రాష్ట్ర రహదారుల పనుల్లో నిర్లక్ష్యంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వం ఆగ్రహంగా ఉన్నట్లు తెలిపారు. ఇటీవలే అస్వస్థకు గురై కోలుకున్న తర్వాత తొలిసారిగా ఆయన శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన అధికారుల సమీక్ష వేదికగా కీలక ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా తమ శాఖలో జరుగుతున్న పనుల పురోగతిలో అధికారుల నిర్లక్ష్యంపై అసహనంగా ఉన్నామని ఆయన వెల్లడించారు. 15 రోజుల్లోగా భూ సేకరణకు ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్ సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. గతేడాది కేంద్రం 5 జాతీయ రహదారుల అభివృద్ధికి గానూ రూ. 8వేల కోట్లతో అనుమతులను మంజూరీ చేసింది. అయితే ఆయా పనుల్లో గత ఆరు నెలలుగా కన్సల్టెంట్లు, అధికారులు సరైన పురోగతి సాధించలేకపోయారని, కొన్ని చోట్ల ఇంకా బైపాస్‌లను ఖరారు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డీపీఆర్‌ల తయారీ పేరుతో తాత్సారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా అంశాలు పొందుపర్చాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. కన్సల్టెంట్ల సంస్థలపై అజమాయిషీ మరింత పకడ్బంధీగా ఉండాలని, అధికారులు అలక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారాయన. భూ సేకరణ షెడ్యూల్ అందిన వెంటనే పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు. ఇందుకు క్రమ పద్దతిలో, కాల నియమావళి రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. భూ సేకరణలో ఏమరుపాటు వద్దని సూచించారు. త్వరలో ప్రధాన కార్యదర్శి స్థాయిలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సును ఏర్పాటు చేయాలని, భూ సేకరణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అన్ని రహదారి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ విధానపరంగా పట్టణాలకు బైపాస్‌లను వ్యతిరేకిస్తుందని, భూ సేకరణ వెసులుబాటు, వ్యయ పరిమితులకు లోబడి పాత రహదారినే ఎక్కువగా వినియోగించేలా నిర్దేశిత 5 జాతీయ రహదారులకు అలైన్‌మెంట్ రూపొందించారు. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో బైపాస్‌ల ఏర్పాటుకు జాతీయ రహదారుల సంస్థ బైపాస్‌ల నిర్మాణాలకు సిద్దంగా లేదు. దీంతో ప్రజలకు కట్టడాల కూల్చివేతలు లేకుండా అలైన్మెంట్ ఖరారు చేయా లని అధికారులకు సూచించారు. అవసరం మేరకు ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని, పనుల్లో వేగం పెంచాలని ఆయన ఆదేశించారు.

బీసీ బిల్లుకు సంపూర్ణ మద్దతు

అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలి: మాజీ ప్రధాని దేవగౌడ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల వారికి రాజకీయ రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని, తమ పార్టీ సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తుందని జనతాదళ్(ఎస్) అధ్యక్షులు మాజీ ప్రధాని దేవగౌడ్ తెలిపారు. బీసీ బిల్లుపై అభిప్రాయాలు తెలుసుకోవడం కోసం త్వరలో రాజకీయ పార్టీల పార్లమెంటరీ ఫ్లోర్ లీడర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేయించేలా చూడాలని తనను కలిసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులకు సూచించారు. బీసీ బిల్లుకు మద్ధతు తెలిపాలని, పార్లమెంటులో ఆమోదం పొందేలా చూడాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య మాజీ ప్రధానిని కలిసి కోరారు. సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, అనంతయ్య, వేముల రామకృష్ణ, అభిలాష్ యాదవ్ తదితరులు ఉన్నారు. బీసీ బిల్లును పార్లమెంటులో పెట్టేలా అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆర్ కృష్ణయ్య అన్నారు. ఇప్పటికీ చాలా పార్టీలు బీసీ బిల్లుపై స్పష్టమైన వైఖరిని ప్రకటించలేదని అన్నారు. బీసీలు విద్యా, ఉద్యోగ రంగాలతోపాటు రాజకీయంగా ఎదగాలంటే చట్టసభల్లో రిజర్వేషన్లు అవసరమన్నారు. అందుకోసం పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టం చేయాలన్నారు. బీసీ బిల్లు కోసం మిగిలిన పార్టీలను కూడా కలుపుకుపోవాలని దేవగౌడ ఆర్ కృష్ణయ్యకు సూచించారు. సెప్టెంబర్ రెండో వారంలో పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్న పార్టీల ఫ్లోర్ లీడర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు బీసీ బిల్లుకు అంగీకారం తెలుపుతున్నప్పటికీ ఉత్తరాది రాష్ట్రా లు ఆమోదం తెలపడం లేదని గుర్తు చేశారు. బీసీ బిల్లుకోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

తట్టు, రుబెల్లా నియంత్రణకు వ్యాక్సినేషన్

- 17 నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రారంభం: మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో తట్టు, రుబెల్లా వ్యాధుల నియంత్రణకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కే లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో యూనిసెఫ్ ఆధ్వర్యంలో మీడియాకు తట్టు, రూబెల్లా వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడు తూ తట్టు, రూబెల్లా వ్యాధులను నియం త్రించేందుకు వ్యాక్సిన్‌ను తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ప్రారంభిం చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నాల్గు వారాలపాటు కొనసాగించను న్నట్లు తెలిపారు. అవసరమైతే ఐదో వారం కూడా వ్యాక్సినేషన్ చేయనున్నట్లు తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం లో అయా గ్రామాల్లో నర్సులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు కూడా భాగస్వామ్యం కానున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వ సహకారంతోనే వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే చాలా అవగాహన సదస్సులను నిర్వహించామని తెలిపారు. గతంలో కూడా ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని విజయవం తంగా పూర్తి చేశామని, 90శాతం టార్గెట్‌ను పూర్తయింద న్నారు. కేసీఆర్ కిట్‌లో కూడా వ్యాక్సిన్ వేసుకుంటేనే చివరి బిల్లు రూ.3వేలు ఇస్తామని ప్రకటించారు. వ్యాక్సిన్‌పై అపోహలు అవసరం లేదన్నారు. వందశాతం రక్షణ ఉంటుందని, దీనివల్ల ఎలాంటి దుష్పలితాలు సంభవించడం లేదన్నారు. కుల, మతాలకు అతీతంగా వ్యాక్సిన్‌ను వేసుకోవాలని సూచించారు. వ్యాక్సిన్ వంద శాతం కేంద్రప్రభుత్వం నిధులను ఇస్తుందన్నారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో 700 స్కూల్స్ ఉండగా, 120 స్కూల్స్ మాత్రమే అనుమతి ఇవ్వలేదని, మిగతా పాఠశాలలు ఇచ్చాయని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలకు ప్రత్యేక కేంద్రాల ద్వారా వ్యాక్సినేషన్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్‌ను ప్రతి చిన్నపిల్లకు వేయించాలని సూచించారు. 2020వరకూ దేశంలో తట్టు, రుబెల్లా వ్యాధులు లేకుండా నియంత్రించాల ని కోరారు. ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన పెంచాలన్నారు. వ్యాధులు రాకుండానే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.

వైభవంగా శిద్ధా షష్ఠ్యబ్ధి మహోత్సవం

హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు




ఒంగోలు, కెఎన్ఎన్ బ్యూరో : రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతికశాఖామంత్రి శిద్దా రాఘవరావు ఆయన సతీమణి లక్ష్మీపద్మావతిల, షష్ఠ్యబ్ధి పూర్తి మహోత్సవం శుక్రవారం ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఏ వన్ కన్వెన్షన్ హాలులో వైభవంగా జరిగింది. రాష్ట్ర మంత్రివర్గ సహచరులు, శిద్దా అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా శిద్దా దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని పెనుగొండ దేవస్థానం, అష్టలక్ష్మీ పీఠం, అహోబిలం స్వామి పండితులు ఆశీర్వదించారు. ప్రముఖ నేతలు, అధికారులు శిద్దాకు అభినందనలు తెలిపారు. రాష్ట్రమంత్రులు సుజయ్‌కృష్ణరంగారావు, నక్కా ఆనంద్‌బాబు, గంటా శ్రీనివాసరావు, చింతకాయల అయ్యన్న పాత్రుడు, దేవినేని ఉమామహేశ్వరరావు, పొంగూరు నారాయణ, కొల్లు రవీంద్ర, కింజరపు



అచ్చెన్నాయుడు, పత్తిపాటి పుల్లారావు, కొత్తపల్లి శామ్యూల్ జవహర్ తదితరులు శిద్దా దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. సినీనటుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు నందమూరి హరికృష్ణ సినీనటుడు గిరిబాబు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపునేని రాజకుమారి వారిని ఆశీర్వదించారు. జిల్లాలోని శాసనసభ్యులు , శాసన మండలి సభ్యులు కార్యక్రమానికి హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎ-1 కన్వెన్షన్ హాలుకి తరలిరావడంతో అక్కడ పండుగ వాతావరణం ఏర్పడింది. హాలులోకి ప్రవేశించడానికి పలువురికి గగనంలా మారింది. మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులను ప్రత్యేక భద్రతతో శిద్దా దంపతులు ఉన్న సభా వేదికపైకి తీసుకువెళ్లారు. హాలులోకి ప్రవేశించడానికి ఒక ద్వారం, బయటకు వెళ్లడానికి మరో ద్వారం ఏర్పాటుచేశారు.

ఎవరితో ఉండాలో శరద్ ఇష్టం



పట్నా: మహాకూటమి కావాలనుకుంటే శరద్ యాదవ్ తాను ఇష్టమొచ్చినట్లు చేసుకోవచ్చని బీహార్ సీఎం నితీశ్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాని కలిసిన తరువాత నితీశ్ విలేకరులతో మాట్లాడారు. మహాకూటమిలోనే తానింకా ఉన్నానని శరద్ యాదవ్ చెప్పడాన్ని విలేకరులు ప్రశ్నించగా, జేడీ(యూ) పార్టీ పరంగా తాము నిర్ణయం తీసేసుకున్నామని, శరద్ యాదవ్ ఎవరితో ఉండాలో తేల్చుకోవాలని ఆయన సమాధానం చెప్పారు. గత నెలలో ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో మహాకూటమి బంధాన్ని తెగతెంపులు చేసుకున్న నితీశ్ బీజేపీతో తిరిగి జత కట్టారు. అయితే.. శరద్ యాదవ్ మాత్రం దీనికి తీవ్ర అభ్యంతరం తెలపడమే కాకుండా తానింకా మహాకూటమిలోనే ఉన్నానని ప్రకటించారు. బీజేపీతో కూడిన తరువాత మొదటి సారి ఢిల్లీ వచ్చిన నితీశ్ ప్రధానిని కలిసిన తరువాత శరద్ వ్యాఖ్యలపై స్పందించారు.

విపక్షాల భేటీకి ఎన్సీపీ డుమ్మా

న్యూఢిల్లీ: విపక్షాల సమావేశానికి ఇటీవలే ఎన్డీయేలో చేరిన జేడీ(యూ)కు ఆహ్వానం పంపిన సోనియా గాంధీకి యూపీఏ భాగస్వాములు కూడా దూరమవుతున్నారు. శుక్రవారం జరిగిన విపక్షపార్టీల సమావేశానికి యూపీఏలో భాగస్వామి ఎన్సీపీ హాజరు కాలేదు. అయితే.. ఈ సమావేశానికి నితీశ్ నాయకత్వంలోని జేడీ(యూ)కు కూడా కాంగ్రెస్ ఆహ్వానం పంపింది. పైగా ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ తాము కాంగ్రెస్ నాయకత్వంలోని సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని చెప్పారు. దీంతో విపక్షాల కూటమిలో చీలికలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల గుజరాత్‌లోని రాజ్యసభ ఎన్నికల్లో ఇద్దరు ఎన్సీపీ ఎమ్మెల్యేలు బీజేపీకి ఓటు వేసారని వార్తలు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం నాటి ఎన్సీపీ చర్య ఆ పార్టీ ఎవరి వైపు ఉందో తేల్చి చెప్పింది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి వ్యూహం ఖరారు చేయడం కోసం సోనియా గాంధీ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశానికి సోనియా, మన్మోహన్ సింగ్, గులామ్ నబీ అజాద్; ఏకే ఆంటోని, టీఎంసీ నేత మమతా బెనర్జీ, నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఒమర్ అబ్దుల్లా, సీపీఐకి చెంది డి రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరయ్యారు.

చర్చలతో పరిష్కరించుకోండి

- డోక్లామ్ వివాదంపై భారత్- చైనాలకు అమెరికా సూచన
- ఎటువంటి పరిణామానికైనా రెడీ
- ట్రైజంక్షన్ సమస్యపై భారత్, భూటాన్ విదేశాంగ మంత్రుల భేటీ
- హిందూ మహాసముద్రంపై డ్రాగన్ కన్ను
- దక్షిణ చైనా సముద్రంలో అమెరికా ఉనికిపై అభ్యంతరం



బీజింగ్, న్యూ ఢిల్లీ: చర్చలతోనే డొక్లాం సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టొచ్చని అగ్రరాజ్యం అమెరికా అభిప్రాయపడింది. ఈ మేరకు భారత ప్రభుత్వానికి యూఎస్ స్టేట్ విభాగ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడచిన 50 రోజులుగా ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. తక్షణమే, ఈ అనిశ్చిత వాతావరణంపై దృష్టి సారించాలని సూచించారు. ఇరు దేశాల సఖ్యత యావత్ ప్రపంచానికి అవసరమని తెలిపారు. ఇదే విషయంపై భారత విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్, భూటాన్ మంత్రి డామోడోర్జి భేటీ అయ్యారు. సరిహద్దులో నెలకొన్న పలు అంశాలపై చర్చించారు. డొక్లాం సమస్యపై భారత్ వేసిన అడుగులు ఆ దేశానికి విజయాన్ని చేకూర్చే విధంగా ఉన్నాయని పలు విశ్లేషణలూ వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే, చైనాతో ఎటువంటి పరిణామానికైనా తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో చేసిన ప్రకటన సర్వత్రా చర్చనీయాంశమైంది. తీసుకొని దౌత్యవేత్తలు తమ అభిప్రాయాన్ని తెలిపారు. అమెరికా, భూటాన్ తదితర దేశాలు కూడా డొక్లాం సమస్యను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని సూచించాయి. కాగా, డొక్లాం అంశంపై భారత్ అతిగా స్పందించడం కూడా ప్రమాదకరమని మరికొంతమంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

భూటాన్ విదేశాంగ మంత్రితో సుష్మా భేటీ

డొక్లాం సరిహద్దులో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలు భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాల మధ్య తీవ్ర ఉత్కంఠ రేపుతుండగా కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ శుక్రవారం భూటాన్ విదేశాంగ మంత్రి డామ్చోడోర్జితో భేటీ అయ్యారు. ఇరు నేతలు పలు కీలక అంశాలపై తీవ్రంగా చర్చించారు.

భారత్,చైనా,భూటాన్ ట్రైజంక్షన్‌లో రోడ్డు నిర్మాణం చైనా చేపడితే ఇరు దేశాలకు ముప్పుగా పరిణమిస్తుందని చర్చించినట్లు తెలిసింది. తమ భూభాగంలోకి చొరబడిన భారత సైన్యం వైదొలగకుంటే 'పరిమిత సైనిక చర్య'కు కూడా వెనుకాడమని చైనా హెచ్చరించినా భారత్ బేఖాతరు చేసింది. తమ బలగాలు వెనక్కి రావాలంటే రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేసి చైనా బలగాలను కూడా ఉపసంహరించుకోవాల న్నారు. పరిస్థితిని చర్చల ద్వారానే పునరుద్ధరించాలని ఇండియా బలంగా వాదిస్తోంది. అయితే గురువారం డొక్లాం సమీప ప్రాంతంలో గల గ్రామాన్ని ఖాళీ చేయాలని భారత సైన్యం ఆదేశించడంతో సైనిక చర్యకు భారత్ సిద్ధమౌతుందా? అన్న సంశయం కూడా నెలకొంది.



చైనాపై దౌత్యపరంగా భారత్‌దే గెలుపు

డొక్లాం సమస్యపై దౌత్యపరంగా భారత్ వేసిన అడుగులు ఆ దేశాన్ని గెలుపు దిశగా తీసుకెళుతు న్నాయని దౌత్యవేత్తలు అభిప్రాయపడు తున్నా రు. ఒక్క బుల్లెట్ కూడా ఉపయోగించు కుండా చైనాపై భారత్ విజయం సాధిస్తుందని చెబుతు న్నారు. ట్రైజంక్షన్‌లో భారత భద్రతా బలగాలు మోహరించడంతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతింటాయని అంద రూ భావించారు. చైనా కూడా భారత భద్రతా బలగాలు తక్షణమే డొక్లాం నుంచి వైదొలగాలని హెచ్చరించింది. అయితే, తమకు ఇబ్బందిగా మారే రోడ్డు నిర్మాణాలు ఆపేంతవరకు అక్కడ నుంచి తమ బలగాలు వైదొలిగేది లేదని స్పష్టం చేయడంతో చైనా ఇరకాటంలో పడింది. దీంతో, చైనాకు వేరే ప్రత్యామ్నాయం లేక చర్చలకు సై అన్నది. ఇటీవల పరిణామాలన్నీ పరిగణలోకి

హిందూ మహాసముద్రంపై చైనా నేవీ కన్ను

హిందూ మహాసముద్రంపై చైనా నేవీ కన్నేసింది. ఈ విషయంలో భారత్‌తో సంబంధాలు విస్తృత పరుచుకునేందుకు యత్నిస్తున్నది. తమకూ హిందూ మహాసముద్రంపై హక్కు ఉందని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. హిందూ మహాసముద్ర రక్షణకు భారత్, చైనాలు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. అయితే, దక్షిణ చైనా సముద్రంలో కృత్రిమ దీపాలను నిర్మాణం చేపడుతుంది. కాగా, చైనా తన రాజకీయ, ఆర్థిక ప్రాబల్యాన్ని చాటుకోవడంలో భాగంగానే ఇటువంటి చర్యలు చేపడుతుందని దౌత్తవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. అందులో భాగంగానే డిజ్‌బౌటిలో తనకు సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకుందని చెప్పారు. దీంతో ఆ సముద్రంలోని నిక్షేపాలను తన సొంతం చేసుకునేందుకు యత్నిస్తుందన్నారు. ఆయా ద్వీపాల్లో క్షిపణి పరీక్షలు వంటి చర్యలకు కూడా చైనా ఆర్మీ యోచిస్తున్నదని చెప్పారు. నూతనంగా నిర్మించిన ద్వీపాల్లో సుమారు 300 నేవీ షిప్‌లు, భారీ స్థాయిలో భద్రతా బలగాలను మోహరించిన విషయం తెలిసిందే.

భారత బలగాలు దేనికైనా సిద్ధం: జైట్లీ



భారత భద్రతా బల గాలు ఎటు వంటి పరి స్థితినై నా ఎదుర్కొనేందు కు సంసిద్ధంగా ఉన్నా యని రక్షణశాఖ మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. అయితే, చైనాతో యుద్ధానికి వెళితే కేవలం 22 రోజుల్లో భారత్ వద్ద గల మందుగుండు అయిపోతుందని కాగ్ తేల్చిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఓ పార్లమెంట్ సభ్యుడు ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. మందుగుండు మరింత ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలపై రక్షణ శాఖ దృష్టి పెట్టిందని సభకు వివరించారు. దానిపై ఎవరికీ సందేహం అక్కర్లేదన్నారు.

అమెరికా ఉనికిని ప్రశ్నిస్తున్న డ్రాగన్

దక్షిణ చైనా మహాసముద్రంలో అమెరికా ఉనికిపై చైనా తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. ఇటీవల అమెరికాకు చెందిన సబ్‌మెరైన్లు ఆ మహాసముద్రంలో చక్కర్లు కొట్టడంపై చైనా నేవీ స్పందించింది. అంతర్జాతీయ సముద్ర జలాలపై రెక్కీ నిర్వహించడం తప్పేమి కాదని వ్యాఖ్యానించింది. అదే సమయంలో, ఈ మహాసముద్రపు జలాలపై పెత్తనం చేసేందుకు అమెరికా ఒడిగడితే సహించేది లేదన్నారు. యూఎస్ నేవీ 'ఫ్రీడం ఆఫ్ నావిగేషన్ ఆపరేషన్' నిర్వహించిన తర్వాత చైనా పై విధంగా వ్యాఖ్యానించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.



సూర్య గ్రహణం సందర్భంగా వాతావరణ అధ్యయనం

న్యూయార్క్: మన భూమ్మీద కంటే ఇతర ప్రదేశాల్లో ఉన్న పరిస్థితులను అంచనా వేయడానికి సూర్యగ్రహణం సందర్భంగా నాసా ఒక అధ్యయనం చేయనుంది. ఈ అధ్యయనంలో భాగంగా ఆకాశంలోకి బెలూన్లు పంపిస్తారు. ఎక్లిప్స్ బెలూన్ ప్రాజెక్టు అని దీనికి నామకరణం కూడా ఏసారు. ఈ అధ్యయనం కోసం 50హై ఆల్టిట్యూడ్ బెలూన్లను ప్రయోగించడానికి అమెరికా వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థుల బృందాలతో కలిసి నాసా పని చేస్తోంది. ఈ నెలలోనే అమెరికాలో సంపూర్ణ సూర్యగ్రహణం కనిపించనుంది. ఈ సందర్భంతా భూవాతావరణంలోని స్ట్రాటోస్ఫియర్‌ను అధ్యయనం చేయడానికి మంచిఅవకాశం వస్తుందని నాసా పేర్కొంది. ఒక్కో బృందానికి నాసా రెండు మెటల్ కార్డులు ఇస్తుంది. వీటిలో హానికరం కాని బ్యాక్టీరియా ఉంటుంది.

మదర్సాల్లో మువ్వన్నెల జెండా ఎగరాలి

యూపీ ప్రభుత్వం ఆదేశం

న్యూఢిల్లీ: మదర్సాలు భారత స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరపాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం జారీ చేసిన ఆదేశాల్లో మదర్సాలు పంద్రాగస్టును పండుగగా జరపాలని, పిల్లల చేత దేశభక్తి గీతాలు ఆలపింపజేసి మిఠాయిలు పంచాలని చెప్పారు. సదరు కార్యక్రమాలను వీడియో తీసి ప్రభుత్వానికి పంపాలన్నారు. యూపీ మదర్సా శిక్షా పరిషద్ జారీ చేసిన ఆదేశాలపై విమర్శలు వస్తున్నాయి. మదర్సాలలో జాతీయ జెండాను ఎగరేయడమే ఈ ఆదేశాల లక్ష్యమని పరిషద్ రిజిస్ట్రార్ రాహుల్ చెప్పారు. యూపీలో 16,000 మదర్సాలు ఉండగా, వాటిలో 560 సంస్థలకు ప్రభుత్వం పూర్తిగా ఆర్థిక సాయం చేస్తోంది. మిగిలిన వాటికి పరిమిత సాయం చేస్తుంది. అయినా ఈ ఆదేశాల జారీ పట్ల మదర్సాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. మిగిలిన స్కూళ్లకు కూడా ఇలాంటి ఆదేశాలే జారీ చేస్తే తమకేమీ అభ్యంతరం లేదని ఒక మదర్సా నిర్వాహకుడు ఖలీద్ రషీద్ ఫిరంగీ మహ్లీ అన్నారు.

కోట్లకు వారసుడైనా బీదగా బతికాడు




- తండ్రి షరతు మేరకు నెలరోజులు సాదాసీదా జీవితం
- బతుకు పరీక్షలో నెగ్గిన ఘనశ్యాం


ఆయన దేశంలోనే పేరుగాంచిన వజ్రాల వ్యాపారి. లక్షల కోట్లకు అధిపతి. ప్రతి ఏటా వేల కోట్ల టర్నోవర్. విలాసవంతమైన జీవితం. అయితే మనం ఇలాంటి వ్యక్తి కుమారులు ఎలా ఉంటారు అనుకుంటాం.. లగ్జరీ కార్లలో తిరుగుతూ, జల్సా చేస్తూ జీవిస్తుంటారని అనుకుంటాం. కానీ స్వశక్తితో కష్టపడి పైకి వచ్చిన ఈ వ్యాపారి తన కుమారులను మాత్రం విలాసవంతంగా పెరిగేందుకు ఆసక్తి చూపలేదు. కష్టం అంటే ఏంటి ఆ కష్టంలో ఉన్న సుఖం, దుఖం పిల్లలకు తెలియాలనుకున్నాడు. ఈ క్రమంలో తన కుమారుడిని తన పేరు, పరపతి ఉపయోగించకుండా ఒక నెల పాటు కష్టపడి బ్రతకాలని సూచించాడు. తానెవరో ఎక్కడుంటాడో ఎవరికి తెలియకుండా సొంతంగా ఒక ఉద్యోగం సంపాదించుకుని పనిచేయాలని చెప్పాడు. కోట్లకు వారసుడైన ఆ కుమారుడు తన తండ్రి మాటను గౌరవించి తండ్రి ఇచ్చిన ఐదు వందల రూపాయల నోటుతో ఇంట్లో నుంచి బయటికి వచ్చాడు. ఎక్కడా ఏం పని చేయాలో ఆలోచించుకుంటూ హైదరాబాద్ నగరానికి చేరుకున్నాడు. నగరంలోని ఒక మురికివాడలో ఉన్న ప్లైవుడ్ షాప్ ఓనర్‌ను కలిసి తనకు పని ఇప్పించాలని కోరాడు. అయితే ఆ యజమాని గుర్తింపు కార్డు అడిగినప్పటికి తన వద్ద లేదని చెప్పి బ్రతిమిలాడి పనిలో చేరాడు. అలా నెల రోజుల పాటు మరో మూడు ప్రాంతాల్లో అడిడాస్, నైక్, మెక్ డోనాల్డ్స్ లాంటి షోరూంలలో పని చేసి చిన్న షాపుల్లో పని చేస్తూ డెలివరి బాయ్ గా కూడా వస్తువులను మోస్తూ చాలీ చాలనీ డబ్బులతో భోజనం చేస్తూ గడిపాడు. బస చేసేందుకు ఓ మురికివాడలోని తనతో పనిచేసే వారి గదిలో పదిమందితో కలిసి ఉన్నాడు. డబ్బు ఉండగానే కాదు ఆ డబ్బు కష్టపడితేనే వస్తుందని ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా చేసిన ఆయువకుడి పేరు హితార్థ్ ధొలకియా(23). దేశంలోనే పేరుగాంచిన గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి ఘన్ శ్యామ్ ధోలకియా చిన్న కుమారుడు. ఘన్ శ్యామ్ గత సంవత్సరం క్రితం దీపావళి పండుగ రోజు తన ఉద్యోగులకు వందల సంఖ్యలో కార్లు, నివాసాలు బహుమతిగా ఇచ్చి వార్తల్లోకి ఎక్కారు. అదే విధంగా తన పెద్ద కుమారుడు కూడా కేరళలోని ఓ బేకరిలో గుమాస్తాగా పనిచేసి ఆయన పరీక్షను నెగ్గాడు. ఈ క్రమంలో చిన్న కుమారుడు హితార్థ్ నెల రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులందరూ కుమారుడిని చూసేందుకు హైదరాబాద్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హితార్థ్ తన సాధారణ జీవితం, హైదరాబాద్ ప్రజలు, తాను ఎదుర్కొన్న కష్టాలు, సుఖాలను మీడియా కు వివరించాడు. తనకు అన్నం తినడం అలవాటు లేనప్పటికి ఇక్కడికి వచ్చాక కడుపునిండా అన్నం తిన్నట్టు తెలిపారు.



రాజ్యసభకు నేతృత్వం వహిస్తూ...



ప్రమాణ స్వీకారం తరువాత రాష్ట్రపతి భవన్‌ను వీడుతూ...



రాజ్యసభ సచివాలయంలో ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరిస్తూ..

రాజ్యసభాపతి వెంకయ్య

నేనిక అందరివాడిని

- ఉపరాష్ట్రపతిగా ప్రమాణం తరువాత వెంకయ్య
- అర్థవంతమైన చర్చల కోసం కృషి చేస్తానని హామీ
- సంచలనాలకు ప్రాధాన్యం ఇవ్వొద్దని మీడియాకు హితవు
- దేశంలో రెండో అత్యున్నత పదవిలో తెలుగు వ్యక్తి



న్యూఢిల్లీ: దేశంలో రాజ్యాంగబద్ధ రెండో అత్యున్నత స్థానాన్ని తెలుగువారైన ముప్పవరపు వెంకయ్య నాయుడు అధిష్టించారు. 15వ ఉప రాష్ట్రపతిగా వెంకయ్య ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతిభవన్ లోని దర్బార్ హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్...వెంకయ్యతో ప్రమాణ స్వీకారం చేయించారు.'' వెంకయ్య నాయుడు అను నేను..రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత ప్రదర్శిస్తానని ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేస్తున్నా'' అని హిందీలో ప్రమాణం చేశారు.ఈ కార్యక్రమానికి , ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,మాజీ ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ,లోక్‌సభ స్పీకర్ సుమిత్రామహజన్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కేంద్ర మంత్రులు, ఎన్డీఏ కూటమి ఎంపీలు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, బీజేపీ అగ్రనేత ఎల్.కె.అద్వానీ, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రతిపక్షపార్టీల నాయకులు తది తరులు హాజరయ్యారు.ప్రమాణ స్వీకారోత్సవానికి ముందు వెంకయ్య ఢిల్లీలోని రాజ్ ఘాట్‌కు వెళ్లి జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్, దీన్ దయాల్ ఉపాధ్యాయలకు కూడా వెంకయ్య పుష్పాంజలి ఘటించారు.

రైతు బిడ్డ మన ఉప రాష్ట్రపతి: మోడీ

రైతు బిడ్డ ఉప రాష్ట్రపతికావడం చాలా సంతోషంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు.వెంకయ్య ఉప రాష్ట్రపతి కావడంపై ప్రజాస్వామ్యానికి వందనం చేశారు. స్వతంత్ర భారతావనిలో జన్మించిన వ్యక్తి మొదటి ఉప రాష్ట్రపతి కావడం ఆనందంగా ఉందన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన వెంకయ్యకు అన్నదాత బాధలు బాగా తెలుసని..అందుకే ఆయన వారి పక్షపాతి అని అన్నారు. తనను ఎప్పుడు కలిసిన గ్రామణ భారతం అభివృద్ధి గురుంచే చర్చించేవారని రాజ్యసభలో మోడీ గుర్తు చేశారు. ఏ ప్రసంగాన్నైనా తన ప్రాసతోనే పండిస్తారని తెలిపారు. ప్రధానమంత్రిగ్రాణ్ సడక్ యోజన వంటి కార్యక్రమా లు వెంకయ్యానాయుడు ఆలోచనే అని గుర్తు చేశారు. నిన్నటి వరకు మనతోనే ఉన్న వెంకయ్యను రాజ్యసభ ఛైర్మన్ చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వెంకయ్య ఉప రాష్ట్రపతి కావడం తనకు ఆనందం కలిగించిందన్నారు.

వెంకయ్య కంటతడి

రాజ్యసభ ఛైర్మన్ గా పెద్దల సభలో అడుగుపెట్టగానే వెంకయ్యానాయుడు కంటతడిపెట్టారు. ఛైర్మన్ కూర్చిలో ఆసీనులైన తర్వాత తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయానంటూ కంటతడి పెట్టారు. రైతు కుటుంబం నుంచి ఈ స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. దేశం కోసంపోరాడిన మహానుభావాలను సేవలను ప్రతిఒక్క సభ్యుడు గుర్తుంచుకోవాలని కోరారు. సభ్యుల సమయాన్ని సద్వియోగం చేసుకుని...అర్థవంతమైన చర్చలు జరపాలని ఆకాంక్షించారు. మీరు కోఆపరేట్ చేస్తే సభను ఆపరేట్ చేస్తానంటూ వెంకయ్య చలోక్తి విసిరారు. రాజ్యసభ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తాను ఏ పార్టీవైపు పక్షపాతం వహించబోనని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. ఛైర్మన్‌గా తానిప్పుడు అన్ని పార్టీలకు చెందిన వాడినని అన్నారు. సభలో ఉన్న వారంతా రాజకీయ ప్రత్యర్థులే కానీ శత్రువులు కాదని గుర్తు చేశారు. చట్ట సభలను నెంబర్ గేమ్‌గా మార్చకుండా ప్రజలకు ఉపయోగపడే అంశాలపై అర్థవంతమైన చర్చలు జరిగేలా కృషి చేస్తానన్నారు. ఉత్తమ భారత్ అన్ని పార్టీల లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

'సంచలనాలొద్దు..వాస్తవాలు చూపండి'

సంచలనాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా..వాస్తవాలను చూపాలని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు మీడియా సూచించారు. సంచలనాలను తగ్గించి అర్థవంతమైన చర్చలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ప్రస్తుతం మీడియా సంచలనాలకు, వివాదాలకే ప్రాధాన్యం ఇస్తోందని..ఈ ధోరణి మారాలని ఆకాంక్షించారు. రాజ్యసభలో ఆందోళన లు జరుగుతున్నట్లు ఫోకస్ చేస్తున్న మీడియా.. అర్థవంతమైన చర్చలు జరుగుతున్నప్పుడు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏ అంశంపైనైనా చర్చలు జరుగుతున్నప్పుడు ఆ చర్చ సారాంశాన్ని ఆయా స్థానిక భాషల్లో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు.

విద్యార్థి నాయకుడు
క్లాస్ టీచరయ్యాడు: శివసేన ఎంపీ

రాజ్యసభ ఛైర్మన్‌గా వెంకయ్య నాయుడు తన కుర్చిలో కూర్చోగానే శివసేన ఎంపీ సంజయ్ రౌత్ తన మాటలతో సభలో నవ్వుల పువ్వులు పూయించారు. మాజీ విద్యార్థి నాయకుడిగా పనిచేసిన వెంకయ్య ఆ తర్వాత బీజేపీ విద్యార్థి విభాగం నాయకుడయ్యారు. ఇప్పుడు ఇంత మంది విద్యార్థులకు టీచర్ అయ్యారు అంటూ రాజ్యసభలో చలోక్తులు విసిరారు. అంతటితో ఆగకుండా ఇక్కడి విద్యార్థులంతా చాలామంచి వారని...మీకు ఎలాంటి ఇబ్బందులు కలిగించరని..బీపీ పెరిగేలా ప్రవర్తించరని తాను హామీ ఇస్తున్నానని చెప్పారు.

నాలుగు అత్యున్నత పదవుల్లో బీజేపీ వ్యక్తులు



భారత ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో దేశ రాజకీయ చరిత్రలో తొలిసారి నాలుగు అత్యున్నత పదవులు బీజేపీ నాయకులకే దక్కినట్లైంది. రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింగ్.. ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న సుమిత్రా మహజన్ బీజేపీ నుంచి వచ్చిన వారే. వీరికి ఆర్ఎస్ఎస్ నేఫథ్యం కూడా ఉండటం గమనార్హం. ప్రస్తుతానికి రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ గా ఉన్న పీజే కురియన్ మాత్రం ఇతర పార్టీకి చెందిన నేతగా ఉన్నారు. ఆయన పదవి కాలం పూర్తయి..ఒకవేళ ఆస్థానంలోనూ బీజేపీ వ్యక్తి ఎన్నికైతే ఐదు ఉన్నత రాజ్యాంగ పదవుల్లో బీజేపీయే దక్కించుకున్నట్లవుతుంది.

ప్రతిపక్షానికి స్వరం..
అధికార పక్షానికి మార్గం: రవిశంకర్ ప్రసాద్

వెంకయ్యానాయుడు రాజ్యసభ ఛైర్మన్ కావడాన్ని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ స్వాగతించారు. పెద్దల సభను చాకచక్యంగా నడిపే శక్తి,సామర్థ్యాలు కలిగిన వ్యక్తి వెంకయ్య అని కొనియాడారు. వెంకయ్య లాంటివ్యక్తి రాజ్యసభ ఛైర్మన్ కావడం చాలా సంతోషానిచ్చిందన్నారు. ప్రతిపక్షాలకు స్వరంగా.. అధికారపక్షానికి మార్గంలా వెంకయ్య పనిచేస్తారని రవిశంకర్ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యసభలో సుధీర్ఘ అనుభవం కలిగిన వెంకయ్య నాయుడు సభను తనదైన శైలిలో ముందుకు తీసుకెళ్తారన్నారు. వెంకయ్య నాయుడు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో తనలాంటి యువ నాయకులనెందరినో ప్రోత్సహించారని గుర్తు చేశారు. గ్రామీణ వాతావరణం నుంచి వచ్చిన వ్యక్తి ఉప రాష్ట్రపతిగా..రాజ్యసభ ఛైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టడాన్ని రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ స్వాగతించారు. వినయం, విధేయత కలిగిన వ్యక్తి రాజ్యసభ ఛైర్మన్ కావడం గర్వంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే వారికి తానెప్పుడూ నమస్కరిస్తాని చెప్పుకొచ్చారు. రాజ్యసభ సభ్యుడిగా వెంకయ్య అన్ని రకాల సమస్యలను లేవనెత్తారని గుర్తు చేశారు. ఇప్పుడు దేశానికి ఉప రాష్ట్రపతి పదవిలో ఉన్న మీరు చూపే సరైన మార్గదర్శకత్వం కోసం ఎదురుచూస్తున్నామని అన్నారు.

భాష ఏదైనా భావమంతా పంచులు.. ప్రాసల్లోనే!

పార్లమెంటు సాక్షిగా వెంకయ్యను ప్రశంసించిన మోడీ


న్యూఢిల్లీ: 'మూడు పంచ్‌లు... ఆరు ప్రాసల'తో ప్రత్యర్థులను చిత్తు చేసే తెలుగు జాతీయ నాయకుడు ఎవరైన ఉన్నారంటే అది కేవలం వెంకయ్య నాయుడు మాత్రమే అన్న విషయం స్పష్టంగా చెప్పవచ్చు. భాష ఏదైనా... భావాన్ని పంచ్‌లు, ప్రాసలతో ఏ చర్చనైనా రక్తి కట్టించడమే ఆయన తీరు. ప్రతిపక్షాలపై వ్యంగ్యంగా విరుచుకుపడినా... వారికీ వినసొంపుగా మాట్లాడే నైజం ఆయనకు మాత్రమే సొంతం. శుక్రవారం స్వతంత్ర్య భారతంలో జన్మించిన తొలి వ్యక్తి దేశ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన వెంకయ్య నాయుడు తెలుగు భాషను స్వయంగా పార్లమెంట్ సాక్షిగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు. సమకాలీన రాజకీయాల్లో ఆయనకు సాటి లేరు. మరి రారని కూడా నిర్మొహమాటంగా చెప్పొచ్చు. ఈ సందర్భంగా ఆయన పంచులు, ప్రాసల్లోకొన్నింటిని ప్రత్యేకంగా చూద్దాం....

- యూ కోపరేట్... ఐ ఆపరేట్

ప్రాసలతోనే ఫట్‌మనిపించే వెంకయ్య నాయుడు, ఉప రాష్ట్రపతిగా పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే మరో పదాన్ని వదిలారు. తన ప్రాసతో సభ సమావేశాన్ని ప్రారంభించారు. సభ్యులనుద్దేశించి... 'యూ కోపరేట్... ఐ ఆపరేట్' అన్నారు. మీరు సహకరిస్తే, నేను సభను నడిస్తాను అని వ్యాఖ్యానించారు.

- ఉప రాష్ట్రపతి అవడం ఇష్టం లేదు... ఉషాపతిగా ఉండటమే ఇష్టం...

వెంకయ్య నాయుడే తదుపరి ఉపరాష్ట్రపతి అని మీడియాలో వచ్చిన వెంటనే ఆయన నోటినుండి జారిన అక్షరాలు. ముందుగా ఆయన భార్య పేరు



తెలియక మీడియా ప్రతినిధులు వెంకయ్య మాటలకు తికమకప డ్డారు. కానీ విషయం తెలుసుకున్నాక అక్కడున్న వారంతా ఫొల్లుమన్నారు. ఆయన మాటల చతురతకు ఆశ్చర్యపోయారు.

- కంట్రీ ఫార్వర్డ్... కాంగ్రెస్ బ్యాక్‌వర్డ్... ధేర్ సిశ్చువేషన్ అక్వర్డ్

2014 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఘోర వైఫల్యాన్ని మూటగట్టుకుంది. అటుతర్వాత, పలు సమస్యలపై కాంగ్రెస్ చేపట్టిన ఆందోళలను ఉద్దేశిస్తూ... దేశం ముందుకుపోతుంటే, కాంగ్రెస్ మాత్రం వెనకబడి పోతుందని... అందుకే వారి పరిస్థితి బాగోలేదని ఓ సేటైర్‌తో చమత్కరించారు.

- పీఎం ప్రిసైడ్స్... మేడమ్ డిసైడ్స్

యూపీఏ హయాంలో ప్రధానిగా వ్యవహరించిన మన్మోహన్ అధికార పరిధిని విమర్శిస్తూ... మీ పార్టీలో మేడమ్ చెబుతారు.... పీఎం ఆచరిస్తారంటూ వ్యంగ్యాస్త్రం విసిరారు. దీనికి కాంగ్రెస్ పార్టీ వారు సైతం ఫిధా అయ్యారంట.

- లెఫ్ట్ ఎప్పటికీ రైట్ కాదు

తమ భావజాలానికి చిరకాల శత్రువులైన కమ్యూనిస్టులపై కూడా వెంకయ్య నాయుడు మాటల తుటాలు పేల్చారు. లెఫ్ట్ ఎప్పటికీ రైట్ కాదంటూ ఓ ప్రాసతో వారినీ గందరగోళంలో పడేశారు. ఈ మాటలు జాతీయ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశమయ్యాయి.

- కాంగ్రెస్ హార్డ్ ఆన్ నేషనలిస్ట్స్.... సాఫ్ట్ ఆన్ టెర్రరిస్ట్స్

తీవ్రవాదులకు ఎప్పుడూ అనుకూలంగా మాట్లాడే కాంగ్రెస్‌ను రాజకీయంగా ఎదుర్కొనేందుకు వదిలిన అక్షర బాణమిది. కాంగ్రెస్ పార్టీ జాతీయవాదులపై హార్డ్‌గా ఉంటుందని.. టెర్రరిస్టులపై సాఫ్ట్‌గా ఉంటుందని విమర్శించారు.

- నేషన్ ఫస్ట్... పార్టీ నెక్స్ట్... అండ్ సెల్ఫ్ లాస్ట్

కాంగ్రెస్ పార్టీ దేశం కంటే కూడా గాంధీ, నెహ్రూ కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని ఎంతోమంది నాయకులు పలుమార్లు విమర్శించినప్పటికీ... వెంకయ్య మాదిరి ఎవరూ చెప్పలేకపోయారు. కాంగ్రెస్ విధానాన్ని ఎండగడుతూ... దేశం ముందు, పార్టీ తర్వాత... చివరికే తాను అంటూ జాతి, పార్టీ పట్ల విధేయతను ప్రదర్శించారు.

అప్పులపాలైన రైతుల కుమార్తెల ఆత్మహత్య

నాగపూర్: ఇప్పటివరకూ అప్పులు తీర్చలేని రైతుల ఆత్మహత్యల గురించే విన్నాం.తమ తల్లితండ్రులు అప్పులు పాలైన దశలో వారికి తాము భారం కారాదన్న ఉద్దేశ్యంతో రైతుల కుమార్తెలు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు మహారాష్ట్రలో చోటు చేసుకున్నాయి. ఈ రెండింటిలో ఒకటి రక్షా బంధన్ రోజున పర్భనీలో చోటు చేసుకోగా, మరొకటి లాతూరులో జరిగింది. డిజిటలైజేషన్‌లో ప్రతిభ కనబర్చిన ఒక విద్యార్థినికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాగపూర్‌లో కోటి రూపాయిల చెక్కును అందజేసిన రోజునే ఈ ఆత్మహత్య ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. మొదటి సంఘటనలో సారికా ఎస్ ఝూటె అనే 17 ఏళ్ళ యువతి రక్షా బంధన్ కట్టించుకున్న తర్వాత ఉరివేసుకుని ప్రాణాలు వదలగా, రెండో సంఘటనలో శీతల్ అనే 21 ఏళ్ళ యువతి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.

కిసాన్ బేటీ బచావో

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, రైతుల కుమార్తెలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి వసంతరావు పాటిల్ షేట్కారీ సంఘటన్ అధ్యక్షుడు కిషోర్ తివారీ కోరారు. బేటీ బచావో ఉద్యమం మాదిరిగానే కిసాన్ బేటీ బచావో ఉద్యమాన్ని కూడా ప్రారంభించాలని ప్రధానమంత్రిని తివారీ కోరారు. సారికా ఝూటే ఆత్మహత్యకు నిరసనగాపర్భనీలో వారం రోజుల పాటు ఆందోళన నిర్వహించినట్టు ఆయన చెప్పారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయనీ, జిల్లా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చి వీటిని నివారించాలని ఆయన కోరారు.

'అయోధ్య' తీర్పు ఈ ఏడాదే?

- డిసెంబర్ 5 నుంచి రామ జన్మభూమిపై తుది వాదనలు
- ఉత్తర్‌ప్రదేశ్ సర్కారు, కక్షిదారులకు సుప్రీం డెడ్‌లైన్

న్యూఢిల్లీ: అయోధ్య భూ వివాదం కేసుపై దాఖలైన వివిధ పిటిషన్లపై తుది వాదనలను డిసెంబర్ 5 నుంచి ప్రారంభించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బాబ్రీమసీదు- రామ జన్మభూమికి చెందిన 2.73 ఎకరాల భూమిపై యాజమాన్య హక్కుల కోసం దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. రామ్‌లాలా కౌన్సిల్, సిజే వైద్యనాథన్‌ల వాదనలతో విచారణ ప్రారంభమౌతుందని పేర్కొంది. 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ..13 పిటిషన్లు దాఖలవ్వడంతో వాటిపై వాదనలు వినిపించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. వివాదాస్పద 2.77 ఎకరాల అయోధ్య భూమిని అలహాబాద్ హైకోర్టు మూడు సమభాగాలుగా విభజించి పంచుకోవాలని 2010 లో తీర్పునిచ్చింది. ఒక భాగం సున్ని వక్ఫ్ బోర్డు , మరొకటి నిర్మోహి అఖాడా, ఇంకొకటి లామ్ లల్లా సంస్థలు పంచుకోవాలని ఆదేశించింది. ఈ తీర్పుపై సంతృప్తి చెందని మూడు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఆపిటిషన్లపై విచారణ ప్రారంభించిన సర్వోన్నత న్యాయస్థానం డిసెంబర్ 5 నుంచి



తుదివాదనలు వినిపించాలని ఆదేశించింది.

సాక్ష్యాల అనువాదానికి 10 వారాల గడువు


అయోధ్య భూ వివాదంలో సాక్షాలను అనువాదానికిఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వానికి జస్టిస్ అశోక్ భూషన్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం 10 వారాల గడువునిచ్చింది. సాక్షాలను ఇంగ్లీష్‌లోకి అనువాదం చేయించాలని స్పష్టం చేసింది.

కక్షిదారులకు 12 వారాల గడువు

న్యాయస్థానానికి కక్షిదారులు చూపించిన పత్రాలను 12వారాల్లో అనువధించాలని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. నిర్ణయాలకు కక్షిదారులు కట్టుబడి ఉండాలని.. ఇక ఎలాంటి అభ్యర్థనలను కోర్టుమన్నించబోదని పేర్కొంది. ఈ వివాదానికి సంబంధించిన సాక్షాలు ఎనిమిది భాషల్లో ఉన్నాయి. హిందీ, సంస్కృతం, ఉర్దూ, పర్షియన్, పాలి, అరబిక్ భాషల్లో ఉన్న పత్రాలను ఇంగ్లీష్ లోకి అనువదించాలని సుప్రీంకోర్టు యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిర్ణీత కాలంలో అనువాదం పూర్తి చేయాలన్న న్యాయస్థానం ఈ కేసులో మరో వాయిదా ఉండకపోవచ్చంది.

ముగిసిన 'వర్షాకాలం'

న్యూఢిల్లీ: వర్షాకాల సమావేశాల్లో 19 సార్లు సమావేశమైన లోక్‌సభ 14 బిల్లులను ఆమోదించింది. ఈ చర్చల్లో కీలకమైన బ్యాకింగ్ సవరణ చట్టం కూడా ఆమోదం పొందింది. అనంతరం లోక్‌సభ వాయిదా పడినట్లు స్పీకర్ సుమిత్రా మహజన్ శుక్రవారం ప్రకటించారు. అయితే, ఈ సమావేశాలకు ఓ ప్రత్యేకత కూడా ఉంది. వర్షాకాల సమావేశాల్లోనే భారత రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరిగాయి. పాత రాష్ట్రపతి, ఉపరాష్ట్రతులతో ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలు కొత్త రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులతో ముగిశాయి. క్విట్ ఇండియా ఉద్యమం జరిగి 75 సంవత్సరాలు అయినందున ప్రభుత్వం లోక్‌సభను ప్రత్యేకంగా సమావేశపరిచింది. వర్షాకాల సమావేశాలు మొత్తం 71 గంటలు సాగాయని, అందులో 29.59 గంటలు మాత్రం ఆందోళనల వల్ల నిర్వహించలేకపోయామని స్పీకర్ మహజన్ పేర్కొన్నారు.



ఎటువంటి కార్పొరేట్ రుణాలను మాఫీ చేయలేదు: జైట్లీ

కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో ఎటువంటి కార్పొరేట్ రుణాలను మాఫీ చేయలేదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. ఇటువంటి కీలక విషయాలపై ప్రతిపక్షాలు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హెచ్చరించారు. శుక్రవారం పార్లమెంట్‌లో సాగిన ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన లోక్‌సభకు వివరించారు. గడచిన మార్చి వరకు రూ. 62,307 కోట్ల ఎన్‌పీఏలు ఉన్నట్లు ఆయన సభకు తెలిపారు.

నకిలీ కంపెనీలపై చర్యలు

నకిలీ కంపెనీలపై చర్యలు ఇక నుంచి వేగంగా తీసుకుంటామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హామీనిచ్చారు. ఫేక్ కంపెనీల పేరుతో దేశంలో పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 11 లక్షల నకిలీ కంపెనీలు, ముఖ్యంగా 331 అనుమానిత కంపెనీలను తాము గుర్తించినట్లుచెప్పారు. వాటి భరతం పట్టేందుకు తాము చర్యలు చేపట్టామన్నారు. అనుమానిత కంపెనీలపై సెబీ కూడా దృష్టిసారించిందన్నారు. శుక్రవారం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి పైవివరాలు వెల్లడించారు. పాత చట్టాలు నకిలీ కంపెనీల పేరు తో ఆర్థిక అవకతవకలు పాల్పడేందుకు వెసులుబాటు ఉందన్నారు. దీన్ని సవరించాలన్నారు.


సైనిక పాఠశాలల్లో బాలిక ప్రవేశానికి చర్యలు

కేంద్ర రక్షణ శాఖఆధ్వర్యంలో నడుసున్న పాఠశాలల్లో బాలిక ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపింది. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి సుభాష్ భర్మే శుక్రవారం పేర్కొన్నారు. ఈ విషయంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తమకు సూచించిందని చెప్పారు. ప్రస్తుతం సైనిక్ స్కూల్స్ నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయన్నారు.

ఆర్టికల్ 370 ఉంటుంది

- జమ్మూ కశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ
- ప్రధాని తనకు హామీ ఇచ్చారని వెల్లడి
- ఆర్టికల్ 35ఏ ఉండడం సంకీర్ణ అజెండాలో భాగం

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లో కలపాలన్న ఆలోచనే ఆర్టికల్ 35ఏ తో రాష్ట్రా నికి ప్రత్యేక హోదా ఇచ్చిందని, దానిని తొలగించరాదని కశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ అన్నారు. శుక్రవారం ప్రధాని మోడీ కలిసిన మెహబూబా ముఫ్తీ, ఆర్టికల్ 370ని తొలగించబోమని తనకు హామీ లభించిందని చెప్పారు. ఆర్టికల్ 35ఏ అనేది సంకీర్ణం అజెండాలో భాగమని తెలిపారు. అది తీసేస్తే సంకీర్ణం ఉనికికే ప్రమాదమని అర్థం వచ్చేలా మాట్లాడిన ముఫ్తీ,



సంకీర్ణం అజెండాను 100 శాతం కాపాడతానని హామీ ఇచ్చారని చెప్పారు. ఇటీవలే ఆర్టికల్ 35 ఏను సుప్రీం కోర్టులో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలైంది. ఈ ఆర్టికల్ ద్వారానే జమ్మూ కశ్మీర్ ప్రభుత్వానికి ఆ రాష్ట్రంలోని శాశ్వత నివాసితులుగా పౌరులను గుర్తించే అధికారం లభిస్తుంది. వారికి మిగిలిన వారికంటే ప్రత్యేక హక్కులు ఉంటాయి. ఈ విషయంలో ఇప్పటికే నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కూడా ముఫ్తీ కలిసారు. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ బీజేపీ శాఖ అధికార ప్రతినిధశి ఆర్టికల్ 35ఏ, 370లను తొలగించే సమయం వచ్చిందని గురువారం వ్యాఖ్యానించారు. దీంతో జమ్మూ కశ్మీర్‌లో రాజకీయ వేడి రాజుకుంది. ఈ వివా దానికి 2014 లో బీజం పడింది. 'వుయ్ ది సిటిజన్స్' అనే ఎన్జీవో ఒకటి ఆర్టికల్ 35ఏను కొట్టేయాలని పిటిషన్‌ను దాఖలు చేసింది. దీన్ని 1954లో రాష్ట్రపతి ఉత్తరులు ద్వారా చేర్చారు. ఇందుకు రాష్ట్రపతికి అధికారం ఉందని రాష్ట్రప్రభుత్వం వాదించినా, సదరు చట్టాన్ని రాజ్యంగంలో చేర్చాలి. అయితే.. ఇం దుకు కేంద్రం కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో జమ్మూ కశ్మీర్ సీఎం సంకీర్ణమే ప్రమాదంలో ఉందన్నట్లు వ్యవహ రించారు. ఆమె సోనియాను కూడా కలుస్తారని వార్తలు వచ్చినా ప్రధాని హామీ నేపథ్యంలో కలుస్తారా? లేదా? అన్నది తెలియడం లేదు.



పల్లెకెలెలో
పలకరించేనా!

గాలెలో భారీ తేడాతో గెలుపు.. కొలంబోలో ఇన్నింగ్స్ విజయం. వరుసగా 8 సిరీస్‌లలో అప్రతిత జైత్రయాత్ర... ఇంక మిగిలింది... విదేశీ గడ్డపై వైట్ వాష్ రికార్డు. ఇదీ ఇపుడు భారత జట్టు ముందున్న లక్ష్యం. కోహ్లి సేనను ఆ అరుదైన రికార్డు ఊరిస్తోంది. ఆ రికార్డు టీమ్‌ఇండియాను పల్లెకెలెలో పలకరిస్తుందా! విదేశాల్లో ప్రత్యర్థిని తొలి వైట్ వాష్ చేసిన తొలి భారత జట్టుగా చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందా? శనివారం ఉదయం సుందరమైన పల్లెకెలె మైదానంలో బలహీనమైన శ్రీలంకతో చివరిదైన మూడో టెస్టు ఆరంభం కాబోతోంది. కోహ్లి సేన తన ప్రత్యర్థిని గత రెండు మ్యాచ్‌లలో మాదిరిగానే ఇక్కడ కూడా చిత్తు చేసి ఆ ఘనతను దక్కించుకుంటుందా? ఐతే వర్షం రూపంలో ముప్పు పొంచివుంది. వరుణుడు అడ్డుకోకుంటే భారత్ ఆశలు నెరవేరుతాయేమో చూడాలి.

- వైట్‌వాష్‌పై కోహ్లిసేన కన్ను
- నేటి నుంచి లంకతో మూడో టెస్టు
- పొంచివున్న వర్షం ముప్పు

ఉదయం 10 గం. నుంచి సోనీ సిక్స్, టెన్ 3లో

పల్లెకెలె: రెట్టించిన కదనోత్సాహంతో ఉరకలు వేస్తున్న కోహ్లి సేన.. ఇప్పటికే వరుస పరాజయాలతో నీరసించిన లంకను మట్టికరిపించి అపూర్వ రికార్డును సొంతం చేసుకోవాలని కృతనిశ్చయంతో ఉంది. జట్టుకు లోటల్లా రెండో మ్యాచ్‌లో ఒంటిచేత్తో లంక బ్యాటింగ్‌ను కూలగొట్టిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా లేకపోవడమే. కానీ ప్రత్యర్థి జట్టుకు కూడా ఇదే విధమైన సమస్య వేధిస్తోంది. గాయం కారణంగా తమ ప్రధాన స్పిన్ ఆయుధం రంగన్ హెరాత్‌ను లంక కోల్పోయింది. అతనితో పాటు పేసర్ నువాన్ ప్రదీప్ కూడా జట్టుకు దూరమ య్యాడు. దీంతో సరైన బలాలు లేక లంక నిర్వీర్యమైంది. వీరి స్థానంలో పేసర్లు చమీర, లహిరు కుమార జట్టులోకి వచ్చారు. గాలెలో ఆడిన బ్యాట్స్‌మన్ గుణతిలకను తప్పించారు.

టాస్ గెలిచిన జట్టు ఈ పిచ్‌పై ముందుగా బ్యాటింగ్ చేయడానికే ఇష్టపడుతుంది. ఐతే కాండీలో వర్షం పడడంతో పిచ్‌ను కప్పి ఉంచారు. దీంతో వికెట్‌పై కొంత తేమ ఉంది. దీంతో తొలిసెషన్లో బ్యాట్స్‌మెన్ శ్రమించాలి. గత రెండు మ్యాచ్‌ల కంటే ఈ వికెట్ భిన్నమైంది. గాలె, కొలంబోలో మాదిరిగా 600 స్కోరు సాధ్యం కాకపోవచ్చు.

తుది జట్టులోకి భువి, కుల్‌దీప్! : మైదానంలోని పిచ్‌పై పచ్చిక ఉండడంతో జట్టులోకి పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను తీసుకోవాలని కోహ్లి భావిస్తున్నాడు. జడేజా స్థానంలో మూడో సీమర్ గా భువిని తీసుకుంటే.. గతంలో మాదిరిగానే తన నమ్మకాన్ని నిలబెడతాడని కోహ్లి విశ్వసిస్తున్నాడు. పిచ్ సీమ్‌కు అనుకూలించేట్లయితే పాండ్యకు బదులుగా భువి జట్టులోకి వస్తాడు. అపుడు జడేజా స్థానాన్ని స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ భర్తీ చేస్తాడు. బాగా బౌన్స్ అయిన ధర్మశాల పిచ్‌పై ఆస్ట్రేలియాను కుల్‌దీప్ ముప్పుతిప్పలు పెట్టాడు. ఇంతవరకు తాను సారథ్యం వహించిన 28 టెస్టుల్లో కోహ్లి ఏనాడూ ఒకే జట్టుతో ఆడకపోవడం విశేషం. ఇదే సంప్రదాయాన్ని కోహ్లి కొనసాగించే అవకాశాలే ఎక్కువ.

రెండుసార్లే: జట్టు కూర్పు ఎలా ఉన్నా లంకపై పూర్తి టెస్టు సిరీస్‌ను గెలిచినట్టయితే కోహ్లి సేన గత 85 ఏళ్లలో ఏ భారత జట్టూ సొంతం చేసుకోలేని ఘనతను దక్కించుకుంటుంది. ఐతే టీమ్‌ఇండియాకు భారత్‌లోనూ పెద్దగా వైట్‌వాష్ రికార్డుల్లేవు. భారత జట్టు రెండు సార్లు ఆ రికార్డును తమ ఖాతాలో వేసుకోగలిగాయి. 1993లో అజహర్ నేతృత్వంలో ఇంగ్లాండ్‌ను, 1994లో లంకను భారత జట్టు వైట్‌వాష్ చేసింది.

పిచ్: పల్లెకెలె పిచ్ సాధారణంగా పేస్ బౌలర్లకు అనుకూలంగా ఉంటుంది. వికెట్‌పై పేస్, బౌన్స్ ఉంటుంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి తొలి రెండు రోజులు సీమ్ మూవ్‌మెంట్ ఉంటుందని చెప్పొచ్చు. ఈ మైదానంలో తేమ ఎక్కువ.

వాతావరణం: మ్యాచ్ జరిగే రోజుల్లో వర్షం పడే సూచనలున్నాయి.


తుది జట్లు (అంచనా): భారత్: శిఖర్ ధావన్, రాహుల్, పుజారా, కోహ్లి (కెప్టెన్), రహానే, అశ్విన్, సాహా (కీపర్), పాండ్య, భువనేశ్వర్/ఉమేష్, కుల్‌దీప్ యాదవ్, షమి.

లంక: ఉపుల్ తరంగ, కరుణరత్నే, కుశాల్ మెండిస్, చండిమాల్ (కెప్టెన్), మాథ్యూస్, డిక్వెల్ (కీపర్), ధనంజయ డిసిల్వ, పెరెరా, చమీర/లక్షణ్ సండకన్, విశ్వ ఫెర్నాండో, లహిరు కుమార.

5	పల్లెకెలె టెస్టులో గెలిస్తే.. కోహ్లి సేన 2015 నాటినుంచి లంకలో వరుసగా 5 మ్యాచ్‌లు గెలిచిన రికార్డును సొంతం చేసుకుంటుంది.
8	లంకలో భారత్ విజయాలు. పాక్ కూడా ఇన్నే మ్యాచ్‌లు గెలిచింది.
843	2017లో పుజారా ఇంతవరకు చేసిన పరుగులు.

అతనొక్కడే

- సత్తాచాటిన దేవిందర్
- జావెలిన్‌త్రోలో ఫైనల్‌కు
- పట్టుదలే పని చేసిందన్న పంజాబీ
- ప్రపంచ అథ్లెటిక్స్



లండన్: భారత జావెలియన్ త్రోయర్ దేవిందర్ కాంగ్ చరిత్ర సృష్టించాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జావెలిన్ త్రో పోటీలో ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించిన తొలి భారతీయుడిగా ఈ పంజాబ్ అథ్లెట్ రికార్డులకెక్కాడు. ఫైనల్ చేరేందుకు 83 మీటర్లు అర్హత మార్కు కాగా దేవిందర్ జావెలిన్‌ను 84.22 మీటర్ల దూరం విసిరాడు. అతను మూడో ప్రయత్నంలో ఈ మార్కును సాదించగలిగాడు. తొలిసారి ప్రపంచ అథ్లెటిక్స్‌లో పోటీ పడుతున్న మరో జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా కథ ముగిసింది. అతను మూడు ప్రయత్నాలలో జావెలిన్‌ను అవసరమైన దూరం విసరలేక పోయాడు. భారత శిబిరం నీరజ్‌పైనే ఆశలు ఎక్కువగా ఆశలు పెట్టుకుంది. భుజం గాయంతో బాధపడుతున్న దేవిందర్ గురువారం రాత్రి గ్రూప్ బి అర్హత రౌండ్‌లో పోటీ పడ్డాడు. మూడో ప్రయత్నంలో జావెలిన్‌ను 84.22 మీటర్లు విసిరాడు. అతను తొలి ప్రయత్నంలో 82.22 మీటర్లు, రెండో ప్రయత్నంలో 82.14 మీటర్ల దూరం విసిరాడు. మూడో ప్రయత్నంలో ఒత్తిడిలోనూ శక్తినంతా కూడ దీసుకొని 84.22 మీటర్ల దూరం సాధించాడు. దేవిందర్ ఫైనల్‌కు అర్హత సాధించిన వారిలో ఏడో స్థానంలో నిలిచాడు. ఈ అర్హత పోటీలో చివరిగా విసిరింది దేవిందరే. అతను ఫైనల్‌కు చేరడంతో భారత శిబిరం ఊపిరి తీసుకుంది. శనివారం ఫైనల్ రౌండ్ జరుగుతుంది. ఫైనల్లో మొత్తం 13 మంది పోటీ పడతారు. ''ఫైనల్ రౌండ్‌కు నీరజ్ అర్హత సాధించలేదన్న సంగతి తెలిసిన తర్వాత నేను అర్హత సాధించాలన్న పట్టుదల నాలో పెరిగింది. దేశం కోసం ఏదైనా చేయాలనుకున్నాను. ఇంత వరకు ఏ భారతీయుడూ చేయని పనిని నేను చేయాలనుకున్నాను. దేవుడి దయ వల్ల దేశం కోసం ఈ మాత్రం చేయగలిగాను'' అని దేవిందర్ ఉద్వేగంతో చెప్పాడు. ''చివరిదైన మూడో రౌండ్‌కు ముందు స్ట్రెచింగ్‌లో సాయం చేయాలని లంకకు చెందిన నా మిత్రుడు వరుణను అడిగాను'' అంటూ తన కుడి భుజం గాయాన్ని దేవిందర్ చూపించాడు. ''శనివారం ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శన తో దేశానికి పతకం సాధించిపెడతాను'' దేవిందర్ నమ్మ కంగా చెప్పాడు. అంతకుముందు గ్రూప్ ఏ క్వాలిఫికేషన్‌లో పోటీపడ్డ 19 ఏళ్ల నీరజ్ ఫైనల్‌కు అర్హత సాధించలేక పోయాడు. రెండో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. మూడో ప్రయత్నంలో 80.54 మీటర్ల దూరం మాత్రమే విసరగలిగాడు.

కోచ్ లేకుండానే...

దేవిందర్ కాంగ్, నీరజ్, మహిళా త్రోయర్ అన్నురాణితో కూడిన భారత జావెలిన్ త్రో జట్టు కోచ్ లేకుండానే లండన్ వెళ్లింది. దీంతో దేవిందర్ క్వాలిఫికేషన్ రౌండ్లో భుజం స్ట్రెచింగ్‌లో లంక త్రోయర్ సాయం తీసుకోవలసివచ్చింది.

ఒకే ఓవర్లో ఆరు వికెట్లు

- ఇంగ్లాండ్‌లో 13 ఏళ్ల బాలుడి సంచలనం

లండన్: ఒకటి.. రెండు కాదు.. ఏకంగా ఆరు వికెట్లు. 13 ఏళ్ల పాఠశాల కుర్రాడు ఆరు బంతుల్లో ఆరు వికెట్లు తీసి సృష్టించాడు. అవన్నీ క్లీన్‌బౌల్డే కావడం విశేషం. ఈశాన్య ఇంగ్లాండ్‌లోని ఓ ప్రాంతంలో ఫిలడల్ఫియా క్రికెట్ క్లబ్ తరపున అండర్ 13 టోర్నీలో ల్యూక్ రాబిన్‌సన్ 6 వికెట్లు తీసి జట్టును ఒంటిచేత్తో గెలిపించాడు. ఈ ఫీట్‌ను అతని కుటుంబమంతా ప్రత్యక్షంగా తిలకించింది.

హాకీ జట్టుకు మరో ఓటమి

న్యూఢిల్లీ: భారత హాకీ జట్టు ఆరంభంలోనే ఆధిక్యంలో నిలిచినా చివరికి ఓటమి కొనితెచ్చుకునే అలవాటును మానుకోని టీమ్‌ఇండియా ఐరోపా పర్యటనలో రెండో ఓటమిని చవిచూసింది. బెల్జియంతో గురువారం రాత్రి జరిగిన పోరులో భారత్ 1-3తేడాతో ఓటమి చవిచూసింది. ఓ గోల్ వెనుకబడి కూడా బెల్జియం స్ఫూర్తిదాయక ప్రదర్శనతో వరుసగా మూడు గోల్స్ కొట్టి గెలిచింది.



ఆధిక్యంలోనే ఆనంద్

సెయింట్ లూయీస్ (యుఎస్ఏ): సింక్వెఫీల్డ్ కప్ చెస్‌లో ఆనంద్ ఎనిమిదో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ఈ రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్‌తో తలపడ్డాడు. ఈ డ్రా తర్వాత ఆనంద్ 5 పాయింట్లతో మాక్సిమ్‌తో కలిసి సంయుక్త ఆధిక్యంలో కొనసాగుతున్నాడు.

నీకెర్క్ ఆశలకు గండి

- 200మీ. పరుగులో స్వర్ణం ఎగరేసుకుపోయిన రామిల్ గులియేవ్

లండన్: ప్రపంచకప్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఓ సంచలనం. 400మీ. స్వర్ణంతో పాటు 200మీ. పసిడిని కూడా కొల్లగొడదామనుకున్న దక్షిణాఫ్రికా అథ్లెట్.. వేడ్ వాన్ నీకెర్క్ ఆశలకు రామిల్ గులియేవ్ (టర్కీ) గండికొట్టాడు.



గురువారం రాత్రి జరిగిన పోటీలో అతను రేసును 20.09 సెకన్లలో పూర్తిచేసి 200 మీ. స్వర్ణాన్ని ఎగరేసుకుపోయాడు. రెండు రేసుల్లోనూ పసిడిని దక్కించుకొని అథ్లెటిక్ దిగ్గజం మైకేల్ జాన్సన్ రికార్డును సమం చేద్దామనుకున్న నీకెర్క్ ఆశలపై రామిల్ నీళ్లు చల్లాడు. నీకెర్క్ 20.11 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రజతంతో తృప్తి పడ్డాడు. ట్రినిడాడ్, టబాగోకు చెందిన జరీమ్ రిచర్డ్ ఇదే సమయంలో రేసును పూర్తిచేసి కాంస్యం దక్కించుకున్నాడు. ''ఇది ఎంత మాత్రం షాక్ కాదు. ఈ పతకం గెలవాలని అనుకున్నాను. ఈ ఏడాది సాధ్యం కాగలదని భావించాను. మనసులో అదే ఆలోచనతో ఉన్నాను'' అని రేసు అనంతరం గులియేవ్ చెప్పాడు. ''రజతానికి మాత్రమే నేను అర్హుణ్ని కాదని చాలామందికి తెలుసు. చాలా కష్టపడ్డాను. 400 మీ. పసిడి గెలిచిన నాకు సరైన గౌరవం దక్కిందని భావించడం లేదు. కాని నా ఆధిపత్య ప్రదర్శనకు ఇది ఆరంభం మాత్రమే'' అని నీకెర్క్ ఆవేదనతో అన్నాడు.



వన్డేల్లోనూ ఆడతా



కాండీ: లంకతో పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌లో తనకు విశ్రాంతినిస్తారన్న ఊహాగానాలకు తెరదించుతూ.. కెప్టెన్ విరాట్ కోహ్లి వన్డేల్లో ఆడేందుకు సిద్ధమేనని ప్రకటించాడు. ఆ సిరీస్‌లో ఆడేందుకు తనకు ఎలాంటి సమస్యలేదని స్పష్టం చేశాడు. ''నేను ఆడడం లేదని ఎవరు చెప్పారు. ఈ వార్తలు ఎక్కడి నుంచి వచ్చాయో నాకు తెలియదు. లంకతో వన్డేలు ఆడడానికి నాకు ఎలాంటి సమస్య లేదు'' అని కోహ్లి శుక్రవారం కరాఖండిగా చెప్పాడు. జడేజాపై నిషేధం గురించి ప్రస్తావిస్తూ.. ఐసీసీకి తన నిబంధనలను అమలుచేయడంలో ఎంతో నిలకడగా ఉండాలని సూచించాడు. ఈ నిబంధనలను ఆటగాళ్లు అర్థంచేసుకోవాలని కూడా చెప్పాడు. ''ఈ నిబంధనలు ఇలాగే ఉంటాయని భావిస్తున్నాను. ఆటగాళ్లు కూడా వీటి గురించి బాగా తెలుసుకోవాలి. పరిస్థితులను బట్టి ఆ నిబంధనలు మారకూడదు. ఐసీసీ నిబంధనల అమలులో నిలకడగా ఉంటే ఆటగాళ్లకు కూడా వాటి గురించి బాగా అవగాహన ఉంటుంది'' అన్నాడు.

దేవుడికంటే బీసీసీఐ ఎక్కువకాదు



న్యూఢిల్లీ: తనపై విధించిన జీవిత కాల నిషేధాన్ని ఎత్తివేస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలు చేయాలని బీసీసీఐ నిర్ణయించడంపై పేసర్ శ్రీశాంత్ మండిపడ్డాడు. కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేయాలని బోర్డు గురువారం నిర్ణయం తీసుకుంది. దీనిపై శ్రీశాంత్ ట్వీట్ చేశాడు. ''బీసీసీఐ.. నేను అడుక్కోవడం లేదు. నా బతుకు తెరువును నాకు తిరిగి ఇమ్మంటున్నాను. అది నా హక్కు. మీరు భగవంతుడి కంటే ఎక్కువ కాదు. నేను మళ్లీ ఆడతాను'' అన్నాడు.

గుజరాత్ చేతిలో యు ముంబా చిత్తు



అహ్మదాబాద్‌లో శుక్రవారం రాత్రి జరిగిన మూడో దశ లీగ్ పోరులో గుజరాత్ ఫార్చ్యూన్స్ బోణీ కొట్టింది. గుజరాత్ 39-21 తేడాతో యు ముంబాను మట్టికరిపించింది

నాదల్‌కు టీనేజర్ షాక్

- ఫెర్రర్‌పై గెలిచి క్వార్టర్స్‌కు ఫెదరర్
- మాంట్రియల్ మాస్టర్స్ టెన్నిస్

మాంట్రియల్: మాంట్రియల్ మాస్టర్స్ టెన్నిస్‌లో టాప్ సీడ్ రఫెల్ నాదల్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. ప్రిక్వార్టర్స్‌లో నాదల్‌కు కెనడా టీనేజర్ డెనిస్ షపవలోవ్ 3-6, 6-4, 7-6(4)తో షాకిచ్చాడు. మరోపోరులో రోజర్ ఫెదరర్ తన చిరకాల ప్రత్యర్థి డేవిడ్ ఫెర్రర్‌ను మట్టికరిపించి క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. హోరాహోరీగా జరిగిన పోరులో నాదల్ తొలి సెట్‌ను 6-3తో గెలుచుకున్నప్పటికీ రెండో సెట్‌లో అద్భుతంగా పోరాడి డెనిస్ 6-4తో సొంతం చేసుకున్నాడు. ఇక నిర్ణయాత్మక మూడో సెట్ పోరు నువ్వానేనా అన్నట్లు సాగింది. టైబ్రేకర్‌కు దారితీసిన ఈ సెట్లో డెనిస్ ఒత్తిడిని తట్టుకొని 7-6(4)తో గెలుచుకున్నాడు. ఫెదరర్ 4-6, 6-4, 6-2తో స్పెయిన్ క్రీడాకారుడు డేవిడ్ ఫెర్రర్‌ను మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్ చేరాడు. ఫెర్రర్ చేతిలో ఇంతవరకు ఓడని ఫెదరర్‌కు అతనిపై ఇది 17వ విజయం. 14ఏళ్ల క్రితం ఫెర్రర్‌పై రోజర్ తొలిసారి గెలిచాడు. ''ఇంకా మెరుగ్గా ఆడగలనన్న నమ్మకం నాలో ఉంది. అందుకే నాకు చాలా సంతోషంగా ఉంది. డేవిడ్ ఇంకా మెరుగ్గా ఆడగలడు. మేం ఇద్దరం బాగా పోరాడాం. గెలుపు కోసం తీవ్రంగా శ్రమించాం'' అని ఫెదరర్ అన్నాడు.





మహేశ్వరికి కాంస్యం



ఆసియా షాట్‌గన్

అస్తానా (కజకిస్తాన్): ఆసియా షాట్‌గన్ ఛాంపియన్ షిప్‌లో మరో పతకం భారత్ ఖాతాలో చేరింది. స్కీట్ వ్యకిగత పోటీలో షూటర్ మహేశ్వరి చౌహాన్ శుక్రవారం 40 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది. చైనాకు చెందిన మెంగ్ 55 పాయింట్లు సాధించి స్వర్ణాన్ని ఎగరేసుకు పోయింది. థాయ్‌లాండ్ షూటర్ సుతియా 54 పాయింట్లతో రజతం వశం చేసుకుంది. భారత్ ఇంతవరకు ఈ ఛాంపియన్‌షిప్‌లో రెండు పసిడి, ఓ రజతం, మూడు కాంస్యాలు కైవసం చేసుకుంది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
Lively Interaction For Ever
లైఫ్
శనివారం 12
ఆగస్టు 2017

UNITED NATIONS INTERNATIONAL YOUTH DAY
2017 YOUTH BUILDING PEACE
#YouthDay #Youth4Peace #ActOn2250



- నేడు ప్రపంచ యువజన దినోత్సవం
- ఈ ఏడాడి థీమ్..,యువత శాంతిమంత్రం
- అన్ని రంగాలను శాసిస్తోన్న యువతరం
- తొందరగా నేర్చుకునే ఫాస్టర్ జనరేషన్
- నేటి యువత ఆవిష్కర్తలు,సృష్టికర్తలు
- సామాజిక చైతన్యంలో పెరిగిన యువత పాత్ర
- మాన్యుఫాక్చర్డ్ ఎమోషన్లో కొట్టుకుపోతున్నారా
- ఫాల్స్ లైఫ్ స్టైల్ తో యూత్ సతమతం
- భారత్లో 35శాతాన్ని మించిన యువజనులు
- భారతీయుడి సగటు వయస్సు 28ఏళ్లు
- సాంకేతికతను ఒడిసిపట్టిన యువత

ఫ్యూచర్ మాదే

> ఫ్యూచర్ వాళ్లదే. దానికి అవసరమైన ఇందనమూ వాళ్లే. వాళ్లు అవునంటే జాతి మొత్తం అవునంటుంది. లేదంటే లేదంటుంది. అదే రూలు. రాబోయె రోజులను ఏలబోయేది యువతరమే. అందుకే యువతకు ప్రపంచ దేశాలు సలామ్ కొడుతున్నాయి. అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. అయితే యూత్ అంతరంగం ఎలా ఉంది. వాళ్ల విధి-విధాన రూపకర్తలెవరూ . స్వయం నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వారికి ఉంటే... అది ఎంత వరకు వ్యవస్థను ఉద్ధరిస్తుంది. ఇదే ఇప్పుడు అందరి మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న. నిజానికి నిరుటి తరం యువతరానికి... నేటి యువతరానికి ఎంతో వ్యత్యాసముంది. ఆలోచనలు,ఆచరణలు అన్నీ విభిన్నంగానే ఉన్నాయి. ఎవర్గ్రీన్ యంగిస్థాన్ వివేకానంద చెప్పే మాటల ప్రకారం యూత్కు మించిన జాతి లేదు. వాళ్లే ప్రపంచ ఛోదకులు. ప్రపంచ యువజన దినోత్సవం సందర్భంగా నేటి యువత సమాజాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తుందో నేడు చూద్దాం.

నేటి యువత.... డెసిషన్ మేకర్స్

కళ్లెం లేని గుర్రాలకు యువతకు పెద్ద తేడా లేదనేది మెజారిటీ జనాల అభిప్రాయం. అయితే ఆ కామెంట్ కొంత వరకే వర్తిస్తుంది. పదిహేనేళ్ల క్రితం వరకు ఆ కామెంట్కు వెయిట్ ఉండేది. కాని మారుతోన్న కాలానికి తగ్గట్లుగా ఆ మాట కూడా ఇప్పుడు మారిపోయిందనే చెప్పాలి. ఎందుకంటే ఇక్కడ కళ్లేలు లేని గుర్రాల మాదిరిగా కుర్రాళ్లు ...ఎలా పడితే అలా దూసుకుపోవడం లేదు. దిశా నిర్దేశం చేసుకుంటూ దూసుకుపోతున్నారు. ఒకప్పటికీ నత్తనడక ఇవ్వాళ లేదు. ఏం చేసినా సూపర్ ఫాస్ట్. ఆ స్పీడ్లోను ఎంజాయ్మెంట్ను కోరుకుంటున్నారు. పాశ్చాత్తుల మాదిరిగా వీకెండ్స్లో వీర లెవెల్లో రెచ్చిపోతున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అనేది ఇక్కడ మనకు ప్రధానంగా కనిపిస్తోన్న మాట. ఎట్ ది సేమ్ టైమ్ బ్యాలెన్స్ అవ్వడం కూడా తెలుసుకున్నారు. విద్యావంతుల్లో తండ్రి మీద ఆధారపడటం అనే మాట



ఇప్పుడు టోటల్ గా మర్చిపోయారు.

వాళ్ల కాళ్ల మీద వారు బతుకుతూ సంసారాన్ని సింపుల్గా లాగేస్తున్నారు. అందుబాటులోకి వచ్చిన అవకాశాలుయువతను ఎక్కడికో తీసుకుపోయి కూర్చోబెడుతున్నాయి. ఒకప్పటిలా పొద్దస్తమాను కష్టపడితే వచ్చే డబ్బుతో ఆ రోజు మాత్రమే సంతోషంగా ఉండే రోజులు ఇప్పుడు పోయాయి. ఒక్కసారి సంపాదిస్తే నెలలు,సంవత్సరాల తరబడి కాలు మీద కాలేసుకు కూర్చునే రోజులు వచ్చేసాయి. ఇంకా సింపుల్ గా చెప్పాలంటే డెసిషన్ మేకర్స్గా నేటి యూత్ మారిపోయారు. తాము ముందుకుపోతూ తనతోటివారిని తమతో పాటు పైకెదిగేలా చేస్తున్నారు.

సరదాతో పాటు... సేవ కూడా

నేటి యువతలో సేవాగుణం కూడా ఎక్కువగానే కనిపిస్తూ ఉంది. ఒకప్పటి రోజుల్లో వయస్సులో పెద్ద వారే సేవా కార్యక్రమాలలో పాలు పంచుకోవడం చూసే వాళ్లం. నేటి రోజులు అలా లేవు. సమస్యలను పరిష్కరించడానికి నేటి యువతే ముందుగా రంగంలోకి దూకేస్తుంది. ఎవరో పెద్దవాళ్లు వచ్చి సమస్యను పరిష్కరిస్తారని అప్పటి వరకు వేచి చూసే ఓపిక వాళ్లకు లేదు. ఏదైనా సరే... క్షణాలలో పరిష్కారం అయిపోవాలి. నేడు ప్రపంచ వ్యాప్తంగా మన దృష్టికి వస్తోన్న ఎన్నో సమస్యల విషయంలో ముందుండి మంత్రాంగం నడిపిస్తుంది ఆధునిక యువతే. ఒక్కో సమస్యకు ఒక్కో పరిష్కారం వారు సూచిస్తున్నారు. దీనికి పెద్దల సహకారం కూడా తీసుకుని పనులను వేగవంతం చేస్తున్నారు. మీరు సరిగా పరిశీలించారో లేదో భూకంపాలు,ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు... స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలలో యువతే మనకు ఎక్కువగా కనిపిస్తున్నారు. సేవాగుణం పెద్దలకే ఉంటుంది.. కుర్రాళ్ల కు ఎక్కడ ఉంటుందని చెప్పేవారికి నేటి యువత సేవా కార్యక్ర మాలను ఓసారి చూస్తే మన అభిప్రాయాన్ని మార్చుకో వల్సిందే. యువత భాగస్వామ్యంలో సామాజిక కార్యక్రమాలలో 130 దేశాల్లో ఇండియా 73వ స్థానంలో ఉంది. ఒకప్పుడు ఈ ర్యాంకు వంద తర్వాత ఉండేది. రానున్న రోజులలో ఇండియా యూత్ ర్యాంక్ 30 లోపు వస్తుందని యుఎన్ భావిస్తుంది.

ఆధ్యాత్మిక చింతనా ఎక్కువే

భక్తిభావం మనకు ఎక్కువగా పెద్దలలోనే కనిపిస్తూ ఉంటుంది. నేడు పలు మతాలలో ఓసారి భక్తుల సంఖ్యను లెక్క కట్టినట్లయితే.. మునుపెన్నడూ లేని విధంగా యువత ఆధ్యాత్మిక చింతనపై చాలా మక్కువ చూపుతున్నట్లు స్పష్టమవుతుంది. పుణ్యక్షేత్రాలలో సందర్శనలోను వారే ఎక్కువగా కనిపిస్తూ ... కొత్త కాంతులను వెదజల్లుతున్నారు. ఆధ్యాత్మిక చింతనలో ఒకప్పటి మూసధోరణి ఇప్పుడు లేదు. అయితే ఆధ్యాత్మికంలో సీరియస్నెస్ కొంత వరకు తగ్గినట్లు స్పష్టమవుతుంది. ఎందుకిలా అనడిగితే... ఇప్పటికాలంలో ఇలాగే ఉండాలి. కడుపు మాడ్చుకుని ఉపవాసాలు గట్రా ఉండకూడదనేది వారు చెబుతున్న మాట. ఆరోగ్యరీత్యా అది కూడా నిజమే అనుకోండి. భక్తి అనేది మనస్సులో ఉండాలి గాని శరీరానికి కాదు కదా. నేటి యువతరం ఎంతటి పాశ్చాత్య సంస్కృతిలో కొట్టుకుపోతున్నప్పటికీ... ఆధ్యాత్మిక చింతనపై వారికున్న మమకారం కొత్త విషయాలను తెలుసుకునేలా చేస్తుంది.

ఎలా మొదలైందంటే...

1995లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ యువత కోసం చేపట్టిన ప్రపంచ కార్యాచరణ కార్యక్రమం పట్ల అవేర్నెస్ పెంచేందుకు.... ఆగస్ట్12 ప్రపంచ యువజన దినోత్సవ కార్యక్రమం చేయాలని సిఫార్సు చేసింది. అప్పటినుంచి ఏటేటా ఒక్కో థీమ్ను అనుసం ధానం చేస్తూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యువత సమస్యల పట్ల ప్రభుత్వాలు ఇతరులు శ్రద్ధ చూపేందుకు ఇదో అవకాశంగా మారింది. 2000 సంవత్సరంలో నిర్వహించిన తొలి ఇంటర్నేషనల్ యూత్ డేకు యువత భావి పౌరులు అనే థీమ్ తో నిర్వహించబడింది. ఈఏడాది వచ్చేసరికి యూత్ శాంతి జపాన్ని థీమ్గా తీసుకువచ్చింది.

ఫైర్ బ్రాండ్స్ ..నిగ్గదీసి అడుగుతారు

ఎక్కడైనా అన్యాయం జరిగితే గతంలో ఆ ఊరి పెద్దలో .. ఆ ఏరియా పెద్దమనిషో వచ్చి ..ఏమిటీ విషయం అని అడిగి పంచాయితీలు చేసేవాడు. ఇప్పుడు తప్పును తప్పు అని చెప్పడానికి ఎవరో పెద్దలే రానక్కర్లేదు. ప్రశ్నించే ఐదు గొంతుల్లో నాలుగు గొంతులు యువతవే ఉంటున్నాయి. కళ్లముందు అన్యాయం జరుగుతుంటే... చూస్తూ ఊరుకునే టైపు కాదు. వాళ్లది ఉరకలేసే ఉడు కురక్తం. తప్పు చేసిన వారిని చెడుగుడు ఆడేసుకుం టున్నా రు. అందుకే యూత్ గుమి గూడి ఉన్న ప్రాంతాలలో ఎవరైనా తప్పుచేయడానికి కూడా భయపడుతున్నారు. యూత్ కదా ఎంతైనా స్పీడనే మాట చెప్పుకోవడానికే కాదు ఆచరించడానికి కూడా ఉపయోగపడుతుంది. వారి పనుల్లో వేగం పెరిగింది. త్వరగా నేర్చుకునే తత్వం అలవ డింది. తాజాగా జరిగిన ఓ స్టడీలో 2020 సంవత్సరానికి భారతీయుల సగటు వయస్సు 29 ఏళ్లు. మన పొరుగు దేశం చైనీయుల సగటు వయస్సు 37ఏళ్లు.

యువతకు... దిశా నిర్దేశకులెవరు

యువతకంటూఎన్నో ఆలోచన లు,అభిప్రాయాలు ఉంటాయి. వారికి సరైన మార్గం చూపించి ముందు కు తీసుకు పోయే పెద్దలు కరువయ్యారు. కరువయ్యారు అనే కంటే వారే పెద్దలను దూరం చేసుకుంటున్నారు అనడం కరెక్టేమో. తోటి ఈడు వారైనా నేస్తాలు, సెర్చ్ ఇంజిన్లతోనే వారు తమఆలోచనలను పంచుకుం టున్నారు. అలాగనిచెప్పి... ప్రతి ఫ్రెండ్ అవసరమేరా ...అంటూ మాన్యుఫాక్చర్డ్ ఎమోషన్లో కొట్టుకుపోయే యువత రంగమైతే కాదిది. ఐతే తమ కార్యాల ను ఆచరణలో పెట్టే సమయంలో ఏవో తప్పటడుగులు



కొన్నికొన్ని పడు తుంటాయి. దానికోసమని ఒక్క సారిగా కట్టలు తెంచేసుకునే ఆవేశం రావడం మామూలే. మరి ఆ సమయంలో వారిని నియం త్రిం చేవా రు ఎవ రు. దీనికి సమా ధానం దొరకదు. ఒకవేళ ఇదీ అని ఎవరైనా చెప్పినా అది కాదు అని వితండ వాదం చేసేవారు ఎందరో. జీవితం పుట్టుకతోనే అందరికీ అన్ని తెలివితేటలను ఇచ్చేయదు కదా. లైఫ్లో కొన్ని దెబ్బలు తినడం తోనే అనుభ వాలు తెలుస్తాయి. అది ఉద్యో గమైనా, వ్యాపా రమైన. ఇలాంటి సందర్భా లలో యువ తకు తమ లోపాలు తెలుసొస్తాయి. అవి కూ డా తెలుసుకుంటూ అడుగు లు ముందుకు వేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించడం కోసం నేటి యువత అడుగులు ముందు కు వేయడం నిజంగా శుభపరిణామమే.

ఓ విశ్లేషకుడి అభిప్రాయం ప్రకారం.. ఇప్పుడు పుట్టే వాళ్లంతా కారణజన్ములే. దాంతో వారికి తెలియని మహత్తులేవో అబ్బినట్టు న్నాయి. అంతా వాళ్ల మయమే నడుస్తోంది ప్పుడు.వాళ్ల నాయక త్వమే రాజ్యమేలుతుంది. వారి గుణా గుణాలు ఆరోగ్యకరమైన వాతావరణం లోంచే పుట్టు కొచ్చినవా లేక వారిని వెనుకనుండి ఎవరైనా నడిపిస్తున్నారా. వారి వాక్ ధోరణి వారి వ్యవ హారశైలి మనకేం చెబుతున్నాయి. ఇలా ప్రశ్నించుకుంటూ పోతే ఎన్నో శేషప్రశ్నలు మన మదిలో మెదులుతుంటాయి. అయితే చివరగా మనం వారి ఆలోచనలను గౌరవిస్తూ... తప్పుడు మార్గంలో వెళితే మంచిచెడులు గురించి చెబుతూ వారిని నియంత్రించాలి తప్ప.. వారు వెళ్లే మార్గం ఏంటో తెలియకుండానే చెక్ పెట్టాలనుకోవడం కరెక్ట్ కాదు.

ప్రపంచ యువజన దినోత్సవం అంటే ఏదో ఒక థీమ్ అనుకుని ఈవెంట్ చేసుకుని వెళ్లిపోవడం కాదు. అసలెందుకు నేడు వరల్డ్ యూత్ డేను చేసుకుంటున్నామో స్పష్టమైన అవగాహన ఏర్పరు చుకోవాలి. అప్పుడే మనం సెలబ్రేట్ చేసుకునే యూత్ డేకు విలువంటూ ఉంటుంది. ప్రతి ఏడాదిలాగానే ఈఏడాది కూడా యునైటెడ్ నేషన్స్ ఇచ్చిన థీమ్ .. యువత శాంతి మంత్రాన్ని జపించడం. యూత్ ఎంత శాంతికాముకులుగా ఉంటే ప్రపంచంఅంత ప్రశాంతంగా ఉంటుందనేది యుఎన్ ఉద్దేశ్యం. యువత పీస్ఫుల్గా ఉండడానికి ప్రయత్నిస్తే ఎన్నో సమస్యలకు మనం పరిష్కారం వెతికినవారమవుతాం. సో యూత్ అనుకుంటోన్న వారంతా ఆవిధంగా ఉండడానికి తమ వంతు ప్రయత్నం తాము చేయాలి. సరికొత్త శాంతి ప్రపంచాన్ని సృష్టించాలి.

- సూర్యమ్ కలిదిండి



నేటి యువత అన్ని రంగాల్లోను ముందుంటున్నారు. ఎంతో వేగంగా మంచి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక్కడ వారు తీసుకునే డెసిషన్స్.. ఇష్యూలు సృష్టించని కరెక్ట్ డెసిషన్స్ అయ్యుండాలి. అయితే తీసుకునే నిర్ణయాల విషయంలో రెండుకు మూడుసార్లు ఆలోచించి తీసుకోవడం ఉత్తమం. ఆవిధంగా చేస్తే ఆ తర్వాత ఏదో జరుగుతుందనే భయాలు వారిలో తొలగిపోతాయి. అలాగే సామాజిక కార్యక్రమాలలో యువత చూపుతోన్న చొరవ నిజంగా హర్షించదగిన విషయం. పెద్దలకు కూడా వారు మార్గదర్శకులుగా మారడం నేటి యువతలో కనిపించే... మంచి లక్షణం.

బి. మల్లారెడ్డి ,ఐపిఎస్
ఎం.డి. తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్





గతంతో పోల్చుకుంటే నేటి యువతలో ఇంటిలిజెన్సీ ఎక్కువగా ఉంది. వారికి ఎనర్జీ ,మోటివేషన్, ఇంట్రస్ట్ లు, కెరీర్ ఆప్షన్స్ కూడా ఎక్కువగానే ఉన్నాయి. వారు వీటిని కరెక్ట్గా యుటిలైజ్ చేసుకుంటే మంచి భవిష్యత్ను బిల్డ్ చేసుకోవచ్చు. ఐతే వారు ఈ స్పీడ్లో పడిపోవడం వలన కల్చర్ బ్రేక్ డౌన్ ఎక్కువగా అవుతుంది. ఆ రోజులకు ఈ రోజులకు వ్యత్యాసం ఎంతో ఉంది. ఇప్పుడు అవకాశాలు వెతుక్కుని మరీ వస్తున్నాయి. ఇప్పటి యవతరం తమకు వచ్చిన అవకాశాలను సరిగా సద్వినియోగం చేసుకుంటే మాత్రం దేశానికే కాదు.. ప్రపంచానికే వెలుగునిచ్చిన వారౌతారు.

సైకాలజిస్ట్, నరేష్ వడ్లమాని

సైనికులకు యువ సాయం

బుర్ర ఐడియాల పుట్ట అయితే మెరుపులాంటి ఆలోచనలే వస్తుంటాయి. అందుల్లోను యువరక్తమైతే దేశం కోసం ఏదో చేయాలనే తాపత్రయం మరింత పెరిగిపోతుంటుంది. ఒరిస్సాకు చెందిన నీల్మాధబ్ లోను ఇదే కసి తోటి స్నేహితులకు కనిపించింది. వీడు దేశం కోసం ఏదో చేసేసేలా ఉన్నాడనుకున్నారు. అనుకున్నట్లుగానే మన సైనికులకు పని తగ్గించే ప్రయోగాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశాడు. దానిలో భాగంగా సైనిక అవసరాల కోసం ఆర్టిఫిషియల్ ఆల్గారిథమ్ ఆధారంగా తయారుచేసిన హ్యూమనాయిడ్ రోబోను తయారుచేశాడు. ఎందరో మేదావులను ఆలోచించేలా చేసాడు.

నీల్మాధబ్ రూపొందించిన ఆటమ్ 3.7 అనే రోబో మన బోర్డర్లో సైనికుడిగా కాపలా కాస్తుంది. అక్కడితో ఊరుకోకుండా కావల్సిన వినోదాన్ని అందిస్తుంది. తెలియని టాపిక్ను మనకు అర్థమయ్యే విధంగా బోధిస్తుంది. అంటే మనల్ని ఎడ్యుకేట్ చేస్తుంది. అలాగే మ్యానుఫ్యాక్చరింగ్ ,డొమెస్టిక్ సర్వీస్ లను సైతం అందిస్తుంది. దీంతో ఆటమ్ 3.7 గురించి రోబోటిక్స్ ప్రపంచంలో దేశవ్యాప్తంగా ఎంక్వైరీలు ఎక్కువైపోయాయి. ఓ ఇంటర్మీడియట్ కుర్రాడు ఇంత చిన్న వయస్సులో చేసిన ఈ ఆవిష్కరణతో.... తలానగర్ జూనియర్ కాలేజీకు మంచి పేరు వచ్చింది. అలాగే ఒరిస్సాలోని మిగతా కాలేజీలకు అతని ఫీవర్ పాకేసింది. ఇంటర్, ఇంజనీరింగ్ విద్యార్థులంతా ప్రయోగాల దిశగా అడుగులు ముందుకు వేస్తున్నారు.

ఏడాది కాలంగా రోబో తయారీలో నీల్మాధబ్ తర్ఫీదు పొందుతున్నాడు. దాదాపు 4లక్షలు ఖర్చు పెట్టాడు. 4.7 అడుగుల ఎత్తు, 30 కేజీల బరువుతో పాటు 14 సెన్సర్లు, 5 రిమోట్ కంట్రోల్ సిస్టమ్స్ ద్వారా ఇతను తయారుచేసిన ఆటమ్ 3.7... పనిచేస్తుంది. ఇక నీల్మాధబ్ గురించి తెలుసుకుంటే... చిన్నతనం నుంచి సైన్స్ ప్రయోగాలంటే చెవి కోసుకునేవాడు. ఎప్పుడూ సైన్స్ టాయ్స్ తయారు చేసేవాడు.



మూడో తరగతి చదువుతుండగానే... ఫస్ట్ సైన్స్ ప్రాజెక్ట్ చేపట్టాడు. ఆరోక్లాస్లో ఉండగానే హ్యూమనాయిడ్ రోబో తయారుచేయాలనే ఆలోచన వచ్చింది. అప్పటి మెచ్యూరిటీ అతనికి ఉపయోగపడలేదు. కసి పెరిగింది. పెద్ద వయస్సు వచ్చాక రోబో తయారుచేయాలనే పట్టుదల పెంచుకున్నాడు. ఆ సమయంలో కుమారుడి అతి ఆలోచనలు చూసి అతని తండ్రి ఆందోళన చెందాడు. కాని కుమారుడు సక్రమమార్గంలో చేస్తోన్న ప్రయోగాలు... టీచర్ల సలహాలు చూసి కొడుకును ఎంకరేజ్ చేయడం మొదలుపెట్టాడు.

ఇంటర్మీడియట్ కు వచ్చాక నెట్ ప్రపంచంపై గ్రిప్ సంపాదించి... మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నాడు. విపరీతమైన సెర్చ్లు చేశాడు. యూట్యూబ్ ను ఫాలో అయ్యాడు. ప్రయోగాలకు మరింత పదును పెంచాడు. కుర్రాడి పట్టుదల చూసి తండ్రి మెచ్చుకున్నాడు. నీల్మాధబ్ తయారుచేయాలనుకున్న మల్టిపర్పస్ రోబో ఖర్చు ఎక్కువగానే అవుతుంది. అందుకే రోబోటిక్స్ లో ఉన్నత చదువులు చదవాలని డిసైడ్ అయిపోయాడు. అవి చదివితే వచ్చే నాలెడ్జ్తో రోబోటిక్స్లో దేశానికి ఉపయోగపడే మరిన్ని అద్భుతాలు చేయెచ్చని అతని అభిప్రాయం. రోబోతోటే సరిపెట్టకుండా మహిళలకు రక్షణగా ఉపయోగపడే డ్రోన్ లు కూడా తయారుచేయాలనే తలంపుతో నీల్మాధబ్ ఉన్నాడు.

ధర్మం సర్వార్థ సాధకం



ధర్మంతో సంపాదించిన అర్థకామాలతో తృప్తి చెందేవాడు ఉత్తమ వ్యక్తి. వాటి సంపాదనకు ధర్మ మార్గాన్ని అవలంబించడమే కాక, ధర్మపు హద్దుతో వాటిని అనుభవించడం కూడా గొప్ప జీవితం.

విచ్చలవిడి సమాజం ఏ దృష్టితో చూసినా హానికరమే. నియమాలను గాలికొదిలేసిన సంఘటనలు పురాణాలలో కూడా ఉన్నాయి. ఆ నియమోల్లంఘన కారణంగా సమాజంలో అనాచారం, దురాచారం పెచ్చు పెరిగిపోయాయి. కాబట్టి నియమబద్ధమైన జీవితం గడపడమే మనిషికి మేలుచేస్తుంది. విచ్చలవిడితనం ఎప్పుడూ అనర్థాలకు దారి తీసి మనిషికి మనిషే శత్రువయ్యే స్థితి కల్పిస్తుంది.

ఊర్ధ్వ బాహుర్విరామ్యేష నహికశ్చిత్ శ్రుణోతిమాం।
ధర్మాదర్థశ్చ కామశ్చ సమ కిమర్థం న సేవ్యతే॥

సర్వ శాస్త్ర స్వరూపమైన మహాభారతంలో వ్యాసమహర్షి దీనిని పేర్కొన్నారు. ''రెండు చేతులు పైకెత్తి ఘోషిస్తున్నాను. ధర్మం వలననే అర్థకామాలు సిద్ధిస్తాయి. అటువంటి ధర్మాన్ని ఎందుకు ఆచరించరు?''. ధర్మం అనే బీజం నుండి వచ్చిన అర్థ కామాలే, జీవితానికి సార్థకతనీ, మోక్షఫలాన్నీ అందిస్తాయి అనేది దీని తాత్పర్యం. జీవన మూల్యాలను త్యజించిన సమాజంలో వ్యక్తులు స్వార్థచింతనయే పరమావధిగా జీవిస్తారు. సుఖాలు జుర్రుకోవాలనే కోరికతో సుఖాలు అందించే సాధనాలు కుప్పతెప్పలుగా కూడబెట్టుకోవాలనే ఆశ వారిలో పెరుగుతుంది. సుఖోపభోగం ముఖ్యం అనుకుంటారు. కట్టుబాట్లు గట్టున పెట్టి స్వైరవిహారం చేయాలి. సుఖం కోసం ఏదైనా చేయవచ్చు అనే ధోరణి ఆధునికత పేరుతో ప్రజలలో చోటు చేసుకుంటున్నది. సాధన సంపత్తులన్నింటిని కొద్దిమంది స్వాహా చేసేందుకు జరిగే ప్రయత్నమే పోటీకి దారితీస్తుంది.

ఆధునికులు ఆరోగ్యవంతమైన పోటీ వాంఛనీయమే అంటారు. అసలు పోటీ అనే పదంలోనే ఆరోగ్యానికి తావులేదు. మొదట్లో చాలా పవిత్రంగా కన్పించే ఈ పోటీ అనతికాలంలోనే అనేక వికృతులకు నెలవు అవుతుంది. ఆరోగ్యవంతమైన పోటీ స్వయంగా తాను బాగుపడడానికి ప్రేరణ అవుతుందని చెప్పినప్పటికీ తాను బాగుపడడానికి రెండోవాడిని చెడగొట్టే ప్రయత్నం సాగుతుంది. రెండోవాడిని చెడగొట్టడం ఎలా అన్నదానితో పోటీ తీవ్రతరమవుతుంది. చివరకు ఈ పోటీ సంఘర్షణకు దారి తీస్తుంది. ప్రతి వ్యక్తి సుఖపడాలని కోరుకుంటాడు. ఎంత సుఖం ఉన్నా ఇంకా సుఖం కావాలనుకుంటాడు. శరీరాన్ని ధరించి ఉన్నంతవరకు అవసరాలు తీర్చుకోక తప్పదు. కాని అదే సర్వస్వం అనుకొని శారీరక వాంఛల పరిపూర్తితో మునిగితేలడం సరికాదని పెద్దలు చెప్పారు. అన్ని సుఖాలు తాత్కాలికమైనవే. శాశ్వత సుఖం ఏదో, ఏమిటో, మనిషి వ్యక్తీకరించలేడు. కోరికలు తీరుతున్న కొద్దీ కొత్త కొత్త కోర్కెలు పుడతాయి. వాటిని తీర్చుకునేందుకు కొత్త కొత్త ఉపాయాలు వెతుకుతాడు. ఇంద్రియాలను సంతృప్తిపరచడానికే మొదటి స్థానం ఇస్తాడు. ఇంద్రియాల సృష్టిలోనే మాయను కల్పించాడు భగవంతుడు. అందువలన ఆ సుఖాలు దుఃఖాంతాలే అవుతాయి. సుఖాలు బయట లేవు అని గ్రహించలేడు. కోర్కెలను సంతృప్తిపరచడంలో సుఖం లేకపోతే అది మరెక్కడ ఉంది? సుఖం అనేది ఎక్కడో బయట లేదు. మనలోనే ఉంది అని ఇక్కడి తాత్త్వికులు నిర్ధారణ చేసారు. మన పూర్వజులు వారి స్వీయానుభవాలను పురస్కరించుకుని నిజమైన సుఖప్రాప్తికోసం కొన్ని మార్గదర్శక సూత్రాలను మన ముందు పెట్టారు. ప్రప్రథమంగా వారు చెప్పిందే మంటే మనస్సు అనేది వికలమై, చంచలంగా ఉంటే వారికి సుఖం ఎప్పుడూ లభించదు.

ధర్మంతో సంపాదించిన అర్థకామాలతో తృప్తి చెందేవాడు ఉత్తమ వ్యక్తి. వాటి సంపాదనకు ధర్మమార్గాన్ని అవలంబించడమే కాక, ధర్మపు హద్దుతో వాటిని అనుభవించడం కూడా గొప్ప జీవితం.

విచ్చలవిడి సమాజం ఏ దృష్టితో చూసినా హానికరమే. నియమాలను గాలి కొదిలేసిన సంఘటనలు పురాణాలలో కూడా ఉన్నాయి. ఆ నియమోల్లంఘన కారణంగా సమాజంలో అనాచారం, దురాచారం పెచ్చు పెరిగిపోయాయి. కాబట్టి నియమబద్ధమైన జీవితం గడపడమే మనిషికి మేలు చేస్తుంది. విచ్చలవిడితనం ఎప్పుడూ అనర్థాలకు దారితీసి మనిషికి మనిషే శత్రువయ్యే స్థితి కల్పిస్తుంది.

ఉపభోగాల పట్ల అపరిమితమైన కోరిక, ఆ కోరికలు తీర్చుకోవడానికి ఒకరిపై మరొకరికి జనించే కసి సుఖప్రాప్తిని కలుగజేయవని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. కాబట్టి జీవితంలో సంయమనం పాటించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అది వ్యక్తికి, సమాజానికి కూడా అన్వయిస్తుంది. సమాజాన్ని సంయమశీలంగా ఉంచడం సులువైన పనికాదు. అందుకుగాను మనవారు చతుర్విధ పురుషార్థాలు మన ముందుంచారు.

ధర్మం అనేది వ్యక్తిని సమాజాన్ని కూడా నియంత్రిస్తుంది. ధర్మం చేత నియంత్రించబడే అర్థకామాలు ఆరాధనీయాలవుతాయి. ఉపభోగ వస్తు సంపద, అధికారం, ధనం, ఆనందం, స్వేచ్ఛాయుత జీవనధర్మం చేత నిబద్ధితమై ఉండాలి. ఈ నియమ నిబద్ధిత జీవనం కొనసాగించే ప్రక్రియలో నిరంతరం మోక్షప్రాప్తికి సంబంధించిన ఆలోచన ప్రేరణనిస్తుండగ చిదానందభూతి పొందడం జరుగుతుంది. తద్వారా మోక్షప్రాప్తి కూడా సంభవం అవుతుంది. ధర్మ, అర్థ, కామ, మోక్షాలలోని ధర్మం మోక్షం అనే రెండు పురుషార్థాల నియంత్రణలో జీవనయానం కొనసాగాలి. ఉపభోగ వస్తు సంపద ఈ రెండింటి నీడతో సాగాలి. నదిలో రెండువైపులా ఉన్న ఒడ్డుల మధ్య ప్రవహిస్తున్నప్పుడు మాత్రమే నీరు ఉపయోగపడుతుంది. అలాకాక ఒడ్డును దాటి ప్రవహిస్తున్నప్పుడు గొప్ప విధ్వంసం జరుగుతుంది. అలాగే ఉపభోగాలనే నది కూడా ధర్మం, మోక్షం అనే ఈ రెండు ఒడ్డుల మధ్య ప్రవహిస్తున్నపుడే సుఖప్రాప్తి కలుగుతుంది. కాబట్టి చతుర్విధ పురుషార్థాల నడుమనున్న రెండు అనగా అర్థకామాల సంయమనం వానికి పరిమితులు నిర్ణయించుకుని తదనుగుణంగా వైయక్తిక, సామాజిక జీవనానికి అవసరమైన భౌతిక సంపదలను గురించి ఆలోచన చేయాలి. సామాజిక వ్యవస్థ ఈ పునాదులపై నిర్మింపబడాలి.

వ్యక్తిలో సహజంగా ఒక నియంత్రణని నిబద్ధం చేసే శక్తి ధర్మానికి ఉంది. ఈ విధమైన ధర్మాన్ని బాల్యం నుంచి అలవరచాలి. చట్టానికి దొరికినా దొరకకపోయినా ధర్మం, దైవం పరికిస్తున్నారనే స్పృహ ఉన్నప్పుడే మనిషి హద్దులు దాటడు. ధర్మాన్ని ఆర్జించిన వారికి సులభంగా అర్థకామాలు లభిస్తాయన్నది మహాత్ముల అభిప్రాయం. ఇహలోక సుఖాన్ని మోక్షాన్ని ప్రసాదించే శక్తి ధర్మానికి ఉందని కణాద మహర్షి నిర్వచించారు.

''యతోభ్యుదయ నిశ్రేయససిద్ధిః సధర్మః''

- గుమ్మా ప్రసాదరావు
భిలాయ్ నుంచి
09755110398

చింతన

నిత్యపూజలో నివేదించే పాలు కాచాలా?



'**క**వోష్ణం క్షీరం నివేదయేత్' అనగా పాలను గోరు వెచ్చగా భగవంతునికి నివేదించాలి. అంటే కాచిన పాలను మాత్రమే భగవంతుని నివేదనకు ఉపయోగించాలి. పాలేకాక ఎటువంటి పదార్థమైనా భగవంతునికి గోరు వెచ్చగా నైవేద్యం పెట్టాలి. కొన్ని ప్రత్యేక పూజలు వ్రతాలు సందర్భాలలో మాత్రమే పచ్చిపాలను, పండని కాయలను నివేదించాలి.



- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత

యజ్ఞాలు అనేక రకాలు



అధ్యాయం 4

శ్లోకం 25:

దైవమేవాపరే యజ్ఞం
యోగినః పర్యుపాసతే।
బ్రహ్మాగ్నావపరే యజ్ఞం
యజ్ఞేనైవోపజుహ్వతి॥

తాత్పర్యం

కొందరు యోగులు వివిధ యజ్ఞాల ద్వారా దేవతలను చక్కగా పూజిస్తారు. మరికొందరు పరబ్రహ్మమనే అగ్నిలో హోమం చేస్తారు.

భాష్యం

వివిధాలైన యజ్ఞాలను రెండు ప్రధాన వర్గాలుగా విభజించవచ్చు. ఒకటి లౌకిక సంపదలను త్యాగం చేయడం కాగా, రెండవది దివ్య జ్ఞాన ప్రాప్తి కోసం చేయబడేది. కృష్ణభక్తి భావనలో ఉన్న వ్యక్తి తనకున్న సర్వస్వాన్నీ భగవంతుని ప్రీత్యర్థం అర్పిస్తాడు. ఇతరులు తాత్కాలికమైన సుఖం కోసం దేవతలైన ఇంద్రుడు, చంద్రుడు వంటి వారిని పూజిస్తారు. ఇంకా ఇతరులు బ్రహ్మంలో లీనమయ్యేందుకు తమ వ్యక్తిత్వాన్నే అర్పిస్తారు. అయితే అర్జునుడు లాంటి భక్తులు మాత్రము సర్వాన్ని కృష్ణుని ప్రీత్యర్థమే చేస్తారు. కనుక తనకున్న సంపదలే కాక, తనను తానుగా అన్నింటినీ కృష్ణునికే అర్పించిన వారవుతారు. కాబట్టి అటువంటి వారు ప్రథమ శ్రేణి యోగి అనబడతారు. అయితే వారు తమ వ్యక్తిత్వాన్ని కోల్పోరు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

భారత పాలకుల వైజ్ఞానిక దృష్టి

జంతర్ మంతర్

భారతదేశం అనాదిగా విజ్ఞాన ఖని. ఈ దేశంలో ఆధ్యాత్మిక, తాత్త్విక శాస్త్రాలే కాదు. విజ్ఞాన సాంకేతికశాస్త్రాలూ వెల్లివిరిసాయి. అటువంటి వాటిలో జ్యోతిషం ఇప్పటికీ నిలిచి ఉంది. అప్పటిదే అయిన జ్యోతిష శాస్త్రం ఈనాటికీ గ్రహణాలూ వంటి వాటిని ఆధునిక శాస్త్రీయ పద్ధతులు, పరికరా లతో లెక్కించి చెప్పే వాటితో సమానంగా పంచాంగ కర్తలు చెప్పగలుగుతున్నారు. ఇది మన శాస్త్ర పటిమను వెల్లడిస్తోంది. ఇటువంటివే పలుశాస్త్రాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఆ తర్వాత మన దేశ భౌతిక శాస్త్ర విజ్ఞానం సన్నగిల్లింది. ఆ శాస్త్రం తెలిసున్నవారున్నా వారికి పోషణ కరువైంది. అయితే ప్రాచ్యపాశ్చాత్య ఖగోళ రీతులను కలబోసి ఒక రాజపుత్ర రాజు విజ్ఞాన శాస్త్రం ఆధారంగా నిర్మించిన నిర్మాణాలు ఇప్పటికీ ఆనాటి వారి విజ్ఞానానికి ప్రతీకగా నిలిచి ఉన్నాయి. అవే వాటిలో జంతర్ మంతర్‌లు ఒకటి. 18వ శతాబ్దం పూర్వార్థంలో జైపూర్‌కు చెందిన మహారాజా రెండవ జైసింగ్ ఐదు జంతర్ మంతర్‌లను నిర్మింపజేశారు. 1724నుంచి 1735 మధ్య వీటి నిర్మాణం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. జైపూర్, న్యూఢిల్లీ, ఉజ్జయిని, మధుర, వారణాసిల్లో ఇవి ఉన్నాయి. జైపూర్‌లోని జంతర్ మంతర్ అన్నిటి లోకి పెద్దది. ఇక్కడ అత్యధికంగా 19 యంత్రాలు ఉన్నాయి. వీటి పేర్లు చక్ర యంత్ర, దక్షిణ్ భిత్తి యంత్ర, దిగంశ, దిశ యంత్ర, ధ్రువ దర్శక పట్టిక, జయ ప్రకాశ్ యంత్ర, కపాలి, కనలి, క్రాంతి వృత్త, లఘు సమ్రాట్, మిత్ర, నాడివాలయ, పల్బ, రామ, రాశి వాలయ, షష్ఠాంశ, ఉన్నతాశ, బ్రిహత్ సమ్రాట్, యంత్ర రాజ యంత్ర. వీటిలో ఒక్కొక్కటి పలు ఖగోళ శాస్త్ర అంచనాలకు ఉపయోగపడతాయి. సూర్యుడు, చంద్రుడు, ఇతర గ్రహాల కదలికలను కను గొనేందుకు వాటి ఆధారంగా పట్టికలు తయారు చేసేందుకు ఈ జంతర్ మంతర్‌లోని యంత్రాలు ఉపయోగించేవారు. ఇక్కడ సూర్యుని గమనాన్ని బట్టి సమయాన్ని కొలిచే ప్రపంచంలోనే పెద్ద నీడ గడియారం (సన్ డయల్) ఉంది. సూర్యుడు ఆకాశంలో ఎగువకు లేచే కొద్దీ అక్కడి నుంచి ముందుకు ప్రయాణించే క్రమంలో నీడలు, వాటి పరిమాణం వంటి వాటిని బట్టి సమయాన్ని నిర్ణయించే పద్ధతికి ఈ నీడ గడియారం ఆధారం. సమయాన్నే కాక గ్రహణాల రాకడను గుర్తించేందుకు, వివిధ గ్రహ గతుల స్థానాలను తెలుసుకునేందుకు ఉపయోగించిన శిలా, లోహ యంత్రాలు ఇక్కడ ఉన్నాయి. కొన్ని మ్యూజియంలలో భద్ర పరిచారు. సమయాన్ని కచ్చితంగా, సరిగా లెక్కించే విధంగా ఈ పరికరాలు, యంత్రాలు ఉన్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులు వాటిని చూసి అబ్బురపడుతున్నారు. ఇటువంటి సమయాన్ని కొలిచేయంత్రాలు, అందుకు వీలైన నిర్మాణాలు వంటి వాటివి ఉన్న ప్రదేశాన్నే వారు జంతర్ మంతర్‌గా పిలిచేవారు. పేరులో ఉన్నట్టు ఇక్కడ జంతర్ అంటే యంత్రం అని అర్థం. యంత్రానికి జంతర్ అపభ్రంశ. మంతర్ అనేది మంత్రణ అంటే సంప్రతింపు, లెక్కగట్టడం అనే అర్థాన్నిస్తుంది. మొత్తానికి ప్రస్తుతమున్న రీతిలో యంత్రాలతో కాల గణన అని అర్థం. ఈ యంత్రాలలో కొన్ని ఇప్పటికీ పనిచేస్తున్నాయి. ఇక్కడి నిర్మాణాల్లో పలు ప్రాచీన నాగరికతల్లో అనుసరించిన ఖగోళ శాస్త్ర సిద్ధాంతాల పోలికలు కనబడతాయి.




జైసింగ్

ఇక్కడ జంతర్ మంతర్‌ల నిర్మాత రెండవ జై సింగ్ గురించి కొంత తెలుసుకోవలసి ఉంటుంది. జై సింగ్ అప్పటి మొగల్ చక్రవర్తి మహ్మద్ షా కోరిక మేరకు ఈ నిర్మాణాలు చేపట్టినట్లు చెబుతారు. జై సింగ్ స్వతహాగా విజ్ఞాన శాస్త్ర అభిలాష కలవాడు. చిన్నప్పటి నుంచే జైసింగ్ కొత్త కొత్త పరికరాలు తయారు చేయడం వంటివి చేసేవాడు. అతని అభి లాషకు, పరిజ్ఞానానికి మహ్మద్ షా తోడ్పాటు లభించింది. గ్రహగతులు వంటి వాటి గురించి పట్టికలు వంటివి తయారు చేయా లని మహ్మద్ షా ఈ నిర్మాణాలకు ప్రోత్సా హం ఇచ్చినట్లు చెబుతారు. రాజస్థాన్‌లోని అంబర్ సంస్థానానికి అధిపతిగా 11వ ఏటే జై సింగ్ అభిషిక్తుడయ్యాడు. ఈతని సంస్థానం మొగలుల పాలనలలో ఉండేది. అందువల్లనే ఇతనికి మొగలు చక్రవర్తితో పరిచయం ఏర్పడింది. అతడు ప్రాచ్య పాశ్చాత్య నిర్మాణాలు, విదేశీ ఖగోళ శాస్త్ర సిద్ధాంతాలు వంటివి పరిశీలించి వాటి సాయంతో తనకున్న విజ్ఞానంతో ఈ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఆయన స్వయంగా కొన్ని యంత్రాలు తయారు చేశాడని కూడా అంటారు.



శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

నిర్మలమైన భక్తే నిజమైన సేవ



శ్రీ రమణాశ్రమం
6-8-46

ఈరోజున ఒక భక్తులు భగవానునితో ''స్వామీ, తాము కొండమీద వుండగా కరక్కాయలు వచ్చిన సమాచారమేమి?'' అని అడిగితే ఇట్లా సెలవిచ్చారు భగవాన్: ''విరూపాక్షగుహలో వుండగా మలప్రవృత్తికిగాను రాత్రుళ్ళు ఒక్కొక్క కరక్కాయ తింటూ వచ్చాను. ఒకరోజున కరక్కాయలు పూర్తిగా అయిపోయినవి. పలనిస్వామి బజారుకు పోవాలని అనుకుంటూ వుంటే కరక్కాయల సంగతి శేషయ్యరుతో చెపుతావా? అన్నాను. 'త్రోవేగదా, వెళ్లేటప్పుడు చెప్పి వెడతా'నన్నాడు. ఆ మరుక్షణమే ఒక భక్తులు ఊరి నుండి వచ్చారు. వారప్పుడప్పుడు వస్తూ వుండేవారే. ఒక్కక్షణం వుండి బయటికి వెళ్లారు. కొంతసేపటికి పలని బజారుకు వెడదామని బయలుదేరాడు. ఇంతలో ఆ వెళ్లినవారు తిరిగి వచ్చి 'స్వామీ! తమ దర్శనం చేసుకొని ప్రక్కనున్న పల్లెలో పని వుండి బండీలో వెళ్లాను. నా బండీకన్న ముందే ఈ కరక్కాయలతో నిండిన గోనెలతో ఒక బండీ పోతూ వున్నది. ఒక గోనెకు చిల్లిపడి ఇవన్నీ దారికడ్డంగా పడినవి. ఎందుకైనా మంచిదని ఏరి తెచ్చాను. ఉండనీయండి స్వామీ' అన్నారు. అవన్నీ ఎందుకని రెండు మూడు వీశెలు ఎత్తిపెట్టి మిగతావి వారికిచ్చేశాం. ఈలాంటివి ఎన్నో జరిగినవి. ఎన్నని చెప్పగలం? అమ్మ వచ్చి వంట పెట్టిన వెనుక ఇనప గరిటె వుంటే బాగుండునే అనేదామె. చూద్దాంలే అనేవాణ్ణి. మర్నాడో మూడోనాడో అయిదారు రకాల గరిటెలు తెచ్చేవారొకరు. పాత్ర సామాను అంతే. ఇది ఉంటే బాగుండును. అది ఉంటే బాగుండును, అని అమ్మ అనటం, అట్లాగా? అని నేననటం, ఆరోజో, మర్నాడో, ఒకటికి పదిరావటం, చాలు చాలు బాబూ అనిపించేది. అవన్నీ ఎవరు కాపాడేది? ఇట్లాంటి సంభవాలెన్నో అంతేమిటి?'' అన్నారు భగవాన్.

''ద్రాక్షపళ్ళ సంగతేమిటి?'' అన్నారా భక్తులు. ''ఆ, అదీ ఇట్లాగే మలశోధనకు మంచిదని ఎవరన్నా తెచ్చి యిస్తే వాడుతూ వుండేవాళ్లం. ఒకరోజు పండ్లన్నీ అయిపోయినవి. ఎవరైనా అంగడికి వెడుతుంటే చెప్పనా అన్నాడు పలనిస్వామి. చూద్దాంలే, ఏం తొందర అన్నా నేను. అంతే. మరి కాస్సేపటికల్లా పట్నం నుండి గంభీరం శేషయ్య అన్న వచ్చారు చేతులో పెద్ద పొట్లం, ఏమయ్యా అంటే, 'ద్రాక్ష' అన్నారు. 'అరే, ఇంతకు ముందే అయిపోయినవని అనుకున్నాం. నీకెట్లా తెలిసిందయ్యా' అంటే, 'నాకేం తెలుసు, స్వామీ! ఇక్కడికి రాబోతూ రిక్తహస్తాలతో ఎట్లా పోవటమని బజారుకు వెళ్లాను. ఆదివారం గదా అంగళ్ళన్నీ మూసి వున్నవి ఒకటి తప్ప. 'భగవాన్ దగ్గరకు పోవాలి. ఏం వున్నదయ్యా' అన్నాను. 'ద్రాక్ష మాత్రం వున్నది. ఇవీ ఇంతకుముందే వచ్చిన'వని పొట్లం కట్టి ఇచ్చాడు. తెచ్చాను. ఇంతకుముందే స్వామీ నాకీ సంకల్పం కలిగింది!' అన్నారు వారు. వేళ సరిచూచుకుంటే ఒక్కటే అయింది. అయ్యా స్వామికిది బాగా అనుభవం. ఇక్కడ ఏదో ఒకటి వుంటే బాగని మేమనుకోటం. అదే సమయంలో భగవానులకిది తీసుకువెడదామని వారికి తోచటం జరిగేది. ఎట్లా తెలిసిందయ్యా నీకంటే ''ఏమో స్వామీ! నాకేం తెలుస్తుది. స్వామికీ వస్తువు తీసుకుపోవాలని తోస్తుంది? తెస్తాను. అంతే, మీరు అదే అనుకున్నామంటారు. ఈచిత్రం స్వామికే తెలియాలి' అనేవారు అయ్యా స్వామి. నిజంగా వారి మనస్సు అంత స్వచ్ఛంగా ఉంచుకునేవారు. ఇక్కడ మనమేది తరలిస్తే అక్కడ వారి మనస్సులో అదే ప్రతిఫలించేది'' అన్నారు భగవాన్. మన మనస్సును కల్మషం లేకుండా స్వచ్ఛమైన స్ఫటికం లాగ ఉండాలని వేరే చెప్పాలా! అయ్యా స్వామి జీవితమే అందుకు నిదర్శనం గదా!

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



సుమతి శతకము

తలనుండు విషము ఫణికిని
వెలయుంగా దోకనుండు వృశ్చికమునకున్
తలతోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ

తాత్పర్యం: పామునకు విషము నోటిలో ఉన్న కోరల్లో ఉండును. తేలుకు తోక చివర ఉండును. కానీ దుర్మార్గుడికి నిలువెల్లా విషమే.

బాలప్రభ

పొడుపు కథ

అడ్డగోడ మీద బుడ్డ చెంబు, తోసినా ఇటుపక్క పడదు. అటుపక్క పడదు.

వివేకం లేని విద్య




ఒక ఊరిలో నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. వారిలో ముగ్గురు సకల శాస్త్రాలను చదివారు. కానీ వారు వివేక శూన్యులు. అందరిలోకి చిన్నవాడికి మాత్రం చదువు రాకపోయినా మంచి వివేకం ఉంది. ఒక రోజున అన్నదమ్ములు కూడబల్కుని డబ్బు సంపాదించని విద్య ఉన్నందువల్ల ప్రయోజనం లేదని అనుకున్నారు. అందుకని వారు వారి విద్యలతో మహారాజును మెప్పించి, వారిచ్చిన కానుకలతో జీవితాంతం సుఖపడవచ్చని నిశ్చయించి ఆ మర్నాడే రాజధానికి బయలు దేరారు. వారిలో చిన్న వాడు కూడా తమతో బయలుదేరే సరికి, నువ్వెక్కడికి? అని అడిగారు ముగ్గురన్నలు. ''నేను కూడా మీతో పాటు వస్తున్నాను అన్నాడు చిన్నవాడు. వారు ముగ్గురూ బిగ్గరగా నవ్వుతూ నీవు మాతో వచ్చి ఏం చేస్తావు? నీకు చదువు చట్టుబండలు లేవుగదా! మేమే వెళ్లేది మహారాజుని కలవటానికి. అక్కడ మా విద్యలను ప్రదర్శించి వారి సత్కారాలను వారిచ్చిన ధన కనక వస్తు వాహనాలను అందుకోవటానికి వెళ్తున్నాం. నీకేమి విద్య వచ్చని ప్రదర్శిస్తావు అని హేళన చేశారు. అప్పుడు చిన్నవాడు ఎంతో వినయంగా వారితో ''అన్నలూ! మీకు వచ్చిన విద్యలలో మెచ్చి మీ కిచ్చే ధనరాశుల మూటలను మోసుకురావటానికి ఒక మనిషి అవసరం కదా! అందుకు నన్ను వినియోగించుకోండి అని ప్రాధేయపడ్డాడు.

మరునాడు నలుగురూ దేశాటనకు బయలుదేరారు. వాళ్లు కొంత దూరం ప్రయాణం చేశాక పెద్దవాడికి ఏదో ఆలోచన తట్టింది. మనలో చిన్నవాడు మంచి పండితుడేమీ కాదు. అలాంటివాడికి రాజాశ్రయం లభించడమనేది జరగని పని. వాడు తెలివైనవాడే కానీ అందువల్ల నాకు ఒరిగేదేమిటి? నేను సంపాదించే ధనంలో వాడికి ఒక్క రూపాయి కూడా ఇవ్వను. కనుక వాణ్ణి ఇంటికి పంపించేద్దాం అన్నాడు. అవునవును. నువ్వు చెప్పింది నిజం. నేను కూడా వాడికి ఒక్క రూపాయి ఇవ్వను అన్నాడు రెండోవాడు. కానీ వారి ఆలోచన మూడోవాడికి నచ్చలేదు. నేనందుకు ఒప్పుకోను. చిన్న నాటి నుండి మనం కలిసి చదువుకున్నాం. ఆటపాటల్లో కలసిమెలసి ఉన్నాం. ఇది మనది, అది ఇతరులది అనుకోవడం బుద్ధితక్కువ ఆలోచన. ఉదాహరణకు లోకమంతా ఒక్కటే అన్నారు పెద్దలు. కనుక వాడు మనతో పాటు వస్తే మన సామాను కూడా మోస్తానంటున్నాడు కదా! కాబట్టి వాడ్ని కూడా తీసుకుపోదాం.. అని తేల్చి చెప్పేసరికి మళ్లీ నలుగురూ కల్సి బయలుదేరారు. అలా ప్రయాణిస్తూ రాజధాని నగరం ప్రవేశించి మహారాజుని కల్సి వారి ముందు తమ విద్యలన్నీ ప్రదర్శించి ప్రశంసలను పొంది రాజుగారిచ్చిన అపారమైన ధనరాశులను స్వీకరించారు ఆ ముగ్గురన్నదమ్ములు. రాజధాని నుండి ఆనందంగా ఇంటి ముఖం పట్టారు వారు. అలా కొంతదూరం ప్రయాణించి ఒక అడవిలోకి ప్రవేశించారు. ఒకచోట వారికి కొన్ని ఎముకలు కనిపించాయి. అవి ఒక జంతువుకు సంబంధించిన ఎముకలని గుర్తించాడు పెద్దవాడు. దీన్ని బ్రతికించి మన విద్యలను చిన్నవాడైన మన తమ్ముడికి చూపిద్దాం. ఎటూ రాజుగారి దగ్గర చూడలేదు కదా వాడు అన్నాడు. అంటూనే ఆ ఎముకలను జాగ్రత్తగా పరిశీలించి వాటితో ఒక జంతువు ఆకారాన్ని కూర్చాడు.. నీవు కూర్చిన ఆకారానికి రక్తమాంసాదులను నేను సమకూరుస్తాను అని రెండో వాడు ముందుకొచ్చి మంచి వన్నె కలిగేటట్లుగా బలిష్టంగా ఉండేటట్లుగా ఆ జంతువుకి ఒకరూపు తీసుకొచ్చాడు. నేనే నా తక్కువ తిన్నది అని మూడోవాడు పౌరుషంగా ముందుకొచ్చి దీనికి ప్రాణం పోస్తాను అన్నాడు. తెలివిగల చిన్నవాడు కంగారుపడి పోయి మూడోవాడి చేయిపట్టుకొని ఆపుతూ అన్నా! తొందరపడకు. దాని ఆకారం చూస్తూ సింహం అని తెలుస్తోంది కదా! నీవు దానికి ప్రాణం పోస్తే మన ప్రాణాలుండవు అని నచ్చజెప్పబోయాడు. దానికి మూడోవాడు మూర్ఖుడా! వాళ్లిద్దరూ వాళ్లకి వచ్చిన విద్యని ప్రదర్శించారు. మరి నేను నా విద్యను చూపించవద్దా. తప్పుకో అంటూ చిన్నవాణ్ణి దూరంగా తోశాడు.

అన్నదమ్ములు ముగ్గురు కూడా తన మాటను లెక్క చేయలేదని చిన్నవాడు నిట్టూరుస్తూ అలాగే, నీకు వచ్చిన విద్యను నువ్వు తప్పక ప్రదర్శించాల్సిందే. కానీ ముందు నన్ను ఆ చెట్టు ఎక్కనివ్వు అన్నాడు. సరే వెళ్లు అన్నాడు. మూడోవాడు చిరాగ్గా వెంటనే చిన్నవాడు చెట్టు ఎక్కి కూర్చుని ఏం జరుగుతుందా అని చూస్తున్నాడు. ఆ తర్వాత మూడో వాడు సింహానికి ప్రాణం పోశాడు. ప్రాణం రాగానే సింహం నిద్ర నుంచి మేల్కొన్నట్లుగా పెద్దగా ఆవులించి జూలును ఒక్కసారిగా విదిలించి భయంకరంగా గర్జిస్తూ ఎదురుగా ఉన్న ఆ ముగ్గురినీ చీల్చి చంపేసింది. ఆ సింహం ఆకలి తీర్చుకుని ఆ ప్రదేశాన్ని విడిచివెళ్లిపోయింది. చెట్టెక్కి ప్రాణాలు దక్కించుకున్న చిన్నవాడు సురక్షితంగా చెట్టు దిగాడు. తన అన్నలు మూర్ఖత్వంతో చనిపోయినందుకు బాధపడుతూ వారు సంపాదించిన ధనంతో ఇంటిదారి పట్టాడు. తర్వాత కొంతకాలానికి పెళ్లిచేసుకుని భార్యా పిల్లలతో సుఖంగా జీవించసాగాడు.

-వులాపు బాలకేశవులు

పుస్తకాల తోట



హాయ్...!! నేస్తాలు.. మీకో మంచివార్త. మనకు కథలు వినడమన్న చదవడమన్న బోలెడు ఇష్టం కదా?? అవి ఎక్కడ దొరుకుతాయో తెలిస్తే మరింత బాగుంటుంది కదూ!!

అందుకే ఇక నుంచి ప్రతి శనివారం ఈ 'పుస్తకాల తోట' లో ఒక మంచి బాలపుస్తక సమాచారం సిద్దమైవుంటుంది. చకచకా చదివేయండిమరి.

శ్రీరాముడు కొలువైన భద్రాచలంకు చెందిన శ్రీధిరాలవెంకటాచారి తాతయ్యకు ఆయన చిన్నతనంలో వాళ్ల అమ్మమ్మ చెప్పిన నీతికథలను గుర్తుపెట్టుకుని వాటిన్నటిని చక్కగా తీర్చిదిద్ది ''అమ్మమ్మ కథలు'' పేరుతో మంచి కథలపుస్తకం అందించారు.

దీనిలో మొత్తం 21 కథలు భలేభలే బొమ్మలతో ఎంచక్కా ముస్తాబయ్యాయి. కథలన్నీ జానపదబాణీల్లో నడుస్తూ చక్కని హాస్యపు సంభాషణలతో భలేనవ్వులు పుట్టిస్తాయి తెలుసా! ప్రతి కథ చదవడానికి హాస్యపుకథలా ఉన్న చివర్లో చక్కని సందేశం అందించడలో రచయిత నైపుణ్యం కనిపిస్తుంది.

బుడ్డోడు- బుడ్డమ్మ, కారాకు- కీరాకు పులికి మేనమామ పిల్లి, బుల్లెమ్మ దెయ్యం వంటి కథల పేర్లు గమ్మత్తుగా ఉన్నాయి. ప్రతికథకు దానినేపథ్యం వివరిస్తూ ప్రారంభిస్తారు. అలనాటి కొన్ని ఆచారాలు, ఆహారపు అలవాట్లు, నాటి గ్రామాల చరిత్ర వంటి విలువైన విజ్ఞాన విషయాలు చెబుతూనే మంచినీతిని అందిస్తుంది ప్రతికథ.

ఈ కథలన్నీ ఊహించి వ్రాసినవికావు అనుభవంతో వ్రాసినవి. ఇవి చదవడం వల్ల మంచికథచదివిన అనుభూతే కాదు సంఘటనలను కథలుగా ఎలా వ్రాయవచ్చో కూడా అర్థం అవుతుంది.

పుస్తకం పేరు: అమ్మమ్మ కథలు
రచయిత: శ్రీధిరాల
పేజీలు: 66, ధర రూ 50/-
దొరికే చోటు శ్రీధిరాల వెంకటాచారి, శాంతినగర్, భద్రాచలం-507111, భద్రాది కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం సెల్: 7893637884
పరిచయకర్త: డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు

మీ లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలి



హాయ్ ఫ్రెండ్స్! ఏం చేస్తున్నారు. ఈ వారం మనకు జాతీయ పండుగ రోజు. ఆ రోజు మనమంతా సామూహికంగా పండుగ జరుపుకుంటాం. ఏమిటది? అని అడక్కండి.. అదే ఆగస్టు 15. మనకు స్వాతంత్ర్యం వచ్చిన రోజు అంటే గతంలో మనం బ్రిటీష్ వారి పాలనలో ఉండేవారం. మా దేశాన్ని మేం పరిపాలించుకుంటాం అని ఎంతో కష్టపడి, బ్రిటీష్ వారిని తరిమి కొట్టి 1947 ఆగస్టు 15వ తేదీనుంచి మన దేశాన్ని మనం పరిపాలించుకుంటున్నాం. అంటే ఇప్పటికీ 70 సంవత్సరాలైందన్నమాట. మనం మన కోసం మన వారిచేత పరిపాలించుకుంటున్నామన్నమాట. మనం ఎలా పాలించుకోవాలి? మన విధి విధానాలు ఏమిటి? అనే అన్ని అంశాలతో ఒక రాజ్యాంగాన్ని రాసుకుని అమలులోకి తీసుకొచ్చాం. ఆ రాజ్యాంగం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రూపొందింది. అందులో మన హక్కులు ఏమిటి? బాధ్యతలు ఏమిటి?మన హక్కులకు ఇబ్బంది కలిగితే ఏం చేయాలి?ఎవరి బాధ్యతలు ఏమిటి? అనే విషయాలు ఎంతో సుదీర్ఘంగా చర్చించి తయారుచేసారు. అది అన్ని దేశాలకంటే పెద్దది. ఈ రాజ్యాంగ నియమాల ప్రకారం మన దేశంలోని ఎవరైనా ఏ పదవినైనా అలంకరించేఅవకాశం ఉంది. మనది లౌకికరాజ్యం. అంటే భారతీయ పౌరుడై ఉండి ఏ కులం వాడైనా, ఏ మతం వాడైనా ఏ పదవిలోనైనా కొనసాగే అవకాశం ఉంటుంది. ఇక్కడ తరతరాల పాలనకు అవకాశం లేదు. ఎవరు ప్రతిభావంతులో ఎవరు కాదో ఓటరు నిర్ణయం మేరకు పాలన కొనసాగుతుంది. అయితే మనం మన నాయకులను ఎన్నుకుని భారత రాష్ట్రపతి పదవి మొదలుకుని గ్రామ సర్పంచ్ వరకు మనమే ఎన్నుకుంటాం. అయితే మనం ఓటు వేసే సమయంలోనే ఎవరు ఎలాంటి వారు అనే విషయాన్ని ఆలోచించాలి. తీరా ఓటు వేసి మీరు గెలిపించిన అభ్యర్థి గెలుపు సాధించిన తరువాత మన పనులు కావడం లేదని, లేదా బాగా లంచం తీసుకుంటున్నాడని సరిగా పనిచేయడం లేదని ఆరోపించడం మంచి పద్ధతికాదు. ఇక్కడ మరో విషయం చెప్పాలనుకుంటున్నాను. మీరు కూడా ఏదో ఒక రోజు ఉన్నత పదవిని అలంకరించవచ్చు. అందుకోసం మీరు ఇప్పటి నుంచేఒక ప్రణాళికసిద్ధం చేసుకోవాలి. ఆ పదవి పొందడానికి ఎలా కష్టపడాలి. పదవి లభించిన తర్వాత ఎలా కొనసాగాలో పూర్తిగా ఒక అవగాహన మీకు ఉండాలి. భారతరాష్ట్రపతిగా పనిచేసిన ఎపిజె అబ్దుల్ కలాం ఏ రోజు తాను ఆ పదవిలో కొనసాగుతానని ఊహించలేదు. అతడొక అంతరిక్ష శాస్త్రవేత్త. పిల్లలకు పాఠాలు చెప్పడమంటే మరీ ఇష్టం. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తర్వాత చివరిశ్వాస వరకు తన బోధనతోనే కాలక్షేపం చేసారు. అయితే కలలు కనుకుంటూ పడుకోవద్దు. మనం కనే కలలు మనం నిద్రపోకుండా చేయగలగాలి. నిరంతరం అవే ఆలోచనలతో సతమతం కావాలి. అప్పుడు మీరు ఏం సాధించాలనుకున్నది సునాయాసంగా అనుకున్నది సాధించగలరు. ఈ శుభ సందర్భంగా భారతీయ భావి పౌరులైన మీరంతా ఒక మంచి నిర్ణయానికి రావాలి. మన దేశ కీర్తిప్రతిష్టలను హిమాలయాలకంటే ఎత్తున నిలబెట్టడానికి ప్రయత్నం చేయాలి. కేవలం మీరు, మీ కుటుంబం, మీ పరిసరాలనే దృష్టిపెట్టుకోకుండా అభివృద్ధి చెందిన ప్రపంచదేశాల ముందు తలెత్తుకుని నిలబడేలా చేయాలి. అది మీ అందరి కనీస కర్తవ్యం. ఆల్‌దిబెస్ట్

- టి. వేదాంతసూరి

తేనె ఎలా తయారవుతుంది



పిల్లలూ! తేనె తిన్నారా ఎప్పుడైనా? ఎందుకంటే తేనెను తయారుచేయడానికి తేనెటీగలు ఎంతో కష్టపడతాయి. అది వాటి విధుల్లో ఒక భాగం. తేనెటీగలు కేవలం మానవుల ప్రయోజనం కోసమే తేనెను తయారుచేస్తాయా? లేదు. అవి ఆహారం కోసం తేనె మీద ఆధారపడతాయి. తేనెటీగల సంరక్షణా దినోత్సవం. నేటి ఆధుని జీవనశైలిలో భాగంగా మానవుడు తేనెను ఎక్కువగా వినియోగించడం వల్ల తేనెటీగల సంఖ్య తగ్గుతోంది. అసలు, తేనెటీగలు తేనెను, తేనెపట్టును ఎలా నిర్మించుకుంటాయో తెలుసుకుందాం!

తేనెటీగలు తేనెను ఎలా తయారు చేస్తాయి? తేనెటీగలు పువ్వుల నుండి మకరందాన్ని సేకరిస్తాయి. అవి ట్యూబుల్లాగా ఉండే దాని నాలుకలతో మకరందాన్ని పీలుస్తాయి. దాన్ని తన రెండు కడుపుల్లో ఒక దానిలో ఆ మకరందాన్ని దాచి తేనెపట్టులోకి చేరుస్తాయి. ఆ మకరందం వేరే తేనెటీగలకు బదిలీ చేయబడుతుంది. ఆ తేనెటీగలు దానిని దాదాపు అరగంటసేపు నములుతూ తమ నోటిలో ఉన్న గ్రంథులలోని ఎంజైములతో కలుపుతాయి. ఆ తర్వాత అవి దానిని షడ్భుజాకారంలో ఉండే తేనెమైనంతో చేయబడిన అరల్లోకి చేర్చి దాంట్లో ఉన్న నీటిని తీసివేయడానికి తమ రెక్కలతో గాలి విసురుతాయి. నీరు 18శాతం కన్నా తక్కువ అయినప్పుడు తేనెటీగలు ఆ అరలను సన్నటి మైనపుపొరతో మూసివేస్తాయి. పొరతో కప్పబడిన తేనె దాదాపు ఎప్పటికీ పాడవకుండా ఉండగలదు.

తేనెను మానవుని అవసరాల కోసం మాత్రం తయారు చేయవు. తేనె వాటి ఆహారం. సాధారణ పరిమాణంలో ఉండే తేనెపట్టులోని తేనెటీగలు శీతాకాలంలో బతకాలంటే వాటికి 10 నుండి 15 కిలోల తేనె అవసరమవుతుంది. అయితే అనుకూల వాతావరణంలో ఒక తేనెపట్టు దాదాపు 25 కిలోల తేనెను ఉత్పత్తి చేయగలదు. కాబట్టి మానవులు ఆ మిగులును పోగుచేసుకుని తన అవసరాలకు వినియోగిస్తున్నాడు. అంతేకాక, ఎలుగుబంట్లు, రాకూన్లు వంటి జంతువులు కూడా తేనె తింటాయి.

తేనెలో విటమిన్ బి, వివిధ ఖనిజాలు, ఆన్టియాక్సిడెంట్ల స్వచ్ఛమైన నిధిగల అద్భుతమైన ఆహారమే కాక అది ఇప్పటికీ ఉపయోగంలో ఉన్న ప్రఖ్యాతి చెందిన అతి ప్రాచీన ఔషధాల్లో ఒకటి. కాలిన గాయాలు, గాయాలు, కంటిశుక్లాలు, చర్మం మీద పుండ్లు, దెబ్బల వల్ల కలిగే వాపులు వంటి వివిధ వైద్య సమస్యలకు చికిత్స చేయడానికి తేనెను ఎన్నో శతాబ్దాల నుంచి వాడుతున్నారు. తేనెటీగలు మకరందానికి ఒక ఎంజైమ్ చేరుస్తాయి. కాబట్టి తేనెకు సూక్ష్మ క్రిములను నశింపజేసే గుణం, యాంటిబయోటిక్ గుణం ఉందని అధ్యయనాలు నిరూపించాయి. అపాయకరమైన సూక్ష్మక్రిములు చంపే హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఆ ఎంజైమ్ తయారుచేస్తుంది.

తేనెటీగలు తేనెపట్టును నిర్మించడానికి ఉపయోగించే మైనం, తేనెటీగ శరీరంలోని ప్రత్యేక గ్రంథుల నుండి ఉత్పత్తి అవుతుంది. తేనెపట్టులోని అరల మధ్య ఉండే గోడల మందం మిల్లీమీటర్లో మూడో వంతు మాత్రమే ఉంటుంది. అయినా ఆ అరలు షడ్భుజాకారంలో ఉంటాయి. కాబట్టి అరలు మధ్య ఉండే సన్నని గోడలు తమ బరువు కన్నా 30 రెట్లు అధిక బరువును మోయగలవు. నిజంగా తేనెపట్టు సివిల్ ఇంజినీర్ నైపుణ్యం కన్నా ఓ అద్భుతం.

అత్యంత చిన్న పక్షి హమ్మింగ్ బర్డ్



మీకు తెలుసా?

ప్రపంచంలోనే అత్యంత చిన్న పక్షి హమ్మింగ్ బర్డ్. హమ్మింగ్ బర్డ్ అనడంతో ఇది పాట పాడుతుందేమో అనుకుంటారు చాలామంది.కానీ అలాంటిదేమి కాదు. ఇది రెక్కలు ఆడించినప్పుడు ఓ చక్కని శ్రావ్యమైన శబ్దం వస్తుంది. దాని కారణంగానే దీనికా పేరు వచ్చింది. వీటికి వాసన చూసే శక్తిలేదు. వీటి నాలుక ఇంగ్లీష్ అక్షరం డబ్ల్యూ ఆకారంలో ఉంటుంది. వాతావరణాన్ని బట్టి వీటి ఒంటి రంగు మారుతుంది. వీటి గుండె నిమిషానికి 1,260 సార్లు కొట్టుకుంటుందట. ముందుకీ వెనక్కీ కూడా ఎగరగల పక్షి ఇదొక్కటే. ఇవి గుండ్రంగా చక్కర్లు కూడా కొట్టగలవు. పైకి కిందికి నిటారుగా కూడా ఎగరగలవు. హమ్మింగ్ బర్డ్ కాళ్లు చాలా బలహీనంగా ఉంటాయి. కాబట్టి ఇవి నడవలేవు. అందుకే ఇవి ఎక్కడా వాలడానికి ఇష్టపడవు. తేనె పీల్చేటప్పుడు కూడా గాల్లో ఎగురుతూనే పీల్చడానికి ప్రయత్నిస్తాయి.

బౌద్ధారామాల క్షేత్రం తవాంగ్



అరుణాచల్ ప్రదేశ్‌లోని వాయువ్య ప్రాంతంలో ఉంటుంది తవాంగ్. ఇది బౌద్ధమత ప్రాంతం. ఇక్కడి మంచు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. అందుకే ఈ ప్రదేశానికి పర్యాటకులు సంవత్సరం పొడవునా వస్తూనే ఉంటారు. ఇది బౌద్ధమత ప్రాంతమని ముందే చెప్పుకున్నట్టు ఇక్కడ అనేక బౌద్ధ ఆశ్రమాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

తవాంగ్ హిమాలయ పర్వతాలపై దాదాపు 12వేల అడుగుల ఎత్తున ఉండటం వల్లనే ఉదయించే సూర్యుడుని ఈ ప్రాంతం ముందే చూడగలుగుతుంది. తవాంగ్‌లో టిబెట్లన సంఖ్యా ఎక్కువే. ప్రశాంతమైన నీటి సరస్సులు, నదులు ఆకాశంలో నీల రంగును ప్రతిబింబింపజేసే అనేక ఎత్తయిన జలపాతాలు, కొన్నిసార్లు మేఘాలు భారంగా తేలుతున్నట్లు సందర్శకులను మంత్రముగ్దుల్ని చేస్తాయి. ప్రకృతి ప్రేమికులకు ఇది ఒక స్వర్గం వలె స్వాగతం పలుకుతుంది.


భారత్- చైనాల మధ్య 1962లో జరిగిన యుద్ధంలో చైనా సైనికులను నిలువరించిన భారత సైనికుడు వీరమరణం పొందిన చోట స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేశారు. లాసాలోని పోతలా ఆశ్రమం తర్వాత అతి ప్రాచీన ఆశ్రమం ఇక్కడే ఉంది. ఈ తవాంగ్ ఆశ్రమంలో ప్రాచీన గ్రంథాలయంతో పాటు వస్తు ప్రదర్శనశాల ఉంది. ఈ ఆశ్రమంలో దాదాపు 500 మంది బౌద్ధ సన్యాసులకు వసతి కల్పించవచ్చు. రాత్రిపూట ఈ ఆశ్రమం విద్యుద్దీపకాంతులతో చూస్తే ఎంతో అందంగా ఉంటుంది. ఒక్కడే 8 మీటర్ల ఎత్తయిన బౌద్ధ విగ్రహం ఉంది. ఇదేకాక చైనా సరిహద్దు వద్ద స్వర్ణ బౌద్ధస్థూపం ఉంది. దీన్నే తవాంగ్ బౌద్ధమఠం అని కూడా అంటారు. ఇక్కడ బుద్ధుని అవశేషాలు కూడా ఉన్నాయని ప్రతీతి. ఈ మఠం సముద్రమట్టానికి 3,500 మీటర్ల ఎగువన 400 సంవత్సరాల క్రితం ఏర్పడింది. ఇలాంటి ఎన్నో ప్రత్యేకతలకు ఆనవాలుగా నిలుస్తున్న తవాంగ్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

పకపక

రేపటి హోంవర్క్



టీచర్: ఏ రోజు పని ఆ రోజే చేయడం తెలివైన వారి లక్షణం అర్థమైందా?
చింటూ: అర్థమైంది టీచర్ రేపటి హోంవర్క్ రేపే చేయాలి ఈ రోజు చేయకూడదని!




సీరియల్ అయిపోయింది



రామారావు: స్వీట్లు ఎందుకు పంచుతున్నావు? ప్రమోషన్ ఏమైనా వచ్చిందా?
అప్పారావు: లేదు. నా భార్య పదేళ్లుగా చూస్తున్న సీరియల్ అయిపోయింది.

గుర్తు పట్టడు

రమేష్: బాకీ అడుగుదామని కాల్ చేస్తే రవిగాడు లిఫ్ట్ చేయట్లేదురా
అమాయకరావ్: నీ సెల్ ఇటువ్వు. నేను చేస్తే గుర్తుపట్టడు.



ఒక ప్రశ్న



తండ్రి: ఏంరా స్కూల్ వదలకుండానే వచ్చేశావ్?
కొడుకు: టీచర్ ఒక ప్రశ్న అడిగారనీ
తండ్రి: ఇంతకీ ఏం ప్రశ్న అది?
కొడుకు: 'నాపై ఈ రాయి విసిరింది ఎవరు?

డౌట్

కొడుకు: అమ్మా నాకొక డౌట్
తల్లి: చెప్పరా
కొడుకు: అన్ని సబ్జెక్టులు ఒక్క టీచర్ చెప్పలేడు కానీ అన్ని సబ్జెక్టులను ఒక్క స్టూడెంట్ ఎలా నేర్చుకోగలడు.



బంగారు పలుకు

ఓ మంచి ఆలోచన
లక్షలాదిమందిని కదిలిస్తుంది
లక్షలాది మందిలో కదలిక
ఒక సమాజాన్ని కదిలిస్తుంది.
- స్వామి వివేకానంద






నివేదా థామస్

రంగుల ప్రపంచంలో వెలగాలనే కల ఎంతోమందికి ఉంటుంది. కానీ ఇక్కడ అదృష్టం వరించేది కొందరినే. ఆ కొందరోతారలై తెరపైకి వస్తారు. చాలా సార్లు ఇది అనుకోకుండానే జరుగుతుంటుంది. అలా జరిగినప్పుడు అప్పటికి చేస్తున్న వృత్తిని, అభ్యసిస్తున్న విద్యను అన్నింటినీ వదిలేసి వస్తుంటారు. ఎందుకంటే అవకాశాలు మళ్లీ మళ్లీ రావు గనుక. అయితే చదువుపై ఏర్పర్చుకున్న ప్రేమ అంత సులువుగా పోతుందా...? అందుకే నాయికగా కొనసాగుతూనే ఆపేసిన కోర్సులను పూర్తి చేస్తామంటున్నారు కొందరు నాయికలు. మరికొందరు ఇలాంటి బాధలు లేకుండా చదువులు పూర్తి చేసుకుని మరీ వెండితెరకొచ్చారు. చదువుకు ప్రేమతో...అంటూ ఈ తారలు చెబుతున్న మాటలు చూడండి...

ఈ తారల మనసంతా చదువే


సాయి పల్లవి


కాజల్

నివేదా థామస్ - ఆర్కిటెక్చర్ విద్యార్థి

బాలనటిగా ప్రయాణం మొదలుపెట్టాను. 'ఉత్తర' అనే మలయాళ చిత్రం నాకు బాగా పేరు తీసుకొచ్చింది. తర్వాత అనేక చిత్రాల్లో నటించాను. పిల్లల టీవీ సీరియల్స్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించాను. వీటితో బాల నటిగా నాకు బాగా గుర్తింపు వచ్చింది. 'దృశ్యం' తమిళ పునర్నిమాన చిత్రం 'పాపనాశం' లో కమల్‌హాసన్ కూతురిగా నటించాను. ఇదొక గొప్ప అనుభవం. 'జెంటిల్‌మన్'తో నాయికగా తెలుగులో అడుగుపెట్టే సమయానికి నేను డిగ్రీలో చేరాను. బ్యాచలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ చదువుకుంటున్నాను. చదువుకుంటూనే 'జెంటిల్‌మన్'లో నటించాను. ఈ సినిమా విజయంతో టాలీవుడ్‌లో ప్రతిభావంతమైన నాయికగా పేరొచ్చింది. దీంతో చాలా అవకాశాలు రావడం ప్రారంభమయ్యాయి. అయినా సమయం దొరికినప్పుడు విరామం తీసుకుని చదువులు కొనసాగిస్తున్నాను. త్వరలోనే ఆర్కిటెక్చర్ పూర్తి చేయాలని ఉంది.

సాయి పల్లవి - ఎంబీబీఎస్

కుటుంబంలో చదువుల గురించి నిక్కచ్చిగా ఉండేవాళ్లు. పిల్లలు బాగా చదువుకోవాలి. కనీసం ఏదైనా మంచి డిగ్రీ సంపాదించుకోవాలి అని భావించేవారు. నాకు డాన్సులు, నటన అంటే ఇష్టం. కానీ ఇంట్లో చదువుపై ఎలాంటి నిబంధన ఉండేదో తెలుసు. కాబట్టి బుద్ధిగా చదువుకున్నాను. జార్జియాలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నప్పుడు మలయాళ దర్శకుడు ఆల్ఫోన్స్ సినిమా అవకాశం ఉందని చెప్పారు. నేను చదువు అయ్యాకే అని సమాధానమిచ్చాను. మీ సెలవుల్లో షూటింగ్ పెట్టుకుంటాం...మీరు సినిమా చేయండి అని అడిగారు. దాంతో ఒప్పుకున్నాను. అలా 'ప్రేమమ్' లో మలర్ పాత్రలో నటించే అవకాశం వచ్చింది. ఈ సినిమా ఎంతో గుర్తింపును తీసుకొచ్చింది. శేఖర్ కమ్ముల చెప్పిన పాత్ర, కథ బాగా నచ్చి 'ఫిదా' లో నటించాను. 'ఫిదా' విజయంతో తెలుగులో చాలా అవకాశాలు వస్తున్నాయి. వీలున్నప్పుడు ఓ ఏడాది పాటు విరామం తీసుకుని ఎంబీబీఎస్ పూర్తి చేయాలి. ఎందుకంటే ఏకాగ్రత లేకుండా వైద్య విద్య చేయడం చాలా కష్టం. ఎంతో మంది జీవితాలు ఆధారపడి ఉండే వృత్తి కాబట్టి...అంత జాగ్రత్త తీసుకునే చదువుకుంటాను.

లావణ్య - ఎకనామిక్స్ గ్రాడ్యుయేట్..

ఇంట్లో ముగ్గురు పిల్లల్లో నేనే చిన్న. ఎవరైనా అమ్మ మాట వినాల్సిందే. చదువులు, కెరీర్ వాళ్లు చెప్పినట్లే ఎంచుకున్నారు. నా విషయానికొస్తే గ్లామర్ ఫీల్డ్ అంటే అమితాసక్తి ఉండేది. రంగుల ప్రపంచమైన సినిమా కెరీర్‌లో ఉండాలని చిన్నప్పుడే అనుకున్నాను. కానీ అమ్మ ఒప్పుకోలేదు. ముందు చదువులు కానివ్వు. తర్వాత ఆలోచిద్దాం అంది. మార్షల్ స్కూల్లో పాఠశాల విద్య పూర్తయ్యాక. ఇంటర్, డిగ్రీ కోసం ముంబై వచ్చాను. రిషి దయారాం నేషనల్ కాలేజీలో ఎకనామిక్స్‌లో డిగ్రీ పూర్తి చేశాను. చదువు పూర్తి చేశాను కాబట్టి...ఇక కెరీర్ నా ఇష్టప్రకారం ఎంచుకోవడానికి ఇంట్లో వాళ్లెవరూ అడ్డు చెప్పలేదు.

కాజల్ - మాస్ మీడియా


కొలాబాలోని అనా హైస్కూల్ లో చదువుకున్నా. జైహింద్, కేసీ కాలేజీల్లో ఉన్నత విద్య అభ్యసించాను. డిగ్రీ అయ్యాక ప్రకటనలు , మార్కెటింగ్ స్పెషలైజేషన్ లో మాస్ మీడియా కోర్సు పూర్తి చేశాను. నాన్నలాగే వ్యాపారరంగంలో స్థిరపడాలని అనుకునేదాన్ని. మాస్ మీడియా కోర్సులో చివరి ఏడాది చదువుతున్నప్పుడు ఇంటర్న్ షిప్ కోసం లోరియల్ కంపెనీతో పనిచేయాల్సి వచ్చింది. లోరియల్ కోసం ఓ ఫొటో షూట్ జరుగుతున్నప్పుడు అక్కడున్న ఫొటోగ్రాఫర్ 'మీరు చాలా బాగున్నారు. మోడల్ గా ప్రయత్నించండి' అని సలహా ఇచ్చాడు. నేను మా బాస్ స్మిరాబక్షిలా ఎంటర్‌ప్రెన్యూర్ అవ్వాలని కోరుకున్నాను. వ్యాపారరంగంలో ఎంతో అనుభవం ఉన్నా...మాతో స్మిరా సరదాగా ఉండేది. ఆమె ప్రభావం నాపై ఉండేది. మోడల్ గా మారమని సలహా ఇచ్చిన ఫొటోగ్రాఫర్ నా ఫొటోలను ప్రొడక్షన్ హౌస్ లకు పంపించాడు. వాటిని చూసి ఓ సినిమా అవకాశం వచ్చింది. ఇక తర్వాత మీకు తెలిసిందే.

రాశీ ఖన్నా - ఎంఏ సైకాలజీ

చిన్నప్పటి నుంచి నాకు చదువులపై ధ్యాస ఎక్కువ. పాఠశాలలో మొదటి వరుసలో కూర్చునేదాన్ని. హాజరు శాతంలో నాకే మొదటి స్థానం. నా ఆలోచనంతా చదువుమీదే ఉండేది. ఎవరితోనూ కలివిడిగా ఉండేదాన్ని కాదు. దాంతో అబ్బాయిలు నాతో ఏదైనా చెప్పాలంటే భయపడేవారు. బాగా చదువుకుని ఐఏఎస్ అధికారి కావాలనుకున్నాను. అందుకే పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఎంఏ సైకాలజీ ఎంచుకున్నాను. ఇక తర్వాత సివిల్స్‌కు సిద్ధమవుదామని భావించాను. అయితే ఇంతలో వ్యాపార ప్రకటనల్లో మోడల్‌గా అవకాశాలు రావడం..తర్వాత మద్రాస్ కేఫ్‌లో ఓ మంచి క్యారెక్టర్‌కు ఎంపికకావడం జరిగిపోయాయి. అలా ఇప్పుడు మీ ముందు నాయికగా ఉన్నాను.


రాశీ ఖన్నా

ఆరు నెలల్లో వస్తాడట!


ప్రభాస్

బాహుబలి-2 తర్వాత ప్రభాస్ తాను నటించబోయే సాహో చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు. సుజిత్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అత్యంత భారీగా నిర్మించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం చిత్రీకరణ మొదలైంది. ముంబాయిలో ఆ వారం రోజుల షూటింగ్‌ను జరిపారట. ప్రభాస్ ఇంకా లొకేషన్‌లోకి అడుగుపెట్టక మునుపే వారం రోజుల చిత్రీకరణను క రాడా పూర్తిచేసుకున్నట్లు తెలిసింది. బాహుబలి-2 తర్వాత కొద్దిరోజులు విశ్రాంతి తీసుకున్న అనంతరం సాహో చిత్రం కోసం మేకోవర్ అయ్యే పనిలో ఉన్నారు ప్రభాస్. ఇందులో కథానాయికగా ఎవర్ని ఎంపిక చేస్తారన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కాకపోతే భాలీవుడ్ నాయిక శ్రద్ధాకపూర్‌ను ఎంపికచేసే అవకాశాలు అధికంగా ఉన్నాయని పరిశ్రమలో వినిపిస్తోంది. ఇందులో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉందట. దాంతో నిర్మాణానంతర పనులకు కూడా ఎక్కువ సమయ ప ట్టే అవకాశం ఉందని సినిమాటోగ్రాఫర్ మధి చెబుతున్నారు. ఇదిలావుండగా, సాహో చిత్ర నిర్మాణాన్ని ఆరు నెలల సమయంలో పూర్తిచేసి ఆ తర్వాతి చిత్రంలో ప్రభాస్ పాల్గొంటారని అంటున్నారు. ఇప్పటికే జిల్ ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో నటించేందుకు ప్రభాస్ అంగీకరించిన నేపథ్యంలో ఆ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలైనట్లు, ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా జాతీయ అవార్డు గ్రహీత అమిత్ త్రివేదిని ఎంపిక చేశారని పరిశ్రమలో చెబుతున్నారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉండనుందట. బాహుబలి స్థాయి చిత్రం వస్తే నటించేందుకు అభ్యంతరం లేదని, కాకపోతే నాలుగేళ్లు కాకుండా రెండేళ్ల సమయం మాత్రం కేటాయిస్తానని ప్రభాస్ అంటున్నారు. రాజమౌళిపై ఉన్న నమ్మకంతోనే తాను నాలుగేళ్ల సమయాన్ని బాహుబలి చిత్రాలకు కేటాయించానని, అయితే అది తనకు మేలునే చేకూర్చిందని ఆయన చెప్పుకొచ్చారు.

18 ఏళ్ల తర్వాత కలిసి


మహేష్‌బాబు , కృష్ణ

తన తండ్రి సూపర్‌స్టార్ కృష్ణతో కలిసి మహేష్‌బాబు మళ్లీ ఓ చిత్రంలో నటించబోతున్నారా? అంటే అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. ప్రస్తుతం తాను చేస్తున్న స్పైడర్ చిత్రం పూర్తికాగానే భరత్ అను నేను చిత్రంలో మహేష్‌బాబు నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ మధ్యనే చిత్రీకరణ మొదలైన ఈ చిత్రం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ చిత్రంలో సూపర్‌స్టార్ కృష్ణ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు వినిపిస్తోంది. సామాజిక స్ఫూర్తిని నింపే కథాంశాలతో తన చిత్రాలను రూపొందించే కొరటాల శివ లోగడ మహేష్ కథానాయకుడిగా తెరకెక్కించిన శ్రీమంతుడు చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. మళ్లీ వీరిద్దరి కలయికలో రూపొందుతున్న ఈ చిత్రం కూడా సమాజ చైతన్యానికి ప్రేరణగా ఉంటుందని సమాచారం. ఇక మహేష్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం విడుదలచేసిన స్పైడర్ టీజర్‌కు విశేషమైన స్పందన లభించింది. దీనికి ఇప్పటికే ఒక కోటి వ్యూస్ లభించాయి.

తెలుగులో మేయాధమాన్

సరోజ, యాక్షన్ త్రీడి, అనామిక చిత్రాల్లో నటించిన వైభవ్ తమిళ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఆయన నటించిన తాజా చిత్రం మేయాధమాన్ తెలుగులో అనువాదం అవుతోంది. రొమాంటిక్ కామెడీ కథతో ఈ చిత్రాన్ని దర్శకుడు రత్నకుమార్ తెరకెక్కించారు. ప్రియ భవానీశంకర్ నాయికగా పరిచయం అవుతోంది. ఈ సినిమాను పిజ్జా, జగర్తాండ లాంటి చిత్రాలను రూపొందించిన దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ నిర్మించారు. స్టోన్ ఫిల్మ్స్ పతాకంపై నిర్మాణమైన ఈ చిత్రం వచ్చే నెలలో విడుదలకానుంది. ఈ చిత్రాన్ని


వైభవ్

తెలుగులో భారీ ఎత్తున ప్రచారం నిర్వహించి విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ స్టోన్ బెంచ్ సంస్థను మూడేళ్ల క్రిందట ప్రారంభించాం. ఇప్పటికే ఎన్ని లఘు చిత్రాలను విడుదల చేశాం. మంచి కథల కోసం చూస్తున్నపుడు రత్నకుమార్ చెప్పిన కథ నచ్చి మేయాధమాన్ సినిమా తీయడం జరిగింది. కథలో ఉన్న కామెడీ, రొమాంటిక్ అంశాలు ఆకట్టుకున్నాయి. ఉత్తర మద్రాసు ప్రాంతంలో నివసించే ఓ జంట మధ్య జరిగే కథ ఇది. యువతరాన్ని బాగా ఆకట్టుకుంటుంది అని చెప్పారు.

మనసైనోడు పాటల విడుదల



మనోజ్ నందం, ప్రియసింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'మనసైనోడు'. హెచ్ పిక్చర్స్ పతాకంపై హసీబుద్దీన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సత్యవరపు వెంకటేశ్వరరావు దర్శకుడు. 'మనసైనోడు' ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్ లో జరిగింది. బిగ్ సీడీ విడుదల అనంతరం దర్శకుడు సత్యవరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...'సుభాష్ ఆనంద్ మంచి సంగీతాన్ని అందించారు. ఆరు పాటలూ బాగుంటాయి. స్వర్గీయ సినారే రచించిన జయ జయ జయహే భారతావని సద్గుణ సముపేత అనే పాట భారత దేశ గొప్పదనాన్ని చాటుతుంది. ఆడవాళ్లు లేకుంటే మగాళ్ల జీవితాలు ఎలా ఉంటాయో ఓ చిలిపి గీతంలో చిత్రీకరించాం. ప్రేమ, కుటుంబ కథకు ఓ సందేశాన్ని జోడించి ఈ సినిమాను రూపొందించాను. యువతరంలో దేశభక్తి నింపేలా ప్రయత్నం చేశాం.' అన్నారు.

పోసాని, గిరిబాబు, రఘుబాబు, కేదార్ శంకర్, సంగీత, మధుమని, జ్యోతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - సురేందర్, ఎడిటర్ - మార్తండ్ కె వెంకటేష్, సంగీతం - సుభాష్ ఆనంద్



రూ.25 లక్షల కేక్

అమీర్‌ఖాన్ నటించిన దంగల్ చిత్రం భారీ విజయాన్ని నమోదు చేసింది. మనదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో సైతం కలెక్షన్ల వర్షం కురిపించింది. ముఖ్యంగా చైనాలో ఏకంగా 2 వేల కోట్లు రాబట్టి రికార్డ్ నెలకొల్పింది. ఈ భారీ విజయాన్ని ఘనంగా నిర్వహించాలని దుబాయ్‌కి చెందిన బ్రాండ్‌వే బేకరి నిర్ణయించుకుంది. 54 కిలోల దంగల్ కేక్ తయారు చేసింది. కేక్ ప్రత్యేకత ఏమంటే దంగల్ సినిమాలో అమీర్ ఖాన్ తన ఇద్దరు క ుమార్తెల చేత కుస్తీ చేయిస్తున్నట్టుగా అలంకరించారు. అమీర్ ఖాన్ గెటప్‌తో పాటుగా రెండు 75 గ్రాముల బరువుండే బంగారు పతకాలను చేర్చారు. ఇంతకీ ఈ కేక్ ఖరీదు ఎంతో తెలుసా? అక్షరాల పాతిక లక్షలు. నెల రోజులు శ్రమించి 1200 మంది కేక్ తయారిలో పాలుపంచుకున్నారట. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ కేక్‌ను ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తయారు చేసినట్టు బేకరీ నిర్వాహకులు వెల్లడించారు.